# ఆధునిక కవితా పరిచయం

## బి.ఏ. స్పెషల్ తెలుగు - రెండవ సెమిస్టర్, పేపర్ -


**రచయితలు :**

**డా॥ పి.వి. సుబ్బారావు,** ఎం.ఏ. పిహెచ్.డి.
రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్
తెలుగు శాఖాధిపతి
సి.ఆర్. కళాశాల, చిలకలూరిపేట.

**డా॥ గుమ్మా సాంబశివరావు,** ఎం.ఏ. పిహెచ్.డి.
రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్
తెలుగు శాఖాధ్యక్షులు
ఆంధ్ర లయోల కళాశాల, విజయవాడ.

సంపాదకులు
**డా॥ పి.వి. సుబ్బారావు,** ఎం.ఏ. పిహెచ్.డి.
రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ & తెలుగు శాఖాధిపతి
సి.ఆర్. కళాశాల, చిలకలూరిపేట.

సమన్వయకర్త :
**డా॥ ఇరపని మాధవి,** ఎం.ఏ. యం.ఫిల్., పిహెచ్.డి.
తెలుగు & ప్రాచ్య భాషా విభాగం,
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
నాగార్జున నగర్ – 522 510.

డైరెక్టర్
**డా॥ నాగరాజు బట్టు**
MBA, MHRM, LLM, M.Sc., (Psy), M.A. (Soc), M.Ed., M.Pil., Ph.D.
Head, Department of HRM



**దూర విద్యా కేంద్రము**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ – 522 510

Ph : 0863 - 2293299, 2293356 (08645) 211023, 211024 (Study Material)
Cell : 98482 85518
e-mail : info@anucde.ac.in
Website : www.anucde.ac.in (or) www.anucde.info

**B.A., Special Telugu**
**Edition :**
**No. of Copies :**

(C) Acharya Nagarjuna University
This book is exclusively prepared for the use of students of Distance Education
Acharya Nagarjuna University and this book is meant of limited circulation only.

Published by :
**Dr. NAGARAJU BATTU**
Director
Centre for Distance Education
Acharya Nagarjuna University

Printed at :

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించినది మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ 2016 నాటికి NAAC చే A గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి సంతోషిస్తున్నాను. ప్రస్తుత గుంటూరు, ప్రకాశం జిల్లాలోని 447 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిప్లమో, డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం అందిస్తోంది.

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఉన్నత విద్యను అందరికీ అందించాలన్న లక్ష్యంతో 2003-04లో దూరవిద్యా కేంద్రాన్ని స్థాపించింది. పూర్తి స్థాయిలో కళాశాలలకు వెళ్ళి విద్యనభ్యసించలేని వారికి, వ్యయభరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరిక ఉన్న గృహిణులకు ఈ దూర విద్యా కేంద్రం ఎంతో ఉపయోగపడుతుంది. ఇప్పటికే డిగ్రీ స్థాయిలో బి.ఏ., బి.కాం., బి.ఎస్.సి, మరియు పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి. ఎం.బి.ఏ., ఎల్.ఎల్.యమ్... కోర్సులను ప్రారంభించిన విశ్వవిద్యాలయం గత సంవత్సరం కొత్తగా 'జీవన నైపుణ్యాలు" అనే సర్టిఫికేట్ కోర్సును కూడా ప్రారంభించింది.

ఈ దూర విద్యా విధానం ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసుకొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో అనుభవం గల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించడం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారు చేశారు. ఈ పాఠ్యాంశాల పై విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి ముమ్ముందు మరింత నిర్దిష్టంగా, అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం వారాంతపు తరగతులు, కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూరవిద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేస్తున్న విద్యార్థులు, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమే గాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని, తద్వారా దేశ పురోగతికి దోహదపడాలని కోరుకుంటున్నాను. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దినదినాభివృద్ధి చెంది, ప్రజలందరికి అందుబాటులో ఉండాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ ఆశయ సాధనకు సహకరిస్తున్న, సహకరించిన దూరవిద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు, అకడమిక్ కో-ఆర్డినేటర్లకు మరియు అధ్యాపకేతర సిబ్బందికి నా అభినందనలు.

**ప్రొఫెసర్ పి. రాజశేఖర్,** M.A., M.Phil., Ph.D.
కులపతి (FAC)
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

**బి.ఏ. స్పెషల్ తెలుగు - మొదటి సంవత్సరం**

**రెండవ సెమిస్టర్, పేపర్ -**

# ఆధునిక కవితా పరిచయం

## సిలబస్

యూనిట్ - 1 : జన్మభూమి (గేయం) - రాయప్రోలు సుబ్బారావు

యూనిట్ - 2 : వేమన నీతి - వేమన పద్యాలు
(1వ పద్యం నుండి 30వ పద్యం వరకు)

యూనిట్ - 3 : గబ్బిలం
గుఱ్రం జాషువా
(గబ్బిలం మొదటి భాగం మొదటి పద్యం "చిక్కి కాసుచే... నుండి
40వ పద్యం నీ యౌదార్య గుణంబు... పుణ్యాంగనా ! వరకు)

యూనిట్ - 4 : భిక్షువర్షీయసి (కవితా ఖండిక)
శ్రీరంగం శ్రీనివాసరావు
(మహా ప్రస్థానం నుండి)

యూనిట్ - 5 : అమృతం కురిసిన రాత్రి (కవితా ఖండిక)
దేవరకొండ బాల గంగాధర తిలక్
(అమృతం కురిసిన రాత్రిలోని 82వ పుట నుండి 83వ పుట వరకు)

బి.ఏ. స్పెషల్ తెలుగు - మొదటి సంవత్సరం

రెండవ సెమిస్టర్, పేపర్ -

# ఆధునిక కవితా పరిచయం

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | జన్మభూమి (గేయం) - మొదటి పాఠం | 1.1 - 1.10 |
| 2. | జన్మభూమి (గేయం) - రెండవ పాఠం | 2.1 - 2.7 |
| 3. | వేమన నీతి - మొదటి పాఠం | 3.1 - 3.17 |
| 4. | వేమన నీతి - రెండవ పాఠం | 4.1 - 4.8 |
| 5. | గబ్బిలం - మొదటి పాఠం | 5.1 - 5.26 |
| 6. | గబ్బిలం - రెండవ పాఠం | 6.1 - 6.14 |
| 7. | భిక్షువర్షీయసి - మొదటి పాఠం | 7.1 - 7.11 |
| 8. | బిక్షువర్షీయసి - రెండవ పాఠం | 8.1 - 8.6 |
| 9. | అమృతం కురిసిన రాత్రి - మొదటి పాఠం | 9.1 - 9.9 |
| 10. | అమృతం కురిసిన రాత్రి - రెండవ పాఠం | 10.1 - 10.6 |

బి.ఏ. స్పెషల్ తెలుగు - మొదటి సంవత్సరం

సెమిస్టర్ - 2

# ఆధునిక కవితా పరిచయం

## మాదిరి ప్రశ్నా పత్రం

సమయం : 3 గంటలు  మార్కులు : 70

**1. ఈ క్రింది పద్యాల్లో ఒకదానికి ప్రతిపదార్థ తాత్పర్యాన్ని రాయండి.** **8 మార్కులు**

1. అల్పుడెపుడు పల్కు ఆడంబరముగాను
సజ్జనుండు పల్కు చల్లగాను
కంచుమ్రోగునట్లు కనకంబు మ్రోగునా !
విశ్వదాభిరామ వినురవేమ !

(లేదా)

ముప్పు ఘటించి వీని కులమున్ గలిమిన్ గబళించి దేహమున్
పిప్పి యొనర్చు నీ భరత వీరుని పాదము కందకుండగా
జెప్పులు కుట్టి జీవనము సేయును గాని నిరాకరింపలే
దెప్పుడు నప్పు వద్దది సుమీ భరతావని వీని సేవకున్

**2. ఈ క్రింది వాటిలో ఒక కంఠస్థ పద్యాన్ని పూరించండి ?** **2 మార్కులు**

ఆత్మ శుద్ధి.......... వినురవేమ

ప్రతిమల .......... క్షుత్తులాఱునే !

**3. ఈ క్రింది వాటిలో ఒక కవితకు భావం రాయండి ?** **2 మార్కులు**

లేదురా ! ఇటువంటి భూదేవి యెందు
లేరురా ! మనవంటి పౌరులింకెందు ?
సూర్యుని వెలుతురుల్ సోకునందాక
ఓడల జెండాలు ఆడునందాకా !

(లేదా)

ఆకశం మీద అప్సరసలు
ఒయ్యారంగా పరుగులెత్తుతున్నారు
వారి పాదాల తారామంజీరాలు
ఘల్లు ఘల్లని మోగుతున్నాయి
వారి ధమ్మిల్లాల పారిజాతాలు
గుత్తులు గుత్తులై వేలాడుతున్నాయి
వారు పృథు వక్షోజ నితంబ భారలై
యౌవన ధస్సుల్లా వంగి పోతున్నారు.

**4.** **ఈ క్రింది వాటిలో మూడింటికి సందర్భ సహిత వ్యాఖ్యలు రాయండి** **(3×2 = 6 మార్కులు)**

1. పొగడరా ! నీ తల్లి భూమి భారతిని
2. సాధనమున పనులు సమకూరు ధరలోన
3. ముక్కు మొగమున్న చీకటి ముద్దవోలె
4. తనకన్నా శవం నయం
5. అతడేసుమీ మన ప్రియుడు నరుడు మనకి వరుడు

**5.** **ఈ క్రింది వాటిలో నాల్గింటికి సంగ్రహ సమాధానాలు రాయండి** **(4×3 = 12 మార్కులు)**

1. రాయప్రోలు వారి జన్మభూమి గేయంపై ప్రేరణలు, ప్రభావాలను వివరించండి ?
2. ఆశను గూర్చి వేమన చెప్పిన విషయాలను తెలపండి ?
3. ఆధనిక తెలుగు సాహిత్యంలో గబ్బిలం కావ్య విశిష్టతను వివరించండి ?
4. భిక్షు వర్షీయసి ఖండికలో శ్రీశ్రీ ప్రయోగించిన పద చిత్రాలను గూర్చి రాయండి ?
5. తిలక్ అప్సరసలను దర్శించి వర్ణించిన తీరును వివరించండి ?

**6. వ్యాసరూప ప్రశ్నలు ఒక్కో యూనిట్ నుండి ఒక ప్రశ్నకు సమాధానం రాయండి ?**

**(5×8 = 40 మార్కులు)**

యూనిట్ - 1

1. రాయప్రోలు వారు జన్మభూమి గేయం ద్వారా యువతీ యువకులను ప్రబోధించిన విధానాన్ని రాయండి

(లేదా)

రాయప్రోలు వారి జన్మభూమి గేయం జాతీయోద్యమంలో అగ్రశ్రేణికి చెందింది ? చర్చించండి ?

యూనిట్ - 2

2. 'వేమన నీతి' పాఠ్యభాగం ఆధారంగా వేమన సామాజిక ప్రబోధాన్ని వివరించండి ?

(లేదా)

'వేమన నీతి' పాఠ్యభాగంలో తాత్త్విక విషయాలను రాయండి ?

యూనిట్ - 3

3. జాషువా గబ్బిలం కావ్యంలో పంచముడి దుస్థితిని వర్ణించిన తీరును వివరించండి

(లేదా)

జాషువా గబ్బిలం ద్వారా పంచముడి సందేశాన్ని పంపించిన విధాన్ని రాయండి ?

యూనిట్ - 4

4. శ్రీశ్రీ భిక్షువర్షీయసిని వర్ణించిన తీరును వివరించండి ?

(లేదా)

శ్రీశ్రీ భిక్షువర్షీయసిలో మానవతా దృక్పథాన్ని వివరించండి ?

యూనిట్ - 5

5. తిలక్ అమృతం కురిసిన రాత్రి ఖండికలో వెల్లడించిన అభిప్రాయాలను రాయండి ?

(లేదా)

అమృతం కురిసిన రాత్రి ఖండిక ఆధారంగా తిలక్ అనుభూతివాదాన్ని సమర్ధించండి ?

యూనిట్ - 1

పాఠం - 1

# జన్మభూమి (గేయం)

(మొదటి పాఠం)

## ఆచార్య రాయప్రోలు సుబ్బారావు

డా॥ పి.వి. సుబ్బారావు

### పాఠ్య నిర్మాణ క్రమం

1.1.0. లక్ష్యం

1.1.2. కవిపరిచయం

1.1.3. పాఠ్య భాగ సందర్భం

1.1.4. పాఠ్య భాగ నేపథ్యం

1.1.5. కఠిన పదాలకు అర్థాలు - భావాలు

1.1.6. పాఠ్య భాగం

ఏ దేశమేగినా ఎందుఁగాలిడిన
ఏ పీఠ మెక్కినా యెవ రెదురయిన
పొగడరా నీ తల్లి భూమి భారతిని
నిలుపరా నీ జాతి నిండు గౌరవమ్ము
లేదురా యిటువంటి భూదేవి యెందు
లేరురా మనవంటి ధీరు లింకెందు.

ఏ పూర్వపుణ్యమో ఏ యోగబలమొ!
జనయించినాడ నీ స్వర్గలోకమున
ఏమంచిపూవులన్ ప్రేమించినావొ
నినుమోచె నీతల్లి కనకగర్భమున

సూర్యుని వెలుతురు సోకునందాక
ఓడల జెండాలు ఆడునందాక
నరుడు ప్రాణాలతో నడుచునందాక
అందాకగల యీయ నంత భూతలిని
మనభూమినంటి క మ్మని బూమిలేదు

తమతపస్సులు ఋషుల్ ధారఁబోయంగ
చండవీర్యము శూర చంద్రు లర్పింప
రాగదుగ్ధము భక్త రాజు లీయంగ
భావసూత్రము కవి బాంధవు లల్ల

దిక్కులు కెగఁదన్న తేజంబు వెలుఁగ
జగముల నూగించు మగతనం బెగయ
రాలు పూవులుసేయు రాగాలు సాగ
సౌందర్య మొఁబోయి సాహిత్యమొప్ప

వెలిగిన దీదివ్య విశ్వంబు పుత్ర !
దీపించె నీ పుణ్య దేశంబు పుత్ర !

అవమానమేలరా ! అనుమాన మేల !
భరతపుత్రుఁడనంచు భక్తితోఁబలుక !

### 1.1.1. లక్ష్యం :

విద్యార్థుల్లో దేశ భక్తి స్ఫోరకమైన జన్మభూమి గేయం ద్వారా దేశభక్తిని జాతీయ సమైక్యతా భావాన్ని ప్రబోధించాలన్న లక్ష్యంతో ఈ పాఠ్య భాగాన్ని ప్రణాళికలో చేర్చారు. జాతీయోద్యమంలో ఈ గేయం ఎంతగా ప్రజల్లో దేశభక్తి భావాలను రేకెత్తించిందో తెలుసుకోవడంతో పాటు వర్తమాన పరిస్థితుల్లో జన్మభూమి మమకారాన్ని పెంపొందించేందుకు ఈ పాఠ్యభాగం దోహదం చేస్తుంది.

### 1.1.2. కవి పరిచయం :

ఆచార్య రాయప్రోలు సుబ్బారావు గారి పేరు వినగానే భావ కవిత్యోద్యమ మార్గదర్శకుడన్న విషయం స్ఫురిస్తుంది. దేశభక్తి కవిత్వం, ఆంధ్రాభిమానం గుబాళిస్తాయి. ఆధునిక కవితాయుగ కర్తగా ఆరాధ్యులైన రాయప్రోలువారు బహుముఖ ప్రజ్ఞాశాలి.

జీవిత విశేషాలు :

బాపట్ల తాలూకా గార్లపాడు గ్రామంలో ది. 13-03-1892వ సంవత్సరంలో ఆయన జన్మించారు. ఆయన తల్లి ఆదెమ్మ తండ్రి వేంకటావధాని. మేనమామ అవ్వారు సుబ్రహ్మణ్యశాస్త్రి దగ్గర సంస్కృతాంధ్రాలు నేర్చుకున్నారు. ఆయన ప్రేరణతో ఆశు కవితాభ్యాసం, అవధానాలు చేశాడు. పల్లె ప్రాంతాల్లో కొత్తిమీర చేలమీద, కుండపాదులతో భారంగా నడిచే చూడి ఆవులపైన, ఊరి చెరువు నుండి బిందెలతో నీళ్ళు మోసుకొచ్చే పల్లె పడతుల పైన ఆశు కవితలు చెప్పేవాడు.

రాజమండ్రిలో రాయప్రోలు వారు విద్యాభ్యాసం చేసే రోజుల్లో ఆంధ్ర కేసరి పత్రికా సంపాదకులు చిలుకూరి వీరభద్రరావు, అత్తిలి సూర్యనారాయణ రాయప్రోలు వారి ప్రతిభకు పాదులు వేశారు. గుంటి లక్ష్మన్న పంతులుగారి పరిచయంతో గోల్డ్ స్మిత్ వంటి ఆంగ్ల కవుల కావ్యాలను చదివాడు. ప్రత్యేకించి గోల్డ్‌స్మిత్ రచించిన () కావ్యాన్ని తెలుగులో లలితగా 1909లో అనువదించాడు. రాయప్రోలు కవితా జీవితానికి ఆ కావ్యంతో కొత్త మలుపు ప్రారంభమైంది. తరువాత కావ్యాలకు బీజాలనదగిన భావాలు అందులో

వున్నాయి. లలిత కావ్యం 1912లో పునర్ముద్రణ పొందింది. అప్పుడు మాత్రమే అది పాఠకుల దృష్టిని ఆకర్షించింది. ఆ సమయంలో ఆయనకు అవధానాలపై ఆసక్తి తగ్గింది. రసభావ రహితమైన ఆశు కవితా విన్యాసంపై అవధానాలపై 1911లోనే విరక్తి కలిగింది. తన కవితా పథాన్ని రమ్యాక్షరక్షణికి, రసకావ్య రచనలపై పునమళ్లించుకున్నాడు.

రాయప్రోలు వారి రచనలను డా॥ పల్లా దుర్గయ్య మూడు విధాలుగా వర్గీకరించి పరిశీలించాడు. 1. అనువాదాలు, 2. సంస్కృత కావ్యాలు, 3. లక్షణ కావ్యాలుగా పేర్కొన్నాడు. అవి కాక ఇంకా లఘు కథా కావ్యాలు, ఖండ కావ్యాలు ప్రసిద్ధమైనవి ఉన్నాయి. అంగ్లానువాదాల్లో లలిత, అనుమిత ప్రసిద్ధాలు, ఉమర్ ఖయ్యామ్ రుబాయితీలు మధుకలశంగా అనువదించాడు. సంస్కృతం నుండి భజగోవిందం, సౌందర్యలహరి గ్రంథాలను ఆంధ్రీకరించాడు. వాల్మీకి రామాయణంలో సుందరకాండను గేయ రూపంలో రచించాడు.

ఆయన కావ్యాల్లో తృణ కంకణం, కష్టకమల, స్నేహలత, స్వప్న కుమారం భావ కవితాచార్యునిగా రాయప్రోలు వారి కీర్తిని విస్తరించాయి. ఆంధ్రావళి, జడకుచ్చులు, వనమాల, మంజరి వంటి ఖండ కావ్యాలు ఆయనను లబ్ధ ప్రతిష్ఠునిగా తీర్చిదిద్దాయి. రమ్యాలోకం, మాధురీ దర్శనం వంటి లక్షణ గ్రంథాలు కవిత్వాన్ని గూర్చి, రసాలంకారాలను గూర్చి పద్యాల్లో చెప్పిన పండితా మోదం పొందాయి. "రూపనవనీతం' అనే గ్రంథం మనస్తత్త్వ ప్రతిపాదనకు సంబంధించి. ఆయన "తృణకంకణం" కావ్యం నవ్య కావ్యాల్లో మొదటిదిగా ప్రశంసించబడింది.

ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం గారు "ప్రేమతత్త్వాన్ని ప్రవచించడానికి పుట్టి గీతాశాస్త్రంగా" దాన్ని అభివర్ణించాడు. ఈ కావ్యంలో ప్రధాన రసాన్ని అమలిన శృంగారంగా విమర్శకులు పేర్కొన్నారు. ఖండవల్లి వారు ధర్మశృంగారంగా పేర్కొన్నాడు. సంభోగమే ప్రధానంగా వర్ణించిన పూర్వకవుల శృంగార రస సిద్ధాంతం రాయప్రోలు వారికి నచ్చలేదు. అందుకే ఆయన అమలిన శృంగారంగా ప్రతిపాదించాడు. కేవలం సౌందర్యాపేక్షతో, శృంగార దృష్టితో కూడిన శృంగారం లేదా ఆనందం మలినమైంది. లౌకికవాదనలకు అతీతంగా వియోగ శృంగారమే పవిత్రంగా పొందే రసానందమే అమలిన శృంగారమని ఆయన భావన. అదీ ఆయన ప్రతిపాదించిన అమలిన శృంగార సిద్ధాంతం "ఉపనిషత్తులు మొదలు లక్షణ గ్రంథాల్లోని రస సిద్ధాంతాలను మదించి తీసిన నవనీతమిది" అని సి.నా.రె. చెప్పిన అభిప్రాయం సమంజసంగా ఉంది. ప్లేటో ప్రేమ సిద్ధాంతానికి అమలిన శృంగార సిద్ధాంతానికి పోలికలున్నాయని కూడా సి.నా.రె. తులనాత్మక పరిశీలనతో వివరించారు.

రాయప్రోలు వారిపై రవీంద్రుని ప్రభావం గాఢంగా ఉంది. శాంతినికేతనంలో ఆయన శిష్యుడిగా అమేయమైన వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నాడు. కామరాజు లక్ష్మణరావుగారి సాహచర్యంతో విజ్ఞానాన్ని పెంపొందించుకున్నాడు.

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంధ్రశాఖాచార్యులుగా, కళాశాలాధ్యక్షులుగా ఎందరో శిష్యులను తీర్చిదిద్దాడు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యవర్గ సభ్యులుగా గణనీయమైన సేవ చేశాడు. ఎందరో కవులను, విమర్శకులను తీర్చిదిద్దిన ధన్యజీవులు రాయప్రోలు.

రావూరి వెంకట సత్యనారాయణగారు రాయప్రోలు వారిని ప్రశంసిస్తూ "ఒక యుగానికి పాదులు తీసిన తోటమాలి, కోకిల స్వామి" అన్నారు. ఆంధ్రోద్యమ కవిత్వానికి ఆద్యులు ఆచార్య రాయప్రోలు. ఆంధ్ర జాత్యాభిమానం ఆయనలో త్రివేణీ సంగమంలా ప్రవహించింది. "నాదు దేశము - నా జాతి - నాదు భాష" అని అభినివేశంతో చాటుకున్నారు. ఒకటి జాత్యాభిమానం, రెండోది దేశాభిమానం. మూడోది భాషాభిమానం. ఈ మూడు పాయల్లో ఆంధ్రాభిమానం సర్వతోముఖ స్ఫూర్తితో ఉంది. ఈ మూడింటికి గత వైభవ స్మరణం, వర్తమాన స్థితి పట్ల విచారం, భవిష్యత్ కర్తవ్య ప్రబోధం ముఖ్య లక్షణాలు.

తెలుగులో రాయప్రోలు వారు భారత జాతీయతకు సంబంధించి రాసిన జన్మభూమి గీతం ద్వారా "ఏ దేశమేగినా / ఎందుకాలిడినా / పొగడరా నీ తల్లి / భూమి భారతిని'' అంటూ జాతీయోద్యమానికి దోహదం చేశాడు. అప్పట్లో ఈ గీతం గొప్ప ప్రచారం పొందింది. యువకుల్లో స్పందన రేకెత్తించింది. తెనుగు తల్లి అనే పదం తొలిసారిగా ఆంధ్రాభిమానంతో రాయప్రోలు వారు ప్రయోగించారు. రాయప్రోలు కవిత్వంలో జాతీయాభిమానం, ఎల్లలులేని ఆంధ్రాభిమానం, ఆంధ్ర భాషాభిమానం, ఆంధ్ర ప్రబోధం, సంస్కరణ దృక్పథం, దేశభక్తి తత్పరత స్మృతి కవిత్వం పుష్కలంగా ఉన్నాయి. కవిత్వంలో వస్తు నవ్యత, శైలిలో సారళ్యం, అచ్చ తెనుగు పదాల ప్రయోగం విరివిగా ఉన్నాయి. గురజాడ, రవీంద్రుల స్ఫూర్తితో, ఆంగ్ల కవులైన గోల్డ్ స్మిత్, టెన్నిసన్‌ల ప్రభావంతో, కొమర్రాజు లక్ష్మణరావు, గుంటి లక్ష్మన్న పంతులు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య వంటివారి సాహచర్యంతో ఆయన కవిత్వ రచన సాగింది. ఆధునిక యుగ కర్తగా కీర్తింపబడిన రాయప్రోలు వారి వ్యక్తిత్వాన్ని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు

"అతడు యుగకర్త ఆచార్యుడాంధ్రవాణి
కభినవాదర్శమార్గ విద్యాప్రదాత
కోకిలస్వామి అతని గుండె గొంతు,
అభినవాలోక మాతని ఆత్మ గీతి''

అని అక్షర సత్యంగా అభినుతించాడు. రాయప్రోలు వారు జూన్ 30, 1984లో స్వర్గస్తులైనా, ఆంధ్రుల హృదయాల్లో చిరస్మరణీయుడు.

### 1.1.3. పాఠ్యభాగ సందర్భం :

తెలుగులో జాతీయతా గంధం గుబాళించే ప్రబోధ కవితగా, ఆంధ్రాభిమాన కవిత్వం రాయప్రోలు వారి 'ఆంధ్రావళి' ఖండ కావ్యంలో సమగ్రంగా సాక్షాత్కరిస్తుంది. జాతీయోద్యమ సమయంలోనే ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకై కొండా వెంకటప్పయ్య పంతులు వారు 1913లో బాపట్ల ఆంధ్రమహాసభను నిర్వహించారు. ఆ సమయంలో ఆంధ్రుల్లో అభిప్రాయ భేదాలు తలెత్తాయి. ఆంధ్రులు సమైక్యంగా జాతీయోద్యమంలో పోరాడాలన్నకాంక్షతో వారిలో ఆంధ్రాభిమానాన్ని రగుల్కొల్పేందుకు గత వైభవ స్మరణను, వర్తమాన కర్తవ్యాన్ని యువతీయువకుల్లో ప్రభోదించాలన్న సంకల్పంతో రాయప్రోలు వారు 1914లో "ప్రబోధం' ఖండిక రచించారు. "అమరావతీ'' పట్టణమున బౌద్దులు / విశ్వవిద్యాలయములు స్థాపించునాడు'' వంటి పద్యాలు 1914లో నెల్లూరు సభలో ఆంధ్ర రత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య చదివి వినిపించగా సభికుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయట. అప్పటి వరకు ఆంధ్ర రాష్ట్ర విషయంలో అభిప్రాయ భేదాలతో కలహించుకొనే నాయకులురాయప్రోలు వారి 'ప్రబోధం' పద్యాల స్ఫూర్తితో సమైక్య భావాన్ని ప్రకటించారట. కవిత్వం సామాజిక ప్రయోజనాన్ని సాధించాలన్న ఆధునిక సిద్ధాంతానికి లక్ష్యంగా ప్రబోధంతో కవితా పరమార్థాన్ని సాధించిన ధన్యులాయన "చావలేదు చావలేదాంధ్ర మహోజ్జ్వల చరిత్ర'' అని ఆంధ్రాభిమానంతో గత చారిత్రక వైభవాన్ని ప్రశంసించారు. "తెనుగుతల్లి'' శీర్షికలో భిన్న ప్రాంతాల్లో అనైక్యంగా ఉన్న ఆంధ్రుల్లో సమైక్యాన్ని సూచించారు. "ఆంధ్ర'' ఖండికలో రాష్ట్రాభిమానాన్ని చాటారు. "తెనుగు మాన్యము'' శీర్షికలో తెలుగు భాషా ప్రాశస్త్యాన్ని ప్రస్తుతించారు. "తెనుగుతల్లి'' "తెనుగు కత్తి'' "తెనుగు భూమి'' మొదలైన పదాల ప్రయోగంతో ఆంధ్రాభినివేశాన్ని కలిగించారు. తెలుగు నదులను, తెలుగు రాజుల శౌర్య పరాక్రమాలను, 'తెలుగు సిరిని' ప్రత్యేకించి ప్రశంసించిన తొలి తెలుగు కవి రాయప్రోలు వారు. విశ్వనాథ, తుమ్మల, జాషువా, కరుణశ్రీ, కొడాలి వంటి కవులకు ఆంధ్రాభిమాన కవిత్వ రచనకు ప్రేరకులు రాయప్రోలు. ఆధునికాంధ్ర కవులకు మార్గదర్శకులు. అందుకే విమర్శకులు ఆయనను ఆధునికాంధ్ర యుగకర్తగా కీర్తించారు.

## 1.1.4. పాఠ్యభాగ నేపథ్యం :

జాతీయోద్యమంలో తెలుగు కవులు జాతీయాభిమానంతో, స్వాతంత్ర్య స్ఫోరకంగా, పారతంత్ర్య బోధకంగా తమ కవితల ద్వారా ప్రజలను ప్రబోధించారు. రాయప్రోలు వారు భారత జాతీయతకు సంబంధించి రచించిన "జన్మభూమి" గేయం జాతీయోద్యమ కవిత్వంలో మకుటాయమానంగా నిలిచింది. ఆచార్య సి. నారాయణరెడ్డి 'జన్మభూమి గేయం' జాతీయ కవితా పురంధ్రికి శిరోభూషణం వంటిది అని అక్షర సత్యంగా వ్యాఖ్యానించారు.

"ఆంధ్రావళి" ఖండ కావ్యంలో ప్రచురించబడిన ఈ గేయం "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అనే సూక్తిని ప్రబోధించి. ఈ గేయం ద్వారా రాయప్రోలు వారు అంతకు ముందెవ్వరూ కలిగించని చైతన్యాన్ని కలిగించారు. ఇంత స్పష్టంగా, ఇంత సజీవంగా మాతృభాషా మమకారంతో తెలుగు కవులెవ్వరూ గానం చేయలేదంటే అతిశయోక్తి కాదు. తెలుగులో జాతీయతా గంధం గల ప్రబోధ కవిత్వం, ఆంధ్ర దేశాభిమాన కవిత్వం రాయప్రోలు వారి "ఆంధ్రావళి" ఖండ కావ్యంలో సమగ్రంగాసాక్షాత్కరిస్తుంది. జాతీయోద్యమ సమయంలో ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకై కొండా వెంకటప్పయ్య వంటి వారు 1913లో బాపట్లలో ఆంధ్ర మహాసభను నిర్వహించారు. ఆ సందర్భంలో ఆంధ్రుల్లో అభిప్రాయ భేదాలు తలెత్తాయి. ఆంధ్రులు సమైక్యంగా జాతీయోద్యమంలో పోరాడలన్న కాంక్షతో వారిలో ఆంధ్రాభిమానాన్ని రంగుల్కొలిపేందుకు, గత వైభవ స్మరణనం, వర్తమాన కర్తవ్యాన్ని యువతీయువకుల్లో ప్రబోధించాలన్న సంకల్పంతో 'ప్రబోధం' ఖండికను రచించాడు. 1914లో నెల్లూరు ఆంధ్ర మహాసభలో దుగ్గిరాల గోపాలకృష్ణయ్య ఆ పద్యాలను చదివి వినిపించగా అప్పటి వరకు ఆంధ్ర రాష్ట్ర విషయంలో కలహించుకుంటున్న ఆంధ్రుల్లో రాయప్రోలు వారి ప్రబోధం పద్యాలు స్ఫూర్తితో సమైక్యత భావాన్ని ప్రకటించారట. ఈ గేయం సభలో ఉన్న యువతీ యువకుల్లో జాతీయాభిమానాన్ని రేకెత్తించింది. ఆచార్య సి. నారాయణరెడ్డి పేర్కొన్నట్లు "జాతీయోద్యమంలో గురజాడ వారి "దేశ భక్తి గేయం" తర్వాత దేశీయుల్లో జాతీయ భావ జాగృతి కలిగించిన గేయాల్లో ఇది అగ్రపదంలోనిదనవచ్చును" అని సముచితంగా వ్యాఖ్యానించారు.

రాయప్రోలు వారు రవీంద్ర కవీంద్రుని శిష్యులో "జన్మభూమి" గేయంపై రవీంద్రుని ఆంగ్ల కవితా ప్రభావంతో పాటు "వర్డ్స్ వర్త్", టెన్నిసన్‌ల వంటి ఆంగ్ల కవుల ప్రభావాలున్నాయని ఆచార్య సి.నా.రె. సోదాహరణంగా నిరూపించారు. తెలుగు సాహిత్యంలో ఇంత మంది ఆంగ్ల కవుల ప్రభావంతో రాయప్రోలు వారు 'జన్మభూమి గేయాన్ని రచించినా, తెలుగు కవులెవ్వరూ చెప్పని గొప్ప దేశభక్తి భావాలు ఇందులో ఉండటం గర్వకారణం. అందుకే జాతీయోద్యమంలో అంత విస్తృతంగా ప్రచారం పొందింది.

## 1.1.5. కఠిన పదాలకు అర్థాలు - భావాలు :

| | | | |
|---|---|---|---|
| 1. | ఏ దేశము + ఏగినా | = | ఏ దేశానికి వెళ్ళినా |
| | ఎందుకాలు + ఇడినా | = | ఏ ప్రాంతంలో సంచరించినా |
| | ఏ పీఠము + ఎక్కినా | = | ఎంత గొప్ప అధికారాన్ని చేపట్టినా |
| | నీతల్లి | = | నీ తల్లియైన |
| | భూమి భారతిని | = | భారతమాతను |
| | పొగడరా | = | నోరార పొగడాలిరా ! |
| | నీ జాతి | = | నీ భరత జాతి |

| | | |
|---|---|---|
| నిండు గౌరవము | = | పరిపూర్ణమైన గౌరవాన్ని |
| నిలుపరా | = | నిలపవలెరా ! |

భావం : భాతీయుడవైననీవు ఏ దేశానికి వెళ్లినా, ఏ ప్రాంతాల్లో సంచరించినా, ఎంత గొప్ప పదవిలో ఉన్నా నీ తల్లి భరతమాతను నోరారా పొగడాలి. భారత జాతి పరిపూర్ణమైన గౌరవాన్ని నిలపాలనీ జాతీయాభిమానాతిరేకంతో రాయప్రోలు వారు ప్రభోదించారు.

| | | | |
|---|---|---|---|
| 2. | ఏ పూర్వ పుణ్యమో ! | = | ఏ పూర్వజన్మ సుకృతమో |
| | ఏయోగ బలమో ! | = | ఏ గొప్పతపోఫలమో ! |
| | స్వర్గఖండమున | = | స్వర్గతుల్యమైన భరతఖండాన |
| | ఏమంచి పూవులన్ | = | ఏ మంచి పూలతో |
| | ప్రేమించినావో ! | = | అర్చించితివో |
| | కనకగర్భంబున | = | బంగారు గర్భంలో |
| | భరతమాతనినుమోచె | = | భరతమాత నిన్ను భరించికన్నది. |

భావం : ఏ పూర్వజన్మ పుణ్యఫలం వల్లనో, ఏతపోదీక్ష వల్లనో, భారత భూమిలో నీవు జన్మించావు. ఏమంచి పూలతో భరతమాతను అర్చించితివో ఆమె బంగారు గర్భంలో నిన్ను మోసి కన్నది. భారతీయుడిగా జన్మించడం పూర్వ జన్మ సుకృతమని కవి గొప్పగా ప్రశంసించాడు.

| | | | |
|---|---|---|---|
| 3. | సూర్యుని వెలుతురల్ | = | సూర్యకాంతి వెలుగులు |
| | సోకునందాక | = | ప్రసరించినంత వరకు |
| | ఓడల జెండాలు | = | పడవలపై జెండాలు |
| | ఆడునందాక | = | ఎగురనంత వరకు (సృష్టి ఉన్నంత వరకు) |
| | ఇటువంటి భూదేవి | = | ఇటువంటి భూమాత |
| | ఎందు | = | ఎచ్చటా ? |
| | లేదురా | = | లేదు |
| | మనవంటి | = | భారతీయులవంటి |
| | పౌరులు + ఇంక + ఎందు | = | ఉత్తమ పౌరులింకెచ్చటైనా |
| | లేదురా | = | లేరని చెప్పాడు |

భావం : మన భారతమాత వంటి భూదేవత ప్రపంచంలో ఎక్కడా లేదు. భారతీయుల వంటి ఉత్తమ పౌరులెక్కడా లేరు. సూర్యరశ్మి ప్రసరించేంత వరకు (సృష్టి ఉన్నంత కాలం) భారత మాతకు సాటియైన దేవత ఉండదు. భారతీయుల వంటి పౌరులెక్కడా ఉండరనీ అతిశయించిన జాతీయాభిమానంతో భారతమాతను, భారతీయుల ఔన్నత్యాన్ని గొప్పగా ప్రశంసించాడు.

| | | | |
|---|---|---|---|
| 4. | అనంత | = | సాటిలేని |
| | భూతలం | = | భూమండంలో |
| | మనభూమి వంటి | = | మన భారతదేశం వంటి |
| | చల్లని తల్లిలేదు | = | చల్లని చూపులతో ప్రజలను రక్షించు తల్లి లేదు. |

భావం : సాటిలేని అనంతమైన ఈ భూమండలంలో భరతమాతవంటి చల్లని చూపులతో ప్రజలను రక్షించే తల్లిలేదని ప్రశంసించాడు. భారతమాత వైభవాన్ని కీర్తించే భావ గీతాలను పాడి ఆమె ఘనతను చాటి చెప్పమని రాయప్రోలు వారు కోరారు. భారత వీరుల శౌర్య ప్రాభవాలను గానం చేసి ప్రజలను ప్రబోధించాలని కవి కాంక్ష.

| | | | |
|---|---|---|---|
| 5. | ఋషుల్ | = | తపస్సంపన్నులు |
| | తమ తపస్సులు | = | తమ తపోదీక్షల ప్రాభవాన్ని |
| | ధార + పోయంగ | = | ధారపోయంగా |
| | రాజచంద్రులు | = | రాజశ్రేష్ఠులు |
| | శౌర్యహారము | = | తమ శౌర్య హారాలను |
| | అర్పింప | = | సమర్పించగా |
| | కవి ప్రభువుల్ | = | కవి శ్రేష్ఠులు |
| | భావసూత్రముల్ + అల్లంగ | = | భావకవితా సూత్రాలను కూర్పు చేయగా |
| | భక్త రత్నముల్ | = | భక్తులనెడి రత్నాలు |
| | రాగదుగ్ధము | = | అనురామనే క్షీరాన్ని |
| | పిదుక | = | పిదికిరి |

భావం : భారతమాత ఔన్నత్యానికి ఋషులు తమ తపో దీక్షలను ధార పోశారు. రాజశ్రేష్టులు తమ శౌర్యం హారాలను సమర్పించి భరతమాతను అర్చించారు. కవిశ్రేష్ఠులు అనురాగ క్షీరాలతో అభిషేకించారని, భరతమాతను భక్తి భావంతో అర్చించిన వారిని గూర్చి ప్రశంసించాడు.

| | | | |
|---|---|---|---|
| 6. | దిక్కులకు + ఎగదన్ను | = | దిక్కులన్నింటికి వ్యాపించు |
| | తేజము వెలుగ | = | తేజస్సు ప్రకాశించగా |
| | రాళ్ల తేనియులు + ఊరు | = | రాళ్లను సైతం కరిగించి మధురమైన తేనెలు ఊరునట్లు |
| | రాగాలు సాగ | = | సంగీత రాగాలు సాగగా |

| | | |
|---|---|---|
| జగములన్ + ఊగించు | = | ప్రపంచాలను ఉర్రూతలూగించినట్టి |
| మగతనంబు + ఎగయ | = | వీరుల పురుషత్వగరిమలు వెల్లివిరియగా |
| సౌందర్యము + ఎగబోయ | = | అందాలుచిందించు |
| సాహిత్యము + అలర | = | సాహిత్యం సంపదలు విలసిల్లగా |

భావం : దిక్కులు పిక్కటిల్లే విధంగా రాజుల పరాక్రమ తేజాలు ప్రకాశించాయి. మన వాగ్గేయకారులు మధుర సంగీత రాగాలతో రాళ్లనుకరిగించి తేనెలూరించారు. ఘన వీరుల పురుషత్వ గరిమలు జగాలను ఊగించాయి. మన సాహితీ సంపదల సౌందర్యాలు అలరించాయి. మన పరాక్రమాలు, సాంస్కృతిక, సాహితీ దీప్తులు విలసిల్లాయని రాయప్రోలు వారు అభిమానాతిరేకంతో గొప్పగా వర్ణించి యువతీ యువకులను ప్రబోధించారు.

| | | | |
|---|---|---|---|
| 7. | పుత్ర | = | యువకా ! |
| | ఈ దివ్య విశ్వంబు | = | ఈ దివ్యమైన ప్రపంచం |
| | వెలిగినది | = | ప్రకాశించింది. |
| | ఈ పుణ్య దేశంబు | = | ఈ పవిత్రమైన భారతదేశం |
| | దీపించెన్ | = | విలసిల్లింది |
| | ఇచట | = | ఈ భూమిలో |
| | పొలముల | = | పొలములందు |
| | రత్నాలు | = | విలువైన రత్నాలు |
| | మొలిచెరా ! | = | మొలిచినది |
| | వారిలో | = | సముద్రంలో |
| | ముత్యాలు పండెరా ! | = | శ్రేష్ఠమైన ముత్యాలు పండాయి. |

భావం : రాయప్రోలు వారు జాతీయాభిమాన స్ఫూర్తితో భారతదేశ సంపన్న గరిమను వర్ణించాడు. ప్రపంచం భారత దేశ సంపన్న శోభలతో విలసిల్లిందని ప్రశంసించారు. పుణ్య భారతదేశం తన ఆధిక్యంతో ప్రకాశించింది. ఈ భారత భూమిలో పొలాల్లో విలువైన రత్నాలు మొలచి ప్రపంచానికి ఆశ్చర్యం కలిగించాయి. సముద్రాల్లో పండిన విలువైన ముత్యాలను భారతీయ సంపదకు సంకేతాలుగా విలసిల్లాయని ప్రాచీన భారతీయ సంపన్నతను ప్రబోధాత్మకంగా వర్ణించి యువకుల్లో జాతీయాభిమానాన్ని రేకెత్తించాయి.

| | | | |
|---|---|---|---|
| 8. | పృథివి | = | భూమి, ఔషధపు మొక్కలు |
| | పిదికెరా ! | = | ప్రసాదించెరా ! |
| | కానల | = | అరణ్యాల్లో |

| | | |
|---|---|---|
| కస్తూరికాచెరా | = | కస్తూరి లభించింది |
| భారతీయుడను + అంచు | = | భారతీయుడనని |
| భక్తితో పాడు | = | దేశభక్తిని చాటి చెప్పుట |
| అవమానము + ఏలరా ! | = | అవమానమెందుకు ? |
| అనుమానము + ఏల | = | అనుమానం ఎందుకు ? |

భావం : భారత భూమి విలువైన దివ్యౌషధాలను ప్రసాదించింది. అరణ్యాల్లో కస్తూరి లభించింది. ఇంత గర్వించ దగ్గ ఘన చరిత్ర గల స్థితిలో భారతీయుడనని సగర్వంగా చాటి చెప్పుటకు అనుమానమెందుకు ? అవమానం ఎందుకు ? అని ఉద్వేగంతో యువకులకు ప్రబోధించారు.

## 1.1.6. పాఠ్యభాగ సారాంశం :

రాయప్రోలు వారు "జన్మభూమి" గేయాన్ని మంజరీ ద్విపద ఛందస్సులో రాశారు. గేయ ప్రారంభంలో

"ఏ దేశమేగినా / ఎందుకాలిడినా
పొగడరా నీ తల్లి / భూమి భారతిని"
నిలుపరా నీ జాతి నిండు గౌరవము"

అనే పంక్తుల్లో "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసీ" అనే రామాయణ శ్లోక స్ఫూర్తిని ప్రబోదించాడు. భారతీయుడవైన నీవు ఏ దేశానికి వెళ్లినా, ఏ ప్రాంతాల్లో సంచరించినా, ఎంత గొప్ప పదవుల్లో ఉన్నా నీ తల్లి భారతమాతను నోరార ప్రశంసించమన్నాడు. భారతజాతి నిండు గౌరవాన్ని నిలపాలని జాతీయాభిమానంతో ప్రబోధించాడు. ఏ పూర్వ జన్మ సుకృతం వల్లనో, ఏ తపో దీక్ష వల్లనో "స్వర్గతుల్యమైన భారతభూమిలో నీవు జన్మించావన్నాడు. భారతమాతను ఏ మంచి పూలతో అర్చించినందునో, నిన్ను ఆపి, బంగారు గర్భంలో మోసి కన్నదని గొప్పగా ప్రశంసించాడు.

మన భారతమాత కంటే భూ దేవత ప్రపంచంలో ఎక్కడా లేదు. భారతీయులవంటి ఉత్తమ పౌరులెక్కడా లేరు. సృష్టిలో సూర్యరశ్మి ప్రసరించేంత వరకు, సముద్రాల్లో ఓడలపై జెండాలు ఎగిరేంత వరకు సృష్టి ఉన్నంత వరకు భారతదేశానికి సాటియైన దేశం మరొకటి లేదు. భారతీయుల వంటి ఉత్తమ పౌరులెక్కడా ఉండరని అతిశయించిన జాతీయాభిమానంతో భారతమాతను, భారతీయులను గొప్పగా అభినుతించాడు.

సాటిలేని అనంతమైన భూమండలంలో భరతమాత వంటి చల్లని చూపులతో ప్రజలను రక్షించే తల్లి లేదన్నాడు. భారతమాత వైభవాన్ని కీర్తించే తెలుగు భావగీతాలను పాడి ఆమె ఘనతను చాటి చెప్పమని కోరాడు. గత భారత వీరుల శౌర్య ప్రాభవాలను గానం చేసి ప్రజలను ప్రబోధించమని రాయప్రోలువారి ఆకాంక్ష. భారతమాత ఔన్నత్యానికి ఋషులు తమ తపోదీక్షలను ధారపోశాడు. రాజశ్రేష్ఠులు తమ శౌర్య హారాలను సమర్పించి భారతమాతను భక్తి భావంతో అర్చించి ఆరాధించిన వారిని గూర్చి ప్రశంసించారు.

దిక్కులన్నీ పిక్కటిల్లే విధంగా రాజుల పరాక్రమ తేజాలు ప్రకాశించాయి. మన వాగ్గేయకారుల మధుర సంగీత రాగాలతో రాళ్లను కరిగించి తేనెలూరించారు. మన వీరుల పురుషత్వపు గరిమలు జనాలను ఊగించాయి. మన సాహితీ సంపదల సౌందర్యాలు అలరించాయి. మన పరాక్రమాలు, సాంస్కృతిక, సాహితీ దీప్తులు విలసిల్లాయని గొప్పగా వర్ణించి యువతీ యువకులను ప్రబోధించారు.

జాతీయాభిమాన స్ఫూర్తితో రాయప్రోలు వారు భారత దేశ సంపన్న గరిమను వర్ణించారు. ప్రపంచం భారతదేశపు సంపన్న శోభలతో విలసిల్లిందని ప్రశంసించారు. పుణ్య భారత దేశం తన అధిక్యతతో ప్రకాసించింది. ఈ భారత భూమితో పొలాల్లో విలువైన రత్నాలు మొలచి ప్రపంచానికి ఆశ్చర్యాన్ని కలిగించాయి. సముద్రాల్లో పండిన విలువైన ముత్యాలు భారతీయ సంపదకు సంకేతాలుగా విలసిల్లాయని ప్రాచీన భారతీయ సంపన్నతను ప్రబోధించి యువతీ యువకుల్లో జాతీయాభిమానాన్ని రేకెత్తించాడు.

భారతభూమి విలువైన గొప్ప దివ్యౌషధాలను ప్రసాదించింది. అరణ్యాల్లో కస్తూరి లభించింది. ఇంత గర్వించదగ్గ ఘన చరిత్ర ఉన్నందున భారతీయుడనని సగర్వంగా చాటి చెప్పేందుకు అనుమానమెందుకు, అవమానమెందుకు ? అని ఉద్వేగంతో రాయప్రోలు వారు యువతీ యువకులను ప్రబోధించారు.

యూనిట్ - 1

పాఠం - 2

# జన్మభూమి (గేయం)

(రెండో పాఠం)

డా॥ పి.వి. సుబ్బారావు

## పాఠ్య నిర్మాణ క్రమం

1.2.1. జన్మభూమి పాఠంలో పెద్ద ప్రశ్నలు

1.2.2. జన్మభూమి పాఠంలో చిన్న ప్రశ్నలు

1.2.3. జన్మభూమి పాఠంలో సందర్భసహిత వ్యాఖ్యలు

1.2.4. కవితాభావానికి రాదగిన కొన్ని ముఖ్యమైన పంక్తులు - వివరణ

## 1.2.1. జన్మభూమి పాఠంలో పెద్ద ప్రశ్నలు :

1. రాయప్రోలువారు 'జన్మభూమి' గేయం ద్వారా యువతీ యువకులను ప్రబోధించిన విధాన్ని వివరించండి. ?

(లేదా)

రాయప్రోలు వారి "జన్మభూమి" గేయం జాతీయోద్యమంలో అగ్రశ్రేణికి చెందింది" చర్చించండి ?

రాయప్రోలు వారు తెలుగులో జాతీయతకు సంబంధించి రచించిన జన్మభూమి గేయంలో

"ఏ దేశమేగినా / ఎందుకాలిడినా
పొగడరా నీ తల్లి / భూమి భారతిని"

అనే గేయం జాతీయోద్యమానికి గొప్పగా దోహదం చేసింది. ఈ గేయం అప్పట్లో యువతీయువకుల్లో స్పందన రేకెత్తించింది. గొప్ప ప్రచారం పొందింది. గురజాడ వారి "దేశభక్తి" గేయం ప్రేరణ, రవీంద్ర కవీంద్రుల ఆంగ్ల కవితా ప్రభావంతో రాయప్రోలు వారు ఈ గేయాన్ని గొప్పగా రచించారు. ఆచార్య సి. నారాయణరెడ్డి పేర్కొన్నట్లు జాతీయోద్యమంలో గురజాడ వారి దేశభక్తి గేయంపై ఆంగ్ల కవులైన టెన్నిసన్, వర్డ్స్ వర్త్‌ల ప్రభావం బలీయంగా ఉందని ఆయన సోదాహరణంగా నిరూపించారు. తెలుగు సాహిత్యంలో ఇంతమంది తెలుగు కవులెవ్వరూ చెప్పని గొప్ప దేశభక్తి భావాలు ఇందులో ఉండడం గర్వకారణం. అందుకే జాతీయోద్యమంలో ఈ గేయం అంత విస్తృతంగా ప్రచారం పొందింది.

ఈ గేయం ప్రారంభంలో రామాయణంలో వాల్మీకి మహర్షి చెప్పిన "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అనే సూక్తిని ప్రబోధించాడు. ఈ గేయం ద్వారా రాయప్రోలు వారు అంతకు ముందెవ్వరూ కలిగించని చైతన్యాన్ని కలిగించారు. ఇంత స్పష్టంగా, ఇంత సజీవంగా, మాతృభాషా మమకారంతో గానం చేయలేదంటే అతిశయోక్తి కాదు.

భారతీయుడవైన నీవు దేశానికి వెళ్లినా ఏ ప్రాంతాల్లో సంచరించినా, ఎంత గొప్ప పదవిని అలంకరించినా, నీ తల్లి భరతమాతను నోరారా పొగడాలని కోరారు. భారత జాతి నిండు గౌరవాన్ని నిలపాలనీ జాతీయాభిమానంతో యువకులను ప్రబోధించారు.

భారతీయుడిగా జన్మించడం ఏ పూర్వజన్మ సుకృతం వల్లనో, ఏ తపోఫలం వల్లనో స్వర్గతుల్యమైన భారతదేశంలో జన్మించావని ప్రశంసించారు. ఏ మంచి పూలతో భారతమాతను అర్చించినందున ఆమె బంగారు గర్భంలో నిన్ను మోసి కన్నదని భారతీయుడిగా జన్మించడం గొప్ప అదృష్టమని భాతీయత ఘనతను ప్రశంసించారు. మన భారతమాత వంటి భూ దేవత ప్రపంచంలో ఎక్కడా లేదు. భారతీయులవంటి ఉత్తమ పౌరులెక్కడా లేరని జన్మభూమి మమకారంతో వర్ణించారు. సృష్టి ఉన్నంత వరకు సూర్యుని వెలుతురు సోకినంత వరకూ భారతమాతకు సాటియైన దేశం ప్రపంచంలో ఉండదని భారతమాతను, భారతీయులను, మహోన్నతంగా వర్ణించారు. భరతమాతలా చల్లని చూపులతో ప్రజలను రక్షించే తల్లి లేదని కీర్తించారు. ఇంత ఉదాత్తమైన భారతమాత వైభవాన్ని తెలుగు బాల గీతాలతో పాడి ఆమె ఘనతను చాటి చెప్పమన్నారు. గత భారత వీరుల శౌర్య ప్రాభవాలను గానం చేసి ప్రజల్లో జాతీయాభిమాన స్ఫూర్తిని రగిలించమని ప్రబోధించారు.

భారతమాత ఔన్నత్యానికి ఋషులు తపోదీక్షలు ధారపోశారు. రాజులు తమ శౌర్యహారాలను సమర్పించి భరతమాతను అర్చించారని ప్రశంసించారు. కవి శ్రేష్ఠులు తమ భావ సూత్రాలతో కీర్తించారు. దేశభక్తి తత్పరులు అనురాగ క్షీరాలతో అభిషేకించి భక్తి భావంతో అర్చించారని ప్రశంసించారు. భారతమాత ఉదాత్త వైభవానికి భారతీయ ఋషులు, రాజులు, కవిశ్రేష్ఠులు, భక్తి తత్పరులు కారకులని ప్రబోధించారు. రాజుల పరాక్రమ తేజాలు దిక్కులన్నీ పిక్కటిల్లే విధంగా ప్రకాశించాయి. మన వాగ్గేయకారులు మధుర సంగీత గాన సుధలతో రాళ్లనుకరిగించి మకరంధాలను ఊరించారు. రాయప్రోలు వారు జాతీయాభిమాన స్ఫూర్తితో భారతదేశ సంపన్న గరిమను వర్ణించారు. ప్రపంచం భారతదేశ సంపన్న శోభలతో విలసిల్లిందని ప్రశంసించారు. పుణ్య భారతమాత పొలాల్లో అమూల్యమైన రత్నాలు మొలిచి ప్రపంచానికి ఆశ్చర్యాన్ని కలిగించాయి. సముద్రాల్లో పండిన విలువైన ముత్యాలు భారతీయ సంపదకు సంకేతాలుగా విలసిల్లాయి. ప్రాచీన భారతీయ సంపన్నతలను ప్రబోధాత్మకంగా వర్ణించి యువతీ యువకుల్లో జాతీయాభిమానాన్ని ప్రేరేపించారు.

దివ్యమైన భారత భూమి విలువైన దివ్యౌషధాలను ప్రసాదించింది. మన అరణ్యాల్లో కస్తూరి ఘుమఘుమలు గుబాళించాయి. ఇంత గర్వించదగ్గ భారత దేశ స్థితిని భారతీయులకు చాటి చెప్పేందుకు అనుమానమేల ? అవమానమేల ? అని ఉద్వేగంతో యువకులను ప్రబోధించారు. జాతీయోద్యమ గేయాల్లో "జన్మభూమి గేయం" చిరస్మరణీయమైంది. రాయప్రోలు వారి 'జన్మభూమి' స్ఫూర్తితో దువ్వూరి రామిరెడ్డి, జాషువా, తుమ్మల వంటి వారు గొప్ప జాతీయోద్యమ కవితలు రాసి ప్రజలకు ప్రబోధించారు.

## 1.2.2. జన్మభూమి పాఠంలో చిన్న ప్రశ్నలు :

**1. రాయప్రోలువారి 'జన్మభూమి' గేయంపై ఉన్న ప్రేరణలు, ప్రభావాలను వివరించండి ?**

రాయప్రోలు వారు భారత జాతీయోద్యమ స్ఫోరకంగా జాతీయతకు సంబంధించి రాసిన 'జన్మభూమి' గేయం మకుటాయమానమైంది. "లేదురా ! ఇటువంటి భూదేవి యెందు"? అని వర్ణించడంలో జాతీయాభిమానం పొంగి పొర్లింది. ఈ గేయంపై రవీంద్రుని ఆంగ్ల కవిత్వ ప్రభావం, టెన్నిసన్ "National Song", స్కాట్ "Breaths there the Man", వర్డ్స్ వర్త్ వంటి కవితల ప్రభావాలున్నాయని డా॥ సి. నారాయణరెడ్డి సోదాహరణంగా విశ్లేషించారు. వాటిని పరిశీలిద్దాం. వాల్మీకి రామయణ శ్లోక ప్రభావం కూడా గేయ ప్రారంభంలో ఉంది. భారత జాతీయోద్యమ కవిత్వం ఆంధ్ర దేశంలో ఆవిర్భవించేందుకు దేశంలో ఉద్యమాలన్నింటితో పాటు రవీంద్రుని జాతీయ గేయాలు కొంత వరకు ఉపకరించాయన్న డా॥ సి. నారాయణరెడ్డి మాటలు అక్షర

సత్యాలు. రాయప్రోలువారు రవీంద్రుని శిష్యులైనందున ఆయన 'జన్మభూమి' గేయంపై "Blessed am I Born this land and that I had the luck to love her" అనే రవీంద్రుని "India's Prayer" అనే గేయ ప్రభావం గాఢంగా ఉంది. జన్మభూమి గేయం ప్రారంభంలో "ఏ దశమేగినా / ఎందుకాలిడినా / పీఠమెక్కినా / ఎవ్వరేమనినా / పొగడరా / నీ తల్లి భూమి భారతిని / నిలుపరా నీ జాతి నిండు గౌరవము" అనే పంక్తుల్లో వాల్మీకి రామాయణ శ్లోకంలోని "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అనే సూక్తిని రాయప్రోలు వారు ప్రబోధించారు.

స్కాట్ మహాకవి రాసిన "Breaths there the Man" అన్న గేయం ఇంగ్లీషు సాహిత్యంలో ప్రసిద్ధమైంది. ఈ గేయం ప్రభావం రాయప్రోలు వారి జన్మభూమి గేయంలో "అవమానమేలరా ! అనుమానమేలరా ! / భారతీయుడనంచు భక్తితో పాడు" అనే పంక్తులపై ప్రస్ఫుటంగా వుంది.

"సూర్యుని వెలుతురుల్ సోకునందాక !
ఓడల జెండాలు ఆడునందాక
అందాకగల ఈ అనంత భూతలని
మన భూమి వంటి చల్లని తల్లి లేదు"

అనే చరణాలపై టెన్నిసన్ "National Song" There is no land like England wherever the light of the day be" అనే గేయ పంక్తులు ప్రభావం స్పష్టంగా వుంది. "లేరురా ! మన వంటి పౌరులింకెందు" అనే వాక్యంపై టెన్నిసన్ గేయంలోని "there are no man like English man" అనే వాక్య భావానికి ప్రతిబింబంగా వుంది.

ఏ పూర్వ పుణ్యమో ! ఏ యోగ బలమో ! జనియించి నాడవీ స్వర్గఖండమున" అనే పంక్తులపై రవీంద్రుని "India's Poetry" లోని "Blessed am I that iam born to this land and that I had the luck to love her" అనే గేయ భావాన్ని స్ఫురింపజేస్తుంది. ఈ జన్మభూమి గేయంపై ఇంత మంది ఆంగ్ల కవుల ప్రభావం ఉన్నా ఇది తెలుగు సాహిత్యంలో ఎన్నడూ లేని కొత్త దనాన్ని ప్రవేశపెట్టిన రచన అని చెప్పిన డా॥ సి. నారాయణరెడ్డి పరిశీలన ప్రశంసనీయం. ఈ గేయంలో భారత దేశ పురాతన వైభవాన్ని జోడించి వర్ణించుట వల్ల ఇంగ్లీషు గేయాల్లో లేని విశిష్టత ఈ గేయానికి ఉంది. రాయప్రోలు వారు జాతీయ స్ఫోరక భావం ప్రబోధంతో పాటు, చక్కని పద బంధాలను కూర్పు చేసినందున ఈ గేయం జాతీయోద్యమంలో బాగా ప్రసిద్ధి చెందింది.

**2. రాయప్రోలు వారి దేశ భక్తి కవిత్వ ప్రభావంతో ఆంధ్రోద్యమంలో వచ్చిన కవితలను వివరించండి ?**

ఆచార్య రాయప్రోలు సుబ్బారావు గారి పేరు వినగానే భావ కవిత్యోద్యమం మార్గదర్శకులన్న విషయం స్ఫురిస్తుంది. దేశ భక్తి కవిత్వ ప్రబోధం, ఆంధ్రాభిమానం గుబాళిస్తాయి. ఆధునిక కవిత్వానికి యుగకర్తగా ఆరాధ్యులైన రాయప్రోలు బహుముఖ ప్రజ్ఞాశాలి.

ఆయన బాపట్ల తాలూకా గార్లపాడు గ్రామంలో ది. 13-03-1892లో జన్మించారు. మేనమామ అవ్వారు సుబ్రహ్మణ్యశాస్త్రి దగ్గర సంస్కృతాంధ్రాలు నేర్చుకున్నారు. ఆయన ప్రేరణతో ఆశు కవితాభ్యాసం, అవధానాలు చేశారు. పల్లె ప్రాంతాల్లో కొత్తిమేర చేల మీద, కుండ పొదుగులితో భారంగానడిచే చూడి ఆవులపైన, ఊరి చెదమనుండి బిందెలతో నీళ్ల మోసుకొచ్చే పల్లె పడుతులపైన ఆశుకవితలు చెప్పేవారు.

రాజమండ్రిలో విద్యాభ్యాసం చేసే రోజుల్లో ఆంధ్రకేసరి పత్రికా సంపాదకులు చిలుకూరి వీరభద్రరావు, అత్తిలి సూర్యనారాయణగారు రాయప్రోలు వారి ప్రతిభకు పాదులు వేశారు. గుంటి లక్ష్మన్న పంతులు గారి పరిచయంతో గోల్డ్‌స్మిత్

మొదలైన ఆంగ్ల కవుల కావ్యాలను చదివారు. ప్రత్యేకించి గోల్డ్‌స్మిత్ వ్రాసిన "Helmat" కావ్యాన్ని తెలుగులో "లలిత" గా 1909లో అనువదించారు. దీంతో రాయప్రోలు కవితా జీవితానికి కొత్తమలుపు ప్రారంభమైంది. తర్వాత కావ్యాలకు బీజాలన దగిన భావాలందులో ఉన్నాయి. లలిత కావ్యం 1912లో పునర్ముద్రణణ పొందింది. అప్పుడు మాత్రమే పాఠకుల దృష్టిని ఆకర్షించింది. ఆ సమయంలోనే అవధానాలపై ఆసక్తి తరిగింది. రసభావ రహితమైన ఆశుకవితా విన్యాసంపై, అవధానాలపై 1911లో విరక్తి కలిగింది. తన కవితా పథాన్ని రమ్యాక్షర క్షోణికి, రసకావ్య రచనలపైకి మళ్లించుకున్నారు. ఆయన రచనలను పల్లా దుర్గయ్యగారు మూడు విధాలుగా వర్గీకరించి పరిశీలించారు. 1. అనువాదాలు, 2. సంస్కృత కావ్యాలు, 3. లక్షణ కావ్యాలుగా పేర్కొన్నారు. ఇంకా కథాకావ్యాలు, ఖండకావ్యాలు ప్రసిద్ధమైనవి.

ఆంగ్లానువాదాల్లో లలిత, అనుమితి ప్రసిద్ధాలు. ఉమర్ ఖయ్యామ్ రుబాయితీలను 'మధుకలశంగా' అనువదించారు. సంస్కృతం నుండి భజ గోవిందం, సౌందర్యలహరి గ్రంథాలను ఆంధ్రీకరించారు. వాల్మీకి రామాయణంలో సుందర కాండను గేయ రూపంలో రచించారు.

ఆయన కావ్యాల్లో తృణ కంకణం, కష్ట కమల, స్నేహలత, స్వప్న కుమారం భావ కవితాచార్యునిగా రాయప్రోలు వారి కీర్తిని విస్తరించాయి. ఆంధ్రావళి, జడ కుచ్చులు, వనమాల, మంజరీ మొదలైన ఖండ కావ్యాలు లబ్ధ ప్రతిష్ఠునిగా తీర్చిదిద్దాయి. రమ్యాలోకం, మాధురీ దర్శనం వంటి లక్షణ గ్రంథాలు కవిత్వాన్ని గూర్చి రసాలంకారాలను గూర్చి పద్యాల్లో చెప్పినా పండితుల ఆమోదం పొందాయి. 'రూపనవనీతం' అనే గ్రంథం స్త్రీ మనస్తత్వ ప్రతిపాదనకు సంబంధించింది. ఆయన "తృణ కంకణం కావ్యం" నవ్య కావ్యాల్లో మొదటిదిగా ప్రశంసించబడింది. ఆచార్య ఖండవల్లి లక్ష్మీ రంజనం గారు "ప్రేమతత్త్వాన్ని ప్రవచించడానికి పుట్టిన గీతాశాస్త్రంగా" అభివర్ణించారు.

ఈ కావ్యంలో ప్రధాన రసాన్ని అమలిన శృంగారంగా పేర్కొన్నాడు. ఖండవల్లివారు ధర్మ శృంగారంగా వర్ణించారు. సంభోగమే ప్రధానంగా వర్ణించిన పూర్వ కవుల శృంగార రస సిద్ధాంతం రాయప్రోలు వారికి నచ్చలేదు. అందుకే అమలిన శృంగారాన్ని ప్రతిపాదించారు. కేవలం సౌందర్యాపేక్షతో, సంభోగ దృష్టితో కూడిన శృంగారం లేదా ఆనందం మలినమైంది. లౌకిక వాదనలకు అతీతంగా వియోగ శృంగారమే పవిత్రంగా పొందే రసానందమే అమలిన శృంగామన్నది రాయప్రోలు వారి సిద్ధాంతం. "ఉపనిషత్తులు మొదలు లక్షణ గ్రంథాల్లోని రస సిద్ధాంతాలను మదించి తీసిన నవనీతమది" అని సి.నా.రె. చెప్పిన అభిప్రాయం సమజసంగా ఉంది. "ప్లేటో ప్రేమ సిద్ధాంతానికి అమలిన శృంగార సిద్ధాంతంతో" పోలికలున్నాయని ఆచార్య సి. నారాయణరెడ్డి తులనాత్మకంగా పరిశీలంచి నిర్ధారించారు.

రాయప్రోలు వారిపై రవీంద్రుని ప్రభావం గాఢంగా ఉంది. శాంతినికేతనంలో ఆయన శిష్యుడిగా అమేయమైన వ్యక్తిత్వాన్ని రూపొందించుకున్నాడు. కొమర్రాజు లక్ష్మణరావుగారి సాహచర్యంతో విజ్ఞానాన్ని పెంపొందించుకున్నాడు.

ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆంధ్ర శాఖాధ్యక్షులుగా ఎందరో శిష్యులను తీర్చిదిద్దారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కార్యవర్గ సభ్యులుగా గణనీయమైన సేవ చేశారు. ఎందరో కవులను, విమర్శకులను తీర్చిదిద్దిన ధన్యులు.

రావూరి వెంకట సత్యనారాయణ గారు రాయప్రోలు వారిని ప్రశంసిస్తూ ఒక యుగానికి పాదులు తీసిన తోటమాలి, కోకిల స్వామి అన్నారు. ఆంధ్రోద్యమ కవిత్వానికి ఆధ్యులు ఆచార్య రాయప్రోలు. ఆంధ్ర జాత్యాభిమానం ఆయనలో త్రివేణీ సంగమంలా ముత్తెఱగులుగా ప్రవహించింది. "నాదు దేశము - నా జాతి - నాదు భాష" అని అభినివేశంతో చాటుకున్నారు. ఒకటి జాత్యాభిమానం. రెండవది దేశాభిమానం. మూడవది భాషాభిమానం. ఈ మూడు పాయల్లో ఆంధ్రాభిమానంలో సర్వతో ముఖ స్ఫూర్తి ఉంది. ఈ మూడింటికిని గత వైభవ స్మరణం, వర్తమాన స్థితి పట్ల విచారం, భవిష్యత్ కర్తవ్యం ప్రబోధం ముఖ్య లక్షణాలు.

తెలుగులో రాయప్రోలు వారు భారత జాతీయతకు సంబంధించి రచించిన "జన్మభూమి" గీతం ద్వారా "ఏ దేశమేగినా / ఎందుకాలిడినా / పొగడరా నీ తల్లి భూమి భారతిని" అన్న ప్రబోధంతో జాతీయోద్యమానికి దోహదం చేశారు. ఈ గీతం అప్పట్లో గొప్ప ప్రచారం పొందింది. యువకుల్లో స్పందన రేకెత్తించింది. "తెనుగు తల్లి" - అనే పదం తొలిసారిగా ఆంధ్రాభిమానంతో రాయప్రోలు వారు ప్రయోగించారు. రాయప్రోలు కవిత్వంలో జాతీయాభిమానం, ఎల్లలు లేని ఆంధ్రాభిమానం, ఆంధ్ర భాషాభిమానం, ఆంధ్ర ప్రబోధం, సంస్కరణ దృక్పథం, దేశ భక్తి తత్పరత, స్మృతి కవిత్వం పుష్కలంగా ఉన్నాయి. కవిత్వంలో వస్తు నవ్యత శైలిలో సారళ్యత, అచ్చ తెనుగు పదాల ప్రయోగం విరివిగా ఉన్నాయి. గురజాడ, రవీంద్రుల స్ఫూర్తితో, ఆంగ్ల కవులైన గోల్డ్ స్మిత్, టెన్నిసన్‌ల ప్రభావంతో, కొమర్రాజు లక్ష్మణరావు, గుంటి లక్ష్మన్న పంతులు, ఆంధ్ర రత్న గోపాలకృష్ణయ్య మొదలైన వారి సాహచర్యంతో ఆయన కవిత్వ రచన సాగింది. ఆధునిక యుగకర్తగా కీర్తించబడిన రాయప్రోలు వ్యక్తిత్వాన్ని ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం ప్రశంసిస్తూ

"అతడు యుగకర్త ఆచార్యుడాంధ్రవాణి
కభినవాదర్శ మార్గ విద్యా ప్రదాత
కోకిలస్వామి అతని గుండె గొంతు
అభినవాలోకమాతని ఆత్మ గీతి"

అన్నారు. ఆయన జూన్ 30, 1984లో స్వర్గస్థుడైనా, ఆంధ్రులకు చిరస్మరణీయుడు ఆచార్య రాయప్రోలు.

### 1.2.3. జన్మభూమి పాఠంలో సందర్భ సహిత వ్యాఖ్యలు :

**1. పొగడరా నీ తల్లి భూమి భారతిని**

కవి పరిచయం : ఈ వాక్యం ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారి ఆంధ్రావళి ఖండ కావ్యంలోని జన్మభూమి గేయం నుండి గ్రహించబడింది.

సందర్భం : కవి గేయం ప్రారంభంలో జాతీయోద్యమ స్ఫూర్తితో, జన్మభూమి పట్ల మమకారంతో యువకులను ప్రేరేపించు సందర్భంలోనిది.

భావం : రాయప్రోలు వారు జాతీయోద్యమంలో యువకుల్లో జాతీయాభిమానాన్ని రేకెత్తించి ఏ లక్ష్యంతో జన్మభూమి పట్ల ప్రేరణ కలిగించేందుకు భారతీయుడవైన నీవు ఏ దేశానికి వెళ్ళినా, ఏ ప్రాంతాల్లో సంచరించినా, ఎంత పెద్ద పదవిలో ఉన్నా నీ తల్లి భారతమాతను నోరార పొగడమని ప్రబోధించారు.

**2. లేదురా ! ఇటువంటి భూదేవియెందు ?**

కవి పరిచయం : ఈ వాక్యం ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారి ఆంధ్రావళి ఖండ కావ్యంలోని జన్మభూమి గేయం నుండి గ్రహించబడింది.

సందర్భం : భారతీయుడిగా జన్మించుట పూర్వ జన్మ సుకృతమని, భారతమాత వంటి భూ దేవత ప్రపంచంలో ఎక్కడా లేదని భరతమాత ఔన్నత్యాన్ని వివరించే సందర్భంలోనిది.

భావం : సృష్టి ఉన్నంత వరకు భారతమాతకు సాటియైన దేశం ఎక్కడా ఉండదని, భారతీయుల వంటి పౌరులెక్కడా ఉండరనీ, అతిశయించిన జాతీయాభిమానంతో కవి భారతమాతను,భారతీయులను గొప్పగా ప్రశంసించి ప్రబోధించారు.

**3. రాగదుగ్ధము భక్త రాజులీయంగ**

కవి పరిచయం : ఈ వాక్యం ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారి ఆంధ్రావళి ఖండ కావ్యంలోని జన్మభూమి గేయం నుండి గ్రహించబడింది.

సందర్భం : కవి భారతమాత ఔన్నత్యానికి భక్తితత్పరలు భక్తిభావంతో అర్పించిన విధానాన్ని ప్రశంసించు సందర్భంలోనిది.

భావం : భారతమాత ఔన్నత్యాన్ని పెంపొందించేదుకు ఋషుల తపోదీక్షలు ధారపోశాడు. రాజశ్రేష్ఠులు తమ శౌర్యహారాలను సమర్పించారు. భక్తితత్పరులు అనురాగ క్షీరాలతో భారతమాతను భక్తి భావంతో అభిషేకించారని భావం.

**4. సౌందర్య మెగబోయు సాహిత్యమలర**

కవి పరిచయం : ఈ వాక్యం ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారి ఆంధ్రావళి ఖండ కావ్యంలోని జన్మభూమి గేయం నుండి గ్రహించబడింది.

సందర్భం : భారతదేశ ఔన్నత్యాన్ని కవులు తమ కావ్యాల ద్వారా గొప్పగా వర్ణించి మన సాహిత్యం సంపదలను విస్తరించారని ప్రశంసించు సందర్భంలోనిది

భావం : భారతదేశ ఘనతను రాజులు తమ పరాక్రమ తేజాలతో ప్రకాశింపజేశారు. మన వాగ్గేయకారులు మధుర సంగీత రాగాలతో రాగ సుధలందించారు. మన సాహిత్యం సాంస్కృతిక దీప్తులు గొప్పగా అలరించాయి. భారతదేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పమని రాయప్రోలు వారు ప్రబోధించారు.

**5. పొలిమాల రత్నాలు మొలిచెరా యిచట వార్ధిలో ముత్యాలు పండెరాయిచట**

కవి పరిచయం : ఈ వాక్యం ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారి ఆంధ్రావళి ఖండ కావ్యంలోని జన్మభూమి గేయం నుండి గ్రహించబడింది.

సందర్భం : రాయప్రోలు వారు భారత దేశ సంపన్న గరిష్ఠను వర్ణించు సందర్భంలో పలికిన వాక్యాలు.

భావం : కవి భారతదేశ సంపన్న గరిమ ప్రపంచానికి తలమానికం వంటిదని ప్రశంసించారు. పుణ్య భారతభూమి, పొలాల్లో అమూల్యమైన రత్నాలు మొలచి ప్రపంచానికి ఆశ్చర్యం కలిగించాయి. సముద్రాల్లో పండిన విలువైన ముత్యాలు భారతీయ సంపద సంకేతాలుగా విలసిల్లాయనీ ప్రాచీన భారత సంపన్నతలను ప్రబోధాత్మకంగా వర్ణించి యువకుల్లో జాతీయాభిమానాన్ని ప్రదీప్తం చేశారు.

**6. అనుమానమేలరా ! అవమానమేలరా ! భారతీయుడనంచు భక్తితో పాడ**

కవి పరిచయం : ఈ వాక్యం ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారి ఆంధ్రావళి ఖండ కావ్యంలోని జన్మభూమి గేయం నుండి గ్రహించబడింది.

సందర్భం : భారత భూమి విలువైన గొప్ప దివ్యౌషధులను ప్రసాదించింది. మన అరణ్యాల్లో సువాసన ద్రవ్యమైన కస్తూరి లభించింది ఇంత గర్వించదగ్గ ఘన చరిత్ర గల భారతదేశానికి చెందిన నీవు భారతీయుడనని సగర్వంగా చాటి చెప్పుకోనేందుకు అనుమానమెందుకు ? అనుమానమెందుకు ? అని ఉద్వేగంతో కవి యువకులను ప్రబోధించే సందర్భంలోనిది.

భావం : గర్వించదగ్గ ఘన చరిత్ర గల భారతీయుడునని సగర్వంగా చాటి చెప్పేందుకు అనుమానమేలరా ? అవమానమేలరా ? అని కవి ఉద్వేగంతో యువకులను ప్రబోధించాడు.

## 1.2.4. కవితా భావానికి రాదగిన పంక్తులు :

1. ఏ దేశమేగినా / ఎందుకాలిడినా
ఎవ్వరేమనిన పొగడరా ! నీ తల్లి భూమి భారతిని
నిలుపరా ! నీ జాతి నిండు గౌరవమ్ము"

ఈ పంక్తులు ఆచార్య రాయప్రోలు సుబ్బారావుగారి 'జన్మభూమి' గేయం ప్రారంభంలోని యువకుల్లో జాతీయోద్యమం స్ఫూర్తిని రగిలించే లక్ష్యంతో రాయప్రోలు వారు వాల్మీకి రామాయణంలోని "జననీ జన్మభూమిశ్చ" అనే సూక్తిని ఈ పంక్తుల్లో ప్రబోధించాడు.

ఏ దేశానికి వెళ్లినా, ఎక్కడ సంచరించినా, ఎంత గొప్ప పదవిని అలంకరించినా, ఎవ్వరేమన్నా నీ తల్లి భూమి భారతిని నోరార పొగడమన్నాడు. భారత జాతి గౌరవాన్ని పరిపూర్ణంగా నిలపమన్నాడు. వాల్మీకి రామాయణంలో చెప్పిన సూక్తిని సరళ సుందరంగా గేయంలో చెప్పి ప్రబోధించాడు.

2. "లేదురా ! ఇటువంటి భూదేవియెందు,
లేరురా ! మనవంటి పౌరులింకెందు ?
సూర్యుని వెలుతుదల్ సోకునందాక
ఓడల జెండాలు ఆడునందాక "

ఈ పంక్తులు ఆచార్య రాయప్రోలువారు దేశభక్తి స్పోరకంగా జాతీయాభిమాన ప్రబోధంతో భారతదేశ ఘనతను వినుతించాడు. ఈ పంక్తులపై ఆంగ్ల కవి టెన్నిసన్ "National Song" ప్రభావం బలియంగా వుంది. ఆయన There is no land like England wherever the light of day be" అనే పంక్తుల ప్రభావంతో "లేదురా ! ఇటువంటి భూదేవియెందు" అన్నాడు. లేదురా ! మనవంటి పౌరులింకెందు ? అనే పంక్తులపై కూడా టెన్నిసన్ ప్రభావం ఉంది. భారతదేశ ఉదాత్తతను, భారతీయుల ఔన్నత్యాన్ని టెన్నిసన్ గేయ ప్రభావస్ఫూర్తితో రాయప్రోలు వారు గొప్పగా రచించారు.

యూనిట్ - 2

పాఠం - 3

# వేమన నీతి

## (మొదటి పాఠం)

## (1వ పద్యం నుండి 30వ పద్యం వరకు - 30 పద్యాలు)

**- వేమన పద్యాలు**

తెలుగు సాహిత్యంలో విలక్షణమైన కవి వేమన. బహుళ ప్రచారాన్ని పొందిన కవిగా కూడా వేమనను చెప్పుకోవచ్చు. వేమన పద్యాలు కనీసం రెండు మూడైనా రాని తెలుగువాడు ఉండటంటే అతిశయోక్తికాదు. ప్రజల నాలుకల మీద నర్తించే పద్యాలు రచించిన వేమన తెలుగు సాహిత్యంలో ఒక విశిష్టమైన స్థానాన్ని సంపాదించాడు. వేమన జీవించిన కాలాన్ని గూర్చి సాహిత్య లోకంలో భిన్నాభిప్రాయాలున్నాయి. ఆయన నివాసాన్ని గూర్చి కూడా పండిత లోకంలో ఏకాభిప్రాయం లేదు. ఏది ఏమైనా ఎక్కువ మంది విమర్శకులు వేమన రాయలసీమ ప్రాంతం వాడని ఆయన 1650 ప్రాంతాల్లో జీవించి సామాజిక వ్యవస్థను పరిశీలిస్తూ పద్య రచన చేశాడని తమ తమ అభిప్రాయాల్ని ప్రకటించాడు.

హైదరాబాదులోని యోగి వేమన తెలుగు విజ్ఞాన కేంద్రం ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వర్తించిన బంగోరె 1980లో వేమన పద్యాలకు ముందు మాటలు రాస్తూ "ఇవాళ మనం ప్రత్యేకంగా ఉద్యమించవలసిన అవసరం లేకుండానే యీ పాటికే అనేక యితర భాషల్లోకి అనువాదమై యితర ప్రాంతాల వారికీ, దేశాలవారికీ బాగా పరిచయస్తుడైన తెలుగు కవి వేమన ఒక్కడే. తమిళం, కన్నడం ఉర్దూ తదితర పొరుగుభాషల మాట అటుంచి, ఇంగ్లీషులోకి కూడా విస్తారంగా తర్జుమా అయి రచ్చ గెలిచినా, (తెలుగువారి వైపు నుంచి పెద్దగా వొత్తిడి లేకపోయినా, యునెస్కోవారు తమకు తాము గానే కాలిఫోర్నియాలోని డా॥ జె.యస్.ఆర్.యల్. నారాయణమూర్తిగారి చేత ఇంగ్లీషులోకి కొత్తగా అనువాదం చేయిస్తున్నారు. క్రమంగా యితర ప్రపంచ భాషల్లోకి కూడా వేమన తర్జుమా కావచ్చు). ప్రజాబలం ఎంత ఉన్నప్పటికీ మన పండితుల కూహకంవల్ల వేమన ఒక విధంగా యింకా యింట గెల్వలేకపోతున్నాడు." అని చెప్పారు.

వేమనను గూర్చి భారతీయులకంటే ముందు పాశ్చాత్యులే ఎక్కువగా పట్టించుకొన్నారు. 1808లో వేమనను గూర్చి మద్రాసు క్రిష్టియన్ కాలేజీ మేగజైనుకు క్యాంబెల్ ఒక వ్యాసం రాశాడు. అందులో బ్రాహ్మణులు వేమన బోధనలను నిరాదరించే వారని రచించారు. హిందువుల ఆచారాలు అలవాట్లు అనే గ్రంథంలో జె.వి. దుబాయ్ అనే పాశ్చాత్యుడు వేమన ప్రసక్తిని రెండుసార్లు తెచ్చాడు. ఈ గ్రంథం 1816లో వెలువడింది. అయితే ఇది ఫోర్జరీ గ్రంథమని 'బంగోరె' తిరస్కరించాడు. వేమన పద్యాల్ని వెలుగులోకి తీసుకువచ్చిన మహానుభావుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్. ఈయనే సి.పి. బ్రౌన్‌గా ప్రసిద్ధుడు. ఈయన 1829లో వేమన పద్యాల్ని 698 మొదటిసారిగా ప్రచురించాడు. తర్వాత 1839లో 1165 పద్యాలతో మరోసారి ముద్రించాడు. బంగోరెగారు బ్రౌన్ రెండవ ముద్రణను పునర్ముద్రిస్తూ రచించిన మాటలు గమనించదగినవి.

"ఇప్పుడు పునర్ముద్రణ పొందుతున్న ఈ 1839 నాటి బ్రౌన్ కూర్పుకు ప్రత్యేక చారిత్రక ప్రాధాన్యం వుంటుంది. వేమన పద్యాలు తొట్టతొలుతగా అచ్చులో ఆవిష్కరించిన వ్యక్తి బ్రౌన్ గనుక ఆయన రూపొందించిన రెండు ముద్రణల్లోనూ యిది విస్తృతమైన ప్రతిగనుక దీనికి ఆ ప్రాధాన్యం వున్నది. పెక్కు తాళపత్ర ప్రతులను సేకరించి సంప్రదించి అప్పటికి ఆధునికమైన శాస్త్రపద్ధతిలో పాఠనిర్ణయం చేసి ముద్రించిన ప్రతిగనుక దీనికి ఆ విశిష్టతవున్నది. వేమన పద్యాలకు నేటికీ మన దేశంలో

లభ్యమవుతున్న రాతప్రతుల విషయం చూస్తే బ్రౌన్ భద్రపరచిపెట్టి పోయినవే జాస్తి. యివి మొత్తం 54 దాకా వున్నాయి. వేమనపై శ్రద్ధ గలిగినవారు చేయవలసిన సర్వంకష పరిశోధనలకు యీ బ్రౌన్ సంచయమే వున్నంతలో అమూల్యమైనది. అనన్యమైనది'' అని చెప్పిన బంగోరె మాటల్ని ' గమనిస్తే బ్రౌన్ సంకలనానికి ఉన్న ప్రాశస్త్యం స్పష్టమవుతుంది.

కవుల చరిత్రల్ని గూర్చి రచించిన మన రచయితలు కొందరు వేమనను కవిగా గుర్తించక పోవటం దురదృష్టం. 1829లో కావలి వెంకట స్వామి రచించిన దక్కను కవుల చరిత్రలోగాని, 1899లో కందుకూరి వీరేశలింగం రచించిన "కవుల చరిత్ర'లో కాని వేమన లేక పోవటం దురదృష్టం. అయితే అంతర్జాతీయ ఖ్యాతి పొందిన మొట్టమొదటి తెలుగు కవిగా వేమనను చెప్పవచ్చు. వేమన పద్యాల్నిసి. పి. బ్రౌన్ () అని అంగీకరించటంతో వేమన పాశ్చాత్యులకు పరిచయమయ్యాడు. వేమన తన కవిత్వాన్ని ప్రజలకోసం రాశాడు. ప్రజల భాషలో రాశాడు. జీవితంలోని ప్రతి సందర్భానికి సమన్వయించే పద్యం వేమన రచనల్లో ఉందని చెప్పటం సముచితమని భావించవచ్చు. అందుకే వేమన 'ప్రజాకవి' అయ్యాడు.

1. అంతరంగమందు అపరాధములు జేసి
మంచివాని వలెను మనుజు డుండు
ఇతరు లెరుగకున్న ఈశ్వరు డెరుగదా
విశ్వదాభిరామ వినుర వేమ.

2. అంతరంగమందు అభవు నుద్దేశించి
నిలిపి చూడచూడ నిలుచుగాక
బాహ్యమందు శివుని భావింప నిలుచునా
విశ్వదాభిరామ వినుర వేమ.

3. అడవి దిరుగ జిక్క దాకసమునలేదు
అవని తీరయాత్రలందు లేదు
ఒడలు శుద్ధిచేసి ఒడయని చూడరా
విశ్వదాభిరామ వినుర వేమ.

4. అదిమి మనసు నిలిపి ఆనందకేళిలో
బ్రహ్మమయుడు ముక్తి బడయగోరు
జిహ్వరుచులచేత జీవుండు చెడునయా
విశ్వదాభిరామ వినుర వేమ.

5. అనగ ననగ రాగ మతిశయిల్లుచు నుండు
తినగ తినగ వేము తీయ నుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినుర వేమ.

6. అనువుగాని చోట అధికుల మనరాదు
కొంచె ముండు టెల్ల కొదువ గాదు
కొండ అద్దమందు కొంచెమై యుండదా
విశ్వదాభిరామ వినుర వేమ.

7. అన్నిదానములను అన్నదానమె గొప్ప
కన్నవారి కంటె ఘనులు లేరు
ఎన్న గురువు కంటె ఎక్కువ లేరయా
విశ్వదాభిరామ వినుర వేమ.

8. అప్పు దూయరోత హరిహరాదులకైన
మొప్పెతోడ మైత్రి మొదలె రోత
తప్పు బలుకరోత తాకట్టిడిన రోత
విశ్వదాభిరామ వినుర వేమ.

9. అప్పులేని వాడె అధిక సంపన్నుడు
తప్పులేని వాడు ధరను లేడు
గొప్పలేని బుద్ధి కొంచెమై పోవురా
విశ్వదాభిరామ వినుర వేమ.

10. అల్పబుద్ధి వాని కధికార మిచ్చిన
దొడ్డవారి నెల్ల తొలగ గొట్టు
చెప్పుదిన్న కుక్క చెరకు తీపెరుగునా?
విశ్వదాభిరామ వినుర వేమ.

11. అల్పసుఖము లెల్ల నాశించి మనుజుండు
బహుళదుఃఖములను బాధపడును
పరసుఖంబు నొంది బ్రతుకంగ నేరడు
విశ్వదాభిరామ వినుర వేమ.

12. అల్పు దెపుడు పల్కు ఆడంబరము గాను
సజ్జనుండు పల్కు చల్లగాను
కంచు మోగినట్లు కనకంబు (మోగునా
విశ్వదాభిరామ వినుర వేమ.

13. ఆత్మలోన శివుని అనువుగా శోధించి
నిశ్చలముగ భక్తి నిలిపె నేని
సర్వముక్తుడౌను సర్వంబు తానౌను
విశ్వదాభిరామ వినుర వేమ.

14. ఆత్మశుద్ధి లేని ఆచార మరియేల
భాండ శుద్ధి లేని పాకమేల
చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా
విశ్వదాభిరామ వినుర వేమ.

15. ఆలి వంకవార లాత్మ బంధువు లైరి
తల్లి వంకవారు తగినపాటి
తండ్రి వంకవారు దాయాదు లైరయా
విశ్వదాభిరామ వినుర వేమ.

16. ఆలుసుతులు మాయ అన్నదమ్ములు మాయ
తల్లి తండ్రి మాయ తానుమాయ
తెలియ నీదు మాయ దీనిల్లు పాడాయ
విశ్వదాభిరామ వినుర వేమ.

17. ఆశకన్న దుఃఖ మతిశయంబుగ లేదు
చూపు నిలుపకున్న సుఖములేదు
మనసు నిలుపకున్న మరి ముక్తి లేదయా
విశ్వదాభిరామ వినుర వేమ.

18. ఆశచేత మనుజులాయువు గలనాళ్లు
తిరుగుచుందురు భ్రమ త్రిప్పలేక
మురికిభాండమందు ముసరు నీగల భంగి
విశ్వదాభిరామ వినుర వేమ.

19. ఆశలుడుగ కున్న పాశముక్తుడు గాదు
ముక్తుడైనగాని మునియుగాడు
మునియునైతె గాని మోగంబులుడుగవు
విశ్వదాభిరామ వినుర వేమ.

20 ఇంటిలోని ధనము నిది నాది యనుచును
మంటిలోన దాచు మంకుజీవి
కొంచుబోడు వెంట గుల్లకా సైనను
విశ్వదాభిరామ వినుర వేమ.

21. ఇంద్రియములు బట్టి ఈడ్చుచు నుండగా
వెర్రి మనుజుదేల వెదకు శివుని
ఇంద్రియముల రోసి ఈశుని జూడరా
విశ్వదాభిరామ వినుర వేమ.

22. ఇచ్చువాని వద్ద ఈని వాడుండిన
చచ్చుగాని ఈవి సాగనీడు
కల్పతరువు కింద గచ్చ చెట్టున్నట్లు
విశ్వదాభిరామ వినుర వేమ.

23. ఇరుకు వచ్చు వేళ ఈశ్వరు నెంతురు
కరుణ గనునె వట్టి గాసి గాక
సుఖము వచ్చువేళ చూడంగ నాల్లరు
విశ్వదాభిరామ వినుర వేమ.

24. ఇల్లు నాలి విడచి ఇనుపకచ్చలు గట్టి
వంటకంబు నీటి వాంఛ లుడిగి
ఒంటినున్న యంత ఒదవునా తత్వంబు
విశ్వదాభిరామ వినుర వేమ.

25. ఉత్తముని కడుపున నోగు జన్మించిన
వాడు చెరచు వాని వంశమెల్ల
చెరకు వెన్ను బుట్టి చెరపదా తీపెల్ల
విశ్వదాభిరామ వినుర వేమ.

26. ఉన్నతావు వదలి ఊరూరు దిరిగిన
కన్నదేమి నరుడు గ్రాసమునకు
తన్నులోను జూడ తమమెల్ల వీడును
విశ్వదాభిరామ వినుర వేమ.

27. ఉప్పుకప్పురంబు ఒక్క పోలిక నుండు
చూడచూడ రుచుల జాడవేరు
పురుషులందు పుణ్యపురుషులు వేరయా
విశ్వదాభిరామ వినురవేమ.

28. ఎంత చదువు చదివి ఎన్ని నేర్చినగాని
హీను డవగుణంబు మానలేడు
బొగ్గు పాలగడుగ పోవునా మలినంబు
విశ్వదాభిరామ వినుర వేమ.

29. ఎన్ని తనువులైన మృతికి నడ్డము గావు
మృతిని గెలువలేని యెరుకలేల
దొంగరీతిగాక దొరకునా మోక్షంబు
విశ్వదాభిరామ వినుర వేమ.

30. ఎరుక కన్నను సుఖ మేలోకమున లేదు
యొరుక నెరుగ నేవని కెరుక లేడు
యెరుక సాటి యెరుక యెరుకయే తత్వంబు
విశ్వదాభిరామ వినుర వేమ.

## 3.1. కవి పరిచయం :

వేమన పేరు వినని తెలుగు వాడు వుండడని చెప్పటం అతిశయోక్తి కాదు. విద్యావంతులు కాని వారు కూడా వేమన పద్యాలను అప్పగించటం వేమన పద్యశక్తికి తార్కాణం. వేమన ప్రజాకవిగా ప్రసిద్ధి పొందాడు. చాలా మంది రాజుల్ని ఆశ్రయించి వారి మెప్పుల కోసం కవిత్వాన్ని సృష్టించి తమ కావ్యాలను రాజులకు అంకితం చేసి ధన్యులమయ్యామని భావించారు. కానీ వేమన ఏ రాజునూ ఆశ్రయించలేదు. అలాగే వేమన కంటే పూర్వుడైన బమ్మెర పోతన కూడా ప్రారంభ దశలో రాజును ఆశ్రయించినా ఆ తర్వాత తాను రచించిన ఆంధ్ర మహా భాగవతాన్ని భగవంతునికే అంకితం చేశాడు. పోతన, వేమన లాంటి కవులు సాహిత్యంలో చాలా అరుదుగా ఉన్నారు. వేమన ఆటవెలది ఛందస్సులో పద్యాలను రచించి, ప్రజల భాషలో సమాజాన్ని ప్రతిబింబింప చేశాడు. సామాజిక రుగ్మతల్ని ఖండించాడు. అయితే వేమన ఏ కాలానికి చెందిన వాడు అనే విషయంలో, సాహిత్య లోకంలో భిన్నాభిప్రాయాలున్నాయి వేమన మీద విశేషం, పరిశోధన చేసిన పలువురు విమర్శకులు వేమన కాలాన్ని క్రీ.శ. 1650 ప్రాంతంగా గుర్తించారు. ఏ కాలానికి చెందిన వాడైనా ఎలాంటి రచనలు చేశాడు అనే విషయాన్ని మనం పరిగణించాలి.

వేమన మీద అనేక గ్రంథాలు వచ్చాయి. కానీ దురదృష్టం ఏమిటంటే సాహిత్య చరిత్రకారులు కూడా కొంత మంది వేమనను కవిగా గుర్తించక పోవటం. 'దక్కను కవుల చరిత్ర'ను రచించిన కావలి సోదరులు కానీ, ఆంధ్ర కవుల చరిత్రను రచించిన కందుకూరి వీరేశలింగం పంతులు కానీ వేమనను గూర్చి ప్రస్తావించలేదు. వేమనను గూర్చి పాశ్చాత్యులు చెప్పే వరకూ, మనం గుర్తించలేకపోయాం. మొదటిసారిగా మద్రాసులోని పాశ్చాత్య పండితులు వేమనని గురించిన ఉటంకింపులు చేశారు. ఆ

తర్వాత సి.పి. బ్రౌను వేమన పద్యాలను సేకరించి సమర్పించటమే కాకుండా ఆయన పద్యాలు కొన్నింటిని ఆంగ్లంలోనికి అనువదించాడు. ఈ విధంగా అంతర్జాతీయ స్థాయిలో ప్రచారం పొందిన మొదటి కవిగా వేమన గుర్తింపు పొందాడు. బ్రౌన్ మహాశయుడు వేమన పద్యానలు "ది వెర్సెస్ ఆఫ్ వేమన" అనే పేరుతో ఆంగ్లంలోనికి అనువదించాడు.

వేమన పద్యాల లాగానే కొంత మంది పద్యాలు రచించి చివర 'విశ్వదాభిరామ వినుమ వేమ' అని చేర్చి ప్రచారంలోనికి తీసుకు రావటంతో 'నిజంగా వేమన పద్యాలు ఏవి' అని నిర్ణయించటం కష్టమైంది. వేమన కవిత్వంలో అనేక సామాజికాంశాలున్నాయి. ఆయన కులాన్ని నిరసించాడు. మూఢ విశ్వాసాల్ని ఖండించాడు. హేతువాద దృక్పథాన్ని ప్రకటించాడు. ధన ప్రాధాన్యాన్ని చెప్పాడు. లోభులు, మూర్ఖులు ఎలా ఉంటారో చెప్పాడు. నైతిక ప్రబోధం, వ్యక్తిత్వ వికాసాన్ని ప్రతిబింబించే అంశాలు వేమన పద్యాల్లో ఉన్నాయి. వేమన పద్యాలు సార్వకాలికాలు, సార్వజనీనాలు.

## 3.2. పాఠ్యభాగ నేపథ్యం :

వేమన లాగా కొంత మంది పద్యాల్ని రచించి వేమన పద్యాలతో కలపటం వల్ల నిజంగా వేమన పద్యం ఏది అని నిర్ధారణ చెయ్యటం కష్టమైపోయింది. ఆటవెలది' ఛందస్సులో దొరుకుతున్న కొన్ని పద్యాలు మాత్రమే వేమన పద్యాలని కొంతమంది భావన. ఇంకా కందం, సీసం, వృత్తాలు, తేటగీతి ఛందస్సులలో వేమన పేరుతో లభిస్తున్న పద్యాలు కూడా వేమన రచించినవేనని మరి కొందరి భావం.

వేమన పద్యాలన్నీ ముక్తకాలు. అంటే స్వయం సమగ్రమైనవి. ఒక పద్యం తర్వాత వచ్చే పద్యానికి అంటే ముందు పద్యానికి, తర్వాతి పద్యానికి సంబంధం ఉండదు. వేమన కవిత్వాన్ని ప్రచారం చేసిన వారిలో కట్టమంచి రామలింగారెడ్డిగారు ప్రముఖులు. ఆయన ఆంధ్ర విశ్వవిద్యాలయం కులపతిగా ఉన్న సమయంలో రాళ్లపల్లి అనంతకృష్ణ శర్మ గారి చేత ఉపన్యాసాలిప్పించారు. రాళ్లపల్లి వారు ఆ తర్వాత వేమన అనే గ్రంథాన్ని రచించారు. కొంత కాలం అది పాఠ్య గ్రంథంగా కూడా ఉంది. తర్వాత వేమన మీద పరిశోధన చేసిన ఆచార్య ఎన్. గోపి గారు తమ పరిశోధనల్లో భాగంగా వేమన పద్యాల ప్రతులను 'పారిస్' నుంచి బంగోరె సహాయంతో తెప్పించుకోగలిగానని చెప్పారు. వేమన మీద అద్భుత పరిశోధనా గ్రంథాన్ని రచించారు.

వేమన పద్యాల్ని బాగా పరిశీలన చేసినవారు వేమన పద్యాలు ఒక వెయ్యి నుండి పదిహేనువందల వరకు ఉంటాయని భావించారు. ఆ పద్యాలను విశ్లేషిస్తే దాదాపు అరవై రకాలుగా వాటిని విశ్లేషించవచ్చని చెప్పారు. ఆచార్య ఎన్. గోపి గారు కొన్ని శీర్షికల వారీగా వేమన పద్యాల్ని విశ్లేషించారు. ప్రపంచ స్వభావం, పుత్రులు, సంసారం, గురువు, కులము, మతము ఇలా అనేక రకాలుగా వేమన పద్యాల్ని పరిశీలించవచ్చు. వేమన పద్యాల్ని పరిశీలిస్తే సమాజంలోని భిన్న ప్రవృత్తుల మనస్తత్వాల ప్రజలు, లౌకిక, సామాజికమైన అంశాలు గోచరిస్తాయి. ఈశ్వరుడు సర్వప్రాణుల్లోనూ వ్యాపించి ఉన్నాడని చెబుతారు కదా ! మరి ఆయా ప్రాణుల్లో ఉన్న ఈశ్వరుని కులం ఏమిటి అని హేతుబద్ధగా ప్రశ్నించాడు. స్త్రీలకు సంబంధించి వేమన వెలుబుచ్చిన అభిప్రాయాలు వివాదాస్పదమయ్యాయి.

వేమన పద్యాల్లోని మూడవ పాదాలు లోకంలో సూక్తులుగా ప్రకాశిస్తూ ఉండటం వేమన కవితా ప్రతిభకు తార్కాణం. "కులము కన్న గుణము మిగుల ప్రధానంబు, తప్పులెన్నువారు తమ తప్పులెరుగరు. పట్టి విడుట కన్న పడిచచ్చుటే మేలు, కుత్సితుండు చేరి గుణవంతు చెరచురా, బొగ్గుపాల కడుగ పోవునా మలినంబు, చెప్పుతినెడి కుక్క చెఱకుయె తీపెరుగునా, శ్రమములోన పుట్టు సర్వంబు తానౌను, గుప్తవిద్య యొకటి కులకాంత వంటిది, పెంటతినెడి కాకి పితరుడెట్లామెరా'' మొదలైనవి ఎన్నో ఉన్నాయి.

## 3.3. కఠిన పదాలకు అర్థాలు

| | | | |
|---|---|---|---|
| 1. | అంతరంగము | = | హృదయం |
| | అపరాధములు | = | తప్పులు |
| | ఈశ్వరుడు | = | భగవంతుడు |
| | విశ్వ | = | సమస్తాన్ని |
| | ద | = | ఇవ్వటం చేత |
| | అభిరాముడు | = | మనోజ్ఞమైనవాడు |
| | వినురవేమ | = | ఓ వేమనా ! విను |
| | అభవుడు | = | పుట్టుకలేనివాడు |
| | బాహ్యము | = | వెలుపల |
| | భావింప | = | ఆలోచించగా |
| | చిక్కడు | = | దొరకదు |
| | అవని | = | భూమి |
| | ఒడలు | = | శరీరం |
| | ఒడయుని | = | ప్రభువును (పరమాత్మను) |
| | అదిమి | = | అణచి |
| | ఆనందకేళి | = | సంతోష క్రీడ |
| | బ్రహ్మమయుడు | = | జ్ఞాని |
| | ముక్తి | = | మోక్షం |
| | జిహ్వ | = | నాలుక |
| | అతిశయిల్లు | = | వృద్ధి చెందు |
| | వేము | = | వేప |
| | సాధనమున | = | అభ్యాసంతో |
| | ధరలోన | = | భూమి మీద |
| | అనువుగాని చోట | = | అనుకూలత లేని ప్రదేశంలో |
| | కొంచెము + ఉండుట | = | తగ్గి ఉండటం, |

| | | |
|---|---|---|
| కొదువ | = | తక్కువ |
| ఎన్నో | = | లెక్కించగా |
| అప్పుదీయ | = | అప్పుచెయ్యటం |
| రోత | = | అసహ్యం |
| హరి హర + ఆదులకు +ఐన | = | విష్ణువు, శివుడు మొదలైన దేవతలకైనా |
| మొప్పె | = | మూర్ఖుడు |
| మైత్రి | = | స్నేహం |
| తాకట్టు + ఇడిన | = | కుదువ బెట్టిన |
| దొడ్డవారిని | = | మంచివారిని |
| తొలగగొట్టు | = | తొలగించు |
| బహుళ | = | అనేకమైన |
| పరసుఖంబు | = | పరలోక సుఖం |
| అల్పుడు | = | నీచుడు, |
| అనువుగా | = | తగినట్లుగా |
| శోధించి | = | వెదకి, |
| సర్వ | = | సమస్తం |
| ముక్తుడు | = | విడిచినవాడు |
| భాండము | = | కుండ, పాత్ర |
| ఆలి | = | భార్య |
| దాయాదులు | = | శత్రువులు |
| ఆలు, సుతులు | = | భార్య బిడ్డలు |
| అతిశయంగ | = | ఎక్కువగా |
| ఆయువు | = | ప్రాణం |
| ముసురు | = | చుట్టుకొను |
| భంగి | = | వలె |
| ఉడుగక + ఉన్న | = | నశించకపోతే |

| | | |
|---|---|---|
| పాశముక్తుడు | = | బంధం తొలిగినవాడు |
| మోహము | = | కోరిక |
| మంటిలోన | = | భూమిలో |
| మంకు జీవి | = | మూర్ఖుడు |
| కొంచు | = | తీసుకొని |
| గుల్లకాసు | = | చిల్లికాణి |
| రోసి | = | రోత చెంది |
| ఈశుడు | = | దైవాన్ని |
| ఈనివాడు | = | ఇవ్వనివాడు |
| ఈవి | = | దానం |
| కల్పతరువు | = | కల్ప వృక్షం |
| గచ్చచెట్టు | = | గచ్చ పొద |
| ఇరుకు | = | కష్టం |
| గాసి | = | బాధ |
| ఇనుప కచ్చులు | = | ఇనుపడిప్పలు |
| వంటకంబు | = | ఆహారం |
| ఒదవునా | = | కలుగునా |
| ఓగు | = | చెడ్డవాడు |
| వెన్ను | = | చివర |
| తావు | = | చోటు |
| గ్రాసము | = | తిండి |
| తమము | = | చీకటి (అజ్ఞానం) |
| హీనుడు | = | నీచుడు |
| అవగుణంబు | = | చెడ్డగుణం |
| మలినంబు | = | మురికి |
| ఎరుక | = | జ్ఞానం |

## 3.4. పాఠ్యభాగ సారాంశం :

లోకంలో మానవుల ప్రవర్తన వింతగా ఉంటుంది. మనసులో చెడుగా ఆలోచించి, ఎవరికీ తెలియకుండా తప్పులు చేసి మంచి వానిలాగా ప్రవర్తిస్తూ ఉంటాడు. ఇతరులకు తెలియక పోయినా ఈశ్వరుడికి మాత్రం తెలుస్తుందనే విషయాన్ని గుర్తించడు. ఎవరైనా పరమాత్మను తన హృదయంలో ప్రతిష్టించుకోవాలి. అప్పుడే ఆ వ్యక్తికి గురి కుదురుతుంది. అంతే గాని బాహ్యంగా చూస్తే గురి కుదరదని గుర్తించాలి. ఇలాంటి ప్రవర్తనల వల్ల ఫలితం ఉండదని తెలుసుకోవాలి. ఆకాశంలో వెదికినా, భూమండలం మీద ఉన్న ఎన్ని పుణ్యక్షేత్రాలు దర్శించినా భగవంతుడు కనిపించడు. బాహ్య అంతరంగ శుద్ధి ఉండాలి. అంటే శరీరాన్ని మనసును స్వచ్ఛంగా ఉంచుకొన్నప్పుడే పరమాత్మ దర్శనం లభిస్తుంది. మనసును నియంత్రించుకొని, ఆనందంలో మునిగిన బ్రహ్మజ్ఞాని మోక్షాన్ని పొందాలని భావిస్తాడు. అయితే ఇంద్రియాలకు బానిసగా మారిపోయి మనసును అధీనంలో ఉంచుకోకపోవటం వల్ల మానవుడు ఉన్నతిని పొందలేడు. చెడు గుణాలకు లోనవుతాడు.

సంగీతానికి సాధన అవసరం. నిరంతరం సాధన చేస్తేనే రాగం ప్రతిభావంతంగా వెలువడుతుంది. తినగా తినగా వేప కూడా తీయగా ఉంటుంది. ఏ పనిని సాధించాలన్నా నిరంతర సాధన అవసరం. సాధనం వల్లనే దేనినైనా సాధించవచ్చు. మనకు పరిస్థితులు అనుకూలంగా లేని ప్రదేశంలో మనం గొప్పలు చెప్పుకోకూడదు. అణిగి ఉండటం, అంటే వినయంగా ఉండటం చిన్నతనం కాదు. కొండ ఎంత పెద్దదిగా ఉన్నా అద్దంలో చూస్తే చిన్నగానే కనిపిస్తుంది. దానం చెయ్యటం మానవునికి మంచి లక్షణం. అందులోనూ అన్నదానం అన్ని దానాల కంటే గొప్పది. అన్నం పరబ్రహ్మ స్వరూపమని గుర్తించి ఆకలితో ఉన్న వారికి సాధ్యమైనంత సాయం చెయ్యాలి. తల్లిదండ్రుల కంటే గొప్ప వారు ఈ భూ మండలంలో ఎవరూ లేరు. అలాగే గురువును మించిన వారు కూడా లేదు.

ఇతరుల దగ్గర నుంచి దేనినైనా తిరిగి ఇచ్చే పద్ధతిమీద తీసుకోవటమే అప్పు. అప్పు చెయ్యటం హరిహరాదులైన దేవతలకు కూడా అసహ్యం. మూర్ఖుడితో స్నేహం చెయ్యటం రోత. తప్పుగా పలకటం, దేనినైనా తాకట్టు పెట్టటం రోతను పుట్టించే విషయాలు. అప్పులేని వాడే గొప్ప ధనవంతుడు. తప్పు చెయ్యనివాడు భూమి మీద ఎవ్వడూ ఉండడు. గొప్పతనం లేకపోతే బుద్ధిహీనమై పోతుందని గుర్తించాలి. నీచునికి అధికారాన్ని అప్పగిస్తే మంచి వారినందరినీ తొలగిస్తాడు. చెప్పు రుచికి అలవాటు పడ్డ కుక్కకు చెఱకు తీపి రుచించదు కదా ! తాత్కాలిక సుఖాలకు అలవాటుపడ్డ, ఆశపడ్డ మానవుడు అనేక దుఃఖాలకు లోనవుతాడు. పర సుఖాన్ని కోరుకోవటం వల్ల బాధల నుంచి విముక్తిడవుతాడు. ఇదే జీవిత పరమార్థమని మానవుడు గుర్తించలేకపోతున్నాడు.

నీచబుద్ధి కలిగినవాడు డాంబికంగా మాట్లాడతాడు. మంచి బుద్ధి కలవాడు శాంతంగా, సంతోషాన్ని కలిగించే విధంగా పలుకుతాడు. కంచు మోగినట్లుగా బంగారం మోగదు కదా ! మనస్సును స్థిరం చేసుకొని పరమాత్మను శోధిస్తే మోక్షం లభిస్తుంది. సర్వ ప్రాణుల్లోనూ తనను, తనలో అన్ని ప్రాణుల్ని చూడగలిగినవాడే శ్రేష్ఠుడు. ఆత్మ శుద్ధి లేకుండా పాటించే ఆచారాలు, పాకశుద్ధి లేని వంటకాలు పనికి రాకుండా ఉన్నట్లే, చిత్తం నిష్కల్మషంగా లేకుండా చేసే శివపూజలు కూడా వ్యర్థమేనని గ్రహించాలి. లోకంలో ఎవరికైనా భార్య పక్షం వారు ఆత్మీయులుగా కనిపిస్తారు. తల్లివైపున ఉన్న వారు అంతంతగానే అనిపిస్తారు. తండ్రి వైపు వారు శత్రువులుగా కనిపిస్తారు. ఇది వాస్తవం. లోక సత్యం

జ్ఞానవంతులకు భార్య బిడ్డలు, అన్నదమ్ములు, తల్లిదండ్రులు, చివరికి తమకు తామే మాయగా కనిపించటం అందరికీ తెలిసిందే. ఈ శరీరం పాడుగాను, ఈ మాయను ఏమీ తెలుసుకోనివ్వదు. ఆశను మించిన దుఃఖం వేరే లేదు. చూపును నిలపకపోతే సుఖం ఉండదు. మనసును నిలిపినప్పుడే ముక్తి లభిస్తుంది. మురికి కుండలోని తిండి కోసం ఈ గాలు మూగినట్లుగా ప్రాణం ఉన్నన్ని రోజులు మానవుడు ఆశతో తిరుగుతూ ఉంటాడు. భ్రాంతిని వీడలేడు. ఆశలు నశించినప్పుడే బాధలు తొలగిపోతాయి. బంధాలు తొలగినప్పుడే మానవుడి ముని అవుతాడు. మునికి మోహాలు తొలగిపోతాయి.

జీవితకాలంలో మానవుడు ఎంతో ధనాన్ని సంపాదింస్తాడు. అయితే ఆ ధనమంతా తనదేనని భావించి దాన్ని భూమిలో దాచిపెడతాడు తాను చనిపోతూ తన వెంట చిల్లి గవ్వను కూడా తీసుకు వెళ్లలేనని గ్రహించలేడు. ఇంద్రియాలకు బానిస అయిన వెర్రివాడు భగవంతుని అన్వేషించలేడు. ఇంద్రియాలను అసహ్యించుకొన్నప్పుడే అంటే నిగ్రహించుకొన్నప్పుడే భగవంతుడు కనిపిస్తాడు. దాత దగ్గర లోభిఉంటే చావనైనా చస్తాడు కాని దాన కార్యక్రమాన్ని సాగనివ్వడు. కల్పవృక్షం కింద గచ్చ పొద ఉంటే ఆ చెట్టు నీడకు ఎవరూ చేరలేరు. కష్టం వచ్చినప్పుడు భగవంతుని తలచుకొంటారు. సుఖల్లో ఉన్నప్పుడు భగవంతుని గూర్చి ఆలోచన చెయ్యకపోతే భగవంతుడు కరుణించడు. మనస్సును సుఖ దుఃఖాలకు అతీతంగా నిలపాలి. ఇంటిని భార్యను వదలిపెట్టి, కామానికి గొళ్లెం వేసి, తిండి నీరు మాని ఒంటరిగా ఉన్నంత మాత్రన తత్వం అలవడదు. చెరకు గడకు చివర వెన్ను పుట్టి చెరకులోని తియ్యదనాన్ని నాశనం చేసినట్లుగా, మంచి వానికి మూర్ఖుడు పుట్టి అతని వంశాన్ని నాశనం చేస్తాడు.

ఉన్న చోటును వదలి ఊరూర తీర్థయాత్రలు చేసినంత మాత్రాన ఉపయోగం ఉండదు. తనలో తనను చూడగలిగితేనే అజ్ఞానం తొలగిపోతుంది. ఉప్పు, కర్పూరం చూడటానికి ఒకే రకంగా, తెల్లగా ఉంటాయి. కానీ వాటి రుచులు భిన్నంగా ఉంటాయి. మానవులందరూ ఒకే రకంగా కనిపించినా అందులో మంచి వారు వేరుగా ఉంటారు. బొగ్గును పాలతో ఎంత కడిగినా దాని నలుపు తొలగిపోదు. అలాగే ఎంత చదివినా, ఎన్ని నేర్చినా అల్పబుద్ధి గల వాడు తన నీచ గుణాల్ని విడువలేడు. ఎన్ని శరీరాలైనా చావును తప్పించుకోలేవు. చావును గెలవలేని జ్ఞానం, వ్యర్థం, దొంగ ఇల్లిల్లూ దూరి వచ్చినట్లు జీవుడు పడుతూ గిడుతూ ఉంటాడు. మోక్షాన్ని మాత్రం పొందలేడు. జ్ఞానాన్ని మించిన సుఖం ఏ లోకంలోనూ లేదు. అయినా దాన్ని పొందాలనే ఆలోచన ఎవరికీ లేదు. జ్ఞానానికి సాటి జ్ఞానమే అనే సత్యాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలి. అప్పుడే జీవితం సక్రమంగా, సంతోషంగా సాగుతుంది.

## 3.5. ముఖ్యమైన పద్యాలకు ప్రతి పదార్థ తాత్పర్యాలు :

1. అనగ నగన రాగ మతిశయిల్లుచు నుండు
తినగ తినగ వేము తియ నుండు
సాధనమున పనులు సమకూరు ధరలోన
విశ్వదాభిరామ వినుర వేమ.

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| విశ్వ | = | సమస్తాన్ని |
| ద | = | ఇవ్వటం చేత |
| అభిరాముడు | = | మనోజ్ఞమైనవాడు |
| వినురవేమ | = | ఓ వేమనా విను |
| అనగన్ + అనగ | = | పలుకగా పలుకగా, |
| రాగము | = | సంగీత రాగం |
| అతిశయిల్లుచున్ + ఉండు | = | పెరుగుతూ ఉంటుంది |
| తినగ తినగ | = | అనేక పర్యాయాలు తినగా |
| వేము | = | వేప |

| | | |
|---|---|---|
| తీయన్ + ఉండు | = | తీయగా ఉంటుంది |
| సాధనమున | = | అభ్యాసంతో |
| పనులు | = | కార్యాలు |
| ధరలోన | = | ఈ భూమి మీద |
| సమకూరు | = | లభిస్తాయి |

**తాత్పర్యం :** లోకంలోని సమస్తమైన జ్ఞానాన్ని ఇవ్వటం చేత మనోజ్ఞమైన ఓ వేమనా చెబుతున్న విషయాన్ని జాగ్రత్తగా విను.

సంగీతం వృద్ధి చెందాలంటే నిరంతర సాధన చెయ్యాలి. నిరంతర సాధన వల్ల రాగం రంజితమవుతుంది. వేప ఆకులు చేదుగా ఉన్నా వాటిని ఎక్కువ సేపు తింటూ ఉంటే తియ్యగా ఉంటాయి. ఈ భూమి మీద దేనినైనా సాధించాలి అంటే అభ్యాసం తప్పనిసరి. అభ్యాసం అంటే నిరంతర సాధన. నిరంతర శ్రమ మానవుని ఉన్నతికి కారణమవుతుందనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలి.

2. అన్నిదానములను అన్నదానమె గొప్ప
కన్నవారి కంటె ఘనులు లేరు
ఎన్న గురువు కంటె ఎక్కువ లేరయా
విశ్వదాభిరామ వినుర వేమ

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| విశ్వ | = | సమస్తాన్ని |
| ద | = | ఇవ్వటం చేత |
| అభిరాముడు | = | మనోజ్ఞమైనవాడు |
| వినురవేమ | = | ఓ వేమనా విను |
| అన్ని దానములును | = | దానాలన్నిటిలో |
| అన్నదానము | = | అన్నాన్ని దానం చెయ్యటం |
| గొప్ప | = | ఉన్నతమైనది |
| కన్నవారి కంటె | = | మనల్ని పుట్టించిన తల్లిదండ్రుల కంటె |
| ఘనులు లేరు | = | గొప్ప వారు లేరు |
| ఎన్న | = | లెక్కించగా |
| గురువుకంటె | = | జ్ఞానాన్ని బోధించే మహనీయుని కంటే |
| ఎక్కువ | = | అధికులు |
| లేరయా | = | లేరు |

**తాత్పర్యం :** లోకంలోని సమస్తమైన జ్ఞానాన్ని ఇవ్వటం చేత మనోజ్ఞమైన ఓ వేమనా చెబుతున్న విషయాన్ని జాగ్రత్తగా విను.

ఈ లోకంలో చేసే దానాలన్నింటిలో అన్నదానం గొప్పది. అంటే శ్రేష్ఠమైనది. మన జన్మకు కారకులైన తల్లిదండ్రుల కంటే గొప్ప వారు లేరు. జాగ్రత్తగా లెక్కించి చూస్తే మనకు విద్య నేర్పిన అంటే జ్ఞానాన్ని అందించిన గురువు కంటే ఎక్కువ ఎవరూ కారని గుర్తించటం మంచిది.

3. అల్పబుద్ధి వాని కధికార మిచ్చిన
దొడ్డవారి నెల్ల తొలగ గొట్టు
చెప్పుదిన్న కుక్క చెరకు తీపెరుగునా ?
విశ్వదాభిరామ వినుర వేమ

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| విశ్వ | = | సమస్తాన్ని |
| ద | = | ఇవ్వటం చేత |
| అభిరాముడు | = | మనోజ్ఞమైనవాడు |
| వినురవేమ | = | ఓ వేమనా విను |
| అల్పబుద్ధి | = | నీచమైన బుద్ధి గలవానికి |
| అధికారము + ఇచ్చిన | = | పెత్తనం అప్పజెప్పితే |
| దొడ్డవారిని + ఎల్ల | = | మంచి వారినందరినీ |
| తొలగగొట్టు | = | తొలగిస్తాడు |
| చెప్పు + తిన్నకుక్క | = | చెప్పును తినే కుక్క |
| చెరకు తీపి | = | చెరుకులోని తీపిని |
| ఎరుగునా | = | తెలుసుకోగలుగుతుందా ? |

**తాత్పర్యం :** లోకంలోని సమస్తమైన జ్ఞానాన్ని ఇవ్వటం చేత మనోజ్ఞమైన ఓ వేమనా చెబుతున్న విషయాన్ని జాగ్రత్తగా విను.

నీచమైన బుద్ధి కలవానికి పెత్తనం ఇస్తే మంచివారినందరినీ పదవుల నుంచి తొలగిస్తాడు. చెప్పును తినే కుక్కకు చెరకులోని తీపి తెలియదు. చెడ్డ వారు చెడ్డ పనులే చేస్తారు. వారికి మంచి గిట్టదు. అలాగే స్వభావాన్ని బట్టి అభిరుచులుంటాయని, వాటిని మార్చటం సాధ్యం కాదని గుర్తించాలి.

4. ఆత్మశుద్ధి లేని ఆచార మదియేల
భాండ శుద్ధి లేని పాకమేల
చిత్తశుద్ధి లేని శివపూజ లేలరా
విశ్వదాభిరామ వినుర వేమ

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| విశ్వ | = | సమస్తాన్ని |
| ద | = | ఇవ్వటం చేత |
| అభిరాముడు | = | మనోజ్ఞమైనవాడు |
| వినురవేమ | = | ఓ వేమనా విను |
| ఆత్మశుద్ధి | = | మానసిక శుభ్రత |
| లేని | = | లేనట్టి |
| ఆచారము + అది + ఏల | = | ఆచారం అది ఎందుకు |
| భాండ శుద్ధిలేని | = | పాత్ర శుభ్రంగా లేని |
| పాకము + ఏల | = | పాకం (వంటకం) ఎందుకు |
| చిత్తశుద్ధిలేని | = | మనసులో స్వచ్ఛత లేని |
| శివపూజలు + ఏలరా | = | భగవంతుని పూజలు ఎందుకు ? |

**తాత్పర్యం :** లోకంలోని సమస్తమైన జ్ఞానాన్ని ఇవ్వటం చేత మనోజ్ఞమైన ఓ వేమనా చెబుతున్న విషయాన్ని జాగ్రత్తగా విను.

మనం ఆచారాలను పాటిస్తున్న సందర్భంలో మన ఆత్మలో భగవంతుని పూజించటం వ్యర్థం. అందువల్ల చేసే ప్రతి పనిలోను స్వచ్ఛత ఉండాలని గ్రహించాలి. పాత్ర శుభ్రంగా లేకపోతే దానిలో వండే వంట కూడా పాడైపోతుందని గుర్తించాలి. స్వచ్ఛత ఉన్నప్పుడే మనం చేసే పనులు శ్రేష్ఠమైనవి అవుతాయి.

5. ఆశచేత మనుజులాయువు గలనాళ్లు
తిరుగుచుందురు భ్రమ త్రిప్పలేక
మురికిభాండమందు ముసురు నీగల భంగి
విశ్వదాభిరామ వినుర వేమ

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| విశ్వ | = | సమస్తాన్ని |
| ద | = | ఇవ్వటం చేత |
| అభిరాముడు | = | మనోజ్ఞమైనవాడు |
| వినురవేమ | = | ఓ వేమనా విను |
| అరచేత | = | కోరికల వల్ల |
| మనుజులు | = | మానవులు |

| | | |
|---|---|---|
| ఆయువు గలనాళ్లు | = | ప్రాణం ఉన్నన్ని రోజులు |
| భ్రమ | = | భ్రాంతిని |
| త్రిప్పలేక | = | తొలగించుకోలేక |
| తిరుగుచున్ + ఉందురు | = | తిరుగుతూ ఉంటారు |
| మురికి భాండమందు | = | మురికితో నిండిన పాత్రపై |
| ముసురు | = | చుట్టి ఉన్న (వాలి ఉన్న) |
| ఈగల భంగి | = | ఈగల లాగా ఉంటారు. |

**తాత్పర్యం :** లోకంలోని సమస్తమైన జ్ఞానాన్ని ఇవ్వటం చేత మనోజ్ఞమైన ఓ వేమనా చెబుతున్న విషయాన్ని జాగ్రత్తగా విను.

ఆశలతో నిండిన మానవులు తమ ప్రాణాలు ఉన్నంత వరకు తమ భ్రాంతుల్ని విడువలేక, మురికి పాత్ర మీద ముసురు కొన్న ఈగల లాగా తిరుగుతూ ఉంటారు.

6. ఉత్తముని కడుపున నోగు జన్మించిన
వాడు చెరచు వాని వంశమెల్ల
చెరకు వెన్ను బుట్టి చెరపదా తీపెల్ల
విశ్వదాభిరామ వినుర వేమ

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| విశ్వ | = | సమస్తాన్ని |
| ద | = | ఇవ్వటం చేత |
| అభిరాముడు | = | మనోజ్ఞమైనవాడు |
| వినురవేమ | = | ఓ వేమనా విను |
| ఉత్తముని కడుపున | = | మంచివాని గర్భాన |
| ఓగు | = | చెడ్డవాడు |
| జన్మించిన | = | పుట్టిన |
| వాడు | = | వాడు |
| వానివంశము + ఎల్ల | = | వారి వంశం మొత్తాన్ని |
| చెరచు | = | పాడు చేస్తాడు |
| చెరకు | = | చెరుకు గడపైన |
| వెన్ను + పుట్టి | = | వెన్నుపుట్టి |

| | | |
|---|---|---|
| తీపు + ఎల్ల | = | తీపినంతటినీ |
| చెరపదా | = | నాశనం చెయ్యదా |

**తాత్పర్యం :** లోకంలోని సమస్తమైన జ్ఞానాన్ని ఇవ్వటం చేత మనోజ్ఞమైన ఓ వేమనా చెబుతున్న విషయాన్ని జాగ్రత్తగా విను.

మంచి వాని కడుపున చెడ్డవాడు పుట్టి వాని వంశం మొత్తాన్ని నాశనం చేస్తాడు. చెరకు గడమీద వెన్నుపుట్టి దాని తీయధనమంతటిని నాశనం చేస్తుంది కదా !

7. ఎంత చదువు చదివి ఎన్ని నేర్చినగాని
హీను డవగుణంబు మానలేడు
బొగ్గు పాలగడుగ పోవునా మలినంబు
విశ్వదాభిరామ వినుర వేమ

**ప్రతిపదార్థం :**

| | | |
|---|---|---|
| విశ్వ | = | సమస్తాన్ని |
| ద | = | ఇవ్వటం చేత |
| అభిరాముడు | = | మనోజ్ఞమైనవాడు |
| వినురవేమ | = | ఓ వేమనా విను |
| ఎంత చదువు చదివి | = | ఎంత గొప్ప చదువులు చదివినా |
| ఎన్ని నేర్చినగాని | = | ఎంత జ్ఞానాన్ని సంపాదించినా |
| హీనుడు | = | అల్పుడు |
| అవగుణంబు | = | చెడ్డ గుణాన్ని |
| మానలేడు | = | వదలలేడు |
| బొగ్గు | = | బొగ్గును |
| పాల | = | పాలతో |
| కడుగ | = | కడిగినా |
| మలినంబు | = | నలుపు |
| పోవునా | = | పోతుందా ? (పోదని భావం) |

**తాత్పర్యం :** లోకంలోని సమస్తమైన జ్ఞానాన్ని ఇవ్వటం చేత మనోజ్ఞమైన ఓ వేమనా చెబుతున్న విషయాన్ని జాగ్రత్తగా విను.

మానవుడు ఎంత విద్యావంతుడైనా, ఎంత జ్ఞానాన్ని సంపాదించినా అతడు అల్పుడైతే తన నీచ గుణాన్ని వదలి ఉండలేడు. అదే విధంగా బొగ్గును పాలతో ఎంత కడిగినా దాని నలుపును తొలగించటం కష్టమేనని వేమన ప్రబోధం. విద్యావంతుడైన వ్యక్తి జ్ఞానవంతుడైనా సద్గుణుడై ఉండాలని వేమన పరోక్షంగా చెప్పినట్లు గుర్తించాలి.

యూనిట్ - 2

పాఠం - 4

# వేమన నీతి

(రెండవ పాఠం)

- వేమన పద్యాలు

## 4.1. వ్యాసరూప ప్రశ్నలు - సమాధానాలు :

1. మీ పాఠ్య భాగం ఆధారంగా వేమన గావించిన సామాజిక ప్రబోధాన్ని వివరించండి ?

(లేదా)

వేమన సామాజికాంశాన్ని వివరించిన తీరును తెల్పండి ?

సమాధానం : వేమన సామాజిక కవి. ఏ కవి అయినా సామాజిక పరిస్థితుల్ని అవగాహన చేసుకొని తన రచనలో ప్రతి బింబిస్తాడు. వేమన తాను పరిశీలించిన అంశాల్ని పద్యాల రూపంలో వెల్లడించాడు. తాను చెప్పదలచుకొన్న అంశాన్ని సూటిగా, స్పష్టంగా తేలిక పదాలతో ప్రతి ఒక్కరికీ అర్థమయ్యే రీతిలో రచించాడు. ఎంత కాలం గడిచినా వేమన పద్యాలు ఇంకా ప్రజల నాలుకల మీద నాట్యం చేస్తూనే ఉన్న ప్రస్తుత పాఠ్య భాగంలో వేమన వెల్లడించిన సామాజికాంశాల్ని ఈ విధంగా పరిశీలించవచ్చు.

ఏ పనిని సాధించాలన్నా నిరంతర శ్రమ అవసరం. శ్రమ జీవికి ఏదీ కష్టం అనిపించదు. వేప చేదుగా ఉన్నా నిరంతరం నమలటం వల్ల అది తియ్యగా అనిపిస్తుంది. అలాగే సంగీతంలో రాణించాలంటే నిరంతరం సాధన చేస్తూ ఉండాలి. సాధన చేసినప్పుడు ఏదీ అసాధ్యం కాదు. జీవితంలో ఉన్నత స్థితికి రావాలను కొన్నవారు తప్పకుండా అవిశ్రాంత కృషి చెయ్యాలి.

మానవుడు సందర్భానికనుగుణంగా ప్రవర్తించాలి. పరిస్థితులు అనుకూలంగా లేనప్పుడు కొంత అణగి ఉండటం మంచిది "తగ్గిన వాడే నెగ్గుతాడు" అనే వాస్తవాల్ని గుర్తించాలి. తగ్గి ఉండటం వల్ల తాత్కాలికమైన అసౌర్యం ఏర్పడవచ్చు కానీ శాశ్వతమైన విజయం లభిస్తుంది. కొండ ఎంత పెద్దదిగా ఉన్నా అద్దంలో చిన్నదిగా కనిపిస్తుంది. అంత మాత్రాన కొండ గొప్పతనం తగ్గిపోదు. ఈ వాస్తవాన్ని గుర్తించి ప్రవర్తించిన మానవులు తప్పకుండా విజయాలను సాధిస్తారు.

తన దగ్గర ఉన్న దాన్ని ఇతరులకు ఇవ్వటం వల్ల ఇతరులకు మేలు కలుగుతుంది. అందుకే దానం మంచి లక్షణమంటారు. అన్ని దానాల కంటే అన్నదానం గొప్పది. శరీరం నిలబడాలంటే అన్నం కావాలి. ఆకలి తీరాలంటే అన్నం తినాలి. అంతే కాని ఆకలిని తీర్చటానికి బంగారాన్ని డబ్బును ఇవ్వటం వల్ల ప్రయోజనం లేదు. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రుల కంటే గొప్ప వారు ఎవరూ లేరు. అలాగే మనల్ని విద్యావంతుల్ని చేసి, జ్ఞాన ధనాన్ని అందించిన గురువు కంటే గొప్ప వారు ఎవరూ లేరు. లోకంలో అందరి కంటే ధనవంతుడెవరంటే అప్పులేని వాడే. అందుకే అప్పులేని బ్రతుకును సాగించాలి. తప్పు లేని వాడు భూమి మీద ఎవడూ కనిపించడు. అందువల్ల తప్పు చెయ్యని జీవితాన్ని సాగించటం వల్ల ఉత్తముడుగా పరిగణించబడతాడు. ఒక వేళ తప్పు చేసినా దాన్ని సవరించుకొని జీవించిన వాడే ధన్యుడవుతాడు. మానవుని బుద్ధి ఉన్నతంగా ఉండాలి. ఉన్నతమైన బుద్ధిగలవాడే ఉత్తమ మానవుడు.

లోకం భిన్న రీతిలో ఉంటుంది. ఒక్కొక్కరిది ఒక్కొక రకమైన మనస్తత్వం. అధికారాన్ని చేపట్టిన వాడు గుణవంతుడై ఉండాలి. అల్పులకు అధికారం అప్పగిస్తే మంచి వారిని పదవుల నుంచి తొలగిస్తాడు. కుక్కకు చెప్పు తియ్యగా ఉంటుంది కాబట్టి అది దాన్ని తింటుంది. కాని చెరకులోని తీపిని కుక్క గుర్తించలేదు. అలాగే చెడ్డ వారు మంచి వారి గొప్పతనాన్ని గుర్తించలేరు.

మనకు లోకంలో ఎంతో మంది కనిపిస్తూ ఉంటారు. వారి గుణాలను ప్రకటిస్తూ ఉంటారు. అల్పుడు ఎక్కువగా గర్వంగా మాట్లాడుతారు. మంచివాడు ప్రశాంతంగా పలుకుతాడు. కంచు విపరీతంగా మోగుతుంది. కానీ బంగారం మోగదు. అంత మాత్రాన బంగారం విలువ లేనిది కాదు గదా ! మాటల్ని బట్టి మనుషుల్ని మోతల్ని బట్టి లోహాల్ని గుర్తించకూడదని వేమన ప్రబోధం. లోకంలో బంధుత్వాలు బహురీతులుగా ఉంటాయి. భార్య వైపు వారు ఎంతో ఆత్మీయులుగా అనిపిస్తారు. తల్లి పక్షం వారు తగినంత రీతిలో అంతంత మాత్రం అనిపిస్తారు. తండ్రి వైపు వారు మాత్రం శత్రువులుగా కనిపిస్తారు. ఇది మానవుల మనస్తత్వాన్ని బట్టి జరుగుతుంది. అందుకే అందరినీ ఆదరించటం సముచితమని వేమన పరోక్షంగా బోధిస్తున్నాడు.

ఆశ మానవుని కుంగదీస్తుంది. దుఃఖానికి గురి చేస్తుంది. ఏ విషయం మీదనైనా చూపు నిలిపితే అది సుఖానికి కారణమవుతుంది. మనసును స్థిరంగాఉంచటం కంటే ఉత్తమమైంది మరొకటి లేదని మానవులు గ్రహించటం ఆశను వదలి స్థిర చిత్తంతో ఉన్న వారికే ఆనందం లభిస్తుంది ధనం మీద ఆశ ఉన్న వారు దాన్ని సంపాదించటానికి అనేక మార్గాలు అనుసరిస్తాడు. మూర్ఖుడైన మానవుడు ధనాన్ని అనుభవించకుండా భూమిలో పాతి పెడతాడు. కానీ అతడు మరణించినప్పుడు అతని వెంట చిల్లి గవ్వను కూడా తీసుకువెళ్లలేడని గుర్తించాలి. ఉన్న ధనాన్ని మానవుడు సద్వినియోగం చెయ్యాలి.

కొంతమంది దాతల దగ్గర లోభులు చేరతారు. దాన కార్యక్రమాల్ని సాగనివ్వరు. కల్పవృక్షం నీడలో గచ్చ పొదలాగా ఆటంకాలు కలిగిస్తారు. అందుకే లోభిని దగ్గరకు చేరన్వికూడదు. చెరకుగడ చివర వెన్ను పుట్టి తీపిపి నాశనం చేసినట్లు మంచి వాడి వంశంలో మూర్ఖుడు పుట్టి వంశనాశనానికి కారకుడవుతాడు. భౌతిక లక్షణాన్ని బట్టి గుణాల్ని గుర్తించటం కష్టం. ఉప్పు, కర్పూరం పైకి తెల్లగానే ఉంటాయి. కానీ వాటిని రుచి చూసినప్పుడు భేదం తెలుస్తుంది. ఉన్నత చదువులు చదివినంత మాత్రాన వారిని గొప్ప వారిగా గుర్తించలేము. ఎంత చదువు చదివినా అల్పుడైనవాడు తన నీచ గుణాల్ని మానుకోలేడు. అలాగే బొగ్గును ఎన్ని పాలతో కడిగినా దాని నలుపు గుణంలో మార్పురాదు.

వేమన పద్యాలు ఊహాల నుంచి పుట్టినవికావు. ఉన్న విషయాన్ని గుర్తించి, ఉర్విలోని సమస్త విషయాల్ని వేమన తన పద్యాల్లో ప్రతిబింబింపచేశాడు. ప్రజలకు పనికి వచ్చే అంశాల్ని ప్రబోధించాడు. వేమన చెప్పిన విషయాలను గ్రహించి ఆచరిస్తే ఉత్తమ సమాజం రూపొందుతుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

2. వేమన గావించిన తాత్త్విక ప్రబోధాన్ని మీ పాఠ్యభాగం ఆధారంగా వివరించండి ?

సమాధానం : వేమన ప్రజాకవి. ప్రజల్ని దృష్టిలో పెట్టుకొని కవిత్వాన్ని రచించాడు. తన కాలం నాటి కవులు రాజాశ్రయాలను పొంది కావ్యాలు సృష్టిస్తున్నా, దానికి భిన్నంగా తాను ప్రజల కోసం ప్రజల్ని గూర్చి కవిత్వాన్ని సృష్టించాడు. తేలిక పదాలతో ఆటవెలది ఛందస్సులో పద్యాల్ని సృష్టించాడు. తేలిక పదాలతో ఆటవెలది ఛందస్సులో పద్యాల్ని రచించి సామాన్య మానవునికి కూడా దగ్గరయ్యాడు. తన కాలం నాటి సమాజంలోని సామాజిక రుగ్మతల్ని తన పద్యాల అస్త్రాలతో ఖండించాడు. ప్రస్తుత పాఠ్య భాగంలో వేమన సామాజిక అంశాలతో పాటు, తాత్త్విక విషయాల్ని కూడా వివరించండి.

వేమన ఈ పాఠ్య భాగంలో భగవంతుడు, ఆచారాలు, మూఢ విశ్వాసాలు, సుఖ దుఃఖాలు, పూజలు, మాయ స్వరూపం, భ్రమలు, మోక్షం, ఇంద్రియ వ్యామోహం, ఒంటరి తనం, తీర్థ యాత్రలు, జ్ఞాన స్వరూపం మొదలైన అనేక విషయాల్ని ప్రస్తావించాడు.

తత్త్వం అంటే స్వభావం. తత్త్వ సంబంధమైంది తాత్త్వికం. ఆయా ఆచారాలు, విశ్వాసాల పట్ల వేమన తన భావాల్ని వెల్లడించిన తీరును గమనిస్తే వేమన పద్యాల్లోని తాత్త్వికత స్పష్టమవుతుంది. అందుకే వేమన

"ఎరుక కన్నను సుఖమే లోకమున లేదు
యెరుక నెరుగ నెవని కెరుక లేదు
యెరుక సాటి యెరుక యెరుకయే తత్త్వంబు
విశ్వదాభిరామ వినురవేమ ! " అని రచించాడు.

ఎరుక అంటే జ్ఞానం. జ్ఞానం అంటే తెలియని దాన్ని గూర్చి తెలుసుకోవటం. దేన్ని గూర్చి తెలుసుకొంటామో అది దానికి సంబంధించిన ఎరుక అని అర్థం చేసుకోవచ్చు. అందుకే జ్ఞానాన్ని మించన సుఖం లేదని వేమన చెప్పాడు. జ్ఞాన స్వరూపాన్ని గ్రహించటం కష్టమన్నాడు. జ్ఞానానికి సాటి జ్ఞానమే అన్న తత్త్వాన్ని గ్రహించినప్పుడే మానవుడు ఉన్నతుడవుతాడు, ఉత్తముడవుతాడు.

"పుట్టినవానికి మరణం తప్పదు" అని భగవద్గీత చెబుతుంది. అందుకే వేమన ఏ శరీరమైనా మృత్యువును తప్పించుకోలేదన్నాడు. మరణాన్ని జయించలేని జ్ఞానం వ్యర్థమని వేమన భావం. దొంగ, ఇల్లిల్లూ దూరి వస్తున్నట్లు జీవుడు పుడుతూ ఉంటాడు. మరణిస్తూ ఉంటాడు. కానీ మోక్షాన్ని మాత్రం పొందలేడు. మోక్షం అంటే పునర్జన్మ లేకపోవటం. చావును గెలవటం అంటే మోక్షాన్ని పొందటమేనని గుర్తించాలి.

మానవుడు పైకి మంచివానిగా కనిపిస్తాడు. కానీ అంతరంగంలో చెడును నిక్షిప్తం చేసుకొంటాడు. ఇలాంటి వ్యక్తిని గూర్చి ఇతరులకు తెలియక పోవచ్చు కానీ, భగవంతుడికి మాత్రం తెలుస్తుందని వేమన చెప్పాడు. తనను ఎవరూ గమనించటం లేదని మానవుడు ఎన్నో తప్పులు చేస్తూ ఉంటాడు. కానీ అతని ఆత్మలో దాని ఉన్న భగవంతుడు గమనిస్తున్నాడనే జ్ఞానాన్ని మాత్రం కలిగి ఉండడని, వేమన చెప్పాడు. పరమాత్మను హృదయంలో నిలుపుకొన్నప్పుడే "గురి" కుదురుతుందని వేమన బోధించాడు. పైపైన చూస్తే గురి కుదరదని, ఫలితం లభించదని చెప్పటం ద్వారా ప్రతి ఒక్కరూ భగవంతుని అంతరంగంలో దర్శించాలని చెప్పాడు. అడవిలో తిరిగినా, ఆకాశంలో చూసినా తీర్థయాత్రలు చేసినా పరమాత్మ గోచరించదు. శరీరాన్ని, మనసును శుద్ధి చేసి అందులో పరమాత్మను దర్శించాలని చెప్పాడు. బాహ్య, అంతరంగ స్వచ్ఛత భగవద్దర్శనానికి అవసరమని ప్రబోధించాడు.

బ్రహ్మజ్ఞాని మనసును స్థిరంగా ఉంచి, ఆనంద పరవశుడై మోక్షాన్ని చేరుకొంటాడు. ఇంద్రియలకు అధీనుడైన మానవుడు తన మనసును స్థిరంగా ఉంచుకోలేక పోవటం వలన నాశనమవుతాడు. ఇంద్రియాలను జయించిన మానవుడు దేనినైనా సాధించగలుగుతాడు. మోక్షాన్ని పొందగలుగుతాడు.

మానవుడు భోగలాలసుడు కాబట్టి సుఖాలను కోరుకొంటాడు. అల్పమైన సుఖాలకు ఆశపడి అధికమైన దుఃఖాలకు లోనవుతాడు. అంటే ఆశ అధికం కావటం వల్ల అతని కోరికలు తీరాక కష్టాలకు గురి అవుతూ ఉంటాడు. ఈ లోక సంబంధమైన సుఖాలకు ప్రాకులాడతాడే కాని పరలోక సుఖాన్ని కోరుకోడు. పరలోక సుఖాన్ని కోరుకున్నవాడు ఈ లోకంలోని బాధల నుంచి విముక్తుడవుతాడు. ఈ జీవిత పరమార్థాన్ని గ్రహించక, ఐహిక బంధాలకు, సుఖాలకు అర్రులుసాచి జీవన మార్గాన్ని దుఃఖమయం చేసుకొంటాడు. ముక్తిని పొందాలని కోరుకునే మానవుడు తన శరీరాన్ని మనసును యోగసిద్ధిలో నిలపాలి. అప్పుడే అందరిలో తనను, తనలో అందరిని చూడగలుగుతాడు. "ఆత్మవత్ సర్వభూతాని" అనే తత్త్వాన్ని గ్రహించిన మానవుడు ముక్తికి అర్హుడవుతాడు. లౌకిక బంధాలు తాత్కాలికాలని మానవుడు గుర్తించాలి. భార్య బిడ్డలు, అన్నదమ్ములు, తల్లిదండ్రులు చివరికి తాను కూడా మాయేనని గుర్తించాలి. ఈ శరీరం పాడైపోను, ఇది మాయ తత్త్వాన్ని తెలుసుకోనివ్వదని వేమన చిత్రంగా ప్రబోధించాడు.

ప్రాణం ఉన్నంత కాలం మానవులు భ్రమలతో ఉంటారు. ఈ పరిస్థితి మురికి నీళ్లతో నిండిన కుండ చుట్టూ తిరుగుతున్న ఈగల లాగా ఉన్నదని చక్కగా బోధించాడు. ఆశలు తొలగితే బంధాలు నశిస్తాయి. బంధాలు పోతే ముని అవుతాడు. మునికి మోహం తొలగిపోతుంది. ఇంద్రియాలు మానవుని పట్టి లాగుతూ ఉంటే ఈశ్వరుని వెదకటం కష్టం. ఇంద్రియాల్ని అదుపులో పెట్టుకొని శివుని చూడాలి. మానవులు, కష్టాలు వచ్చినప్పుడు భగవంతుని స్మరిస్తారు. సుఖంలో తలచుకోకపోతే ఈశ్వరుడు కరుణించడు. సుఖ దుఃఖాలకు అతీతంగా మనసును నిలపాలి. ఇంటిని భార్యను వదలి, కామానికి గొళ్లెం పెట్టి, తిండి నీళ్ళు మాని ఒంటరిగా ఉన్నంత ఆ మాత్రాన తత్త్వం అలవడదని వేమన ఖండితంగా చెప్పాడు. ఉన్న చోటును విడిచి తీర్థయాత్రలు చేస్తే ప్రయోజనం లేదు. తనలో తనను చూసుకోగలిగితే అజ్ఞానం తొలగిపోతుంది.

వేమన తాత్త్వికుడు, యోగి, కావటం వల్ల జీవన సారాన్ని, మానవుడు ప్రవర్తించవలసిన తీరును తన పద్యాల్లో స్పష్టంగా వెల్లడించాడు.

## 4.2. ప్రశ్నలు - సంగ్రహ సమాధానలు :

1. మీ పాఠ్య భాగం ఆధారంగా వేమన వెల్లడించిన ఈశ్వర తత్త్వాన్ని ప్రకటించండి ?

సమాధానం : వేమన ప్రజల కోసం సాహిత్యాన్ని సృష్టించాడు. ప్రజల్ని ఆలోచింపచేసే పద్యాల్ని రచించాడు. వేమన చెప్పిన విషయాల్ని ఆచరిస్తే ఉత్తమ వ్యక్తిత్వం అలవాడుతుంది. వేమన భిన్న దృక్కోణాలలో విషయాల్ని ప్రబోధించాడు. అలాగే ఈశ్వర తత్త్వాన్ని కూడా ప్రకటించాడు.

"అంతరంగమందు అపరాధములు చేసి
మంచివాని వలెనె మనుజుడుండు
ఇతరు లెరుగకున్న ఈశ్వరుడెరుగడా
విశ్వదాభిరామ వినురవేమ" - అని వేమన రాశాడు.

మనుషులు ఎవరికీ తెలియకుండా, అనేకమైన తప్పులు చేసి పైకి మంచి వాళ్లలాగా ప్రవర్తిస్తూ ఉంటారు. అందుకే ఇతర వ్యక్తులు తెలియక పోయినా సర్వాంతర్యామియైన శివునికి మానవులు చేసే పనులన్నీ తెలుస్తాయని చెప్పాడు. ఈశ్వరుని, అంతరంగంలో నిలిపినప్పుడు మాత్రమే గోచరిస్తాడని తెలిపాడు. బాహ్యంలో చూస్తే గురి కుదరుదు. ఫలితం ఉండదు అని బోధించాడు. అంటే మంచి ఫలితాన్ని సాధించాలంటే మానవుడు తన దృష్టిని భగవంతుని మీద కేంద్రీకరించాలి.

పరమాత్మను దర్శించాలంటే అడవుల్లో తిరగవలసిన అవసరం లేదు. తీర్థయాత్ర చెయ్యవలసిన పనిలేదు. మనసును నిష్కల్మషంగా ఉంచుకోవాలి మనసులో ఎలాంటి దుష్ట చింతనా ఉండకూడదు. మనసును, శరీరాన్ని స్వచ్ఛంగా ఉంచుకొన్న మానవుడు మాత్రమే పరమాత్మను దర్శించ గలుగుతాడని వేమన బోధించాడు.

ఆత్మలో శివుని అనువుగా శోధించాలని వేమన తెలిపాడు. భక్తిని పరమాత్మ మీద కేంద్రీకరించాలి. మనసును యోగ సిద్ధిలో నిలిపినప్పుడు మోక్షం సిద్ధిస్తుంది. అప్పుడే మానవుడు అందరిలో తనను, తనలో అందరినీ దర్శించగలుగుతాడు. ఈ తత్త్వాన్ని అవర్చుకొన్నవాడు ఉన్నతుడవుతాడు. లోకం పట్ల సమదృష్టిని గల మానవుడే ధన్యుడు చిత్త శుద్ధితో ఈశ్వరుని అర్చించినవాడికి సత్ఫలితం లభిస్తుందని వేమన ఈశ్వరతత్త్వాన్ని వివరించాడు.

2. 'ఆశ'ను గూర్చి వేమన ప్రకటించిన భావాల్ని వివరించండి ?

సమాధానం : లోకాన్ని పరిశీలన చేసిన కవి ఉత్తమ కవిత్వాన్ని సృష్టిస్తాడు. సామాజిక స్థితి అతనికి బాగా అవగహనతో ఉంటుంది కాబట్టి సమాజానికి అవసరమైన విషయాల్ని వెల్లడించటానికి ప్రయత్నిస్తాడు. 'ఆశ'ను గూర్చి వేమన అనేక పద్యాలు రచించాడు. ఆశను మించిన దుఃఖం లేదన్నాడు. చూపు చంచలత్వాన్ని పొందకుండా స్థిరంగా ఉన్నప్పుడే సుఖాన్ని ప్రసాదిస్తుంది. మనసును కేంద్రీకరిస్తేనే అంటే మనసును అనేక విషయాల మీద ప్రసరింపచేయకుండా ఉంటేనే మోక్షం లభిస్తుంది.

"ఆశచేత మనుజులాయువు గలనాళ్ల
తిరుగుచుందురు భ్రమత్రిప్పలేక
మురికి భాండమందు ముసురు నీడగల భంగి
విశ్వదాభిరామ వినురవేమ !"

మనిషి జీవించినంతకాలం ఆశను వీడకుండా ఉంటాడు. భ్రాంతిని వదలలేడు. లోకంలో మురికితో నిండిన కుండ మీదకు ఈగలు ముసుకొన్నట్లుగా ఆశను వదలని మానవుని మనసులో అనేక వాంఛలుంటాయి. వాటిని అదుపు చేసుకోవాలి. ఆశకు దూరంగా మనసును నిలుపు కోవాలి. అప్పుడే అతడు ప్రశాంతంగా జీవనాన్ని సాగిస్తాడు.

ఆశలు నశిస్తే బంధాలు తొలగిపోతాయి. బంధాలు తొలగిపోతే ముని అవుతాడు. అంటే ఇహ లోక సంబంధమైన బంధాలు మానవునికి ఏమీ ఉండవు కాబట్టి అతడు మునిగా మారిపోతాడు. ముని అయిన వానికి మోహాలు ఉండవు. అంటే కోరికలు నశిస్తాయి. అందువల్ల మానవుడు ముని వృత్తిలో జీవించాలి.

మానవుడు అల్ప సుఖాలను ఆశించకూడదు. సుఖాల పట్ల వ్యామోహాన్ని తొలగించుకోవాలి. దేని పట్ల అయినా ఆశను పెంచుకొంటే అది దుఃఖ కారకమవుతుంది. సుఖ జీవనం కోసం మనసును అదుపులో ఉంచుకోవాలి. మనసును అదుపులో పెట్టుకొని ఆశలకు దూరంగా ఉన్న మానవునికే సుఖాలు ప్రాప్తిస్తాయని వేమన చెప్పాడు. ఇలా వేమన ఆశను గూర్చి పలు విషయాలు తన పద్యాలలో వివరించాడు.

## 4.3. సందర్భ సహిత వ్యాఖ్యలు :

### 1. ఒడలు శుద్ధి చేసి ఒడయుని చూడరా ! (3)

కవి పరిచయం : ఈ పద్యపాదం "రెడ్డి సేవా సమితి" వారు ప్రచురించిన "వేమన పద్యాలు" అనే గ్రంథం నుంచి స్వీకరించబడిన "వేమన నీతి" అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : వేమన ఈశ్వరతత్త్వాన్ని తెలియజేసే సందర్భంలో ఈ వాక్యాన్ని రచించాడు.

భావం : ఈశ్వర తత్త్వం బోధపడాలంటే అడవుల్లో తిరిగినంత మాత్రాన సరిపోదు. ఆకాశంలో చరించినంత మాత్రాన బోధపడదు. తీర్థ యాత్రలు చేసినంత మాత్రాన ఫలితం ఉండదు. శరీరాన్ని శుభ్రం చేసుకోవాలి. దానితో పాటును మనసును స్వచ్ఛంగా ఉంచుకోవాలి. అప్పుడే ఈశ్వర సాక్షాత్కారం లభిస్తుంది. దీనివల్ల మనోగోచరుడే పరమాత్మ అనే తత్త్వాన్ని వేమన విశదం చేశాడు.

**2. ఎన్న గురువు కంటె ఎక్కువలేరయా (7)**

కవి పరిచయం : ఈ పద్యపాదం "రెడ్డి సేవా సమితి" వారు ప్రచురించిన "వేమన పద్యాలు" అనే గ్రంథం నుంచి స్వీకరించబడిన "వేమన నీతి" అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : వేమన అన్నదానం, కన్నవారు, గురువు అనే విషయాల్ని గూర్చి వివరిస్తూ ఈ పద్యపాదాన్ని రచించాడు.

భావం : దానం అంటే తన దగ్గర ఉన్నదాన్ని ఇతరులకు ఫలితంగా ఇవ్వటం. ఫలాపేక్ష లేకుండా ఇచ్చిన దానికే ఫలితం ఉంటుంది. దానాలన్నిటిలోనూ అన్నదానం గొప్పది. జీవి ప్రాణంతో నిలవాలంటే అన్నం అవసరం. ఇతరమైన ఏ పదార్థాలు, సౌకర్యాలు ఉన్నా వాటి వల్ల శరీరం నిలబడదు. అందువల్ల అన్నదానం చెయ్యటం వలన అనంత ఫలితం లభిస్తుంది. కన్నవారు అంటే తల్లిదండ్రుల కంటే గొప్పవారు లేరు. ఇంకా జాగ్రత్తగా పరిశీలిస్తే మనిషిలోని అజ్ఞానపు చీకట్లు తొలగించి విజ్ఞానపు వెలుగుల్ని నింపే గురువును మించిన గొప్పవారు ఎవరూ లేరని వేమన బోధించాడు.

**3. కంచు మ్రోగినట్లు కనకంబు మ్రోగునా (12)**

కవి పరిచయం : ఈ పద్యపాదం "రెడ్డి సేవా సమితి" వారు ప్రచురించిన "వేమన పద్యాలు" అనే గ్రంథం నుంచి స్వీకరించబడిన "వేమన నీతి" అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : లోకంలో మనుషుల తీరు తెన్నుల్ని, లోహాల స్వభావాన్ని వివరిస్తున్న సందర్భంలో వేమన ఈ పద్యపాదాన్ని రచించాడు.

భావం : అల్పబుద్ధి కలవాడు ఆడంబరంగా మాట్లాడతాడు. అంటే వాడిలో శక్తి సామర్థ్యాలు లేకపోయినా, అది సాధిస్తా ఇది సాధిస్తా అని అనవసరంగా మాట్లాడుతూ ఉంటాడు. అంతే వాడు మాటల మనిషే కాని చేతల మనిషి కాడు. కానీ మంచి లక్షణాలు కలవాడు ప్రశాంతంగా మాట్లాడుతాడు. మంచి వానిలో గర్వం ఉండదు కాబట్టి అతని మాటలు కూడా వినయంగా ఉంటాయి. లోకంలో కంచు బంగారం అనే లోహాలున్నాయి. కంచు కంటే బంగారానికి విలువ ఎక్కువ. కానీ కంచు బాగా మోగుతుంది. బంగారం మోగదు. అంతమాత్రం చేత బంగారం విలువ తగ్గదు. కంచు విలువ పెరగదని గుర్తించాలి.

**4. తెలియనీదుమాయ దీనిల్లుపాడాయ**

కవి పరిచయం : ఈ పద్యపాదం "రెడ్డి సేవా సమితి" వారు ప్రచురించిన "వేమన పద్యాలు" అనే గ్రంథం నుంచి స్వీకరించబడిన "వేమన నీతి" అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : మాయా స్వరూపాన్ని గ్రహించటం సాధ్యం కాదని, మాయా తత్త్వం లోకంలో చిత్రంగా ఉంటుందని తెలియజేస్తున్న సందర్భంలో వేమన రచించిన పద్యపాదమిది.

భావం : భార్యాబిడ్డలు మాయ, అన్నదమ్ములు మాయ, తల్లిదండ్రులు మాయ, తానూమాయ అని చెప్పిన వేమన మాయను గూర్చి తెలుసుకోవాలని ప్రయత్నిస్తే దాని స్వరూపాల్ని తెలియనివ్వకుండా ఉంటుందని వివరిస్తూ "దీనిల్లు పాడాయె" అని చక్కని తెలుగు పలుకుబడిని ప్రయోగించాడు. లోకంలోని బాంధవ్యాలు క్షణికాలు. అశాశ్వతాలు అని గుర్తించి మసలుకోవాలని వేమన పరోక్షంగా ప్రబోధిస్తున్నట్లు మనం గుర్తించాలి.

**5. కొంచుబోడు వెంట గుల్ల కాసైనను (20)**

కవి పరిచయం : ఈ పద్యపాదం "రెడ్డి సేవా సమితి" వారు ప్రచురించిన "వేమన పద్యాలు" అనే గ్రంథం నుంచి స్వీకరించబడిన "వేమన నీతి" అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : లోకంలో ధనం శాశ్వతం కాదని, బతికి ఉన్నంత కాలం దాని కోసం వెంపర్లాడటం తగదని చెబుతూ వేమన్న రచించిన పద్యపాదమిది.

భావం : మానవుడు ధనాన్ని సంపాదించటానికి అనేక మార్గాలు ఆచరిస్తాడు. కొంత మంది శ్రమించి డబ్బు సంపాదిస్తారు. కొంత మంది ఇతరుల్ని మోసగించి, దోపిడీ చేసి సంపాదిస్తారు. ఏ విధంగా సంపాదించిన ధనమైనా అది శాశ్వతం కాదని వేమన చెబుతున్నాడు. కొంత మంది మూర్ఖులు తాము సంపాదించిన ధనాన్ని మట్టిలో దాచిపెడతారు. అంటే భూమిలో పాతి పెడతారు. ఎన్ని విధాలుగా ధనాన్ని దాచిపెట్టినా చివరి దశలో తాను మరణించినప్పుడు మానవుడు చిల్లిగవ్వ కూడా తన వెంట తీసుకొని వెళ్లలేడనే వాస్తవాన్ని వేమన ఇక్కడ తెలియజేశాడు. ఉన్నంతలో దానం చెయ్యమని పరోక్షంగా బోధించాడు.

**6. చెరుకు వెన్ను బుట్టి చెరపదా తీపెల్ల (25)**

కవి పరిచయం : ఈ పద్యపాదం "రెడ్డి సేవా సమితి" వారు ప్రచురించిన "వేమన పద్యాలు" అనే గ్రంథం నుంచి స్వీకరించబడిన "వేమన నీతి" అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : మంచివాని కడుపున నీచుడు పుట్టి వంశాన్ని నాశనం చేసినట్లు చెరకు తుద వెన్ను పుట్టి తీపిని నాశనం చేస్తుందని వివరిస్తున్న సందర్భంలో వేమన ఈ పద్య పాదాన్ని రచించాడు.

భావం : ఉత్తమ గుణసంపన్నుడైన వ్యక్తి వంశంలో నీచుడు జన్మించి, ఆ వంశ కీర్తిని మొత్తాన్ని నాశనం చేస్తాడు. అంటే తండ్రి మంచి లక్షణాలు కలవాడై సమాజంలో ఉన్నత స్థితిని పొంది సజ్జనుడుగా పరిగణింపబడుతూ ఉంటే అతని కడుపున పుట్టిన వాడు నీచుడై దుష్టుడై వంశాన్ని నాశనం చేస్తాడు. చెరకు తియ్యగా ఉంటుంది. అయితే చెరకు చివర వెన్ను పుట్టినప్పుడు ఆ తీపిదనాన్ని కోల్పోతుంది. ఈ సత్యాన్ని గుర్తించి ప్రవర్తించాలని వేమన చెప్పాడు.

**7. పురుషులందు పుణ్య పురుషులు వేరయా (27)**

కవి పరిచయం : ఈ పద్యపాదం "రెడ్డి సేవా సమితి" వారు ప్రచురించిన "వేమన పద్యాలు" అనే గ్రంథం నుంచి స్వీకరించబడిన "వేమన నీతి" అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : లోకంలో కేవలం భౌతిక స్వరూపాన్ని బట్టి అంతరంగిక స్వభావాన్ని అంచనా వెయ్యలేమని వివరిస్తున్న సందర్భంలో వేమన రచించిన పద్యపాదమిది.

భావం : ఉప్పు, కర్పూరం రెండూ ఒకే రకంగా ఉంటాయి. అంటే రెండూ పైకి తెల్లగా కనిపిస్తూ ఉంటాయి. అయితే రెండూ తెల్లగా ఉన్నంత మాత్రాన వాటి గుణాలు ఒకే రకంగా ఉండవు. వాటి రుచులు భిన్నంగా ఉంటాయి. అలాగే మానవులందరూ పైకి ఒకే రకంగా కనిపిస్తూ ఉంటారు. కానీ వారిలో పుణ్యాత్ములైన వారు భిన్నంగా ఉంటారు. అంటే బాహ్య రూపం ముఖ్యంకాదని అంతరంగం ముఖ్యమని వేమన బోధించాడని గుర్తించాలి.

**8. ఎరుకసాటి యెరుక యెరుకయే తత్త్వంబు (3)**

కవి పరిచయం : ఈ పద్యపాదం "రెడ్డి సేవా సమితి" వారు ప్రచురించిన "వేమన పద్యాలు" అనే గ్రంథం నుంచి స్వీకరించబడిన "వేమన నీతి" అనే పాఠ్యభాగంలోనిది.

సందర్భం : వేమన భిన్న విషయాల మీద పద్యాలను రచించాడు. మరణం, మోక్షం మొదలైన విషయాలను గూర్చి రచించి జ్ఞాన స్వరూపాన్ని వివరించే సందర్భంలో చెప్పిన పద్యపాదమిది.

భావం : జ్ఞానం అంటే తెలియని దాన్ని గూర్చి తెలుసుకోవటం దాన్నే ఎరుక అంటాము. జ్ఞానాన్ని మించిన సుఖం ఏ లోకంలోనూ ఉండదు అని వేమన చెప్పాడు. దీన్ని బట్టి జ్ఞానవంతుడు ఎక్కడైనా సుఖంగా ఉంటాడనే విషయం స్పష్టమవుతున్నది. జ్ఞానాన్ని గూర్చి తెలుసుకోవాలనే జ్ఞానం ఎవరికీ లేదని, జ్ఞానానికి సాటి జ్ఞానమేనని అదే తత్త్వమని వేమన చెప్పాడు. కాబట్టి జ్ఞానానికి మించినది ఏదీ లేదని, దానికి సాటి అదేనని జ్ఞాన మహత్త్వాన్ని వేమన ఇక్కడ స్పష్టం చేశాడు.

**డా॥ గుమ్మా సాంబశివరావు**

రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్

తెలుగు శాఖాధ్యక్షులు

ఆంధ్ర లయోల కళాశాల, విజయవాడ.

యూనిట్ - 3

పాఠం - 5

# జాషువా గబ్బిలం

(మొదటి పాఠం)

- గుఱ్ఱం జాషువా

చిక్కినకాసుచేం దనివిం జెందు నమాయకుం డెల్ల కష్టముల్
బొక్కెడు బువ్వతో మఱచిపోవు క్షుధానల దగ్ధమూర్తి న
ల్దిక్కులుఁ గల్గు లోకమున దిక్కరియున్న యరుంధతీ సుతుం
డొక్కండు జన్మమెత్తె భరతోర్వరకుం గడగొట్టు బిడ్డఁడై

పూపవయస్సులో వలసపోయిన చక్కని తెల్గు కైతకున్
బ్రాపక మిచ్చినట్టి రఘునాథనృపాలకుఁ దేలియున్న తం
జాపురి మండలమునకుఁ జక్కగ దక్షిణభాగ భూములన్
గాపురముండె నప్పరమ గర్భదరిద్రుండు నీతిమంతుడై.

ముప్పు ఘటించి వీని కులమున్ గలిమిన్ గబళించి దేహమున్
బిప్పియొనర్చు నీ భరత వీరుని పాదము కందకుండగాఁ
జెప్పులు గుట్టి జీవనము సేయును గాని నిరాకరింప లే
దెప్పుడు నప్పు వడ్డది సుమీ భరతావని వీని సేవకున్

వాని ఱెక్కల కష్టంబు లేనినాఁడు
సస్యరమ పండి పులకింప సంశయించు
వాఁడు చెమ్మటలోడ్చి ప్రపంచమునకు
భోజనముఁ బెట్టు వానికి భుక్తి లేదు.

వాని తలమీఁదఁ ఉబలిమిన పంకిలమును
గడిగి కరుణింప లేదయ్యొ గగనగంగ
వాని నైవేద్యమున నంటు వడిన నాఁడు
మూఁడు మూర్తులకును గూడఁ గూడు లేదు

పామునకుఁ బాలు, చీమకుఁ బంచదార
మేపుకొనుచున్న కర్మభూమిఁ జనించు
ప్రాక్తనంబైన ధర్మదేవతకుఁ గూడ
నులికిపడు జబ్బు గలదు వీఁడున్న చోట

వాని నుద్ధరించు భగవంతుఁడే లేఁడు
మనుజుఁ డెట్లు వానిఁ గనికరించు
వాఁడు జేసికొన్న పాపకారణ మేమొ
యింతవఱకు వాని కెఱుకలేదు

ఆ యభాగ్యుని రక్తంబు నాహరించి
యినుపగజ్జెల తల్లి జీవనము సేయుఁ
గనరి బుసకొట్టు నాతని గాలిసోఁక
నాల్గు పడగల హైందవ నాగరాజు

కులములేని నేను కొడుకులఁ బుట్టించి
యీ యఘాతమందె ద్రోయవలెనె
భార్యయేలఁ బుట్టుబానిసకని వాఁడు
జరుపసాఁగె బ్రహ్మచర్య దీక్ష

ఉదయమాది రక్తమోడ్చి కష్టముఁజేసి
యినుని సాగనంపి యిల్లు సేరి
యున్న గంజిఁ ద్రావి యొక్కనాఁ డాపేద
ప్రక్కమీఁద మేను వాల్చియుండె

భూనభములఁ గ్రొంజీఁకటు
లేనుఁగునకు మదము వోలి యెసక మెసగె సం
ధ్యా నాట్యకేళి మాని మ
హానటుఁడు శివారవముల నారంభించెన్

ముక్కు మొగమున్న చీఁకటి ముద్దవోలె
విహరణము సేయసాఁగె గబ్బిల మొకండు
దాని పక్షానిలంబున వాని చిన్న
యాముదపు దీప మల్లన నాఱిపోయె

తిల్లిక నాఱిపి దయ్యపుఁ
బిల్లవలెం దిరుగుఁ దబిసి పిట్ట నరయఁగాఁ
బల్లవితమయ్యె నాతని
యుల్లంబునఁ గ్రొత్తక్రొత్త యూహాంకురముల్

చెలిమిన్ బక్షికి విన్నవించుకొనఁ జొచ్చెన్ స్వీయవృత్తాంత ము
మ్మలికన్ గందిన నెమ్మనంబున మదోన్మత్త ప్రపంచంబులోఁ
బులుఁగుం బుత్రలుఁగాకఁబేదలకు నాప్తుల్ జుట్టపక్కంబులున్
గలరే! వాని కవోష్టబాష్పములు వ్యాఖ్యానించెఁ జక్రాంగనల్

ప్రవిమల దేవతాభవన వాసము చేయుచు మమ్మువంటి మా
నవులకు లేని గౌరవమునం దులదూఁగెడు గబ్బిలాల రా
ణివిగద నీవు స్వాగతము నీకు శుభంబకదమ్మ నీ తనూ
భవులకుఁ దల్లక్రిందుల తపంబులకున్ గుడి గోపురాలకున్

గాఢనిద్రావలంబియై కన్నుమూసి
క్ష్మాతలము మేను మఱచిన కాళరాత్రి
నా గృహంబున వెదకుచున్నా వదేమి
దొరక దిచ్చట నానంద కిరణ లవముఁ

నిన్ను బహిష్కరించు నవనీవలయం బిది యంటరాని వాఁ
డున్న నిషిద్ధగేహము సహోదరి, నీవు సమస్త దేవతా
సన్నిధి నారగింతువు ప్రసారము లంతటి పుణ్యురాలివై
యన్నములేని పేదల గృహంబులు సొచ్చితివేల బేలవై

హృదయములేని లోకముసుమీ యిది మాపులఁబశ్చిమంబుగా
నుదయము తూర్పుగా నడచుచుండు సనాతనధర్మ ధేనువుల్
పిదికిన పాలు పేదకు లభింపవు శ్రీగలవాని యాజ్ఞలోఁ
బవెదవిఁ గదల్పఁజాల రరవిందభవ ప్రముఖామృతాంధసుల్

ప్రతిమల పెండ్లి సేయుటకు వందలు వేలు వ్యయించుఁగాని దుః
ఖితమతులైన పేదల పకీరుల శూన్యములైన పాత్రలన్
మెతుకు విదల్ప దీ భరత మేదిని ముప్పదిమూఁడుకోట్ల దే
వత లెగవడ్డ దేశమున భాగ్యవిహీనుల క్షుత్తు లాఱునే

పరమార్థంబులు బోధసేయుదురు లోభస్వాంతులై నిత్యమున్
గురువుల్ ముక్కుకుసూటిగాఁదగులు యుక్తుల్ పన్ని కైవల్యపుం
దెరువుల్చూపి మహాపరాధివనుచున్ దీర్మానముల్ సేయుచుం
దురు వేదాంతరథంబు సాగదనుకొందున్ నేను లేకుండినన్

ఒగిసంసారము దిద్దుకొంచుఁ గర మత్యుచ్చస్థితిం దూఁగుచుం
బగలెల్లన్ మునివృత్తినుండి యనుకంపన్ శర్వరీ వేళలన్
వగలందూలు దరిద్రమూర్తుల సమాశ్వాసింపనేతెంచితే
ఖగసన్యాసిని! యర్చ్వరాల వకలంకంబైన మర్యాదకున్

గిరుల గుండెలు కరఁగి నిర్ఝరము లట్టు
లుబుకుచున్నవి దిశల నన్నూఱడింపఁ
బక్షికళ్యాణి, సోదర ప్రజలకండ్ల
నిర్గమించెనె యొక్క కన్నీటిచుక్క

చుట్టాలేగద వాలఖిల్యు లినతేజుల్ యోగవిద్యావిధుల్
పుట్టుందాపసు లార్ద్రచిత్తులు మహాత్ముల్ వైనతేయస్తుతిన్
జెట్టుం గొమ్మఁ బరిత్యజించిన పరశ్రేయశ్శుభాకాంక్షు లో
పిట్టా! నీకు నమస్కరించెదను నా విజ్ఞప్తి నాలింపవే

ఈ ప్రశాంతరాత్రి యెల్లలోకంబులను
బుజ్జగించి నిద్రఁ బుచ్చు కొనియె
నౌషధంబులేని యస్పృశ్యతాజాడ్య
మందభాగ్యు నన్ను మఱచిపోయె

కర్మసిద్ధాంతమున నోరు కట్టివేసి
స్వార్థలోలురు నా భుక్తి ననుభవింత్రు
కర్మమన నేమొ, దానికీ కర్తయేమొ,
యీశ్వరునిచేత ఋజువు చేయింప వమ్మ

ఆలయంబున నీవు వ్రేలాడు వేళ
శివుని చెవి నీకుఁ గొంత చేరువుగా నుండు
మౌని ఖగరాజ్ఞి! పూజారి లేనివేళ
విన్నవింపుము నాదు జీవిత చరిత్ర

ఆ పూజారులు విన్న నీకగును బ్రాయశ్చిత్త మీశానుఁడున్
గోపించున్ వివరింప నేమిటికి నీకుం బొమ్ము వార్ధక్యమున్
దాపై పెంజెడ దెల్లనైనది నిశీథస్త్రీకి నా ఖేటక
వ్యాపారంబు ముగించి నీ పొరుగు గూబల్గూండ్లకున్ బోయెడిన్

పసమించు నీ గరుత్తుల
విసరి శ్రమంబడపి నన్నుఁ బ్రేమించిన నీ
యసమోపకారమునకుం
బసదన మిడలేక నే ఋణస్థుఁడ నైతిన్

నీ నమస్కారముల నిక్కి నిక్కి నడువఁ
బక్షిణీ! నాకు నుద్యోగబలము లేదు
మెచ్చఁదగు నీ కళాశక్తి నుచ్చరింప
ఖగసతీ!క్షమ నాకుఁ గలము యోగ్యతలు లేవు

స్వార్థమున నిన్నుఁ గొఱముట్టువలె గణింపఁ
గడుపునిండిన భాగ్యవంతుఁడను గాను
దోషములు సూపి నీకు నీతులు వచించి
దొరతనము సేయఁగా మతస్థుఁడను గాను

మృగపక్షిత్వ విచిత్రధర్మములు మూర్తిన్ దాల్చియున్నట్టి నీ
మొగముం జూడరు లోక మట్టి శకునంబుల్ ప్రాతపట్టింపులు
న్దగవీ పేదకు రమ్ము గబ్బిలపుచానా! నాదు స్వాంతంబులో
దిగులుంబాపి పినాకపాణి కొక సందేశంబు నందింతువా?

ధర్మమునకుఁ బిఱికితన మెన్నఁడును లేదు
సత్యవాక్యమునకుఁ జావు లేదు
వెఱవనేల నీకు విశ్వనాథుని మ్రోల
సృష్టికర్త తాను సృష్టి వీవు

నరునకుఁ జేరరాని సదనంబున వాసముసేయు నీశ్వరే
శ్వరునకు నా నమస్కృతు లుపాయన మిమ్మొకవేళఁ గారణాం
తరముల వెండి పర్వతమున న్నివసించుచు నున్నఁ బక్షిసుం
దరి! యొకపూట యానమకదా! యిది నీకుఁ బరోపకారిణీ !

గౌరీనాథుఁడు కాశికిం జనెదు మార్గంబందు రా మేఘపుం
బాఱిన్ జుక్కలతోఁట నాటుకుని మింట న్నీకుఁగన్నట్టు
దారిం బొమ్మొక వేళఁ జూచెదవు భూతస్వామిని న్నీకుఁ జ
త్వారం బేర్పడి దారిఁ దప్పెదవు గాదా! భానుఁదే తెంచినన్ః

ఛత్రముల వంటి నీలి పక్షములు విచ్చి
నీవు బ్రహ్మాండమునఁ బయనించు వేళఁ
జిత్తజల్లుల ముమ్మాయి ముత్తియములు
జలధరస్వామి నీ మీఁదఁ జల్లం గలఁడు

మొలక సంధ్యారాగమునఁ గెంపు లెగఁజిమ్ముఁ
జరమాచలంబునఁ జరణమూఁది
సెలయేటి నీట నీఁతలు గొట్టి విహరించు
మరుదంకురముల సన్మాన మంది
కొండకొమ్ముల నెదుర్కొని తుత్తునియలైన
తోయదమ్ముల మీఁదఁ దుఱఁగలించి

## 5.3.1. కవి పరిచయం :

అంటరానితనం సంఘంలో విలయతాండవం చేస్తున్న రోజుల్లో వినుకొండ సమీపాన ఉన్న చాట్రగడ్డపాడు గ్రామంలో 1895 సెప్టెంబర్ 28వ తేదీన గుఱ్ఱం వీరయ్య, లింగమాంబ దంపతులకు జాషువా జన్మించాడు. అప్పట్లో ఆయన తల్లిదండ్రులది వర్ణాంతర వివాహం.

జాషువాకు బాల్యంలో తోటి బాలురతో ఆడుకోవాలనే కుతూహలానికి అస్పృశ్యత అడ్డుతెరగా నిలిచింది. “అంటరాని వాడవు నీవు మాతో ఆడకూడదన్న” బాలుడి చెంపపై సాచి కసితో చెంపదెబ్బ కొట్టాడు. “సోదరా ! ఈ దెబ్బ నీలోని అంటరానితనపు జాఢ్యానికని” హెచ్చరిక చేశాడు. అవమానాలకు గురిఅవుతూనే బాల్యంలో ఆయన విద్యాభ్యాసం సాగింది. “ఫాదరి బడిలో క్రమముగా ఐదవ తరగతిని గెలిచి యస్పృశ్యతకున్ గాదిలి చెలియగు హిందూ సోదరుల కళాలయము”లో ప్రవేశించాడు. (నా కథ ప్రథమ భాగం). ఉన్నత పాఠశాలలో చదువుతున్నపుడు సాహిత్య లోకంలో సంచలనం కలిగిస్తున్న తిరుపతి వెంకట కవులు, కొప్పరపు కవుల అవధానాన్ని సభలు, పాండితీ స్పర్థలు, వివాదాలు జాషువాను ఆకర్షించాయి. కొప్పరపు కవుల అవధానాన్ని చూసి ముగ్ధుడై ప్రశంసా పద్యాలు వ్రాసి వేదికపై చదివేందుకు ప్రయత్నించగా “అస్పృశ్యుండీ నిర్భాగ్యుడెట్లు సభలో జొచ్చెనంచు” కొందరు బ్రహ్మణ పండితులు ఈసడింపుతో సభ నుంచి నిష్క్రమించారు. చివరకు మానవతా దృష్టి గల కొందరు బ్రాహ్మణ పండితుల సహకారంతో ఆ పద్యాలు చదివి వినిపించి కొప్పరపు కవుల ఆశీస్సులు పొందాడు.

జాషువా తండ్రి క్రైస్తవ ఫాదరీ ఉద్యోగం చేసేవాడు. జాషువా హిందూ పురాణాలు చదువుతున్నాడన్న నెపంతో తండ్రి ఉద్యోగం ఊడిపోయే హెచ్చరికలు వచ్చాయి. ఇంట్లో హిందూ పురాణాలు చదివే అవకాశం లేక ఊరి వెలుపల పాడుబడ్డ మశీదులో గుడ్డి దీపపు వెలుగులో పురాణాలు చదివాడు.

తన ఊళ్లో టిక్కెట్ నాటక ప్రదర్శన జరుగుతున్నపుడు అస్పృశ్యత కారణంగా చూడ్డానికి వీల్లేదన్న ఆంక్షతో ఆయన మనసెంతో క్షోభించింది. ఉన్నత పాటశాల చదువు పూర్తయిన తర్వాత నెలకు ఏడున్నర రూపాయల జీతంతో ఉపాధ్యాయుడిగా చేరాడు. “అద్దెకు ముద్దకు చాకలి పద్దుకు కూరిమి చూడాలి. హద్దియ మేరీమాంబకు” చాలినందున ఆ ఉద్యోగాన్ని వదులుకున్నాడు. భుక్తి కోసం మూకీ చిత్రాల వ్యాఖ్యాతగా, నాటకాల కంపెనీ యజమాని గున్నేశ్వరరావు దగ్గర నాటక రచయితగా పనిచేశాడు. ఆ దశలో రాజమండ్రిలో కందుకూరి వీరేశలింగం, చిలకమర్తి వంటి ప్రముఖ కవులను కలసికొని ఆశీస్సులు పొందాడు. తర్వాత 1919 నుండి తొమ్మిదేళ్లపాటు గుంటూరు ట్రైనింగ్ స్కూల్లో ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. ఉభయ భాషా ప్రవీణ చదివి జిల్లా బోర్డు

పాఠశాలలో 15 సంవత్సరాలు తెలుగు ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేశాడు. మూడేళ్లు యుద్ధ ప్రచార శాఖలో ఉద్యోగిగా, కొన్నాళ్ళు ఆకాశవాణిలో ప్రోగ్రామ్ ప్రొడ్యూసర్‌గా పనిచేశాడు. జీవిక కోసం ఎన్నో ఉద్యోగాలు చేశాడు.

**జాషువా రచనలు :**

జాషువా సమకాలిక సమాజాన్ని ఉర్రూతలూపిన భావ కవిత్వోద్యమంగాని, అభ్యుదయ కవిత్వోద్యమంగాని ఆయనను ప్రభావితం చేయలేదు. అంటరానితనంతో అవమానాలు, ఆత్మక్షోభలు ఎదుర్కొన్న ఆయన హృదయం సంస్కరణలు, దృక్పథాన్ని వాంఛించింది. సాంఘిక విప్లవం రావాలని కోరింది. అందుకే సంఘంలో దురాచాలు సమసిపోయి అందరూ సహజీవనం చేయాలన్న అస్పృశ్యుని ఆత్మ క్షోభా నివేదిక "గబ్బిలం", సలసల క్రాగి చిందిన కన్నీటి బిందువు "అనాధ". సమతా దృక్పథ పీఠిక "స్మశాన వాటిక", ఆయన కృతులన్నీ విశిష్టమైనవే. కవిగా ప్రసిద్ధుడై ఎన్నో సన్మానాలు, బిరుదులు, పదవులు అందుకున్నాడు. "కవి కోకిల", మధుర శ్రీనాథ, కవితా విశారద, నవయుగ చక్రవర్తి, విశ్వకవి సామ్రాట్ వంటి ఎన్నో బిరుదులకు వన్నె తెచ్చారు. "కళా ప్రపూర్ణ", పద్మభూషణ్ వంటి బిరుదులతో సత్కరింపబడ్డారు. శాసనమండలి సభ్యులుగా విశిష్ట గౌరవాన్ని పొందారు.

ఆయన "క్రీస్తు చరిత్ర" కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు లభించింది.

జాషువా కవిత్వాన్ని గూర్చి ఆచార్య సి. నారాయణరెడ్డి "జాషువా కవిత్వాన్ని అతని వ్యక్తిత్వం నుంచి విడదీసి చూడలేము. అవి ఒకదానికొకటి కారకాలు. ఉపస్కారకాలు. అవిభాజ్యంగా కలసిమండిన అనలజ్వాలలు" అన్నారు. జాషువా కాంక్షతో రచనలు చేశారు. ఆయన రచనల్లో సంప్రదాయ భాషా ఛందస్సులే సాక్షాత్కరిస్తాయి.

జాషువా భుక్తి కోసం, వృత్తి కోసం సాహిత్య జీవిత ప్రారంభ దశలో పెక్కు నాటకాలు రచించారు. "రుక్మిణీ కళ్యాణము" చిదానంద ప్రభాతము, ధ్రువ విజయము, మీరాబాయి, తెరచాటు వంటి నాటకాలు రచించినా అవి ఏవీ ఆయన ప్రతిభకు నికషోపలాలుగా నిలువలేదు. తొలి దశలో, ఆశుకవితా సాధన దశలో రచించిన హిమ ధామార్కధర పరిణయం కన్యకాపరమేశ్వరీ, కుశలవో పాఖ్యానం ఆయన కవితా శక్తిని నిరూపించేవి కావు. ఖండ కావ్య సంపుటాలు ఏడు భాగాలు : పిరదౌసి, గబ్బిలం, ముంతాజ్ మహల్, "స్వప్న" కథ, అనాథ, కాందిశీకుడు, బాపూజీ, నేతాజీ, స్వయంవరం, కొత్తలోకం, ముసాఫర్లు, నాగార్జున సాగరం, క్రీస్తు చరిత్ర, నాకథ వంటి కావ్యాల్లో జాషువా కవితాశక్తి పరిపూర్ణంగా వికసించింది.

జాషువా ఖండ కావ్యాలు ఆయన శ్వాసకోశాలు ఎగజిమ్మిన ఆవిరులు 'పిరదౌసి'లో కవితకు చూడాలి చేసిన అన్యాయం గోచరిస్తుంది. ఆచార్య సి. నారాయణరెడ్డిగారు జాషువా వ్యక్తిత్వాన్ని కవిత్వాన్ని వివరిస్తూ "అసమ సమాజం బాకులు కుమ్మినప్పుడు, అంటరాని తనం విషాగ్నులు చిమ్మినపుడు, దుర్భర దారిద్ర్యం వెన్నాడినప్పుడు దురంతర వేదన గుండెల్లో తుక తుక ఉడికనప్పుడు జాషువా గుర్తొస్తారు. ఆయన పిరదౌసి గుర్తొస్తుంది. గబ్బిలం జ్ఞాపకానికి వస్తుంది. స్మశాన వాటి నిట్టూర్పు పొగలితో కట్టెదుట నిలుస్తుంది. ఇంకా ఇంకా ఎన్నెన్నో ఖండకృతులు ప్రతిఘటనకు ఓంకృతులై ధ్వనిస్తాయి" అని ఆయన కృతులను, వ్యక్తిత్వాన్ని విశ్లేషించారు.

ఆచార్య జి.యన్.రెడ్డి గారు "ఆధునికాంధ్ర సాహిత్య రంగంలో తొలి తరం కవుల్లో అన్ని విధాలా విలక్షణంగా ప్రసన్నమయ్యే మహనీయమూర్తి జాషువా. వారిది రాపిడిపడ్డ జీవితం. రాపిడిలో రాణించిన ప్రతిభ, ప్రతిభతో గుబాళించిన కవిత. "కుల మత విద్వేషంబుల్ తలసూపని కళారాజ్యం" కొసరం కలలు గన్న ఆశావాది. సమతా వాది, మానవతావాది జాషువా" అని ప్రశంసించారు.

జాషువా కృతులను పరిశోధించిన డా॥ బి. భాస్కర్ చౌదరి "జాషువా ఖండ కావ్యాలకు సార్వజనీనత సిద్ధించింది. వస్తు నవ్యత, వస్తు వైవిధ్యం, వ్యధా భరితమైన హృదయం నుండి పొంగి పొరలిన భావావేశం, క్షుద్ర వస్తువులో కూడా ఉదాత్తతను

చూడగలిగిన సహృదయం వాటికా ప్రశస్తిని చేకూర్చాయి. వాటికి తోడు నిమ్నోన్నతాలు లేని శైలి, ప్రజల వ్యవహారంలో బాగా నలిగిపోయిన పద ప్రజల వ్యవహారంలో బాగా నలిగిపోయిన పద ప్రయోగం, కొన్ని శతాబ్దాలుగా తెలుగు వారికి సన్నిహితమై పోయిన హృద్యమూ, సంప్రదాయ బద్ధమూ ఐన పద్య రచన జాషువా కావ్య ఖండికలకు మెరుగులు దిద్దాయని'' పరిశీలనతో ప్రశంసించారు.

పై విమర్శకుల అభిప్రాయాలన్నీ జాషువా కృతుల విశిష్టతను, ఆయన వ్యక్తిత్వాన్ని విశదీకరిస్తున్నాయి. దీపాల పిచ్చయ్య శాస్త్రిగారితో కలిసి జంట కవిత్వం వ్రాసేందుకు ప్రయత్నించి "నా పేరును ముందుంచ జాషువా పిచ్చియగున్ అతడు పేరును ముందుంచ పిచ్చి జాషువా యగున్'' పేర్లు కలవక ఏ విధంగా చూసినా జాషువాకే పిచ్చి పట్టేట్లుందని విరమించారు.

జాషువా కృతులు ఆధారంగా ఆయన కవితా లక్షణాలను పరిశీలిస్తే (1) సంస్కరణ దృక్పథం, 2) సమతా దృష్టి, 3) అభ్యుదయ భావుకత, 4) మానవతా వాదం, 5) హేతువాద దృష్టి, మూఢ విశ్వాస నిరసన, 6) అస్పృశ్యతా నిరసన వంటి లక్షణాలు ఆయన కవిత్వంలో పుష్కలంగా కనిపిస్తాయి. జాషువా పద్య రచనలో మార్పు తెచ్చాడు. వ్యాకరణ నియమాలు సడలించి భాషా స్వేచ్ఛను ప్రకటించాడు. జన వ్యవహారంలో ఉన్న అరబ్బీ, పారశీ, ఉర్దూ పదాలను యథేచ్ఛగా ప్రయోగించాడు. తెలుగుతనం గుబాళించే చక్కని పదాల పోహళింపు, పద చిత్రాల మేళవింపు ఆయన కవితకు వన్నె తెచ్చాయి.

జాషువా కీర్తి సౌధానికి పిరదౌసి, గబ్బిలం, ఖండ కావ్యాలూ, ముంటా జమహలు నాలుగు స్తంభాలుగా నిలిచాయి. జాషువా కృతుల ద్వారా ఆంధ్ర సాహితీ ప్రియుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ధన్య జీవి. ఆయన 1971 జూలై 24వ తేదీన మరణించినా, తెలుగు సాహితీ ప్రియుల హృదయాల్లో చిరస్మరణీయులు చిరంజీవి.

## 5.2. పాఠ్యభాగ సందర్భం :

జాషువా గబ్బిలం కావ్యాన్ని 1941లో రచించారు. అంతకంటే ముందు అస్పృశ్యత దీన స్థితికి సానుభూతిని వ్యక్తపరుస్తూ గురజాడ అప్పారావు (1910). వంగిపూడి వేంకట శర్మ (1915), వేంకట పార్వతీశ్వర కవులు (1920) వంటి వారు రచించారు. జాషువా గబ్బిలం కావ్యంలో తీవ్రత వాటిలో వ్యక్తం కాలేదు.  జాషువా గబ్బిలం కావ్యంలో కథానాయకుడైన పంచముడి కష్టాలు జాషువా జీవితానుభవంలోనివి కావడం వల్ల కావ్యానికి మరింత విశిష్టత చేకూరింది. పై పై సానుభూతితో కావ్య రచన చేయడానికి నిజజీవితంలో కష్టాలు ఎదుర్కొని పలవరించిన తీరుకున్న భేదం ఇతర కవుల రచనకు, జాషువా గబ్బిలానికి ఉంది.

జాషువా గబ్బిలం కావ్య నేపథ్యాన్ని వివరిస్తూ "కాళిదాసుని మేఘ సందేశము మనస్సులో ఉంచుకొని నేనీ కావ్యమును రచించితిని. గ్రంథ నామము గబ్బిలము శ్రోతలకిది కటువుగా దోపవచ్చును. కాని యందలి కథా నాయకుడు ప్రణయ సందేశము పంపును. ఇతడంపునది తుక తుక నుడుకునశ్రు సందేశము. అతని శిక్షా కాలమొక సంవత్సరము. ఇతని శిక్ష ఆజన్మాంతము, అతడు మన్మథాగ్ని తప్తుడు, ఇతడు క్షుధాగ్ని తప్తుడు. ఇరువురిలోని తడుదయనీయుడు'' అని సహృదయులకు విజ్ఞప్తి చేశాడు. జాషువా వివరణ కాళిదాసు మేఘ సందేశానికి ఆయన గబ్బిలానికి ఉన్న తులనాత్మక పరిశీలనను వ్యక్త పరుస్తుంది. గబ్బిలం కావ్య విశిష్టతను, జాషువా వ్యక్తిత్వాన్ని తిరుమల రామచంద్రగారు ప్రశంసిస్తూ గొప్పగా చెప్పారు. "గబ్బిలం కావ్యంలో'' తాను చేసుకొన్న పాపకారణమేమిటో తనకే తెలియని ఒక అభాగ్యుని అశ్రువుల గాథ. దానిలో అతని బాష్ప సందేశం ప్రధానం. దేశ వర్ణన గౌణం, అనుషంగికం, పరమనికృష్టంధకారం నుంచి హిమ ధవళ కైలాసోన్నతులలో నివసించే పరమశివుని వరకు పాకిన గాథ అది. కవి కరుణార్ద్ర హృదయం కుమ్మరించిన కథ అది. "గబ్బిలం శాశ్వతంగా ఉంటుందని నా నమ్మకం'' అని జాషువా గారు అభిప్రాయపడ్డారు. (మరపురాని మనిషి తిరుమల రామచంద్ర, యువభారతి ప్రచురణ). పై అభిప్రాయాలన్నీ గబ్బిలం కావ్య విశిష్టతను స్పష్టపరుస్తున్నాయి.

## పాఠ్యభాగ నేపథ్యం :

జాషువా గబ్బిలం మొదటి భాగం 1941లో వెలువడింది. అప్పటికీ, ఇప్పటికీ అంటరానితనం ఘోరమైన దురాచారమని చాటి చెప్పిన కావ్యాల్లో గబ్బిలం శ్రేష్ఠమైనదని విమర్శకుల అభిప్రాయం. కథారసభరితమైన "గబ్బిలం" సహృదయుల మనస్సులను రసార్ద్రమొనరిస్తుంది. అంటరానితనాన్ని గూర్చి తీవ్రంగా ఆలోచిస్తుంది.

పంచముడిగా అవమానాలకు గురి అవుతున్న ఒక పేదవాడు గబ్బిలం ద్వారా భగవంతుడికి తన కష్టాలను నివేదించుకుంటూ సందేశం పంపడం ఈ కావ్యంలోని ఇతివృత్తం భారతీయ భాషల్లో అంటరానితనాన్ని గూర్చి వచ్చిన కావ్యాల్లో జాషువా రచించిన 'గబ్బిలం' విశిష్టమైందని పండితాభిప్రాయం. ప్రస్తుత పాఠ్య భాగం గబ్బిలం మొదటి భాగంలో 40 పద్యాలు. ఈ పద్యాల్లో జాషువా అస్పృశ్యత దుస్థితిని, ఆవేదనను ఆర్ద్రంగా వర్ణించాడు.

## 5.3. కఠిన పదాలకు అర్థాలు - భావాలు ప్రతిపదార్థ తాత్పర్యం :

| | | | |
|---|---|---|---|
| 1. | చిక్కిన కాసుచే | = | లభించిన స్వల్పమైన నాణెం చేత |
| | తనివి + చెందు | = | సంతృప్తి చెందిన |
| | అమాయకుడు | = | అమాయకమైనవాడు |
| | ఎల్ల కష్టముల్ | = | కష్టాలన్నింటినీ |
| | బొక్కెడు బువ్వతో | = | కొద్దిపాటి అన్నంతో |
| | మఱచిపోవు | = | మఱచిపోవునట్టి |
| | క్షుధ + అనల దగ్ధమూర్తి | = | ఆకలి బాధలో దహించుకపోవునట్టి |
| | దిక్కరి | = | దిక్కులేనివాడు |
| | అరుంధతీసుతుండు | = | పంచముడి (పంచములు అరుంధతీ వశిష్ఠల కుమారులనెడి భావన) |
| | భరత + ఉర్వర | = | భారతదేశమందు |
| | కడగొట్టుబిడ్డడు | = | చిట్ట చివర వర్ణం వాడు నాలుగు వర్ణాల వారి తర్వాత జన్మించిన ఐదో వర్ణం వాడు కడగొట్టి బిడ్డడైనా ఏ ముచ్చటకు నోచుకోనివాడని వ్యంగ్యం. |

**భావం :** భరతమాత కడగొట్టు బిడ్డడైన పంచముడు తనకు లభించిన కొద్ది ధనంతో తృప్తి పడే అమాయకుడు. బొక్కెడు బువ్వతో ఆకలి తీర్చుకొని కష్టాలన్నింటినీ మరచిపోయేవాడు. ఆకలి బాధకు నానాటికి దహించుకుపోతున్న బడుగు జీవి. నాలుగు దిక్కులున్న ఈ లోకంలో దిక్కులేని వాడిగా పుట్టాడని భావం.

| | | | |
|---|---|---|---|
| 2. | పూపవయస్సులో | = | లేత వయస్సులో |
| | వలసపోయిన | = | తరలిపోయిన |
| | చక్కని తెల్గుకైతకున్ | = | చక్కని తెలుగు కవిత్వానికి |

| | | |
|---|---|---|
| ప్రాపకము | = | ఆశ్రయం ఇచ్చినట్టి |
| రఘునాథ నృపాలకుడు + ఏలియున్న | = | రఘునాథ నాయకుడు పరిపాలించిన |
| తంజాపురి మండలమునకున్ | = | తంజాపురి ప్రాంతానికి |
| దక్షిణ భాగభూములన్ | = | దక్షిణం దిక్కు భూముల్లో |
| అ+పరమ గర్భ దరిద్రుడు | = | దయనీయమైన ఆ గర్భదరిద్రుడు |
| నీతిమంతుడై | = | నీతిలో కూడిన ప్రవర్తనలో జీవించువాడు |

**భావం :** లేత వయస్సులో వలసపోయిన చక్కని తెలుగు కవితకు ఆశ్రయమిచ్చిన రఘునాథ భూపాలుడు తంజావూరును పాలిస్తున్న సమయంలో తంజావూరికి దక్షిణ దిక్కునున్న భూముల్లో ఆగర్భ దరిద్రుడు నీతిమంతుడై కాపురమున్నాడు.

**ప్రతిపదార్ధ తాత్పర్యానికి ముఖ్యం :**

| | | | |
|---|---|---|---|
| 3. | ముప్పుఘటించి | = | ఆపదలు కలిగించి |
| | వీని కులమున్+కలిమిన్ | = | వీడికులాన్ని, సంపదనీ |
| | కబళించి | = | హరించి |
| | దేహమున్ | = | శరీరాన్ని |
| | పిప్పి + ఒనర్చు | = | పిప్పి చేయు |
| | భరతవీరుని | = | భారతీయుని |
| | పాదము కందకుండగా | = | పాదము కందిపోకుండా |
| | చెప్పులు కుట్టి | = | చెప్పులు కుట్టి |
| | జీవనము + చేయును | = | జీవించును |
| | నిరాకరింపలేదు + ఎప్పుడు | = | ఎప్పుడూ తిరస్కరించలేదు |
| | భరతావని | = | భారతభూమి |
| | వీని సేవకున్ | = | ఇతడి సేవకు |
| | అప్పు + పడ్డది సుమీ | = | అప్పు పడ్డది |

**భావం :** ఆ దరిద్రుని కులాన్ని, సంపదనీ హరించి వాడి దేహాన్ని పీల్చి పిప్పి చేసిన భారత వీరుల పాదాలు కందిపోకుండా అతడు వారికి చెప్పులు కుట్టి జీవిస్తున్నాడు. ఏనాడు తన పనిని తిరస్కరించలేదు. భారతభూమి వీని సేవకు అప్పుపడ్డదని కవి భావన.

4. సస్యరము = పంట అనేలక్ష్మి

భుక్తి = భోజనము

**భావం :** అతడి రెక్కల కష్టం లేనినాడు పంటలు పండవు. భూమి పులకించేందుకు సంశయిస్తుంది. వాడు చెమటోడ్చి ప్రపంచానికి భోజనం పెట్టేవాడు. వాడి తిండికి గతిలేదు.

5. పులిమిని = రుద్దిన

పంకిలము = బురద

గగనగంగ = ఆకాశ గంగ

అంటు + పడిననాడు = అంటుపడిన రోజున

మూడు+మూర్తులన్ = త్రిమూర్తులైన (బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులకు)

కూడు = నైవేద్యం

**భావం :** ఆ పంచముడి తలమీద రుద్దిన అంటరాని తనమునే బురదను ఆకాశగంగ కూడ కడిగి ఆ మలినాన్ని తొలగించలేదు. అతడి వల్ల నైవేద్యం అంటుపడితే త్రిమూర్తులకు కూడా నైవేద్యం ఉండదు.

6. ప్రాక్తనంబైన ధర్మదేవత = పురాతనమైన ధర్మదేవత

ఉలికిపడు జబ్బు = బెదిరిపోయే జబ్బు

**భావం :** పామునకు పాలు, చీమకు పంచదార మేపు కర్మభూమిలో పురాతనమైన ధర్మదేవత కూడా అంటరాని తనానికి ఉలిక్కిపడుతుంది.

7. ఉద్ధరింప = పైకెత్తు, ఆదుకొను

కనికరించు = దయతలచు

**భావం :** ఆ పంచముణ్ణి ఉద్ధరించే భగవంతుడే లేడు. మనుష్యులు తననిపై కనికరం చూపిస్తారనీ నమ్మకం లేదు. అతడు చేసుకున్న పాపకర్మం పంచముడిగా పుట్టడమే.

8. అహరించి = ఆరగించి

ఇనుప గజ్జెల తల్లి = దరిద్ర దేవత

నాల్గు పడగల హైందవ నాగరాజు = నాలుగు పడగలతో ఉన్న హిందూ మతమనే సర్పం

**భావం :** ఆ అభాగ్యుని రక్తం త్రాగి దరిద్ర దేవత తాండవిస్తుంది.. అతని గాలి సోకితేనే నాల్గు పడకల హైందవ నాగరాజు కసరి బుసకొడుతున్నాడు. హిందూ మతంలో నాల్గు వర్ణాల వారు (బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు) అతడిని కసరి బుసకొడుతున్నారని భావం.

9. అఖాతము = గొయ్యి

పుట్టుబానిస = బానిసగా పుట్టినవాడు

బ్రహ్మచర్య దీక్ష = అవివాహితుడిగా ఉండేదీక్ష

**భావం :** కులం లేని నేను కొడుకుల పుట్టించి వాళ్లను కూడా ఈ అఖాతములోకి తోయడం ఎందుకని ఆలోచించి, అతడు బ్రహ్మచర్య దీక్షతో ఉన్నాడన్న భావన పాఠకులను పట్టి కుదుపుతుంది.

10. రక్తము + ఓడ్చి = రక్తం ధారవోసి

ఇనుని = సూర్యుని

**భావం :** ఉదయం నుండి సాయంత్రం వరకు తన రక్తాన్ని ధారవోసి కష్టం చేసిన ఆ అభాగ్యుడు సూర్యాస్తమయంలో ఇల్లు చేరుకొని ఉన్న గంజి త్రాగి పడుకున్నాడు.

11. భూనభముల = భూమ్యాకాశాల

క్రొత్త + చీకట్లు = క్రొత్తగా ఆవరించిన చీకట్లు

సంధ్యా నాట్యంకేళి = సాయం కాలపువేళ శివుని నాట్య విలాసం

**భావం :** సూర్యాస్తమయంతో భూమ్యాకాశాల్లో ఏనుగు మదజలంలా చీకట్లు ముసురుకున్నాయి. శివుడు తన తాండవాన్ని విరమించాడు.

12. పక్ష + అనిలము = రెక్కల గాలి

అల్లన = మెల్లగా

**భావం :** ముక్కుమొగమున్న చీకటి ముద్దులా గబ్బిలమొకటి ఆ అభాగ్యుడి యింట్లో ప్రవేశించి వాని రెక్కల గాలి చేత అక్కడ వెలుగుతున్న ఆముదపు దీపాన్ని ఆర్పివేసింది.

**విశేషం :** జాషువా గబ్బిలాన్ని ముక్కు మొగమున్న చీకటి ముద్ద అనే పద చిత్రంతో వర్ణించడం ఔచిత్యంగా వుంది.

13. తిల్లిక = దీపం

దయ్యపు పిల్ల = భూతం

తబసి పిట్ట = గబ్బిలం

ఉల్లంబున = మనస్సులో

ఊహ + అంకురముల్ = ఆలోచనల ఆరంభం

**భావం :** గబ్బిలం దీపాన్ని ఆర్పి తిరుగుతుండగా, ఆ అభాగ్యుడి మనస్సులో కొత్త కొత్త ఆలోచనలు మొదలయ్యాయి.

| | | | |
|---|---|---|---|
| 14. | స్వీయ వృత్తాంతము | = | తన కథ |
| | ఉమ్మలికన్ | = | బాధతో |
| | కందిన | = | తపించిన |
| | నెమ్మనంబున | = | నిండు మనస్సుతో |
| | మద + ఉన్మత్త | = | అహంకారముతో |
| | కవోష్ణ బాష్పములు | = | గోరు వెచ్చని కన్నీళ్లు |
| | చక్రాంగనలు | = | చక్రవాక పక్షులు |

**భావం :** ఆ పంచముడు గబ్బిలానికి తన దయనీయమైన వృత్తాంతాన్ని బాధతో కుమిలిన తన మానసిక వేదనను వివరించుటకు మొదలుపెట్టాడు. ఈ అహంకార ప్రపంచంలో పేదలకు ఆప్తులైన చుట్టాలు పులుగు పుత్రలే గదా ! అని వెచ్చని కన్నీళ్లతో వ్యాఖ్యానించాడు.

| | | | |
|---|---|---|---|
| 15. | ప్రవిమల | = | పవిత్రమైన |
| | దేవతా భవనము | = | దేవాలయం |
| | తనూభవులకు | = | కొడుకులకు |

**భావం :** పవిత్రమైన దేవాలయాల్లో నివసించే గబ్బిలారాణివి నీవు. మావంటి మానవులకు లేని గౌరవంతో నీవు తులతూగుతున్నావు. నీకు, నీ సంతతికి గుడి గోపురాలకు శుభమే కదా ! అని కుశల ప్రశ్నలడిగాడు.

| | | | |
|---|---|---|---|
| 16. | క్ష్మాతలము | = | భూమండలము |
| | కాళరాత్రి | = | చీకటి రాత్రి |
| | ఆనంద కిరణలవము | = | స్వల్పమైన ఆనందపు వెలుగు |

**భావం :** భూ మండలమంతా గాఢ నిద్రలో మునిగి ఉన్న అర్థరాత్రి వేళ నాయింటిలో ఏదో వెతుకుతున్నావు. ఇక్కడ వీశమైన సంతోషం కూడా లభించదన్నాడు.

| | | | |
|---|---|---|---|
| 17. | అవనీవలయము | = | భూ మండలము |
| | నిషిద్ధ గేహము | = | ప్రవేశించరానిది |
| | బేలవై | = | అయామకురాలివై |

**భావం :** సోదరీ ! అంటరానివాడనైన నా నిషిద్ధ గృహంలో ప్రవేశించిన నిన్ను కూడా భూ మండలం నిషేధిస్తుంది. సమస్త దేవాలయాల్లో ప్రసాదాన్ని ఆరగించే పుణాత్మురాలివి నీవు. తినేందుకు తిండి లేని పేదల గృహంలో నీవెందుకు ప్రవేశించావని ప్రశ్నించాడు.

| | | | |
|---|---|---|---|
| 18. | మాపుల | = | సాయంత్రం వేళల |
| | పశ్చిమంబుగా | = | పడమర దిక్కుగా |
| | అరవిందభవ | = | బ్రహ్మ |
| | అమృతాంధసుల్ | = | దేవతలు |

**భావం :** ఇది హృదయం లేని లోకం సుమా ! ఉదయం తూర్పు దిక్కుగా, సాయంత్రం పడమర దిక్కునా సంచరించు ధర్మ దేవులు పిదికిన పాలు మావంటి పేదలకు లభించవు. ఈ విషయాన్ని గూర్చి బ్రహ్మ వంటి దేవతా ప్రముఖులు నోరువిప్పని తన ఆవేదనను వ్యక్తపరిచాడు.

**ప్రతిపదార్థ తాత్పర్యానికి ముఖ్యం :**

| | | | |
|---|---|---|---|
| 19. | ప్రతిమల | = | బొమ్మల |
| | పెళ్లి + చేయుటకు | = | పెళ్లి సేయుటకు |
| | వందలు, వేలు | = | వందల వేల రూపాయలు |
| | వ్యయించున్ + కాని | = | ఖర్చు పెట్టునుగాని |
| | దుఃఖితమతులైన | = | శోకంతో ఉన్న |
| | పేదల ఫకీరుల | = | పేదవాడైన బైరాగులను (బిచ్చగాళ్లను) |
| | శూన్యములు + ఐన | = | ఖాళీగా ఉన్న |
| | పాత్రలన్ | = | పాత్రలందు |
| | ఈ భరతమేదిని | = | ఈ భారత భూమి (ప్రజలు |
| | మెతుకు విదల్పదు | = | మెతులకును రాల్చరు |
| | ముప్పది మూడు కోట్ల దేవతలు + ఎగవడ్డ | = | ముప్పై మూడు కోట్ల మంది దేవతలున్న ఈ దేశంలో |
| | భాగ్య విహీనుల | = | దరిద్రుల |
| | క్షుత్తులు + ఆరునే | = | ఆకలి బాధలు చల్లారునా ? (చల్లారవని అర్థం) |

**భావం :** బొమ్మల పెళ్లిళ్ల చేయుటకు భారతీయులు వందలు, వేలు ఖర్చు పెట్టెదరు. కాని ఆకలితో అలమటించే పేదల, బైరాగుల బొచ్చెల్లో ఒక్క మెతుకు రాల్చరు. ముప్పై మూడు కోట్ల దేవతలెగవడ్డ ఈ దేశంలో దరిద్రుల ఆకలి బాధలు తీరవు గదా! అని కవి ఆక్షేపించారు.

**విశేషం :** జాషువా గారు ఈ పద్యం రాసే నాటికి భారతదేశపు జనాభా ముప్పది మూడు కోట్ల మనిషి కొక్క దేవుత చొప్పున ఉన్నారని కవి భావన. హిందూ పురాణాలు మత విశ్వాసాలను జాషువా అతిశయించి ముప్పై మూడు కోట్ల దేవతలని చెప్పాడని కొందరి విమర్శ.

| | | |
|---|---|---|
| 20. లోభస్వాంతులు | = | లోభంతో కూడిన మనస్సులున్న వారు |
| పరమార్థములు | = | పరమాత్మకు సంబంధించిన |
| కైవల్యము | = | మోక్షము, ముక్తి మార్గాలు |
| తెరువుల | = | మార్గాలు |
| మహా + అపరాధి | = | గొప్ప నేరస్థుడు |
| వేదాంత రథము | = | ఉపనిషత్తుల గమనము |

**భావం :** లోభులైన గురువుల కుయుక్తులతో ముక్తి మార్గాన్ని బోధించు నెపంతో ప్రజలను గొప్ప నేరస్థులుగా నిరూపింతురు. వారి ప్రమేయం లేకుంటే వేదాంత రథం సాగదన్న భ్రమతో ఉంటారు.

**ప్రతిపదార్థ తాత్పర్యానికి రాదగిన పద్యం :**

| | | |
|---|---|---|
| 21. ఖగ సన్యాసిని | = | పక్షి జాతిలో సన్మార్గంలో సంచరించు దాన (గబ్బిలము) |
| ఒగి | = | చక్కగా |
| సంసారము దిద్దుకొంచును | = | సంసార బాధ్యతలు నిర్వహించుకుంటూ |
| కరము + అతి + ఉచ్ఛస్థితిన్ | = | మిక్కిలి అత్యున్నత మైన స్థితిలో |
| తూగుచున్ | = | విలసిల్లుతూ |
| పగలు + ఎల్లన్ | = | పగటి వేళల్లో |
| మునివృత్తి నుండి | = | సజ్జనుడైన మునిలా ఉండి |
| శర్వరీ వేళలన్ | = | రాత్రి సమయాల్లో |
| అనుకంపన్ | = | దయాగుణంతో |
| వగలిన్ + తూలు | = | బాధల దుఃఖాల్లో మునిగినట్టి |
| దరిద్రమూర్తుల | = | దరిద్రజనులను |
| సమ+అశ్వాసింపన్ | = | ఊరడించేందుకు |
| ఏతెంచితివే | = | వచ్చితివా ? |

| | | |
|---|---|---|
| అకలంకంబు + ఐన | = | కళంకంలేని |
| మర్యాదకున్ | = | గౌరవానికి |
| అర్హురాలివి | = | తగిన దానివి |

**భావం :** సన్మార్గమందు సంచరించు గబ్బిలమా ! నీవు నీ సంసార బాధ్యతలను గొప్పగా నవరించుకొంటూ విలసిల్లుతున్న ధన్యురాలవు. పగటి వేళలో సజ్జనుడైన మునిలా జీవిస్తావు. రాత్రి సమయాల్లో దయాగుణంతో బాధల్లో మునిగి తేలుతున్న దరిద్ర జనులను ఊరడించేందుకు వచ్చిన నీవు నిష్కళంకమైన మర్యాదకు అర్హురాలివని జాషువా ప్రశంసించారు.

| | | | |
|---|---|---|---|
| 22. | పక్షి కళ్యాణి | = | పక్షుల్లో శుభకరమైన గబ్బిలమా ! |
| | గిరులగుండాలు | = | కొండల గుండెలు |
| | కరిగి | = | కరిగి |
| | నిర్ఝరములు + అట్టులు | = | సెలియేళ్లలా |
| | ఉబుకుచున్నవి | = | పరుగెత్తుతున్నాయి |
| | దిశల | = | దిక్కుల్లో |
| | నన్ను + ఊఱడింప | = | నన్ను ఓదార్చేందుకు |
| | సోదర ప్రజలు | = | సాటి మానవుల |
| | కండ్ల | = | కళ్లనుండి |
| | కన్నీటి చుక్క | = | కన్నీటి బిందువు |
| | నిర్గహించునే | = | వెలికి రాదుగదా ! |

**భావం :** పక్షుల్లో శుభకరమైన గబ్బిలమా ! సోదర మానవుల కళ్ల నుండి నన్ను ఓదార్చేందుకు కన్నీటి చుక్కరాలుట లేదు. నా దుస్థితిని చూసి జాలితో కొండల గుండల కరిగి నన్నూరడించేందుకు సెలయేళ్లలా ఉబికి వస్తున్నాయన్నాడు. పేదవాళ్ళ పట్ల సాటి మానవాళికి సానుభూతి లేకున్నా, ప్రకృతికి పరిపూర్ణమైన సానుభూతి ఉందని జాషువా భావం.

**ప్రతి పదార్థ తాత్పర్యానికి ముఖ్యం :**

| | | | |
|---|---|---|---|
| 23. | ఓ పిట్టా ! | = | ఓ గబ్బిలమా ! |
| | వాలఖిల్యుల్ | = | వాలఖిల్యులనే ఋషుల (చెట్టుపై వ్రేలాడే సూక్ష్మ శరీరులు) |
| | ఇన తేజుల్ | = | సూర్యునితో సమానమైన తేజస్సు గలవారు |
| | యోద విద్యానిధుల్ | = | యోగ విద్యలో ప్రవీణులైనవారు |
| | పుట్టున్ + తాపసులు | = | పుట్టుక చేతనే తాపసులు |

| | | |
|---|---|---|
| ఆర్ద్ర చిత్తులు | = | దయతో కూడిన మనస్సు కలవారు |
| మహాత్ముల్ | = | గొప్పవారు |
| వైనతేయ స్తుతిన్ | = | గరుత్మంతుని ప్రార్థన చేత |
| చెట్టున్ + కొమ్మన్ | = | చెట్టుకొమ్మ తమ నివాసమైన |
| పరిత్యజించిన | = | విడిచిపెట్టినవారు |
| పరశ్రేయః | = | ఇతరుల శ్రేయస్సునీ |
| శుభకాంక్షల్ | = | శుభాన్నీ కోరేవారు |
| నీకు | = | నీకు |
| చుట్టాలేగదా ! | = | నీ బంధువులుకదా ! |
| నా విజ్ఞప్తిన్ | = | నా విన్నపాన్ని |
| ఆలింపన్ | = | వినుమా |
| నమస్కరించెదన్ | = | నీకు నమస్కరించెదను. |

**భావం :** గబ్బిలమా ! పుట్టుక చేతనే తాపసులు, సూర్యతేజో సంపన్నులు, యోగవిద్యా నిధులైన వాలఖిల్యులు నీకు చుట్టాలే గదా ! వారు చెట్టు కొమ్మపై వ్రేలాడే తపస్సంపన్నులు. దయార్ద్ర మనస్కులైన మహనీయులు గరుత్మంతుడు అమృతం తెచ్చేందుకు వెళ్లే సమయంలో అతని విన్నపాన్ని మన్నించి చెట్టు కొమ్మను పరిత్యజించిన పరశ్రేయోకాంక్షులు. వారు నీకు బంధువులైనందున నీవు నా విన్నపాన్ని విని ఉపకారం చేయమని వారిని అర్థించి నమస్కరించాడు.

| | | | |
|---|---|---|---|
| 24. | ప్రశాంత రాత్రి | = | ప్రశాంతమైన రాత్రి |
| | ఎల్లలోకంబులను | = | అన్నీ లోకాల్లో ఉన్న ప్రజలందరినీ |
| | బుజ్జగించి | = | ఓదార్చి |
| | ఔషధంబులేని | = | మందులేనట్టి |
| | అస్పృశ్యతా జాడ్య | = | అస్పృశ్యతా రోగపీడితుడైన |
| | మంద భాగ్య | = | దురదృష్టవంతుని |
| | నన్ను మఱచిపోయె | = | నన్ను మరచిపోయింది |

**భావం :** ప్రశాంతమైన ఈ రాత్రి లోకంలో ప్రజలందరినీ బుజ్జగించి నిద్రబుచ్చింది. మందులేనట్టి అస్పృశ్యతా రోగ పీడితుడైన తనను మరచి పోయిందని ఆవేదన చెందాడు. అస్పృశ్యుడైన దీనుడికి ఆకలి బాధ వల్ల నిద్ర పట్టలేదు. దురదృష్టవంతుడైన అస్పృశ్యుని ప్రశాంత రాత్రి మరచిపోయిందని కవి భావన.

| | | | |
|---|---|---|---|
| 25. | కర్మ సిద్ధాంతమున | = | కర్మ సిద్ధాంతం చేత (విధిరాత అనే భావన) |
| | నోరు కట్టి వేసి | = | నోరు మూయించి |
| | స్వార్థలోలురు | = | స్వార్థపరులైన దోపిడీదారులు |
| | నా భుక్తిన్ | = | నా ఆహారాన్ని |
| | అనుభవింత్రు | = | అనుభవిస్తున్నారు (తింటున్నారు) |
| | కర్మము + అననేమో | = | కర్మంటే ఏమిటో ? |
| | దానికి | = | ఆ కర్మకు |
| | ఈ కక్షయేమో | = | ఈ కక్ష ఎందుకో ? |
| | ఈశ్వరుని చేత | = | శివుని చేత |
| | ఋజువు చేయింపవు+అమ్మ | = | నిరూపించవమ్మా |

**భావం :** స్వార్ధపరులైన ద్రోహులు కర్మ సిద్ధాంతంతో నా నోరు మూయించి నా ఆహారాన్ని కబళిస్తున్నారు. కర్మమంటే ఏమిటో ? దానికి కక్ష ఎందుకో ? శివుని చేత ఆ కర్మ సిద్ధాంతాన్ని నిరూపించమని గబ్బిలాన్ని వేడుకున్నాడు.

| | | | |
|---|---|---|---|
| 26. | మౌనిఖగరాజ్ఞి | = | తపస్సంపన్నవైన గబ్బిలపు రాణీ |
| | ఆలయంబున | = | ఆలయంలో |
| | శివుని చెవి | = | శివుని చెవికి |
| | కొంత చేరువగన్ + ఉండు | = | కొంత దగ్గరగా ఉందువు |
| | నాదు జీవిత చరిత్ర | = | నా దైన్యమైన జీవిత చరిత్రను |
| | విన్నవింపుమా ! | = | శివునికి విన్నవింపుమని కోరాడు |

**భావం :** గబ్బిలపు రాణీ ఆలయంలో నీవు శివుని చెవికి దగ్గరలో ఉంటావు. పూజారి లేని సహాయంలో నా దైన్యమైన చరిత్రను శివునికి విన్నవించమని వేడుకున్నాడు.

**ప్రతి పదార్థ తాత్పర్యానికి రాదగిన పద్యం :**

| | | | |
|---|---|---|---|
| 27. | ఆ పూజారులు | = | ఆలయంలో అర్చకులు |
| | విన్న | = | నీవు చెప్పే నా చరిత్ర వింటే |
| | ప్రాయశ్చిత్తము | = | శిక్ష |
| | నీకు + అగున్ | = | నీకు జరుగుతుంది. |

| | | |
|---|---|---|
| ఈశానుడున్ | = | శివుడునూ |
| కోపించున్ | = | నిన్ను కోపిస్తాడు. |
| నీకున్ | = | నీకు |
| వివరింపన్ + ఏమిటికి | = | ఎక్కువగా వివరించపనిలేదు |
| నిశీధ స్త్రీకిన్ | = | రాత్రి అనే స్త్రీకి |
| వార్ధక్యమున్డాసె | = | చీకట్లు ముసిరినవి, |
| పెను + జడ | = | పెద్దదైన రాత్రి అనే స్త్రీ జాడ |
| తెల్లనైనది | = | తెల్లగా మారింది (చీకట్లు అలముకొన్నాయి) |
| నీ పొరుగు గూబల్ | = | నీ పొరుగు పిట్టలన్నీ |
| అఖేటక వ్యాపారంబు | = | మేతకై వెళ్ళి వేటాడి |
| ముగించి | = | ముగించుకొని |
| గూండ్లకున్ | = | తమ గుళ్లలోకి |
| పోయెడున్ | = | పోతున్నాయి |
| పొమ్ము | = | నీవు వెళ్లుము |

**భావం :** గబ్బిలమా ! ఆలయంలో పూజారులు నీవు నా చరిత్రను విన్నవించడం వింటే నీకు ప్రాయశ్చితము తప్పదు. ఈశ్వరుడు నిన్ను కోపిస్తాడు. ఇంత కంటే ఎక్కువ నీకు వివరించ పనిలేదు. రాత్రి అనే స్త్రీ జడలు తెల్లబారి వార్ధక్యాన్ని సూచిస్తున్నాయని అర్థం. నీ పొదగున నివసించే పిట్టలు మేతకు వెళ్ళి వేటాడి తమ పని ముగించుకొని గూళ్లకు చేరుకున్నాయి. నీవు కూడా తొందరగా వెళ్లమని కవి గబ్బిలానికి సూచించాడు.

28.

| | | |
|---|---|---|
| పసమించు | = | పటిష్టమైన |
| నీగరుత్తుల | = | నీ రెక్కలతో |
| విసిరి | = | విసిరి |
| శ్రమంబు + అడపి | = | తాపాన్ని పోగొట్టి |
| నన్నున్ | = | నన్ను |
| ప్రేమించిన | = | ప్రేమ భావంతో పరిచరించిన |
| నీ అసమ + ఉపకారంబునకున్ | = | నీ సాటిలేని ఉపకారానికి |
| పసదనము + ఇడలేక | = | తగిన కానుకలు ఇవ్వలేక |
| నే ఋణస్థుడన్ + ఐతిన్ | = | నేను బాకీపడితినని బాధపడ్డాడు. |

**భావం :** గబ్బిలమా ! నీ పటిష్టమైన రెక్కల బలిమితో నా తాపాన్ని పోగొట్టావు. నీవు చేసిన సాటిలేని ఉపకారానికి తగిన కానుక ఇవ్వలేక నేను బాకీ పడితినని అస్పృశ్యుడు ఆవేదనతో బాధపడ్డాడు.

| | | | |
|---|---|---|---|
| 29. | పక్షిణీ | = | గబ్బిలపు చాన ! |
| | నిక్కినిక్కినడువన్ | = | నిక్కినిక్కి నడుచుటకు |
| | నాకు ఉద్యోగ బలము లేదు | = | ఉద్యోగ బలం లేదు |
| | మెచ్చన్ + తగు | = | మెచ్చుకోదగ్గ |
| | నీ కళాశక్తిన్ | = | నీ కళా ప్రతిభను |
| | ఉచ్ఛరింప | = | ప్రశంసించుటకు |
| | ఖగసతీ | = | పక్షిరాణీ |
| | నాకున్ | = | నాకు |
| | కులము యోగ్యతలు లేవు | = | అర్హమైన కులం బలం లేదు |

**భావం :** గబ్బిలపు చాన ! నమస్కారాలతో నిక్కినిక్కి నడిచే ఉద్యోగబలం నాకు లేదు. మెచ్చుకోదగ్గ నీ కళాప్రతిభను మెచ్చుకొనేందుకు నాకు అర్హమైన కులం బలం లేదని అస్పృశ్యుడు గబ్బిలంతో తన అశక్తతను ఆవేదనతో చెప్పాడు.

| | | | |
|---|---|---|---|
| 30. | కొఱముట్టువలె | = | నిన్నొక సాధనంగా |
| | గణింప | = | లెక్కించుటకు |
| | భాగ్యవంతుడనుకాను | = | నేను సంపన్నుడను కాను |
| | దోసము+చూపి | = | నీలో తప్పులు చూపించి |
| | దొరతనము+చేయగా | = | పెత్తనం చెలాయించేందుకు |
| | మతస్థుడను కాను | = | క్రైస్తవ మత ప్రచారకుణ్ణి కాను |

**భావం :** స్వార్థంతో నిన్ను నేనొక సాధనంగా ఉపయోగించేందుకు కడుపు నిండిన భాగ్యవంతుణ్ణి కాదు. నీలో తప్పులు చూపించి నీతులు వల్లించి పెత్తనం చెలాయించేందుకు నేను క్రైస్తవ మత ప్రచారకుణ్ణి కాదని జాషువా మత ప్రచారకుల మనస్తత్వాన్ని ఆక్షేపించాడు.

**ప్రతిపదార్థ తాత్పర్యానికి ముఖ్యం :**

| | | | |
|---|---|---|---|
| 31. | గబ్బిలి పుచాన | = | గబ్బిలపు రాణీ ! |
| | మృగ పక్షిత్వ | = | జంతు, పక్షి సంబంధమైన |

| | | |
|---|---|---|
| విచిత్ర ధర్మముల్ | = | విచిత్రమైన ధర్మాలు |
| మూర్తిన్ | = | ఆకారంలో |
| దాల్చిన + అట్టి | = | ధరించినట్టి |
| నీమొగమున్ | = | నీ ముఖాన్ని |
| లోకము | = | ఈ లోకం |
| చూడదు | = | అశుభమని చూడదు |
| అట్టి శకునంబుల్ | = | అటువంటి శకునాలు |
| ప్రాత పట్టింపులున్ | = | పాతకాలపు నమ్మకాలు |
| ఈ పేదకు | = | ఈ పేదవాడికి |
| తగదు | = | తగినవి కావు |
| నాదు స్వాంతంబులో | = | నా మనస్సులో ఉన్న |
| దిగులున్ + బాపి | = | దుఃఖాన్ని తొలగించి |
| పినాకపాణికి | = | శివునికి |
| ఒక సందేశంబున్ | = | ఒక సందేశాన్ని |
| అందింతువా ? | = | అందించెదవా ? |

**భావం :** గబ్బిలపు రాణీ ! మృగ పక్షి వింత ధర్మాలు కలిగిన నీ ఆకారం విచిత్రమైంది. ఈ లోకం శకునాల పేరుతో నీ ముఖాన్ని అశుభమని చూడదు. పేదవాడినైన నాకు పాత పట్టింపులు లేరు. నా మనస్సులో దుఃఖాన్ని తొలగించి శివునికి నా సందేశాన్ని అందింతువా అని దయనీయంగా అర్థించాడు. లోకంలో జనులు గబ్బిలాన్ని అశుభ సంకేతంగా ఈసడిస్తారు. పేదవాడైన దళితుడి గబ్బిలమే మంగళకరమైన ఆత్మ బంధువు. అందుకే తనకు పాతశకునాల పట్టింపులు లేవన్నాడు. తన విన్నపాన్ని శివునికి అందించమని అర్థించాడు.

| | | | |
|---|---|---|---|
| 32. | ధర్మమునకు | = | ధర్మానికి |
| | పిఱికితనము + ఎన్నడును లేదు | = | ఎప్పుడు పిఱికితనంలేదు |
| | సత్యవాక్యమునడన్ | = | సత్యం వాక్యానికి |
| | చావులేదు | = | మరణమన్నది లేదు |
| | విశ్వనాథుని మ్రోల | = | శివుని ఎదుట |
| | వెఱవన్+ఏల | = | నీవు భయపడవలసిన పనిలేదు |

| | | |
|---|---|---|
| తాను | = | ఆ శివుడు |
| సృష్టికర్త | = | సృష్టికర్త |
| ఈవు | = | నీవు |
| సృష్టివి | = | ఆయన సృష్టిలో జీవివి |

**భావం** : ధర్మం ఎప్పుడూ స్థిరంగా ఉంటుంది. అది పిరికితనంతో చలించదు. మార్పు చెందదు. సత్య వాక్యానికి చావుండదు. కలకాలం సజీవంగా ఉంటుంది. గబ్బిలమా ! పరమ శివుడు సృష్టికర్త. నీవు ఆయన సృష్టిలో జీవివి. ఆయన సన్నిధిలో నీకు భయం ఎందుకు అని జాషువా గబ్బిలానికి ఆత్మస్థైర్యాన్ని ప్రబోధించాడు.

**ప్రతి పదార్థ తాత్పర్యానికి ముఖ్యమైన పద్యం :**

| | | | |
|---|---|---|---|
| 33. | పరోపకారిణి | = | పరోపకార బుద్ధి గల గబ్బిలమా |
| | నరునకు చేరరాని | = | నరులు సమీపించలేని |
| | సదనంబున | = | నివాసాన |
| | వాసము + చేయున్ | = | నివసించినట్టి |
| | ఈశ్వర + ఈశ్వరునకు | = | పరమేశ్వరునకు |
| | నానమస్కృతులు | = | నా నమస్కారాలు |
| | ఉపాయనము + ఇమ్ము | = | కానుకగా సమర్పించుము |
| | కారణ + అంతరముల | = | కారణాంతరాల చేత |
| | ఒకవేళ | = | ఒకవేళ |
| | వెండి పర్వతమునన్ | = | కైలాసంలో వెండి కొండపై |
| | నివసించుచున్ + ఉన్న | = | నివసిస్తున్న |
| | పక్షి సుందరి | = | పక్షిసుందరివైన గబ్బిలమా ! |
| | నీకున్ | = | నీకు |
| | ఇది | = | ఇది |
| | ఒక పూట మానము కదా ! | = | ఒక్క పూట ప్రయాణమే కదా ! |

**భావం** : పరోపకారిణివైన గబ్బిలమా ! నరునకు చేరరాని నివాసంలో నివసిస్తున్న పరమేశ్వరుడునకు నా నమస్కారాలను కానుకగా ఇమ్ము. కారణాంతరాల చేత ఒకవేళ కైలాసంలో వెండికొండపై ఉన్నా, నీకది ఒక్క పూట ప్రయాణమే కనుక వెళ్లి నా విన్నపాన్ని అందించమని జాషువా కోరాడు.

**ప్రతిపదార్థ తాత్పర్యానికి ముఖ్యమైన పద్యం :**

| | | | |
|---|---|---|---|
| 34. | గౌరీనాథుండు | = | గౌరీ దేవి భర్తయైన శివుడు |
| | కాశికిన్ + చనెడు | = | కాశీకి వెళ్లే |
| | మార్గంబు + అందురా | = | దారిలోకి రాగా |
| | మేఘపున్ + పొఅన్ | = | మేఘాల పొగల్లో |
| | చుక్కల తోటు నాటుకొని | = | నక్షత్రాల సమీపాన |
| | మింటన్ + నీకున్ | = | ఆకాశమందు నీకు |
| | కన్పట్టుదారిన్ | = | కనిపించే దారిలో |
| | పొమ్ము | = | వెళ్లుము |
| | ఒక వేళన్ | = | ఒక సమయంలో |
| | భూతస్వామినిన్ | = | శివుని |
| | నీకున్ | = | నీకు |
| | చత్వారంబు + ఏరపడి | = | కంటి చూపు మందగించి |
| | భానుడు + ఏతెంచినన్ | = | సూర్యుడు ప్రకాశించగా |
| | దారిన్ + తప్పెదవుగదా | = | దారి తప్పవుగదా ! |

**భావం :** గబ్బిలమా ! నీవు కాశీకి వెళ్లే దారిలో శివుడు మేఘాల పొగల్లో చుక్కల తోట సమీపాన కనిపిస్తాడు. సూర్యుడి ప్రకాశం వల్ల నీకు కంటి చూపు మందగించి దారి తప్పవుగదా ! అని జాషువా సంశయాత్మకంగా ప్రశ్నించాడు.

| | | | |
|---|---|---|---|
| 35. | ఛత్రముల వంటి | = | గొడుగుల వంటి |
| | నీలి పక్షములు | = | నల్లని రెక్కలు |
| | విచ్చి | = | వికసింపజేసి |
| | బ్రహ్మాండమునన్ | = | భూగోళమందు |
| | పయనించువేళ | = | ప్రయాణించే సమయంలో |
| | జలధర స్వామి | = | మేఘుడు |
| | చిత్తజల్లులు | = | చిత్తకార్తెలో కురిసే ఆహ్లాదమైన నీటి తుంపరులు |
| | ముమ్మాయి ముత్తియములు | = | అతివయించిన ముత్యాల జల్లులు |

| | | |
|---|---|---|
| నీమదన్ | = | నీపై |
| చల్లన్ + కలడు | = | చల్లును |

**భావం :** గబ్బిలమా ! విశాలమైన గొడుగుల వంటి నల్లని నీ రెక్కలు విప్పి బ్రహ్మాండంలో సంచరించే సమయంలో మేఘుడు నీపై ఆహ్లాదకరమైన చిత్త జల్లులు వంటి ముత్యాల తుంపరులు ముమ్మరంగా చల్లి ఆనందాన్ని కలిగిస్తాడు.

| | | | |
|---|---|---|---|
| 36. | మెలక సంధ్యారాగమున | = | సంధ్యా సమయపు లేత కాంతులు |
| | కెంపులు + ఎగజిమ్మ | = | కెంపుల వంటి కాంతులు ప్రసరించగా |
| | చరమ + అచలంబున | = | సూర్యుడు అస్తమించు పడమటి కొండపై |
| | చరణము + ఊది | = | నీ పాదాలు మోపి |
| | సెలయేటి నీటన్ | = | ఆకాశ గంగలో |
| | ఈతలు గొట్టి | = | ఈతలు కొట్టి |
| | విహరించు | = | విహరించునట్టి |
| | మదత్ + అంకురములు | = | చల్లని పిల్ల గాలులు తుంపరులు |
| | సన్మానము + అంది | = | సన్మానాన్ని అందుకొని |
| | కొండ కొమ్మలన్ | = | పర్వత శిఖరాల |
| | ఎదుర్కొని | = | ఢీ కొని |
| | తునియలు + తునియలైన | = | ముక్కలు ముక్కలైన |
| | తోయదమ్ముల మీద | = | నీటి తుంపరల మీద |
| | తుఱగలించి | = | ప్రకాశించి |
| | కలహంస | = | రాజహంస |
| | ఒన్నేటి జాంగలంబులమీద | = | ఆకాశగంగ పరిసరాల్లో |
| | చిలుకలు + ఎంగిలింపన్ | = | చిలుకలు కొరికిన |
| | చిటిల తేనియల్ + ఊరు | = | మకరందం జాలువారునట్టి |
| | స్వాదు ఫలములు | = | మధురమైన పండ్లు |
| | ఎలిమిన్ + ఆరగించి | = | సంతోషంగా తిని |
| | ఖగవధూటీ | = | గబ్బిలపు యువతీ |
| | కుటిల సంసారంబు | = | కుటిలమైన సంసారపు బాధలు |

| | | |
|---|---|---|
| కొన్నినాళ్లపాటు | = | కొన్ని రోజులు |
| మరచిరమ్ము | = | మరచిరమ్ము |

**భావం :** గబ్బిలపు యువతీ ! సంధ్యా కాలపు లేత కాంతి కెంపుల్లా ప్రసరించే అస్త్రాద్రిపై నీ పాదాలు మోపి విహరించిన పిదప ఆకాశ గంగలో ఆహ్లాదకరమైన పిల్లగాలుల తుంపరుల సన్మానాన్ని అందుకొమ్ము. పర్వత శిఖరాలను ఢీ కొని ముక్కలై ప్రకాశించి ఆకాశ గంగ ప్రాంతాల్లో విహరించు మకరందం జాలు వారే మధుర ఫలాలను తిని కొన్నాళ్ల పాటు కుటిలమైన సంసార బాధలను మరచిరమ్ము అని కవి గబ్బిలాన్ని కోరాడు.

| | | | |
|---|---|---|---|
| 38. | సాత్విక + ఆహారిణీ | = | సాత్త్వికమైన శాఖాహారాన్ని స్వీకరించు గబ్బిలమా ! |
| | తపశ్చర్యకతన | = | తపోదీక్ష వల్ల |
| | నీమనంబున | = | నీ మనసునందు |
| | జాలివెన్నెల రహించు | = | జాలి అనే వెన్నెల ప్రసరిస్తుంది |
| | నాదు కన్నీటి కథ | = | దుఃఖభరితమైన నా కథను |
| | సమన్వయము + చేయు | = | సమన్వయించేందుకు |
| | అర్ద్ర హృదయంబున్ + కూడ | = | జాలితో కూడిన మనసు |
| | కొంత + అవసరంబు | = | కొంత అవసరమైందే |

**భావం :** సాత్త్విక శాఖాహారివైన గబ్బిలమా ! తపోదీక్ష వల్ల నీ మనసులో జాలి అనే వెన్నెల ప్రసరిస్తుంది. దుఃఖ భరితమైన నా కన్నీటి కథను సమన్వయించేందుకు జాలి మనస్సు, మానవతాదృష్టి నీలో ఉన్నందున నీకు నా సందేశాన్ని తీసుకెళ్లేందుకు అర్హురాలివని జాషువా గబ్బిలాన్ని ప్రశంసించాడు.

| | | | |
|---|---|---|---|
| 39. | పుల్గు దొరసానివి | = | పక్షుల్లో రాణివి |
| | బిడ్డలన్ + కని | = | బిడ్డలనుకని |
| | పాలు + ఇచ్చెడ | = | పాలిచ్చి పెంచే |
| | దొడ్డతనంబు + ఉన్న | = | ఔదార్యం ఉన్న పక్షి రాణివి |
| | నాకు + అడ్డుపడి | = | నా బాధలను అడ్డుకొనే |
| | వేయిపు గిడ్డివి | = | కామధేనువు వంటి దానివి |
| | నా మనవిన్ | = | నా విన్నపాన్ని |
| | ఆలంకం చెదవు గదా ! | = | విందువు కదా |

**భావం :** బిడ్డలకు పాలిచ్చి పెంచే ఉదాత్తమైన పక్షి రాణివినీవు నా బాధలను తొలగించేందుకు వచ్చిన కామధేనువు వంటిదానివి నా విన్నపాన్ని ఆలకిస్తావు గదా ! అని కవి వేడుకున్నాడు.

**ప్రతిపదార్థ తాత్పర్యానికి ముఖ్యం :**

| | | | |
|---|---|---|---|
| 40. | ఓపుల్గు పుణ్య + అంగనా ! | = | ఓ పుణ్యమైన గబ్బిలపు చాన ! |
| | నీ + ఔదార్యగుణంబు | = | ఉదాత్తమైన నీ ఉదారగుణం |
| | ఆయుష్మంతులు | = | చిరంజీవులైన |
| | నీ కుమారులు | = | నీ పిల్లలు |
| | మగండు + అంగీకృతిన్ + చూపి | = | నీ భర్త అంగీకరించిన |
| | నీవు | = | నీవు |
| | ఎత్తైననగంబు కొమ్ముల | = | కైలాస పర్వత శిఖరాల్లో |
| | విహాయస + ఈశున్ | = | నివసించునట్టి శివుని |
| | ఆవాసమందు + ఊయలూగి | = | నివాసంలో విహరించి ఉయ్యాలలూగి |
| | కృతార్థురాలవు + అయి | = | ధన్యురాలవై |
| | రమ్ము | = | తిరిగిరమ్ము |

**భావం :** ఓ పుణ్యమైన గబ్బిలపు చాన ! ఉదాత్తమైన నీ ఔదార్య గుణాన్ని నీ పిల్లలు, భర్త అంగీకరించారు. నీవు కైలాస పర్వత శిఖరాల్లో శివుడి నివాసంలో విహరించి ఉయ్యాలలూగి ధన్యురాలవై తిరిగి రమ్మని కవి కోరాడు.

**డా॥ పి.వి. సుబ్బారావు**
రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్ &
తెలుగు శాఖాధిపతి
సి.ఆర్. కళాశాల, చిలకలూరిపేట.

యూనిట్ - 3

పాఠం - 6

# జాషువా గబ్బిలం

(రెండవ పాఠం)

- డా॥ పి.వి సుబ్బారావు

## 6.1. గబ్బిలం పాఠ్యభాగ సారాంశం :

దీనుడైన పంచముడు తనకు లభించిన స్వల్ప ధనంతో తృప్తి పడే అమాయకుడు. బొక్కెడు బువ్వతో కష్టాలన్నింటినీ మరచిపోయే అల్ప సంతోషి. ఆకలి బాధతో నానాటికి దహించుకుపోతున్న బడుగు జీవి. భారత భూమికి కడగొట్టు బిడ్డడుగా జన్మించిన ఈ అరుంధతీ సుతుడు నాలుగు దిక్కులున్న ఈ లోకంలో ఏ దిక్కు లేనివాడుగా పుట్టాడు. లేత వయస్సులో వలస పోయిన తెలుగు కవితకు ఆశ్రయమిచ్చిన రఘునాథ భూపాలుడు తంజావూరు ప్రాంతాన్ని పరిపాలిస్తున్నపుడు తంజావూరికి దక్షిణ దిక్కున ఆ గర్భ దరిద్రుడైన నీతిమంతుడు కాపురమున్నాడు.

ఆ అభాగ్యుని కులాన్ని, కలిమిని, అతడి దేహాన్ని పీల్చి పిప్పి చేసినా భారత వీరుని పాదాలు కందకుండా వారికి చెప్పులు కుట్టి జీవనం గడుపుతున్నాడు. ఏనాడు తన వృత్తిని ఎవ్వరి విషయంలోనూ తిరస్కరించని వాడు. భరతభూమి వీని సేవకు అప్పు పడ్డది. అతడు అపకారికి కూడా ఉపకారం చేసే సజ్జనుడు, పంచముడని కవి భావన :

అతడి రెక్కల కష్టం లేనినాడు పంటలు పండవు. వాడు చెమటోడ్చి ప్రపంచానికి భోజనం పెడతాడు. వాడికి భోజనానికి గతిలేదు. అతడి తల మీద సమాజం పంచముడు అనే బురదను పులిమింది. ఆ బురదను కడిగి కరుణించేందుకు ఆకాశ గంగకు కూడా అసాధ్యంగా ఉంది. అతడి నైవేద్యం వల్ల అంటువడితే త్రిమూర్తులకు కూడా నైవేద్యం ఉండదు. పాముకు పాలు, చీమకు పంచదార వేసే కర్మ భూమిలో ప్రాచీన ధర్మ దేవతకు కూడా వీడి వల్ల అంటుపడతాననే భయంతో ఉలికిపడుతుంది. వాడిని ఉద్ధరించే భగవంతుడే లేడు. మనుష్యులు కనికరిస్తారనుకోవడం కల్ల. అతడు చేసుకున్న పాపం పంచముడిగా పుట్టడమనే బాధ.

ఆ అభాగ్యని రక్తం త్రాగి దరిద్ర దేవత తాండవిస్తుంది. నాల్గుపడగల హైందవ నాగరాజు అతడి ఉనికి అంటేనే కసరి బుస కొడుతున్నాడు.

సమాజ స్థితిలో ఈసడించబడే పంచముడు "కులం లేని నేను కొడుకులను పుట్టించి ఈఅఖాతంలో త్రోయడమెందుకన్న భావంతో ఆలోచించి పెళ్లి చేసుకోవడం మానేసి బ్రహ్మచర్యం దీక్షతో ఉన్నాడు.

ఉదయం నుండి రక్తం ధారవోసి కష్టించి సాయంత్రానికి ఇంటికి చేరుకొని ఉన్న గంజి త్రాగి ఆ పేదవాడు కుక్కిపడక మీద పడుకొన్నాడు. భూమండలమంతా చిమ్మ చీకట్లు కమ్మకొన్న స్థితిలో ముక్కు మొగమున్న చీకటి ముద్దలా గబ్బిలమొకటి అతడి కుటీరంలో ప్రవేశించి దాని రెక్కలతో అతడింట్లో వెలిగే ఆముదపు దీపాన్ని ఆర్పి వేసింది. గబ్బిలాన్ని చూడగానే అతని మనసులో కొత్త ఊహలు అంకురించాయి. స్నేహ భావంతో గబ్బిలానికి తన గోడును విన్నవించుకుంటూ బాధతో బడలిన బడుగు జీవులకు మదోన్మత్త ప్రపంచంలో పులుగులు పుట్రలు కాక ఆప్తులైన చుట్టపక్కాలుండరని కవి భావన. అందుకే వేడి

కన్నీటి జాలుతో అతడి వేదనను గబ్బిలానికిని వేదించుకున్నాడు. గొప్ప గొప్ప దేవాలయాల్లో నివసిస్తూ గౌరవాన్ని పొందుతున్న గబ్బిలాల రాణికి స్వాగతం పలికాడు. మావంటి వారికి లేని గొప్ప మర్యాద పొందుతున్న ధన్యురాలివి నీకూ, తల్లక్రిందులుగా తపస్సు చేసే నీ సంతతతికీ, గుడి గోపురాలకు శుభమే కదా ! అని కుశల ప్రశ్నలు వేశాడు.

భూ మండలమంతా గాఢ నిద్రలో ఉన్న కాళరాత్రి వేళ నీకు నీ యింట్లో ఎంత వెదికినా ఆనందం లేశమైన లభించిన చోటుకు నీవెందుకు ప్రవేశించావని ప్రశ్నించాడు. అంటరానివాడిగా నన్ను బహిష్కరించిన ఈ లోకం నాయింట ప్రవేశించిన నిన్ను కూడా బహిష్కరిస్తుంది. గుళ్లు, గోపురాలన్నింటిలో ప్రసాదాలారగించే ధన్యురాలువు నీవు. తిండి లేని ఈ పేద వాడింట్లో ప్రవేశించి ప్రయోజనం లేదు గదా ! అన్నాడు. ఈ లోకం హృదయం లేనిది, సనాతన ధర్మ ధేనువులు పితికిన పాలు పేదలకు లభించవు. ఈ విషయాన్ని బ్రహ్మాది దేవతా ప్రముఖులెవ్వరూ పెదవి విప్పి మాట్లాడరు.

భారతదేశంలో బొమ్మల పెళ్లిళ్లు చేయడానికి వందలు, వేలు వ్యయించేందుకు వెనుకాడరు. పేదల, బడుగు జీవుల భిక్షా పాత్రల్లో మెతుకు రాల్చరు. ముప్పై మూడు కోట్ల దేవతలున్న దేశంలో పేదవారి ఆకలి బాధలు చల్లారవని కవి ఆవేదన.

లోభులు, స్వార్థపరులైన దొంగ గురువులు ముక్తి మార్గాన్ని బోధిస్తామని ప్రలోభపెడతారు, కుయుక్తులతో మహాపరాధిగా తీర్మానిస్తారు. వారు లేకుంటే ఆధ్యాత్మిక భావం సాగదని వారి భావన.

సన్మార్గమందు సంచరించు గబ్బిలమా ! నీ సంసార బాధ్యతలను ఉన్నతమైన స్తితిలో సవరించుకొంటున్న ధన్యురాలవు. పగటి వేళల్లో సజ్జనుడైన మునిలా జీవిస్తావు. రాత్రి వేళల్లో దయార్ద్ర హృదయులై బాధల్లో మునిగితేలెడి దరిద్రజనులను ఊరడించేందుకు వచ్చిన నీవు నిష్కళంకమైన మర్యాదకు అర్హురాలవు.

పక్షుల్లో శుభకరమైన గబ్బిలమా ! నన్ను ఓదార్చేందుకు సోదర మానవుల కళ్ల నుండి కన్నీటి చుక్కరాలుటలేదు. నా దుస్థితికి చలించి జాలితో కొండల గుండెలు కరిగి నన్నూరడించేందుకు సెలయేళ్లలా ఉబికి వస్తున్నాయన్నాడు. పేదవాళ్ల పట్ల సాటి మానవులకు సానుభూతి లేకున్నా, ప్రకృతికి పరిపూర్ణమైన సానుభూతి ఉందని కవి భావన.

పుట్టుక చేతనే తాపసుల, సూర్యతేజో సంపన్నులు, యోగవిద్యానిధులైన సూక్ష్మ శరీరులు వాలఖిల్యులు నీకు చుట్టాలేగదా! వారు చెట్టు కొమ్మపై వ్రేలాడే తపస్సంపన్నులు. దయార్ద్ర హృదయులైన వారు గరుత్మంతుడే అమృతాన్ని తెచ్చేందుకు వెళ్లే సమయంలో అతని విన్నపాన్ని మన్నించి చెట్టు కొమ్మను పరిత్యజించిన పరహితైషులు. వారు నీకు బంధువులైనందున నీవు విన్నపాన్ని మన్నించి ఉపకారం చేయమని గబ్బిలాన్ని అర్థించాడు.

ఈ ప్రశాంతమైన రాత్రి లోకంలో ప్రజలందరినీ బుజ్జగించి నిద్రపుచ్చింది. మందు లేనట్టి అస్పృశ్యతా రోగ పీడితులనైన నన్ను మరచిపోయిందని బాధపడ్డాడు. అస్పృశ్యుడికి ఆకలి బాధ వల్ల నిద్ర పట్టలేదు. దురదృష్టవంతుడైన తనను ప్రశాంత రాత్రి పట్టించుకోలేదని మరచిపోయిందని కవి భావన. స్వార్థపరులైన ద్రోహులు కర్మ సిద్ధాంతంతో నా నోరు మూయించి నా ఆహారాన్ని కబళిస్తున్నారు. కర్మమంటే ఏమిటో ? దానికీ కక్ష ఎందుకో ? శివుడి చేత ఆ కర్మ సిద్ధాంతాన్ని నిరూపించమని గబ్బిలాన్ని వేడుకున్నాడు.

ఆలయంలో నీవు శివుని చెవికి దగ్గరలో ఉంటావు. పూజారి లేని సమయంలో నా దైన్యమైన చరిత్రను శివునికి విన్నవించమని గబ్బిలాన్ని అర్థించాడు. ఆలయంలో పూజారులు గమనిస్తే నీకు ప్రాయశ్చితము తప్పదు. ఈశ్వరుడు కూడా కోపిస్తాడు. ఇంతకంటే ఎక్కువగా నీకు వివరించవలసిన పనిలేదు. రాత్రి చీకట్లు విస్తరిస్తున్నాయి. రాత్రి అనే స్త్రీ పెద్ద జడలు తెల్లబారి వార్ధక్యాన్ని సూచిస్తున్నాయి. నీ పొరుగున నివసించే పిట్టలు మేతకు వెళ్లి వేటాడి తమ పని ముగించుకొని గూళ్లకు చేరుతున్నాయి. నీవు కూడా తొందరగా వెళ్లమని గబ్బిలానికి సూచించాడు.

పటిష్టమైన నీ రెక్కల బలిమితో విసిరి ప్రేమతో నా తాపాన్ని పోగొట్టావు. నీవు చేసిన గొప్ప ఉపకారానికి బదులుగా తగిన కానుక ఇవ్వలేక నేను నీకు బాకీపడితిని అని బాధపడ్డాడు. నమస్కారాలతో నిక్కినిక్కి నడిచే ఉద్యోగ బలం నాకు లేదు. నీ కళా ప్రతిభను మెచ్చుకొనేందుకు అర్హమైన కులం నాకు లేదని తన అశక్తతను గబ్బిలానికి చెప్పుకున్నాడు. స్వార్థంతో నిన్నొక సాధనంగా ఉపయోగించుకొనేందుకు నేను కడుపు నిండిన భాగ్యవంతుణ్ణి కాదు. నీలో తప్పులు చూపించి నీతులు వల్లించి పెత్తనం చెలాయించేందుకు క్రైస్తవమత ప్రచారకుణ్ణి కాదని, మత ప్రచారకుల మనస్తత్వాన్ని అధిక్షేపించాడు. మృగ పక్షి వింత ధర్మాలు కలిగిన నీ ఆకారం విచిత్రమైంది. ఈ లోకం శకునాల పేరుతో అశుభమని నీ ముఖాన్ని చూడదు. పేదవాడినైన నాకు పాతకాలపు పట్టింపులు లేవు. నా మనస్సులో దుఃఖాన్ని తొలగించి శివుడికి నా సందేశాన్ని అందించమని అర్థించాడు.

ధర్మానికి పిరికి తనంలేదు. ఎప్పుడూ స్థిరంగా ఉంటుంది. సత్య వాక్యానికి చావులేదు. కలకాలం సజీవంగా ఉంటుంది. పరమ శివుడు సృష్టికర్త. ఆయన సృష్టిలో నీవు జీవివి. ఆయన సన్నిధిలో నీకు భయమెందుకు ? ధైర్యంగా నా సందేశాన్ని అందించమని ప్రబోధించాడు. నరులకు చేరరాని నివాసంలో నివసిస్తున్న పరమేశరునకు నా నమస్కారాలను కానుకగా అందించు కారణాంతరాల చేత అతడు కైలాసంలో వెండి కొండపై ఉన్నా నీ కది ఒక్క పూట ప్రయాణమే కనుక అక్కడకు వెళ్లి నా విన్నపాన్ని వినిపించమని కోరాడు. నీవు కాశీకి వెళ్లే దారిలో శివుడు మేఘాల పొగల్లో చుక్కల తోట సమీపాన కనిపిస్తాడు. సూర్య కాంతి తీవ్రత వల్ల నీకు కంటి చూపు మందగించి దారి తప్పవు గదా ! అని సంశయాత్మకంగా గబ్బిలాన్ని ప్రశ్నించాడు. విశాలమైన పెద్ద గొడుగుల వంటి నీ నల్లని రెక్కలు విప్పి బ్రహ్మాండంలో సంచరించే సమయంలో మేఘుడు నీపై ఆహ్లాదపు చిత్తజల్లులు వంటి ముత్యాల తుంపరులు ముమ్మరంగా చల్లి ఆనందం కలిగిస్తాడు.

సంధ్యాకాలపు లేత కాంతులు కెంపుల్లా ప్రసరించే అస్తాద్రిపై విహరించిన పిదప ఆకాశంలో ఆహ్లాదకరమైన చల్లని పిల్లగాలులు తుంపరుల సన్మానాన్ని అందుకొమ్ము. ఆకాశ గంగ ప్రాంతాల్లో మకరందం జాలు వారే మధుర ఫలాలను తిని కొన్నాళ్లపాటు కుటిల సంసార బాధలను మరచి రమ్మని గబ్బిలాన్ని కోరాడు.

సాత్విక శాఖాహారివైన నీ తపోదీక్ష వల్ల నీ మనసులో జాలి గుణం ఉంటుంది. దుఃఖ భరితమైన నా కన్నీటి కథకు సమన్వయించేందుకు నీ వంటి జాలితో కూడిన మనసు కొంత అవసరం. నా సందేశాన్ని శివుడికి అందించేదుకు నీవు అర్హురాలివని ప్రశంసించాడు. ఉదాత్తమైన నీ ఔదార్య గుణాన్ని పిల్లలు, నీ భర్త అంగీకరించారు. కనుక నీవు కైలాస పర్వత శిఖరాల్లో శివుడి నివాసంలో విహరించి ఉయ్యాలూగి ధన్యురాలివై తిరిగి రమ్మని కవి గబ్బిలాన్ని కోరాడు.

## 6.2. గబ్బిలం పాఠంలో ప్రశ్నలు :

**1. జాషువా గబ్బిలం కావ్యంలో పంచముడి దుస్థితిని వర్ణించిన విధాన్ని వివరించండి ?**

జవాబు : ప్రసిద్ధ ఆధునిక కవి జాషువా స్వానుభవం నుండి పుట్టిన కావ్యం గబ్బిలం. బాల్యం నుండి ఆయన అనుభవించిన అంటరాని తనమునే జాఢ్యాన్ని పారద్రోలాలన్న సంస్కరణ దృక్పథంతో గబ్బిలం కావ్యాన్ని రచించాడు. కుతకుత ఉడికిన ఆయన హృదయం నుండి అర్ద్రతా వేదనతో వెలికివచ్చిన కావ్యం గబ్బిలం. అంటరానితనాన్ని ఘోరమైన దురాచారంగా చాటి చెప్పిన కావ్యాల్లో గబ్బిలం శ్రేష్టమైంది. భారతీయ భాషల్లో అంటరానితనాన్ని గురించి వచ్చిన కావ్యాల్లో గబ్బిలం విశిష్టమైందని విజ్ఞులైన విమర్శకుల అభిప్రాయం.

సంఘంలో పంచముడిగా, అంటరానివాడిగా పరిగణింపబడి బాధలకు గురిఅవుతున్న అభాగ్యుడు. తనకు లభించిన కొద్ది ధనంతో తృప్తి పడే అమాయకుడు. బొక్కెడు బువ్వతో తన కష్టాలన్నింటినీ మరచిపోయే అల్పసంతోషి. ఆకలి బాధతో

నానాటికి దహించుకుపోతున్న బడుగు జీవి. భారతభూమికి కడగొట్టు బిడ్డడిగా జన్మించినవాడు. చాతుర్వర్ణ వ్యవస్థలో నాలుగు వర్ణాల తర్వాత వాడు పంచముడు. సహజంగా కడగొట్టు బిడ్డడి ముచ్చటగా పెంచే స్థితి సంఘంలో ఉంది. కాని ఇక్కడ నీచంగా చూడబడేవాడు పంచముడన్న వ్యంగ్యం ధ్వనిస్తుంది. నాలుగు దిక్కులున్న ఈ లోకంలో ఏ దిక్కు లేనివాడిగా పుట్టాడు. లేత వయస్సులో వలస పోయిన తెలుగు కవితకు ఆశ్రయమిచ్చి ఆదరించిన రఘునాథ భూపాలుడు పరిపాలించే తంజావూరు మండలంలో దక్షిణ దిక్కునున్న భూముల్లో ఆ అభాగ్యుడు నీతిమంతుడై కాపురముంటున్నాడు.

ఆగర్భ దరిద్రుడైన అతడి కులాన్ని కలిమిని దొంగిలించి అతడి దేహాన్ని పిప్పి చేసిన భారత వీరుల పాదాలు కందకుండా వారికి చెప్పులు కుట్టి జీవనం గడుపుతున్నాడు. ఏనాడూ తన వృత్తిని ఎవ్వరి విషయంలోనూ తిరస్కరించని వాడు. భారతభూమి వీని సేవకు అప్పుపడ్డది. అపకారికి కూడా ఉపకారం చేసే సజ్జనుడు పంచముడన్న విషయాన్ని ఇచ్చట కవి సూచించాడు. అతడి రెక్కల కష్టంలేనినాడు పంటలు పండవు. అతడు చెమటోడ్చి ప్రపంచానికి భోజనం పెట్టే ఉదారుడు. అయినా వాడికి భోజనానికి గతిలేదు.అతడి తల మీద సమాజం పంచముడు అనే బురద పులిమింది. ఆ బురదను కడిగి కరుణించేందుకు ఆకాశ గంగకు కూడా అసాధ్యంగా ఉంది. అతడి నైవేద్యం వల్ల అంటువడితే త్రిమూర్తులకు కూడా నైవేద్యం ఉండదు.

పాముకు పాలు, చీమకు పంచధార పెట్టే ఈ కర్మ భూమి ఇతడిని కాల్చుకు తింటుంది. పంచముడిగా జన్మించడం తప్ప అతడు చేసిన పాపమేమీలేదు. అస్తవ్యస్థమైన ఈ వ్యవస్థలో పంచమ వర్ణాన్ని సృష్టించిన వంచకులను జాషువా గర్హించాడు. ధర్మదేవత కూడా వీడంటే ఉలికిపడుతుంది. వాడిని ఉద్ధరించే భగవంతుడే కన్పించడం లేదు. మానవులు అతడిని కరుణించి కనికరిస్తారన్న ఆశ అసలే లేదు.

ఆ దరిద్రుడి రక్తం త్రాగి విలయతాండవం చేస్తుంది దరిద్ర దేవత. అతడి గాలి సోకితే నాల్గుపడగల హైందవ నాగరాజు కసరి బుస కొడుతున్నాడు. హిందూ మతంలోని నాలుగు వర్ణాల నాలుగు పడగలకు ప్రతీకగా జాషువా చెప్పాడు. నాలుగు వర్ణాల వారు కూడా కసరికొడుతున్నారన్న ఆవేదన వ్యక్తం చేశాడు.

దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తున్న అతడు పుట్టు బానిసగా కులం లేని తనంతో కుమిలిపోతున్న స్థితిలో పెళ్లి చేసుకొని కొడుకులను పుట్టించి ఈ అంటరాని తనమనే గొయ్యిలో నెట్టుటమెందుకని ఆలోచించి, పెళ్లి మానుకొని బ్రహ్మచర్య దీక్షను కొనసాగిస్తున్నాడన్న భావన మనసున్న వారిని కదిపేట్లుగా ఉంది.

ఉదయం నుండి సాయంత్రం వరకు రక్తం ధారవోసి కష్టించిన ఆ శ్రమజీవి ఇల్లు చేరుకొని తన దుస్థితి ఆలోచించ సాగాడు.

జాషువా సాంఘిక విప్లవాన్ని కోరి సంస్కరణ దృక్పథంలో గబ్బిలం కావ్యం రచించాడు. గాంధేయవాదిగా, అహింసా సిద్ధాంత ప్రియుడిగా గాంధీజీ బోధించిన ధర్మ కర్తృత్వ సిద్ధాంతాన్ని ఆయన విశ్వసించాడు. సంఘంలో ధనికులు, అధికులైన వారిలో హృదయ పరివర్తన కల్గి పేదలు, బలహీనులు, అభాగ్యుల పట్ల జాలిని చూపితే సమాజం బాగుపడుతుందని ఆయన నమ్మకం. అందుకే పంచముడి దుస్థితిని హృదయ విదారకంగా వర్ణించినా, అతడిని తిరుగుబాటుకు ప్రోత్సహించలేదు.

**2. పంచముడు గబ్బిలంతో తన ఆవేదనను నివేదించిన విధానాన్ని వివరించండి ?**

**(లేదా)**

**జాషువా గబ్బిలం ద్వారా పంచముడి సందేశాన్ని పంపించిన విధానాన్ని తెలియజేయండి.**

జాషువా కావ్యాల్లో ప్రముఖమైంది గబ్బిలం, అస్పృశ్యుడి ఆత్మ క్షోభ గబ్బిలం ద్వారా పరమ శివుడికి సందేశం పంపించాడు. జాషువా గబ్బిలం కావ్య నేపథ్యాన్ని వివరిస్తూ "కాళి దాసుని మేఘ సందేశము మనస్సులో ఉంచుకొని నేనీ కావ్యమును రచించితిని. గ్రంథనామము గబ్బిలము. శ్రోతలకిది కటువుగా దోపవచ్చును కాని యందు కథానాయకుడు ప్రణయ సందేశమంపును. ఇతడంపునది తుకతుక నుడుకు అశ్రు సందేశము. అతని శిక్షా కాల పరిమితి యొక సంవత్సరము ఇతని శిక్ష ఆజన్మాంతము. తర తరములు దీని కవధి లేదు. అతడు మన్మధాగ్ని తప్తుడు. ఇతడు క్షుధాగ్ని తప్తుడు. ఇరువురిలోను కడు దయనీయుడు" అని చెప్పాడు. కాళిదాసు మేఘసందేశం ప్రేరణతో జాషువా గారు తన కావ్యానికి గబ్బిలము పేరు పెట్టారు. పేదలకు పులుగు, పుట్రలు తప్ప ఆత్మీయులైన చుట్టాలుండరన్న విషయాన్ని చెప్పారు. అందుకే గబ్బిలం పేరు గ్రంథానికి ఔచిత్యంగా ఉంది.

అంటరానితనంతో అలమటించే పంచముడు తన రక్తం ధారవోసి ఉదయం నుండి సాయంత్రం వరకు కష్టించి ఇల్లు చేరి గంజి త్రాగి పడుకొని తన దుస్థితిని గూర్చి చలించాడు. భూమండలమంతా చిమ్మ చీకట్లు కమ్ముకొన్న స్థితిలో ముక్కు మొగమున్న చీకటి ముద్దలు గబ్బిలమొకటి అతడి కుటీరంలో ప్రవేశించి దాని రెక్కలతో అతడింట్లో వెలిగే ఆముదపు దీపాన్ని ఆర్పివేసింది. గబ్బిలాన్ని చూడగానే అతని మనస్సులో కొత్త ఊహలు అంకురించాయి. స్నేహంతో తన గోడును గబ్బిలానికి విన్నవించుకుంటూ, బాధతో బడలిన బడుగు జీవులకు మదోన్మత్త ప్రపంచంలో పులుగు పుట్రలు కాక ఆప్తులైన చుట్టపక్కాలుండరని కవి భావన. అందుకే వేడి కన్నీటి జాలుతో అతడి వేదనను నివేదించుకున్నాడు. గొప్ప గొప్ప దేవాలయాల్లో నివసిస్తూ గౌరవాన్ని పొందుతున్న గబ్బిలాల రాణికి స్వాగతం పలికాడు. మా వంటి వారికి లేని గౌరవ మర్యాదలు పొందుతున్న ధన్యురాలవు నీవు అన్నాడు. నీకు తల్లక్రిందులుగా తపస్సు చేసే నీ సంతతికి గుడి గోపురాలకు శుభమే గదా ! అని కుశల ప్రశ్నలు వేశాడు.

భూమండలం గాఢనిద్రలో ఉన్న కాళరాత్రివేళ నీకు నా యింట్లో ఎంత వెదికినా ఆనందం అవలేక లభించని చోటు. నీవెందుకు ప్రవేశించావని ప్రశ్నించాడు. అంటరానివాడిగా నన్ను బహిష్కరించిన ఈ లోకం నా యింట ప్రవేశించిన నిన్ను కూడా బహిష్కరిస్తుంది. గుళ్లగోపురాలన్నింటిలో ప్రసాదాలారగించే ధన్యురాలవు. తిండి లేని ఈ పేదవాడింట్లో ప్రవేశించి ప్రయోజనం లేదు గదా ! అన్నాడు.

ఈ లోకం హృదయం లేనిది సనాతన ధర్మధేనువులు పితికిన పాలు పేదలకు లభించవు. ఈ విషయాన్ని బ్రహ్మాది దేవతా ప్రముఖులెవ్వరూ పెదవి విప్పి మాట్లాడరు. భారతదేశంలో ఆధ్యాత్మిక భావనతో బొమ్మల పెళ్లిళ్లు చేయడానికి వందలూ, వేలు వ్యయించేందుకు వెనుకాడరు. దుఃఖించే అన్నార్తులైన పేదల, బడుగు జీవుల, భిక్షా పాత్రల్లో మెతుకు రాల్చరు. ముప్పది మూడు కోట్ల దేవతలున్న దేశంలో పేదవారి ఆకలి వేదనలు చల్లారవని కవి ఆవేదన. జాషువాగారు ఈ పద్యం వ్రాసే నాటికి భారతదేశపు జనాభా ముప్పది మూడు కోట్లు. అందుకే ముప్పది మూడు కోట్ల దేవతలన్నారు.

లోభులు, స్వార్థపరులైన దొంగ గురువులు ముక్తి మార్గాన్ని బోధిస్తామని ప్రజలను ప్రలోభపెడతారు. కుయుక్తులతో మహాపరాధిగా తీర్మానిస్తారు. వారు లేకుంటే ఆధ్యాత్మిక భావన సాగదని వారి భావన.

జాషువా గబ్బిలం ద్వారా అంటరానివాడి ఆత్మక్షోభను పరమశివుడికి పంపించాడు. ఆంధ్రదేశపు వర్ణనలు, భారత దేశంలో ప్రముఖమైన పట్టణాలు, క్షేత్రాల వర్ణనలు కూడా ఈ కావ్యంలో ఉన్నాయి. గబ్బిలం కావ్యం ఆధునికాంధ్ర కవిత్వంలో విశిష్టమైంది.

3. **జాషువా గబ్బిలం ద్వారా దళితుడు సందేశాన్ని పంపే సందర్భంలో గబ్బిలానికి చేసిన సూచనలను వివరించండి ?**

**(లేదా)**

**జాషువా గబ్బిలం ఆర్ద్ర హృదయాన్ని ప్రశంసించిన తీరును వివరించండి.**

గబ్బిలం సాత్త్విక శాఖాహారి. తపస్సంపన్న దీనుల పట్ల దయార్ద్ర హృదయం ఉన్న సుగుణశీలి. జాషువా దళితుడి సందేశాన్ని గబ్బిలం ద్వారా అందించే సందర్భంలో గబ్బిలానికి కొన్ని హితమైన సూచనలు చేశాడు. సన్మార్గంలో సంచరించే గబ్బిలమా ! పగటి వేళల్లోనే సంసార బాధ్యతలను సమున్నతంగా నిర్వహించే ధన్యురాలివి. సజ్జన సాధు స్వరూపివి. రాత్రి వేళల్లో బాధల్లో మునిగి తేలెడి దరిద్ర జనులను దయార్ద్ర హృదయమై ఊరడించేందుకు వచ్చిన నీవు నిష్కళంకమైన మర్యాదకు అర్హురాలివని ప్రశంసించాడు.

పక్షుల్లో మంగళకరమైన గబ్బిలమా ! నన్ను ఓదార్చేందుకు సాటి సోదర మానవుల కళ్ల నుండి కన్నీటి చుక్క రాలుటలేదు. ప్రకృతిలో కొండల గుండెలు కరిగినా స్థితికి చలించి జాలితో ఊరడించేందుకు సెలయేళ్లలా ఉబికి వస్తున్నాయి. పేదవాళ్ల పట్ల సాటి మానవులకు సానుభూతి లేకున్నా, ప్రకృతికి పరిపూర్ణమైన సానుభూతి ఉందని కవి భావన.

పుట్టుక చేతనే తాపసులు, సూర్య తేజో సంపన్నులు, యోగ విద్యానిధులైన సూక్ష్మ శరీరులు వాలఖిల్యులు నీకు చుట్టాలే గదా ! వారు చెట్టు కొమ్మపైకి వ్రేలాడే తపస్సంపన్నులు. దయార్ద్ర మనస్కులైన వారు గరుత్మంతుడు అమృతాన్ని తెచ్చేందుకు వెళ్లే సమయంలో అతడి విన్నపాన్ని మన్నించి చెట్టు కొమ్మను పరత్యజించిన పరహితైషులు. వారు నీకు చుట్టాలైనందున నీవు నా విన్నపాన్ని మన్నించి ఉపకారం చేయమని గబ్బిలాన్ని అర్థించాడు.

ఈ ప్రశాంతమైన రాత్రి లోకంలో ప్రజలందరినీ బుజ్జగించి నిద్ర పుచ్చింది. మందు లేనట్టి - అస్పృశ్యతా రోగ పీడితునైన నన్ను మరిపోయిందని బాధ పడ్డాడు. ఆకలి బాధ వల్లనే అతడికి నిద్ర పట్టలేదు. స్వార్థపరులైన ద్రోహులు కర్మ సిద్ధాంతంతో నా నోరు మూయించి ఆహారాన్ని కబళిస్తున్నారు. కర్మమంటే ఏమిటో ? దానికీ క్షక్ష ఎందుకో ? శివుడి చేత ఆ కర్మ సిద్ధాంతాన్ని నిరూపించమని గబ్బిలాన్ని వేడుకున్నాడు. ఆలయంలో నీవు శివుని చెవికి దగ్గరలో ఉంటావు. పూజారి లేని సమయంలో నా దైన్య చరిత్రను విన్నవించమన్నాడు. పూజారులు గమనిస్తే నీకు ప్రాయశ్చిత్తం తప్పదు. శివుడు కూడా కోపిస్తాడు. ఇంత కంటే ఎక్కువగా చెప్పవలసిన పనిలేదని హితవు పలికాడు. రాత్రి చీకట్లు విస్తరిస్తున్నాయి. నీ పొరుగున నివసించే పిట్టలన్నీ మేతకు వెళ్లి వేటాడి తమ పని ముగించుకొని గూళ్లలకు చేరాయి. నీవు కూడా తొందరగా వెళ్లమని గబ్బిలానికి చెప్పాడు. పటిష్టమైన నీ రెక్కల బలిమితో ప్రేమతో విసిరి నా తాపాన్ని పోగొట్టావు. నీవు చేసిన గొప్ప ఉపకారానికి బదులుగా తగిన కానుక ఇవ్వలేక నీకు బాకీ పడి తినని బాధపడ్డాడు. నీ కళా ప్రతిభను మెచ్చుకొనేందుకు అర్హమైన కులం నాకు లేదని తన అశక్తతను ఆవేదనతో చెప్పాడు. స్వార్థంతో నిన్నొక సాధనంగా ఉపయోగించేందుకు నేను కడుపు నిండిన భాగ్యవంతుడను కాదు. నీలో తప్పులు చూపించి నీతులు వల్లించి పెత్తనం చెలాయించేందుకు క్రైస్తవ మత ప్రచారకుణ్ణి కాదని మత ప్రచారకుల మనస్తత్వాన్ని అధిక్షేపించాడు. ఈ లోకంలో మృగ పక్షి వింత ధర్మాలు కలిగిననీ ఆకారం విచిత్రమైంది. శకునాల పేరుతో అశుభమని ప్రజలు నీ ముఖాన్ని చూడరు. పేదవాడినైన నాకు ఆ పట్టింపులు లేవు. నా మనస్సులో దుఃఖాన్ని తొలగించి శివుడికి నా సందేశాన్ని అందించమని కోరాడు. పరమ శివుడు కారణాంతరాల చేత కైలాసంలో వెండి కొండపై ఉన్నా నీ కది ఒక పూట ప్రయాణమే కనుక అక్కడకు వెళ్లి నా విన్నపాన్ని వినిపించమన్నాడు.

విశాలమైన పెద్ద పెద్ద గొడుగుల వంటి నీ నల్లని రెక్కలు విప్పి బ్రహ్మాండంలో సంచరించే సమయంలో మేఘుడు నీ పై ఆహ్లాదపు చిత్త జల్లులు వంటి ముత్యాల తుంపరులు ముమ్మరంగా చల్లి ఆహ్లాదం కలిగిస్తారు. ఆకాశ గంగ ప్రాంతంలో మకరందం జాలువారే మధుర ఫలాలను తిని కొన్నాళ్ల పాటు కుటిల సంసార బాధలను మరచి రమ్మని గబ్బిలాన్ని కోరాడు. దుఃఖ భరితమైన నా కన్నీటి కథను సమన్వయించేందుకు నీ వంటి జాలితో కూడిన మనస్సు కొంత అవసరం. నా సందేశాన్ని శివుడికి అందించేందుకు

అన్ని విధాల నీవు అర్హురాలవని జాషువా గబ్బిలాన్ని ప్రశంసించాడు. ఉదాత్తమైన నీ ఔదార్య గుణాన్ని నీ పిల్లలు, భర్త అంగీకరించారు. కనుక నీవు కైలాస పర్వత శిఖరాల్లో శివుడి నివాసంలో విహరించి ఉయ్యాలలూగి ధన్యురాలవై తిరిగి రమ్మని హితవు పలికాడు. జాషువా దళితుడి దైన్య సందేశాన్ని అందించమని గబ్బిలాన్ని అర్థిస్తూ హితోక్తి సూచనలతో ప్రశంసించాడు.

## గబ్బిలం పాఠంలో చిన్న ప్రశ్నలు :

1. ఆధునిక తెలుగు సాహిత్యంలో గబ్బిలం విశిష్టతను వివరించండి ?

అంటరానితనం సంఘంలో విలయ తాండవం చేస్తున్న రోజుల్లో వినుకొండ సమీపాన చాత్రగడ్డపాడులో 1895 సెప్టెంబర్ 28వ తేదీన గుఱ్ఱం వీరయ్య - లింగమాంబ దంపతులకు జన్మించాడు. అప్పట్లో ఆయన తల్లిదండ్రులది వర్ణాంతర వివాహం.

ఆయన బాల్యంలో తోటి బాలురతో ఆడుకోవాలనే కుతూహలానికి అస్పృశ్యత అడ్డుతెరగా నిలిచింది. అంటరాని వాడవు. మాతో ఆడకూడదన్న బాలుడి చెంపపై సాచి కసితో చెంపదెబ్బ కొట్టాడు. సోదరా ! ఈ దెబ్బ నీలో అంటరానితనపు జాఢ్యానికని హెచ్చరిక చేశాడు. అవమానాలకు గురి అవుతూనే బాల్యంలో ఆయన విద్యాభ్యాసం సాగింది. ఫాదరీ బడిలో క్రమముగా ఐదవ తరగతిని గెలిచి యస్పృశ్యంతకున్ గాదిలి చెలియగు హిందూ సోదరుల కళాలయములో ప్రవేశించాడు. (నా కథ - ప్రథమ భాగం) ఉన్నత పాఠశాలలో చదువుతున్నపుడు సాహిత్య లోకంలో సంచలనం కలిగిస్తున్న తిరుపతి వేంకట కవులు, కొప్పవరపు సోదర కవుల అవధాన సభలు, పాండితీ స్పర్థలు, వివాదాలు జాషువాను ఆకర్షించాయి.

జాషువా స్వానుభవం నుండి పుట్టిన కావ్యం గబ్బిలం. బాల్యం నుండి ఆయన అనుభవించిన అంటరాని తనమనే జాఢ్యాన్ని పారద్రోలాలన్న సంస్కరణ దృక్పథంతో గబ్బిలం కావ్యాన్ని రచించాడు. కుత కుత ఉడికిన ఆయన హృదయం నుండి ఆవేదనతో వెలికి వచ్చిన కావ్యం గబ్బిలం. అంటరానితనాన్ని ఘోరమైన దురాచారంగా చాటి చెప్పిన కావ్యాల్లో గబ్బిలము శ్రేష్టమైనది. భారతీయ భాషల్లోనే అంటరానితనాన్ని గురించి నిరసిస్తూ వచ్చిన కావ్యాల్లో గబ్బిలము విశిష్టమైందని విజ్ఞులైన విమర్శకుల అభిప్రాయం.

ఆచార్య సి. నారాయణరెడ్డి జాషువా గబ్బిలం కావ్య విశిష్టతను విరవిస్తూ "అ సమ సమాజం బాకులు కుమ్మినప్పుడు, అంటరాని తనం విషాగ్నులు చిమ్మినప్పుడు, దుర్భర దారిద్ర్యం వెన్నాడినప్పుడు, దురంత వేదన గుండెల్లో తుక తుక ఉడికినప్పుడు జాషువా గుర్తొస్తాడు. గబ్బిలం జ్ఞాపకానికి వస్తుంది. స్మశాన వాటి నిట్టూర్పు పొగలతో కట్టెదుట నిలుస్తుంది'' అని ప్రశంసించాడు.

జాషువా 1941లో రచించిన గబ్బిలంలో అస్పృశ్యుడి ఆత్మక్షోభా నివేదిక గబ్బిలం ద్వారా పరమ శివుడికి పంపించడం ప్రధాన ఇతివృత్తమైనా, దక్షిణ భారతదేశంలో ప్రసిద్ధమైన పట్టణాలు, నగరాల వర్ణన గౌణంగా వర్ణించబడమైంది. ఆధునిక తెలుగు సాహిత్యంలో జాషువా గబ్బిలం విశిష్టమైంది.

2. జాషువా కవితా విశేషాలను వివరించండి ?

జాషువా కృతులు ఆధారంగా ఆయన కవితా లక్షణాలను పరిశీలిస్తే (1). సంస్కరణ దృక్పథం, (2) సమతా దృష్టి, (3) అభ్యుదయ భావుకత, (4) మానవతా వాదం, (5) హేతువాద దృష్టి - మూఢ విశ్వాస నిరసన (6) అస్పృశ్యతా నిరసన వంటి లక్షణాలు ఆయన కవిత్వంలో పుష్కలంగా ఉన్నాయి.

జాషువా కృతులపై పరిశోధించిన డా॥ బి. భాస్కర చౌదరి "జాషువా ఖండ కావ్యాలకు సార్వ జనీనత సిద్ధించింది. వస్తు నవ్యత, వస్తు వైవిధ్యం, వ్యధాభరితమైన హృదయం నుండి పొంగి పొరలిన భావావేశం, క్షుద్ర వస్తువులో కూడా ఉదాత్తతను

చూడగల సహృదయం వాటికొక ప్రశస్తిని చేకూర్చాయి. వాటికి తోడు నిమ్నోన్నతాలు లేని శైలి, సామాన్య ప్రజల హృదయాల్లో బాగా నలిగిపోయిన పద ప్రయోగం, కొన్ని శతాబ్దాలుగా తెలుగు వారికి సన్నిహితమైన హృద్యమూ, సంప్రదాయ బద్ధమూ ఐన పద్య రచన జాషువా కావ్య ఖండికలకు మెరుగులు దిద్దాయని" పరిశీలనాత్మకంగా ప్రశంసించారు.

జాషువా పద్య రచనలో మార్పులు తెచ్చాడు. వ్యాకరణ నియమాలు సడలించి భాషా స్వేచ్ఛను ప్రకటించాడు. జన వ్యవహారంలో ఉన్న అరబ్బీ, పారశీ, ఉర్దూ పదాలను యథేచ్ఛగా ప్రకటించాడు. తెలుగు తనం గుభాలించే చక్కని పదాల పోహళింపు పద చిత్రాల మేళవింపు ఆయన కవితకు వన్నె తెచ్చాయి. జాషువా కీర్తి సౌదానికి పిరదౌసి, గబ్బిలము, ముంటా జమహలు, ఖండ కావ్యాలు నాలుగు స్తంభాల్లా నిలచాయి.

## 6.3. సందర్భ సహిత వ్యాఖ్యలు :

### 1. భరతోర్వరకుం గడగొట్టు బిడ్డ

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : పంచముడి పుట్టుకను గూర్చి వర్ణించు సందర్భంలోనిది.

భావం : భారతమాతకు కడగొట్టు బిడ్డడైన పంచముడు తనకు లభించిన కొద్ది ధనంతో సంతృప్తి పడే అమాయకుడు. బొక్కెడు బువ్వతో ఆకలి తీర్చుకొని కష్టాలన్నింటినీ మరచిపోయేవాడు. ఆకలి బాధకు నానాటికి దహించుకు పోతున్న బడుగు జీవి. నాలుగు దిక్కులున్న ఈ లోకంలో ఏ దిక్కూ లేని వాడిగా పంచముడు పుట్టాడని కవి భావన.

### 2. ఆ పరమ దరిద్రుడు నీతిమంతుడై

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : దరిద్రుడైన పంచముడి నివాసాన్ని గూర్చి కవి వర్ణించు సందర్భంలోనిది.

భావం : తెలుగు కవితకు ఆశ్రయమిచ్చిన రఘునాథ భూపాలుడు తంజావూరును పాలించే సమయంలో, తంజావూరుకు దక్షిణ దిక్కున పరమ దరిద్రుడైన పంచముడు నివసిస్తున్నాడు. అతడు దరిద్రుడైనా నీతి మంతుడై జీవిస్తున్నాడన్న విశేషాన్ని కవి సూచించాడు.

### 3. అప్పుపడ్డది సుమీ భరతావని వీని సేవకున్

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : పంచముడి జీవన విధానాన్ని వర్ణించు సందర్భంలో కవి పలికిన వాక్యమిది.

భావం : ఆ దరిద్రుని కులాన్ని సంపదను హరించి అతడి దేహాన్ని పీల్చి పిప్పి చేసిన భారతవీరుని పాదాలు కందకుండా చెప్పులు కుట్టి జీవనం సాగిస్తున్నాడు. ఏనాడు తన పనిని కాదని తిరస్కరించలేదు. భారత భూమి వీని విలువైన సేవకు అప్పు పడ్డదని కవి భావన.

విశేషం : అపకారికి కూడా ఉపకారం చేసే సజ్జనుడు పంచముడని కవి అభిప్రాయం.

**4. ప్రపంచమునకు భోజనము పెట్టువానికి భుక్తి లేదు.**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : పంచముడి దయనీయమైన స్థితిని వర్ణించు సందర్భంలో కవి పలికిన వాక్యమిది.

భావం : పంచముడి రెక్కల కష్టం లేని నాడు పంటలు పండవు. ప్రజల కడుపులు నిండవు. అతడు చెమటోడ్చి ప్రపంచానికి భోజనం పెట్టినా, అతనికి మాత్రం తినేందుకు తిండి లేదు. అతడి పరిస్థితి విచిత్రం.

**5. కడిగి కరుణింప లేదయ్యె గగన గంగ**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : పంచముడిపై ఉన్న అస్పృశ్యతా మాలిన్యాన్ని గూర్చి కవి వర్ణించు సంరద్భంలో పలికిన వాక్యమిది.

భావం : అతడి తల మీద రుద్దిన అంటరానితనమనే బురదను ఆకాశ గంగ కూడా కరుణించి తొలగించలేదని కవి భావన. సమాజం అతడిపై ముద్రను అంత గాఢంగా వేసిందని కవి ఆవేదన.

**6. మూడు మూర్తులకును గూడఁగూడు లేదు**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : అతడి నైవేద్యం వల్ల అంటుపడితే త్రిమూర్తుల స్థితి ఏ విధంగా ఉంటుందో వర్ణించే సందర్భంలో కవి పలికిన వాక్యమిది.

భావం : అంటరానివాడైన ఆ దరిద్రుడు అంత కష్టపడి పంట పండించినా అతడికి తినేందుకు తిండి లేదు. అతడి తలపై రుద్దిన అంటరానితనపు మాలిన్యాన్ని, ఆకాశ గంగ కూడా కడిగి వేయలేని దుస్థితి, అతడి నైవేద్యం వల్ల అంటుపడితే త్రిమూర్తులకు కూడా కూడు లేదని కవి అధిక్షేపణతో చెప్పాడు.

విశేషం : అతడు పండించిన ధాన్యాన్నే ఆలయాల్లో నైవేద్యంగా పెడతారు. అది కూడా అంటువడితే వాళ్లకు తినేందుకు తిండి ఉండదని కవి అధిక్షేపణ.

**7. ధర్మ దేవతకు కూడ నులికిపడు జబ్బు గలదు వీడున్న చోట**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : ధర్మ దేవత కూడా అధర్మంగా పంచముడిని నిరసిస్తుందని కవి పలికిన సందర్భంలోనిది.

భావం : పాముకు పాలు,చీమకు పంచదార మేపే కర్మ భూమి మనది ఈ కర్మ భూమిలో కూడా ధర్మ దేవత పంచముడి పట్ల అధర్మంగా ప్రవర్తిస్తుందని, అతడి స్పర్శను ఈసడిస్తూ ఉలికిపడుతుందని కవి అధిక్షేపించాడు.

**8. మనుజుడెట్లు వాని కనికరించు ?**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : అతడి పట్ల ఏ భగవంతుడికి కనికరం లేదని వర్ణించు సందర్భంలో కవి పలికినది.

భావం : ఇంత మంది దేవుళ్లున్నా అతణ్ణి సానుభూతితో ఉద్ధరించే భగవంతుడే లేడు. అతడు చేసుకున్న పాపం పంచముడిగా పుట్టడమే. మనుష్యులు కనికరిస్తారన్న నమ్మకం అతడికి లేదని కవి నిస్పృహతో వివరించాడు.

**9. కసరి బుసకొట్టు నాతని గాలిసోక**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : హిందూమతంలోని అన్నీ వర్ణాల వారు పంచముడిని కసరికొడుతున్నారని వర్ణించు సందర్భంలో కవి పలికిన వాక్యం.

భావం : దరిద్ర దేవత ఆ అభాగ్యుని రక్తాన్ని ఆరగించి విలయ తాండవం చేస్తుంది. హిందూ మతంలోని నాలుగు వర్ణాల వారు పంచముడిని కసరి కొడుతున్నారని కవి భావన.

విశేషం : నాగరాజు నాల్గు పడగలు నాలుగు వర్ణాలకు సంకేతంగా కవి ప్రయోగించాడు.

**10. భార్యయేల పుట్టు బానిసకని**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : పంచముడి దయనీయమైన బ్రహ్మచర్య దీక్షను వర్ణించు సందర్భంలో కవి పలికిన వాక్యమిది.

భావం : కులం లేని తాను పెళ్లి చేసుకొని తన కొడుకులను కూడా అంటరానితనమనే అఖాతంలోకి త్రోయడం ఇష్టం లేక, పుట్టు బానిసైన తనకు భార్య ఎందుకని ఆలోచించి అతడు బ్రహ్మచర్య దీక్షను సాగిస్తున్నాడని కవి భావన.

**11. ముక్కు మొగమున్న చీకటి ముద్దవోలె**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : అంటరాని వాడింట్లో గబ్బిలం ప్రవేశించిన సందర్భంలో కవి దాన్ని వర్ణిస్తూ పలికినదీ వాక్యం.

భావం : ఆ అభాగ్యుడి ఇంట్లో ప్రవేశించిన గబ్బిలం ముక్కుమొగమున్న చీకటి ముద్దలా ఉంది. దాని రెక్కల గాలి చేత అక్కడ వెలుగుతున్న ఆముదపు దీపాన్ని ఆర్పివేసింది.

విశేషం : ముక్కు మొగమున్న చీకటి ముద్దలా గబ్బిలాన్ని జాషువా మంచి పద చిత్రంతో వర్ణించాడు. ఇది ఆయన కవితా ప్రతిభకు తార్కాణం.

**12. పులుగులు పుత్రలు గాక పేదలకు నాప్తుల్ చుట్టపక్కంబులు గలరే ?**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : పంచముడు తన దయనీయమైన స్థితిని గబ్బిలంతో నివేదించాలనుకునే సందర్భంలో కవి పంచముడి చేత పలికించిన వాక్యమిది.

భావం : పంచముడు గబ్బిలంతో తన దీన స్థితిని, కుమిలిన తన మానసిక వేదనను నివేదించుటకు మొదలు పెట్టి, అహంకార పూరితమైన ఈ ప్రపంచంలో పేదలకు ఆప్తులైన చుట్టాలు పులుగులు పుట్రలే గదా ! అని వేడి కన్నీటితో వ్యాఖ్యానించాడు.

**13. దొరకదిచట ఆనంద కిరణలవము**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : పంచముడు తన ఇంట్లో ప్రవేశించిన గబ్బిలంతో పలుకు సందర్భంలోనిది.

భావం : భూ మండలమంతా గాఢ నిద్రలో ఉన్న ఈ రాత్రి వేళ నాయింట నీవు ఏదో వెదుకుచుంటివి ? ఎంత వెదికినా నీకు లేశమైనా సంతోషం లభించదు.

విశేషం : ఇది అభాగ్యుని శూన్య గృహం. నీ ప్రయత్నం వ్యర్థమని కవి భావన.

**14. భాగ్య విహీనుల క్షుత్తులాఱునే ?**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : ముప్ఫైమూడు కోట్ల దేవతలున్న ఈ దేశంలో దరిద్రుల ఆకలి బాధలు చల్లారవని వర్ణించు సందర్భంలో కవి పలికిన వాక్యమిది.

భావం : బొమ్మల పెళ్లిళ్ల చేసేందుకు వందలూ, వేలూ వ్యయించే ఈ వ్యవస్థలో ఆకలితో అలమటించే పేదల, ఫకీరుల భిక్షాపాత్రల్లో ప్రజలు మెతుకురాల్చరు. ముప్ఫై మూడు కోట్ల దేవతలున్న ఈ దేశంలో దరిద్రుల ఆకలి బాధలు తీరవుగదా ! అని కవి అధిక్షేపించాడు.

**15. వేదాంత రథము సాగదనుకొందున్ నేను లేకుండినన్**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : కవి లోభులు, స్వార్థ పరులైన గురువుల ప్రవృత్తిని వర్ణించు సందర్భంలో పలికిన వాక్యమిది.

భావం : ఈ వ్యవస్థలో ముక్తి మార్గాన్ని బోధించే నెపంతో మహాపరాధిగా నిరూపించే స్వార్థపు గురువులున్నారు. వారు తమతోనే వేదాంత రథం సాగుతుందని భావిస్తారని కవి అధిక్షేపించాడు.

**16. అర్హురాల నకలంకం బైన మర్యాదకున్**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : దీనుడైన దళితుడు తనను ఊరడించేందుకు వచ్చిన గబ్బిలంతో పలికిన వాక్యమిది.

భావం : పక్షి సన్యాసినీ ! పగలెల్లా మునిలా నీ సంసార బాధ్యతలు గొప్పగా చక్కదిద్దుకొంటావు. రాత్రి వేళల్లో బాధల్లో మూలుగుతున్న నా లాంటి దరిద్రులను ఊరడించేందుకు వచ్చిన నీవు నిష్కళంకమైన మర్యాదకు అర్హురాలవని కవి ప్రశంసించాడు.

**17. మంద భాగ్యు నన్ను మరచిపోయె**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : నిద్రరాని దళితుడు రాత్రిని అధిక్షేపించే సందర్భంలో పలికిన వాక్యమిది.

భావం : ఈ ప్రశాంతమైన రాత్రి లోకంలో ప్రజలందరినీ బుజ్జగించి నిద్ర పుచ్చింది. మందు లేనట్టి అస్పృశ్యతా రోగ పీడితుడైన తనను మరచి పోయిందని ఆవేదనతో పలికాడు. అస్పృశ్యుడైన దీనుడికి ఆకలి బాధ వల్ల నిద్ర పట్టలేదు. దురదృష్టవంతుడైన తనను ఈ ప్రశాంత రాత్రి మరచిపోయిందని జాషువా అధిక్షేపాత్మకంగా దళితుడి చేత పలికించాడు.

**18. కర్మమననేమో ? దానికీ కక్ష యేమొ ఈశ్వరుని చేత ఋజువు చేయింపవమ్మా !**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : దళితుడు గబ్బిలంతో స్వార్థపరులైన ద్రోహులు కర్మ సిద్ధాంతం పేరుతో తన నోరుమూయించి దోచుకుంటున్నారని గబ్బిలంతో ఆవేదనతో పలికిన సందర్భంలోనిదీ వాక్యం.

భావం : స్వార్థపరులైన ద్రోహులు కర్మ సిద్ధాంతం పేరుతో తన నోరు మూయించి తన ఆహారాన్ని కబళిస్తున్నారు. కర్మమంటే ఏమిటో ? దానికీ కక్ష ఎందుకో ? శివుని చేత కర్మ సిద్ధాంతాన్ని నిరూపించమని గబ్బిలాన్ని దళితుడు వేడుకున్నాడు.

**19. పూజారి లేని వేళ విన్నవింపుము నాదు జీవిత చరిత్ర**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : దళితుడు గబ్బిలంతో తన దీన చరిత్రను ఆలయంలో పూజారి లేని సమయంలో శివుడికి విన్నవించమని కోరే సందర్భంలో పలికిన వాక్యమిది.

భావం : గబ్బిలపు రాణీ ! ఆలయమంలో నీవు వ్రేలాడే సమయంలో శివుడి చెవికి దగ్గరగా ఉంటావు. పూజారి లేని సమయంలో తన దైన్య చరిత్రను శివుడికి విన్నవించమంటాడు. "దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డుకుంటాడు" అనే సామెతను దృష్టిలో ఉంచుకొని జాషువా ఈ సందర్భంలో ఔచిత్యంగా ప్రయోగించాడు.

**20. పసదనమిడ లేకనే ఋణస్థుడనైతిన్**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : గబ్బిలం తన రెక్కల పటుత్వంతో విసిరి దళితుడి తాపాన్ని పోగొట్టిన సందర్భంలో గబ్బిలంతో పలికిన వాక్యమిది.

భావం : గబ్బిలం దళితుడి పట్ల ప్రేమతో తన రెక్కల బలిమితో విసిరి తాపాన్ని పోగొట్టింది. గబ్బిలం తనకు చేసిన గొప్ప ఉపకారానికి తగిన కానుక ఇవ్వలేని దుస్థితిలో తాను బాకీ పడ్డానని బాధపడ్డాడు.

**21. పినాకపాణి కొక సందేశంబు నందితువా ?**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : దళితుడు గబ్బిలంతో తన మనసులోని బాధను పోగొట్టి శివుని కొక సందేశాన్ని అందింతువా ? అని పలికిన సందర్భంలోనిదీ వాక్యం.

భావం : గబ్బిలపు చానా ! మృగపక్షి విచిత్ర లక్షణాలు మూర్తీ భవించిన నీ ముఖాన్ని శకునాల పేరిట ఈ లోకులు చూడరు. పేదవాడినైన నాకు మూఢనమ్మకాలతో కూడిన పాత పట్టింపులు లేవు. నా మనస్సులో బాధను పోగొట్టి శివుడికి ఒక సందేశాన్ని అందించమని దళితుడు గబ్బిలాన్ని కోరాడు.

**22. సత్యం వాక్యమునకు చావులేదు**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : దళితుడు గబ్బిలంతో తన సందేశాన్ని శివుని ఎదుట ధైర్యంగా విన్నవించమని చెప్పు సందర్భంలో పలికిన వాక్యమిది.

భావం : ధర్మానికి ఎప్పుడూ పిరికితనం లేదు, సత్యవాక్యానికి మరణం లేదు. నీకు భయమెందుకు, ఈశ్వరుడు సృష్టికర్త, నీవు ఆయన సృష్టించిన దానవి.

**23. నాదు కన్నీటికథ సమన్వయము సేయు ఆర్ద్ర హృదయంబు గూడ కొంతవసరంబు"**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : సాత్త్విక శాఖాహారి గబ్బిలమా ! తపోదీక్ష వల్ల తపో దీక్ష వల్ల నీ మనస్సు జాలితో నిండింది. నా సందేశాన్ని వినిపించేందుకు కొంత ఆర్ద్ర హృదయం అవసరమని దళితుడు పలుకు సందర్భంలోనిది.

భావం : సాత్త్విక శాఖాహారి, తపోదీక్ష సంపన్నమైన గబ్బిలానికి జాలి గుణం పుష్కలంగా వుండే నా కన్నీటి కథను సమన్వయించేందుకు నీలాంటి ఆర్ద్ర హృదయం అవసరమని దళితుడు వేడుకున్నాడు.

**24. వేలుపు గిడ్డివి నా మన - నాసాలకించెదవు గదా !**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : దళితుడు గబ్బిలంతో నా పాలిటి కామధేనువైన నీవు నన్ను ఆదుకొనేందుకు అవతరించావని పలుకు సందర్భంలోనిదీ వాక్యం.

భావం : ఉదార స్వభావంతో బిడ్డలకు పాలిచ్చే గబ్బిలపు రాణివి నీవు. నన్ను ఆదుకొనేందుకు అవతరించిన కామధేవునువువి కనుక నా విన్నపాన్ని శ్రద్ధగా వినుమని దళితుడు గబ్బిలాన్ని వేడుకున్నాడు.

**25. కృతార్థురాలవయి రమ్ము 'పుల్గు పుణ్యాంగనా !**

కవి పరిచయం : ఈ వాక్యం మహా కవి జాషువా వారి గబ్బిలం కావ్యం మొదటి భాగంలోనిది.

సందర్భం : కవి గబ్బిలంతో నీ భర్త, కుమారుల అంగీకారంతో వెళ్లే నీవు ధన్యురాలివై తిరిగి రమ్మని కోరు సందర్భంలోనిది.

భావం : పక్షుల్లో పుణ్య స్త్రీవైన గబ్బిలమా ! నీ ఔదార్యాన్ని నీ భర్త, కుమారులు ప్రశంసింతురు. వాళ్ల అంగీకారంతో నీవు ఉన్నతమైన వెండి కొండ శిఖరాల్లో శివుని నివాసంలో ఉయ్యాలలూగి విహరించి ధన్యురాలివై తిరిగి రమ్మని జాషువా గబ్బిలంతో పలికాడు.

## ముఖ్యమైన కంఠస్థ పద్యాలు :

1. చిక్కిన కాసుచే...... గడగొట్టు
2. ముప్పు ఘటించి.... వీని సేవకున్
3. ప్రతిమల.... క్షుత్తులాడనే
4. ఆ పూజాదలు..... బోయెడిన్
5. నీయౌధార్య గుణంబు.... పుణ్యాంగనా
6. చుట్టాలే గదా.... విజ్ఞప్తి నాలింపవే

యూనిట్ - 4

పాఠం - 7

# భిక్షువర్షీయసీ

## శ్రీరంగం శ్రీనివాసరావు

## (మొదటి పాఠం)

- డా॥ పి.వి. సుబ్బారావు

### పాఠ్య నిర్మాణ క్రమం

7.1. కవి పరిచయం శ్రీశ్రీ జీవిత కవితా విశేషాలు

7.2. పాఠ్య భాగ సందర్భం

7.3. కఠిన పదాలకు అర్థాలు - భావాలు

7.4. పాఠభాగ సారాంశం

శ్రీశ్రీగా ప్రసిద్ధి చెందిన శ్రీరంగం శ్రీనివాసరావు ఆధునిక మహాకవుల్లో అగ్రగణ్యుడు. భావకవితా యుగంలో కలంపట్టి, అభ్యుదయ కవితా రథ సారథిగా, విప్లవ కవితా ఉద్యమ విధాతగా తన ప్రత్యేకతను చాటుకొన్న బహుముఖ ప్రజ్ఞాశాలి.

"ఇప్పుడు మనం 20వ శతాబ్దంలో ఉన్నాం. ఈ శతాబ్దం నాది (తెలుగు సాహిత్యానికి సంబంధించినంత వరకు). ఈ వ్యవస్థని మార్చాలని ఉద్ఘోషించడం కన్నా ఇంకో ఉత్కృష్ట ధర్మం ఏ సాహిత్యపరుడికైనా ఎలా ఉంటుందో నేనూహించలేను. మరి వ్యవస్థకు రకరకాలుగా కొమ్ముగాచే రాతగాళ్లంతా నా దృష్టిలో ప్రజాద్రోహులే" అని వ్యవస్థ మార్చే సాహిత్య పరమార్థమనే విషయాన్ని చాటి చెప్పిన ప్రగతివాది శ్రీశ్రీ.

ఆయన 1910 జనవరి 2వ తేదీన విశాఖపట్టణంలో పండిత వంశంలో జన్మించారు. తల్లి అప్పల కొండమ్మ. తండ్రి వెంకట రమణయ్య, ఆయన విశాఖపట్టణం ఏ.వి.యస్. హైస్కూల్‌లో గణితశాస్త్ర ఉపాధ్యాయునిగా, హెడ్మాస్టర్‌గా పనిచేశారు. ఆచార్య శ్రీనివాస అయ్యంగార్ మీదున్న అభిమానంతో తన కుమారుడికి "శ్రీనివాసరావు" అని పేరు పెట్టాడు. బాల్యంలోనే శ్రీశ్రీకి మాతృ వియోగం కలిగింది. తండ్రి వెంకటరమణయ్య సుభద్రమ్మను రెండో పెళ్ళి చేసుకున్నాడు. ఆమె శ్రీనివాసరావుని కన్నకొడుకులా పెంచింది. శ్రీనివాసరావుకి ఐదవ ఏట 1915లో ఉపనయనం తరువాత అక్షరాభ్యాసం చేశారు. గోదావరయ్య బడిలో ఓనమాలు దిద్దాడు. ఎనిమిదవ ఏట 1918లో ప్రాథమిక విద్యను అభ్యసించాడు. ఆ దశలోనే పొడుగు పొట్టి పాదాలతో ఉన్న కందపద్యాన్ని రాయాలన్న ఉబలాటంతో యతిప్రాసలు లేని కందపద్యాన్ని చెప్పి మురిసి పోయాడు. తండ్రి వెంకట రమణయ్య పద్య రచన పట్ల కుమారుడి ఆసక్తిని గమనించి 'సులక్షణసారం' కొని తెచ్చి నేర్చుకోమని ప్రోత్సహించాడు. బాల్యంలోనే 'సావిత్రీ సత్యవంతము' అనే పద్య నాటకాన్ని వీరసింహులు - విజయ సింహులు' అనే నవలను కవితా సాధన దశలోనే రచించారు. పదిహేనవ ఏట ఆయన రచించిన 'పరిణయ రహస్యాలు' అనే నవల ముద్రితమైనది.

ఆయన పద్దెనిమిదో ఏట భావకవితా ప్రభావంతో 1928లో 16 పద్య ఖండికలను పురిపండా అప్పలస్వామిగారి ప్రేరణతో 'ప్రభవ'గా వెలువరించారు. పురిపండా, శ్రీశ్రీల 'కవితా సమితి' ఆధ్వర్యంలో ప్రథమ కుసుమంగా "ప్రభవ వెలువడింది.

అందులో 'ప్రకృతి గీతాలు, ప్రణయ గీతాలు, ప్రకీర్ణ గీతాలు' అనే మూడు విభాగాలున్నాయి. ఆ ఖండికలపై కృష్ణశాస్త్రి, విశ్వనాథల ప్రభావం ఉంది.

శ్రీశ్రీ 1928-31 సంవత్సరాల్లో మద్రాసులో బి.ఏ. డిగ్రీ జంతుశాస్త్ర ప్రధానాంశంగా పొందారు. శ్రీశ్రీ 1929లో తీవ్రమైన టైఫాయిడ్ జ్వరానికి గురయ్యాడు. ఆ సమయంలో ఆయన ఆలోచనా విధానంలో అప్పటి వరకున్న కవిత్వానికి ఛందస్సు ఆవశ్యకమనే. భావం తొలగిపోయింది. దేశ దేశాల కవుల రచనలను చదవటంతో ఆయన ఊహా పరిధి విస్తృతమైంది.

శ్రీశ్రీ బ్రతుకు తెరువు కోసం రకరకాల ఉద్యోగాలు చేశారు. మొదట విశాఖపట్టణం ఏ.వి.యన్. కాలేజీలో "జువాలజీ డిమాన్‌స్ట్రేటర్‌గా, హార్బర్‌లో గుమస్తాగా, విశాఖ పత్రికలో రిపోర్టర్‌గా, ఆంధ్ర ప్రభలో సబ్-ఎడిటర్‌గా, ఆనందవాణిలో సబ్-ఎడిటర్‌గా, ఆకాశవాణిలో ఉద్యోగిగా, నైజాం కొలువులో ఉద్యోగిగా ఎన్నో ఉద్యోగాలు నిర్వహించారు. చివరికి సినీరచయితగా చిరస్మరణీయమైన పాటలు రచించి ప్రేక్షకుల హృదయాల్లో నిలిచాడు.

పురిపండా, వడ్డాది సీతారామాజనేయులు గారలతో కలిసి 1926లో శ్రీశ్రీ కవితా సమితిని విశాఖలో స్థాపించారు. 1933లో బరంపురంలో జరిగిన అభినవ ఆంధ్ర కవి పండిత సభకు హాజరయ్యారు. తరువాత కాలంలో ఈ సభ నవ్య సాహిత్య పరిషత్తుగా రూపొందింది.

కాల్పనికోద్యమ ప్రభావంతో కృష్ణశాస్త్రి విశ్వనాథల ప్రేరణతో సమాన భూయిష్టమైన పద్య రచనా సంపుటి ప్రభవను వెలువరించిన శ్రీశ్రీ డిగ్రీ చదువు పూర్తయి 1931లో విశాఖపట్టణం చేరుకున్నారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న ప్రముఖ కవి, సాహిత్య వేత్త అబ్బూరి రామకృష్ణారావుగారి సాంగత్యంతో దేశ దేశాల కవుల గ్రంథాలను చదివి మనస్సుకు పట్టించుకున్నారు.

అంగ్ల సాహిత్యంలోని న్యూ సిగ్నేచర్స్ (1932) : ఫ్రెంచి జాతీయాగీతం, హరీన్ ఛటోపాధ్యాయ "ఘురూ హువా హై జంగ్" గీతం, నజ్రుల్ ఇస్లాం గీతాలు, ఎడ్గార్ ఎలెన్‌పో, గురజాడ, కవికొండల గేయాలు మహాప్రస్థాన రచనకు మార్గదర్శకాలయ్యాయి. పై ప్రభావాలతో 1933లో శ్రీశ్రీ రచించిన 'జయభేరి', "నేను సైతం ప్రపంచారికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను" అనేది అభ్యుదయ కవిత్వానికి నూతన కవాటాలు తెరిచింది. ఆదిశంకరుల "భజగోవిందమ్ గీతం" తన మహాప్రస్థానంలోని 'మరో ప్రపంచం' గీతం నడకకు తోడ్పడిందని శ్రీశ్రీ తెలిపారు. నిరుద్యోగంతో, అశాంతితో, అలజడితో మధన పడుతున్న దశలో శ్రీశ్రీ మహాప్రస్థానం కావ్య సంపుటిలోని గీతాలను 1933-49 మధ్య సంవత్సరాల్లోనే చాలా వరకు రచించారు. ఈ గీతాలన్నీ ఏక కాలంలోనే పండిత పామరులందరినీ రంజింపజేశాయి. తదనంతర కవులను గొప్పగా ప్రభావితం చేశాయి. దాదాపు అభ్యుదయ కవులంతా శ్రీశ్రీని అనుసరించారు.

మహాప్రస్థాన గీతాలు యువ నవకవులను ఉత్తేజపరిచాయి. పాఠకలోకంలో బాగా ప్రచారం పొందాక ఆలస్యంగా మహాప్రస్థాన కావ్య సంపుటి 1950లో చలంగారి యోగ్యతాపత్రంతో వెలువడింది. సాహిత్య లోకంలో సంచలనం కలిగించిన శ్రీశ్రీ యువకవులకు ఆరాధ్యుడయ్యాడు. ఆ తరువాత కవులు శ్రీశ్రీ ప్రభావం నుంచి తప్పించుకోలేకపోయారు. "తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, వాసించి అపూర్వశక్తి"గా మహాప్రస్థాన కావ్య సంపుటిని చలం ప్రశంసించారు.

శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వం ఆదరణ కోల్పోయిన తరువాత వచ్చిన దిగంబర కవితా ఉద్యమాన్ని సమర్ధించాడు. 1970లో విప్లవ రచయితల సంఘానికి అధ్యక్షుడయ్యాడు. శ్రీశ్రీ కవిత్వ రచనలో మూడు దశలు కన్పిస్తాయి. ఆయన తొలుత భావకవి, పిదప అభుద్యదయ కవి, తరువాత విప్లవ కవి. మహాప్రస్థానం తరువాత ఖడ్గసృష్టి మరోప్రస్థానం సంపుటాలను వెలువరించాడు. సిప్రాలి (సిరి సిరి మువ్వ శతకం, ప్రాసక్రీడలు, లిమరిక్కులు) చమత్కార కవితా సంపుటి. ఇందులో హాస్యం, అధిక్షేపణ సమపాళ్లలో ఉన్నాయి.

'మరో ప్రపంచం' రేడియో నాటికల సంపుటి, చరమరాత్రి కథల సంపుటిని వెలువరించాడు. "చైనా యానం"? యాత్రా సాహిత్య రచన చేశాడు. స్వీయచరిత్రను "అనంతం"'గా రచించాడు. పత్రికల్లో ఇచ్చిన ప్రశ్నలు-జవాబులు "ప్ర.జ." పేరిట వెలువరించాడు. అనువాద కథలు, నవలలు రాశాడు. వి.ర.సం. వారు శ్రీశ్రీ వ్యాసాలు "వ్యూలు - రివ్యూలు" ప్రచురించాడు.

సినిమా పాటలను, "పాడవోయి భారతీయుడా", "తెలుగువీర లేవరా" ! పేరుతో సంకలనాలుగా వెలువంరించాడు. సాహితీ ప్రక్రియలన్నింటినీ సుసంపన్నం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి శ్రీశ్రీ. ఆయనకు అజరామరమైన కీర్తిని ఆర్జించి పెట్టింది మహాప్రస్థానం. మహాకవిగా నిలబెట్టింది కూడా మహా ప్రస్థానమే.

శ్రీశ్రీ రచనలను ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యంగారు సమీక్షిస్తూ "ఆంధ్ర సాహిత్య చరిత్రలో అభ్యుదయ కవితా మహాప్రస్థాన యుగకర్త శ్రీశ్రీ దాదాపు 1930 నుంచి ఆంధ్ర సాహిత్యం ఆయన వెంట నడుస్తోంది. ఆంధ్ర సాహిత్యానికి సామాజిక స్పృహతో పాటు అంతర్జాతీయ దృక్పథాన్ని నేర్పారు శ్రీశ్రీ. శ్రీశ్రీ పాట కవోష్ణ రుధిర జ్వాల, శ్రీశ్రీ వచన కవిత ఉత్తేజాన్ని ఊపిరిగా పీల్చే వజ్రాయుధ ధార ! శ్రీశ్రీ వచన రచన గుండెను గుప్పిట పట్టిన గద్య ప్రహేళిక! శ్రీశ్రీ నాటిక సూటిగా మాట్లాడే జీవిత పేటిక. శ్రీశ్రీ కథ జీవన వ్యథను మోసుకొచ్చిన ఉధిత రంగం. శ్రీశ్రీ రక్తం కవిత, శ్రీశ్రీ ఊపిరి నవత. శ్రీశ్రీ ఆర్తి అభ్యుదయం. శ్రీశ్రీ విక్రాంతి విప్లవం. శ్రీరంగం శ్రీనివాసరావు రెండు శ్రీశ్రీలకు ప్రతీక. ఒక శ్రీకారం అభ్యుదయ ప్రస్థానానిది. ఒక శ్రీకారం విప్లవ ప్రస్థానానిది. అక్షర సత్యంగా వ్యాఖ్యానించారు.

కవిత్వ రంగంలో ఎప్పుడు ఏ కొత్తదనం వచ్చినా దానిని ఆచరించటం శ్రీశ్రీ నైజం. బ్రతుకులో నిరంతరం ఎక్స్‌పెరిమెంట్, విదూషకుని టెంపర్‌మెంట్ తనలో ఉన్నాయని శ్రీశ్రీ చెప్పుకున్నాడు. కవితారంగంలో వచ్చిన అనేక నూతన ప్రయోగాలపై మనసుపడి "సర్రియలిజమ్" (అధివాస్తవికత) వంటి కవితా రూపాలను తెలుగులో ప్రవేశపెట్టాడు. విశ్వవిఖ్యాత రచయితల రచనలకు అనువాదాలు చేశారు.

గురజాడతో ప్రారంభమైన కవితావిప్లవం శ్రీశ్రీతమదంజ వేసింది. ప్రభవ రచించే నాటికి శ్రీరంగం శ్రీనివాసరావుగా ఉన్న కవి 'సుప్తాస్థికలు' (1929) రచించే నాటికి శ్రీశ్రీ కలం పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. 1930 దాకా తెలుగు కవిత్వం తనను నడిపిస్తే ఆ తరువాత తెలుగు కవిత్వాన్ని తానే నడిపిస్తున్నాని పలికారు. "ఈ శతాబ్దం నాదే" అని కూడా సగర్వంగా చెప్పారు.

ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో శ్రీశ్రీ యుగకర్తగా నిలిచారు. ఆయన రచనల తర్వాత సాహిత్య స్వరూపంలో సమూలమైన మార్పు వచ్చింది. చలం చెప్పినట్లు "ఇంకా రాత్రి చీకటిల్లో లోకం నిద్రలో భయంకర స్వప్నాలు కంటూ దీనంగా పలవరించే సమయాన ఉషాగమనాన్ని గుర్తించి స్వాగతమిచ్చే వైతాళికుడు" శ్రీశ్రీ ... సాహిత్యంలో సంచలనాన్ని సృష్టించిన శ్రీశ్రీ 1982 జూన్ 15వ తేదీన మరణించారు.

ప్రస్తుత పాఠ్యభాగం ప్రతిజ్ఞ శ్రీశ్రీ గారి మహాప్రస్థానం నుండి గ్రహించబడింది.

**శ్రీశ్రీ వెలువరించిన గ్రంథాల వివరాలు :**

1. కవితా సంపుటాలు
2. నాటికలు
3. కథలు
4. యాత్రా సాహిత్యం.

5. స్వీయచరిత్ర
6. వ్యాసాలు
7. వ్యూలు - రివ్యూలు
8. సినిమా పాటలు
9. అనువాదాలు
10. ప్రశ్నలు - జవాబులు

వి.ర.సం. వారు శ్రీశ్రీ సాహిత్యాన్ని ఇరవై సంపుటాల్లో ముద్రించారు.

1. కవితా సంపుటాలు : 1. ప్రభవ, 2. మహాప్రస్థానం, 3. ఖడ్గసృష్టి, 4 మరో ప్రస్థానం, 5. సిప్రాలి (సిరిసిరి మువ్వ కథకం, ప్రాసక్రీడలు, లిమరిక్కులు).
2. నాటికలు - మరో ప్రపంచ (రేడియో నాటికల సంపుటి)
3. కథలు - చరమరాత్రి
4. యాత్రా సాహిత్యం - చైనాయానం
5. స్వీయ చరిత్ర - అనంతం
6. వ్యాసాలు (సాహిత్యంపై విమర్శ వ్యాసాలు)
7. వ్యూలు - రివ్యూలు - శ్రీశ్రీ వ్రాసిన సమీక్షలు
8. సినిమా పాటలు - 1. తెలుగు వీరలేవరా !, 2. పాడవోయి భారతీయుడా! (శ్రీశ్రీ వ్రాసిన మంచి పాటల సంకలనాలు)
9. అనువాదాలు - అనువాద కథలు, నవలలు
10. ప్ర.జ. : పత్రికల్లో శ్రీశ్రీ నిర్వహించిన ప్రశ్నలు - జవాబులు ప్ర.జ. పేరిట వి.ర.సం. వారు ప్రచురించారు.

**పాఠం :**

దారిపక్క చెట్టు క్రింద,
ఆరిన కుంపటి విధాన
కూర్చున్నది ముసల్దొకతె
మూలుగుతూ, ముసురుతున్న
ఈగలతో వేగలేక

ముగ్గుబుట్టవంటి తలా,
ముడుతలు తేరిన దేహం,
కాంతిలేని గాజుకళ్ళు,
తన కన్నా శవం నయం.

పడిపోయెను, జబ్బుచేసి ;
అడుక్కునే శక్తి లేదు;
రానున్నది చలికాలం ;
దిక్కులేని దీనురాలు.

ఏళ్ళు ముదిరి కీళ్ళు కదలి,
బతుకంటే కోర్కి సడలి -
పక్కనున్న బండరాతి
పగిదిగనే పడి ఉన్నది.

"ఆ అవ్వే మరణిస్తే
ఆ పాపం ఎవ్వరి"దని
వెర్రిగాలి ప్రశ్నిస్తూ
వెళ్ళిపోయింది!

ఎముక ముక్క కొరుక్కుంటు
ఏమీ అనలేదు కుక్క!
ఒక ఈగను పడవేసుకు
తొందరగా తొలగె తొండ!

క్రమ్మె చిమ్మచీకట్లూ,
దుమ్ము రేగె నంతలోన.
"ఇది నా పాపం కాదనె
ఎగిరి వచ్చి ఎంగిలాకు!

## 7.1. కవి పరిచయం - శ్రీశ్రీ జీవిత విశేషాలు :

శ్రీశ్రీగా ప్రసిద్ధి చెందిన శ్రీరంగం శ్రీనివాసరావు ఆధునిక మహాకవుల్లో అగ్రగణ్యుడు. భావకవితా యుగంలో కలం పట్టి, అభ్యుదయ కవితా రథసారధిగా, విప్లవ కవితా ఉద్యమ విధాతగా తన ప్రత్యేకతను చాటుకొన్న బహుముఖ ప్రజ్ఞాశాలి.

"ఇప్పుడు మనం 20వ శతాబ్దిలో ఉన్నాం. ఈ శతాబ్దం నాది (తెలుగు సాహిత్యానికి సంబంధించినంత వరకు) ఈ వ్యవస్థని మార్చాలని ఉద్ఘోషించడం కన్న ఇంకో ఉత్కృష్ట ధర్మం ఏ సాహిత్యపరుడికైనా ఎలా ఉంటుందో నేనూహించలేను. మరి వ్యవస్థకు రకరకాలుగా కొమ్ముగాసే రాతగాళ్ళంతా నా దృష్టిలో ప్రజాద్రోహులే" అని వ్యవస్థ మార్పే సాహిత్య పరమార్థమనే విషయాన్ని చాటి చెప్పిన ప్రగతివాది శ్రీశ్రీ.

ఆయన 1910 ఏప్రియన్ 30వ తేదీన విశాఖ పట్టణంలో పండిత వంశంలో జన్మించాడు. తల్లి అప్పల కొండమ్మ, తండ్రి వెంకట రమణయ్య. విశాఖ పట్టణం ఏ.వి.యన్. హైస్కూల్లో గణితశాస్త్ర ఉపాధ్యాయుడిగా, హెడ్మాస్టర్‌గా పనిచేశాడు. ఆచార్య శ్రీనివాస అయ్యంగార్ (అప్పట్లో ప్రసిద్ధ ఇంగ్లీషు ప్రొఫెసర్) మీదున్న అభిమానంతో తన కుమారుడికి 'శ్రీనివాసరావు' అనే పేరు

పెట్టాడు. బాల్యంలో శ్రీశ్రీకి మాతృ వియోగం కలిగింది. తండ్రి వెంకట రమణయ్య సుభద్రమ్మను రెండో పెళ్లి చేసుకున్నాడు. ఆమె శ్రీనివాసరావుని కన్న కొడుకులా పెంచింది. శ్రీనివాసరావుకి ఐదో యేట 1915లో అక్షరాభ్యాసం చేయించారు. గోదావరయ్య బడిలో ఓనమాలు దిద్దాడు. ఎనిమిదో యేట 1918లో ప్రాథమిక విద్యను అభ్యసించాడు. ఆ దశలోనే పొడుగు పొట్టి పాదాలతో ఉన్న కంద పద్యాన్ని రాయాలన్న ఉబలాటంతో యతి ప్రాసలు లేని కంద పద్యాన్ని చెప్పి మురిసిపోయాడు. తండ్రి వెంకట రమణయ్య పద్య రచన పట్ల కుమారుడి ఆసక్తిని గమనించి 'సులక్షణసారం' కొని తెచ్చి పద్య లక్షణాలు నేర్చుకోమని ప్రోత్సహించాడు. బాల్యంలోనే శ్రీశ్రీ 'సావిత్రీ సత్యవంతము' అనే పద్య నాటకాన్ని, వీరసింహులు విజయ సింహులు' అనే నవలను కవితా సాధన దశలోనే రచించాడు. పదిహేనో ఏట ఆయన రచించిన 'పరిణయ రహస్యాలు' అనే నవల ముద్రితమైంది.

ఆయన పద్దెనిమిదో ఏట భావ కవితా ప్రభావంతో 1928లో 16 పద్య ఖండికలను పురిపండా అప్పలస్వామి గారి ప్రేరణతో 'ప్రభవ' పేరుతో ప్రచురించాడు. పురిపండా శ్రీశ్రీలు 'కవితా సమితి' ఆధ్వర్యంలో ప్రథమ కుసుమంగా ప్రభవ వెలువడింది. అందులో 'ప్రకృతి గీతాలు, ప్రణయ గీతాలు, ప్రకీర్ణ గీతాలు' అనే మూడు విభాగాలున్నాయి. ఆ ఖండికలపై కృష్ణశాస్త్రి, విశ్వనాథల ప్రభావం ఉంది.

శ్రీశ్రీ 1928 లో మద్రాసులో బి.ఏ. జంతు శాస్త్రం ప్రధానాంశంగా చేరాడు. 1929లో తీవ్రమైన టైఫాయిడ్ జ్వరానికి గురయ్యాడు. ఆయుర్వేద వైద్యులు 40 రోజుల పాటు లంకణాలుంచారు. ఆ సమయంలో ఆయన ఆలోచనా విధానంలో మార్పు వచ్చింది. ఆకలి వేదనతో అలమటించిన శ్రీశ్రీ అన్నార్తులు శ్రామికులు, కార్మికుల బాధలను అవగతం చేసుకున్నాడు. అప్పటి వరకు భావ కవితా ప్రభావంతో కవిత్వానికి ఛందస్సు ఆవశ్యకమనే భావం తొలగిపోయింది. దేశ దేశాల కవుల రచనలు చదవటంతో ఆయన ఊహా పరిధి విస్తృతమైంది. అభ్యుదయ కవితా దృక్పథంతో అంకురార్పణ జరిగింది.

శ్రీశ్రీ 1931లో పట్టభద్రుడైన తర్వాత బ్రతుకు తెరువు కోసం రకరకాల ఉద్యోగాలు చేశాడు. మొదట విశాఖపట్టణం ఏ.వి.యన్. కాలేజిలో జువాలజీ డిమాన్‌స్ట్రేటర్‌గా, హార్బర్‌లో గుమస్తాగా, విశాఖ పత్రికలో రిపోర్టర్‌గా, ఆంధ్రప్రభలో సబ్ ఎడిటర్‌గా, ఆకాశవాణిలో ఉద్యోగిగా, నైజాం కొలువులో ఉద్యోగిగా ఎన్నో ఉద్యోగాలు చేశాడు. చివరికి సినీ రచయితగా చిరస్మరణీయమైన పాటలు రాసి ప్రేక్షకుల హృదయాల్లో నిలచిపోయాడు. బరంపురంలో 1933లో జరిగిన అభినవ ఆంధ్ర కవి పండిత సభకు హాజరయ్యాడు. తర్వాత కాలంలో ఈ సభ నవ్య సాహిత్య పరిషత్తుగా మారింది.

ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లైబ్రేరియన్‌గా పని చేస్తున్న ప్రముఖ కవి, సాహిత్యవేత్త అబ్బూరి రామకృష్ణారావుగారి సాంగత్యంతో దేశ దేశాల కవుల గ్రంథాలను చదివి మనస్సుకు పట్టించుకున్నాడు.

### ఆంగ్ల సాహిత్యంలోని న్యూ సిగ్నేచర్స్ (1932) :

ఫ్రెంచి జాతీయ గీతం, హరీన్ ఛటోపాధ్యాయ"షురూ హువాహై జంగ్" గీతం, నజ్రుల్ ఇస్లాం గీతాలు, ఎడ్గార్ ఎలన్‌పో, గురజాడ, కవి కొండల గేయాలు' మహా ప్రస్థాన రచనకు మార్గదర్శకాలయ్యాయి. ఈ ప్రభావాలతో శ్రీశ్రీ 1933లో రచించిన 'జయభేరి', 'నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను' అనే అభ్యుదయ కవిత్వానికి నూతన కవాటాలు తెరిచింది. ఆది శంకరుల 'భజగోవిందం గీతం' తన మహాప్రస్థానంలో 'మరో ప్రపంచం' గీతం నడకకు తోడ్పడిందని శ్రీశ్రీ తెలిపాడు. శ్రీశ్రీ నిరుద్యోగంతో, అశాంతితో అలజడితో మధనపడుతున్న దశలో మహాప్రస్థాన సంపుటిలోని గీతాలను 1933-42 మధ్య సంవత్సరాల్లో చాలా వరకు రచించాడు. ఈ గీతాలన్నీ ఏక కాలంలో పండిత పామరులందరినీ రంజింప చేశాయి. తదనంతర కవులను గొప్పగా ప్రభావితం చేశాయి. దాదాపు అభ్యుదయ కవులంతా శ్రీశ్రీని అనుసరించారు.

మహాప్రస్థాన గీతాలు యువ నవ కవులను ఉత్తేజ పరిచాయి. పాఠక లోకంలో బాగా ప్రచారం పొందాక ఆలస్యంగా 'మహాప్రస్థాన' కావ్య సంపుటి 1950లో చలంగారి సంచలనాత్మక 'యోగ్యతా పత్రం'తో ప్రచురితమైంది. సాహిత్య లోకంలో సంచలనం కలిగించిన శ్రీశ్రీ యువకవులకు ఆరాధ్యుడయ్యాడు. ఆ తర్వాత కవులు శ్రీశ్రీ, శ్రీశ్రీ ప్రభావం నుంచి తప్పించుకోలేకపోయారు. "తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి ఊగించి శాసించి అపూర్వశక్తిగా'' మహా ప్రస్థాన కావ్య సంపుటిని చలం ప్రశంసించారు.

శ్రీశ్రీ అభ్యుదయ కవిత్వం ఆదరణ కోల్పోయిన తర్వాత వచ్చిన దిగంబర కవితా ఉద్యమాన్ని సమర్థించాడు. 1970లో విప్లవ రచయితల సంఘానికి అధ్యక్షుడయ్యాడు. శ్రీశ్రీ కవిత్వ రచనలో మూడు దశలు కనిపిస్తాయి. ఆయన తొలుత భావ కవి. పిదప అభ్యుదయ కవి. తర్వాత విప్లవ కవి. మహాప్రస్థానం తర్వాత ఖడ్గ సృష్టి, మరో ప్రస్థానం సంపుటాలను ప్రచురించాడు. సి.ప్రా.లి. (సిరి సిరి మువ్వ శతకం, ప్రాసక్రీడలు, లిమరిక్కులు) చమత్కార కవితా సంపుటి ఇందులో హాస్యం, అధిక్షేపణ సమపాళ్లలో ఉన్నాయి.

'మరో ప్రపంచం' రేడియో నాటికల సంపుటి, చరమ రాత్రి కథల సంపుటిని ప్రచురించాడు. 'చైనా యానం' యాత్రా సాహిత్య చరిత్రను రచించాడు. స్వీయ చరిత్రను అనంతరం పేరిట వెలువరించాడు. వివిధ పత్రికల్లో ఇచ్చిన ప్రశ్నలు జవాబులను ప్ర.జ. పేరిట ప్రచురించాడు. అనువాద కథలు, నవలలు రాశాడు. వి.ర.సం. వాద శ్రీశ్రీ వ్యాసాలను వ్యూలు - రివ్యూలు పేరిట ప్రచురించాడు.

సినిమా పాటలను "పాడవోయి భారతీయుడా'' 'తెలుగు వీర లేవరా !' పేరుతో సంకలనాలుగా వెలవరించాడు. శ్రీశ్రీ చేపట్టిన సాహితీ ప్రక్రియల్నింటిని సుసంపన్నం చేసిన బహు ముఖ ప్రజ్ఞాశాలి. ఆయనకు అజరామరమైన కీర్తిని ఆర్జించి పెట్టింది మహా ప్రస్థానం. మహాకవిగా నిలబెట్టింది కూడా మహా ప్రస్థానమే.

ఆచార్య జీ.వీ. సుబ్రహ్మణ్యం శ్రీశ్రీ రచనలను సమీక్షిస్తూ "ఆంధ్ర సాహిత్య చరిత్రలో అభ్యుదయ కవితా మహా ప్రస్థాన యుగకర్త శ్రీశ్రీ దాదాపు 1930 నుంచి ఆంధ్ర సాహిత్యం ఆయన వెంకట నడుస్తోంది. ఆంధ్ర సాహిత్యానికి సామాజిక స్పృహతో పాటు అంతర్జాతీయ దృక్పథాన్ని శ్రీశ్రీ నేర్పారు. శ్రీశ్రీ పాట కవోష్ణ రుధిర జ్వాల. శ్రీశ్రీ వచన కవిత ఉత్తేజాన్ని ఉత్తేజాన్ని ఊపిరిగా పీల్చే వజ్రాయుధ ధారా శ్రీశ్రీ వచన రచన. గుండెను గుప్పిట పట్టిన గద్య ప్రహేళిక. శ్రీశ్రీ నాటిక సూటిగా మాట్లాడే జీవిత పేటిక. శ్రీశ్రీ కథ జీవన వ్యథను మోసుకొచ్చిన ఉదధితరంగం. శ్రీశ్రీ రక్తం కవిత, శ్రీశ్రీ ఊరి నవతా, శ్రీశ్రీ ఆర్తి అభ్యుదయం, శ్రీశ్రీ విక్రాంతి విప్లవం. శ్రీరంగం శ్రీనివాసరావు రెండు శ్రీలకు, ప్రతీక. ఒక శ్రీకారం అభ్యుదయ ప్రస్థానానిది. ఒక శ్రీకారం విప్లవ ప్రస్థానానిది'' అని అక్షర సత్యంగా వ్యాఖ్యానించాడు.

కవిత్వ రంగంలో ఎప్పుడు ఏ కొత్తదనం వచ్చినా దానిని ఆచరించటం శ్రీశ్రీ నైజం. బ్రతుకులో నిరంతరం ఎక్స్‌పరిమెంట్, విదూషకుని టెంపర్‌మెంట్ తనలో ఉన్నాయని శ్రీశ్రీ చెప్పుకున్నాడు. కవితా రంగంలో వచ్చిన అనేక నూతన ప్రయోగాలపై మనసు పడి "సర్రియలిజమ్'' (అధి వాస్తవికత) వంటి కవితా రూపాలను తెలుగులో ప్రవేశపెట్టాడు. విశ్వవిఖ్యాత రచయితల రచనలకు అనువాదాలు చేశాడు.

గురజాడతో ప్రారంభమైన కవితా విప్లవం శ్రీశ్రీతో ముందంజ వేసింది. ప్రభ ప్రచురించే నాటికి (1928) శ్రీనివాసరావుగా ఉన్న కవి సుప్తాస్థికలు' (1929) రచించే నాటికి శ్రీశ్రీ కలం పేరుతో ప్రసిద్ధుడయ్యాడు. 1930 దాకా తెలుగు కవిత్వం తనను నడిపిస్తే, ఆ తర్వాత తెలుగు కవిత్వాన్ని తానే నడిపిస్తున్నానని పలికారు. ఈ శతాబ్దం నాది అని కూడా సగర్వంగా చెప్పారు. ఆధునికాంధ్ర సాహిత్య చరిత్రలో శ్రీశ్రీ యుగకర్తగా నిలిచాడు. ఆయన రచనలతో సాహిత్య స్వరూపంలో సమూలమైన మార్పు

వచ్చింది. చలం చెప్పినట్లు "ఇంకా రాత్రి చీకట్లో లోకం నిద్రలో భయంకర స్వప్నాలు కంటూ దీనంగా పలవరించే సమయాన ఉషాగమనాన్ని గుర్తించి స్వాగతించిన వైతాళికుడు" శ్రీశ్రీ సాహిత్యంలో సంచలనాన్ని సృష్టించిన శ్రీశ్రీ 1983 జూన్ 15 తేదీన మరణించినా సాహితీ ప్రియుల హృదయాల్లో ఆయన చిరంజీవి.

## 7.2. పాఠ్యభాగ సందర్భం :

క్రీ॥శ॥ 20వ శతాబ్ది ప్రారంభంలో (1922) ప్రపంచవ్యాప్తంగా తీవ్రమైన దుర్భిక్ష పరిస్థితులు, నిరుద్యోగ సమస్య ఏర్పడ్డాయి. బ్రిటన్‌లో దాదాపు రెండు కోట్ల 75 లక్ష లమంది ఆకలిపై పోరాట యాత్ర నిర్వహించారు. ఆ ప్రభావం భారత దేశానికి కూడా వ్యాపించింది. చరిత్రకారులు దాన్ని హంగ్రీ థర్టీస్' గా పేర్కొన్నారు. ఆపరిస్థితుల్లో అభ్యుదయ మహాకవి శ్రీశ్రీ చలించి 1934లో దోపిడీ వ్యవస్థలో బలైన ముసలి బిచ్చగత్తె దైన్య గాథను 'భిక్షువర్షీయసి' ఖండికగా ఆర్ద్రతతో కవిత్వీకరించాడు. అదే సమయంలో మహాకవి జాషువా సంస్కరణ దృక్పథంతో దోపిడీ వ్యవస్థలో బలైన అనాథ గాథను ఆర్తితో పద్య కావ్యంగా (1934) రాశాడు. ఆధునిక కవితా పాఠకులను శ్రీశ్రీ గారి భిక్షువర్షీయసి ఆకర్షించినంతగా జాషువా గారి అనాథ పాఠకుల అభిమానాన్ని పొందలేదు. శ్రీశ్రీ గారి సరళమైన తెలుగు పదాలను కూర్పుతో పదబంధాలతో భిక్షువర్షీయసి పాఠకుల అభిమానాన్ని పొందింది. అప్పటికి పద్య కవిత్వాభిమానులే ఎక్కువగా ఉన్నా, వచన కవిత్వ పాఠకులు శ్లిష్టా, శ్రీశ్రీ, నారాయణ బాబు వంటి కవుల ప్రభావంతో పెరిగారు. శ్రీశ్రీ ఛందస్సుల సర్ప పరిష్వంగాలను ఛేదించాలన్నా, ఆయన కవిత్వంలో లయ, తూగు పాఠకులను గొప్పగా ఆకర్షించాయి.

## 7.3. కఠిన పదాలకు అర్థాలు - భావాలు :

| | | |
|---|---|---|
| ఆరిన కుంపటి విధాన | = | ఆరిపోయిన కుంపటిలా |
| ముసల్ది + ఒకతై | = | ఒక ముసలిది |
| మూలుగుతూ | = | బాధపడుతూ |
| ముసురుతున్న | = | తనపై వాలుతున్న |
| ఈగలతో వేగలేక | = | ఈగల బాధపడలేక |

**భావం :** దారి పక్క చెట్టుకింద ముసల్దొకతె ఆరిన కుంపటిలా కొడిగట్టిన జీవితంతో తనపై ముసురుతున్న ఈగలతో బాధపడలేక మూలుగుతుంది.

**విశేషం :** మహాకవి శ్రీశ్రీ ముసలిదాని స్థితిని ఆరిన కుంపటి విధాన అనే పద చిత్రంతో అద్భుతంగా సూచించాడు.

| | | | |
|---|---|---|---|
| 2. | ముగ్గుబుట్టలాంటి | = | తెల్లగా నెరిసిన జుట్టు |
| | కాంతిలేని గాజు కళ్లు | = | కాంతి కోల్పోయిన గాజులాంటి |
| | ముడతలు తేరిన దేహం | = | ముసలితనాన్ని సూచించే ముడతలు పడ్డ శరీరం |
| | శవనయం | = | నిర్జీవమైన శవమేనయం |

**భావం :** శ్రీశ్రీ ముసలిదాని స్థితిని వర్ణిస్తూ సరళమైన తెలుగు పదాలతో పాఠకుల కళ్లకు రూపు గట్టే విధంగా కవిత్వీకరించాడు. ముసలితనాన్ని సూచించే తెల్లని ముగ్గు బుట్టలాంటి నెరసిన జుట్టు, ముడతలు పడిన శరీరం కంటి చూపు కోల్పోయిన కాంతి రహితమైన గాజు కళ్లు. ఆవిడ దైన్య స్థితిని సూచిస్తూ తన కన్నా శవం నయమని చెప్పాడు.

**విశేషం :** అద్భుతమైన పద చిత్రాలతో, సరళమైన పదబంధాలతో పాఠకుల మనో నేత్రానికి దృశ్య మానం చేసే విధంగా ఆవిడ దుస్థితిని తనకంటే శవం నయమని సూచించాడు

3. అడుక్కొనే శక్తి లేదు = అడుక్కొనే శక్తి లేని దీనావస్థ

దిక్కులేని దీనురాలు = దిక్కులేని దీనురాలు

**భావం :** జబ్బు చేసి ఆ ముసలిది పడిపోయింది. అడుక్కొనే శక్తి లేని దీనురాలు. రానున్న చలికాలంలో ఆ దిక్కు లేని దీనురాలి స్థితి ఏమవుతుందోనని కవి ఆవేదన వ్యక్తపరచాడు.

4. ఏళ్లు ముదిరి = వయస్సు పై బడి

కీళ్లు సడలి = కీళ్ళు కదలిపట్టు తప్పాయి

బతుకు + అంటే = జీవితమంటే

కోర్కె సడలి = జీవించాలనే కోరిక సడలిపోయింది

బండరాతి పగిదిగనే = స్తబ్దమైన బండరాయిలా ఉంది.

**భావం :** వయస్సు పైబడి వార్ధక్యం వల్ల కీళ్లు సడలి పట్టు తప్పాయి. జీవితం పట్ల కోరిక సడలి వైరాగ్యం కలిగింది. ఆ ముసలి దాని స్థితి ఆమె పక్క నున్న స్తబ్ధమైన బండరాయిలా చలన రహితంగా ఉంది. ఆవిడ దైన్యస్థితిని సరళమైన పదాలతో, చక్కని పదబంధాలతో శ్రీశ్రీ పాఠకుల గుండెలు పిండేలా కవిత్వీకరించాడు.

5. ఆ అవ్వ మరణిస్తే = ఆ ముసలి అవ్వమరణిస్తే

ఆ పాపం ఎవ్వరిదని = ఆ పాపానికి బాధ్యులెవ్వరని ?

వెర్రిగాలి = చైతన్యానికి ప్రతీకైన గాలి

ప్రశ్నిస్తూ వెళ్లిపోయింది = ప్రశ్నిస్తూ వెళ్లిపోయింది

**భావం :** దీనురాలైన ఆ ముసలి అవ్వ మరణిస్తే ఆ పాపం ఎవ్వరిదని ? వెర్రి గాలి ప్రశ్నిస్తూ వెళ్లిపోయింది. గాలి చైతన్యానికి ప్రతీక. ఆ అవ్వ స్థితికి చలించి ఆవిడ దుస్థితికి కారకులెవ్వరు ? ఆమె మరణిస్తే ఆ పాపం ఎవ్వరిదని ? వ్యవస్థాగతమైన లోపాన్ని గాలి చైతన్యంతో ప్రశ్నించి వెళ్లిపోయింది. సమసమాజ భావుకుడైన శ్రీశ్రీ ఆమె దుస్థితిని ఆర్ద్రతతో ప్రశ్నించాడు.

6. ఎముకముక్కను కొరుక్కుంటూ = ఎముక ముక్కను కొరికి తింటూ

కుక్క ఏమీ అనలేదు = ఏమీ అనలేదు

తొండ, ఈగను పడవేసుకు = ఈగను పడవేసి తింటూ

తొందరగా తొలిగె = తొందరగా వెళ్లిపోయింది.

**భావం :** ప్రకృతిలో జీవరాశులు స్వార్థంతో బతుకుతాయి. ఆ ముసలి అవ్వ దుస్థితికి చూసి కుక్క ఏమీ అనకుండా ఎముక ముక్క కొరుక్కుంటూ తింటుంది. తొండ తన స్వార్థంతో ఒక ఈగను పడవేసుకొని తొందరగా తొలగి వెళ్లింది. ప్రకృతిలో

జంతువులు నిర్లిప్తంగా తమ స్వార్థంతో ఆహారాన్ని వెతుక్కుంటూ ఉండటం సహజం. ఆ ముసలి అవ్వ దుస్థితికి చలించి ఏమీ చేయగల స్థితి వాటికి లేదు.

| | | | |
|---|---|---|---|
| 7. | చిమ్మ చీకట్లు | = | దట్టంగా వ్యాపిన చీకట్లు |
| | క్రమ్మె | = | వ్యాపించాయి |
| | అంతలోన | = | ఆలోగా |
| | దుమ్ము రేగె | = | దుమ్ము రేగింది |
| | ఎంగిలాకు | = | ఎంగిలి విస్తరాకు |
| | ఇది నా పాపం కాదని ఎగిరి వచ్చె | = | గాలికి ఎగిరి వచ్చింది. |

**భావం :** అంతలోనే చిమ్మ చీకట్లు వ్యాపించాయి. గాలి ప్రభావంతో దుమ్ము రేగుతుంది. గాలికి ఎగిరి వచ్చిన ఎంగిలాకు ఇది నా పాపం కాదన్నది. ప్రకృతిలో సహజ సిద్ధంగా జరిగే పరినామాలు జరుగుతుంటాయి. ప్రకృతి దోపిడీ వ్యవస్థలో ముసలి అవ్వలాంటి వారికి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండటం సహజం.

## 7.4. పాఠ్య భాగ సారాంశం :

ప్రపంచ వ్యాప్తంగా 1930 ప్రాంతాల్లో ఆకలి తీవ్రత ఉద్యమంగా వచ్చింది. ఆకలితో అలమంటించే సామాన్యులు దీనులు అల్లాడిపోయారు. శ్రీశ్రీ అభ్యుయ కవిగా మారడానికి ముందు 1930 ప్రాంతాల్లో తీవ్రమైన టైఫాయిడ్ జ్వరానికి గురై 40 రోజులు లంకణాలతో అలమటించాడు. ఆకలి బాధ అనుభవైకవేద్యం అయింది. అందుకే ఆకలితో అలమటించే వారిని గూర్చి ఆలోచించాడు. ఆ ప్రభావంతో 1934లో దోపిడీ వ్యవస్థలో ఆకలి వేదనతో అలమటించే భిక్షువర్షీయసి దైన్యస్థితిని అనితర సాధ్యంగా అక్షరీకరించాడు. ఏళ్లు మీరిన బిచ్చగత్తె అనే అర్థంలో 'భిక్షు వర్షీయసి'గా నామకరణం చేశాడు. శీర్షిక మాత్రం సంస్కృత పద బంధమైనా, ఖండికలో పదాలన్నీ సరళమైన అచ్చ తెలుగు మాటలే. ఏళ్లు మీరిన ముసలి బిచ్చగత్తె దారి పక్క చెట్టు కింద ఆరిన కుంపటిలా వుంది. కొడిగట్టిన జీవితంతో తనపై ముసురుతున్న ఈగలతో బాధ పడలేక మూలుగుతుంది. శ్రీశ్రీ ముసలి దాని దైన్యాన్ని ఆరిన కుంపటి విధాన అనే పద చిత్రంతో పాఠకుల మనో చిత్రంలో హత్తుకొనే విధంగా వర్ణించాడు.

ముసలిదాని స్థితిని సరళమైన పదాలతో, అద్భుతమైన పద బంధాలతో పాఠకుల కళ్లకు రూపుగట్టే విధంగా వర్ణించి చెప్పాడు. ముసలి తనాన్ని సూచించే ముగ్గు బుట్ట లాంటి తెల్లని నెరిసిన జుట్టు, ముడతలు పడ్డ దేహం. చూపు కోల్పోయిన కాంతి లేని గాజు కళ్ళతో ఆవిడ దైన్య స్థితిని సూచిస్తూ తన కన్నా శవం నయం అనడంలో నిర్జీవమైన శవం కంటే దైన్యంగా ఉందన్న పదబంధం వల్ల ఆర్ద్రంగా సూచించాడు.

ఆ ముసలిది జబ్బు చేసి పడిపోయింది. అడుక్కొనే శక్తి లేని అనాధ. రానున్న చలికాలంలో ఆవిడకు కట్టుకొనే బట్టలు, కప్పుకొనే దుప్పట్లు ఇచ్చేవారెవరు ? ఆ దిక్కు లేని దీనురాలి దైన్య స్థితి ఏమవుతుందోనని మానవతా దృక్పథంతో శ్రీశ్రీ ఆవేదన వ్యక్తపరచాడు.

వయస్సు పైబడి వార్ధక్యం వల్ల ఆ ముసలి దాని కీల్లు సడలి పట్టు తప్పాయి. జీవించాలనే కోరిక సడలి వైరాగ్యం కలిగింది. ఆమె స్థితి పక్కనున్న బండరాయిలా స్తబ్ధంగా చలన రహితంగా వుంది. ఆవిడ దైన్య స్థితిని సరళమైన పదాలతో పాఠకుల గుండెలు పిండేలా శ్రీశ్రీ వర్ణించాడు.

దీనురాలైన ఆ ముసలి అవ్వ మరణిస్తే ఆ పాపం ఎవ్వరిదని ప్రశ్నిస్తూ వెర్రిగాలి వెళ్లిపోయిందన్నాడు. గాలి చైతన్యానికి ప్రతీక. ఆ అవ్వ దుస్థితికి చలించి కారకులవ్వరు ? ఆమె మరణిస్తే ఆ పాపం ఎవ్వరిదని, వ్యవస్థాగతమైన లోపాన్ని గాలి చైతన్యంతో ప్రశ్నించి వెళ్లిపోయింది. సమసమాజ భావుకుడైన శ్రీశ్రీ ఆమె దుస్థితికి ఆర్ధ్రతతో ప్రశ్నించాడు.

ప్రకృతిలో జీవరాశులు స్వార్ధంతో బతుకుతాయి. ఆ ముసలి అవ్వ దుస్థితిని చూసి కుక్క ఏమీ అనకుండా ఎముక ముక్క కొరుక్కుంటూ ఉంది. తొండ తన స్వార్ధంతో ఒక ఈగను పడవేసుకొని తినేందుకు తొందరగా తొలగి వెళ్లిపోయింది. ప్రకృతిలో జంతువులు తమ ఆహారాన్ని వెతుక్కుంటూ ఉండటం సహజం. ఆ ముసలి అవ్వ దుస్థితికి చలించి ఏమీ చేయగల స్థితి వాటికి లేదు.

అంతలోనే చిమ్మ చీకట్లు కమ్ముకున్నాయి. గాలి ప్రభావంతో దుమ్ము రేగుతుంది. గాలికి ఎగిరి వచ్చిన ఎంగిలాకు ఇది నా పాపం కాదన్నది. ప్రకృతిలో సహజ సిద్ధంగా జరిగే పరిణామాలు జరుగుతుంటాయి. ప్రకృతి దోపిడీ వ్యవస్థలో ముసలి అవ్వలాంటి వారి దుస్థితికి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండటం సహజం.

యూనిట్ - 4

పాఠం - 8

# భిక్షువర్షీయసీ

## శ్రీరంగం శ్రీనివాసరావు

## (రెండవ పాఠం)

- డా॥ పి.వి. సుబ్బారావు

### పాఠ్య నిర్మాణ క్రమం

8.1. పెద్ద ప్రశ్నలు

8.2. చిన్న ప్రశ్నలు

8.3. సందర్భ సహిత వ్యాఖ్యలు

8.4. కవితా భావానికి రాదగిన గేయ పంక్తులు

### 8.1. భిక్షువర్షీయసి పాఠంలో పెద్ద ప్రశ్నలు :

1. శ్రీశ్రీ భిక్షువర్షీయసిని వర్ణించిన విధాన్ని వివరించండి ?

లేదా

శ్రీశ్రీ భిక్షువర్షీయసిలో మానవతా దృక్పథాన్ని వివరించండి ?

జవాబు : ప్రపంచ వ్యాప్తంగా 1930 ప్రాంతాల్లో కరువు కాటకాలు, నిరుద్యోగ సమస్య వల్ల ఆకలి తీవ్రత ఉద్యమంగా వచ్చింది. ఆకలితో అలమటించే సామాన్యులు, దీనులు నిరాశా నిస్పృహలతో అలమటించి అల్లాడిపోయారు.

శ్రీశ్రీ భావ కవితా ప్రభావంతో ప్రభవ పద్య కవితా సంపుటి ప్రచురించిన తర్వాత 1930 ప్రాంతాల్లో తీవ్రమైన టైఫాయిడ్ జ్వరానికి గురై లంకణాలతో 40 రోజులు ఆకలి బాధతో అలమటించాడు. సామాన్యులు, దీనులు, కార్మికులు, కర్షకులను గూర్చి తీవ్రంగా ఆలోచించి అభ్యుదయ కవిగా మారాడు. ఆ ప్రభావంతో 1934లో దోపిడీ వ్యవస్థలో ఆకలి వేదనతో అల్లాడే ముసలి అవ్వ దైన్య స్థితిని 'భిక్షువర్షీయసి' ఖండికగా అక్షరీకరించాడు. ఏళ్లు మీరిన బిచ్చగత్తె అనే అర్థంలో 'భిక్షువర్షీయసి' అనే నామకరణం చేశాడు. శీర్షిక సంస్కృత పదబంధమైనా ఖండికలో పదాలన్నీ సరళమైన అచ్చ తెలుగు మాటలే. ఏళ్లు మీరిన ముసలి బిచ్చగత్తె దారి పక్క చెట్టు కింద ఆరిన కుంపటిలా కూర్చున్నది. 'ఆరిన కుంపటి' అనే పద చిత్రం కొడిగట్టిన ఆమె జీవితాన్ని సూచిస్తుంది పాఠకుల మనో ఫలకంపై హత్తుకొనే విధంగా శ్రీశ్రీ వర్ణించాడు. ఆమె ముసురుతున్న ఈగలతో బాధపడలేక మూలుగుతుంది.

ముసలి అవ్వ స్థితిని సరళమైన పదాలతో, అద్భుతమైన పద చిత్రాలతో పాఠకుల కళ్లకు రూపు గట్టే విధంగా వర్ణించి చెప్పాడు. ముసలి తనాన్ని సూచించే ముగ్గు బుట్టలాంటి తెల్లని నెరిసిన జుట్టు, ముడతలు పడ్డ శరీరం, చూపు కోల్పోయిన కాంతి లేని గాజు కళ్లు ఆవిడ దైన్య స్థితిని సూచిస్తున్నాయి. తన కన్నా శవం నయం అనడంలో నిర్జీవమైన శవం కంటే దీనంగా ఉందన్న విషయాన్ని 'తన కన్నా శవం నయం' అనే పదబంధం వల్ల దయనీయమైన ఆమె స్థితిని సూచించాడు.

ఆ ముసలి బిచ్చగత్తె జబ్బు చేసి పడిపోయింది. అడుక్కునే శక్తి లేని అనాథ. రానున్న చలి కాలంలో ఆమెకు కట్టుకొనేందుకు బట్టలూ, కప్పుకొనేందుకు దుప్పట్లు ఇచ్చేవారెవరు ? ఆ దిక్కులేని దీనురాలి దైన్య స్థితి ఏమవుతుందోనని మహాకవి శ్రీశ్రీ మానవతా దృక్పథంతో ఆవేదన వ్యక్తపరచాడు. వయస్సుపైబడి వార్దక్యం వల్ల ఆ ముసలి దాని కీళ్లు సడలి పట్టు తప్పాయి. జీవించాలనే కోరిక సడలి బతుకుమీద విరక్తి కలిగింది. ఆమె స్థితి పక్కనున్న బండరాయిలా స్తబ్దంగా చలన రహితంగా వుంది. ఆవిడ దైన్య స్థితిని సరళమైన పదాలతో పాఠకుల గుండెలు పిండేలా శ్రీశ్రీ వర్ణించాడు.

దీనురాలైన ఆ ముసలి అవ్వ మరణిస్తే ఆ పాపం ఎవ్వరిదని ? వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్లిపోయిందన్నాడు. గాలి చైతన్యానికి ప్రతీక. ఆ అవ్వ దుస్థితికి చలించిన గాలి అందుకు కారకులెవ్వరు ? ఆమె మరణిస్తే ఆ పాపం ఎవ్వరిది ? అంటూ వ్యవస్థాగతమైన లోపాన్ని గాలి చైతన్యంతో ప్రశ్నించి వెర్రిగా వెళ్లిపోయిందని సమ సమాజ భావకుడైన శ్రీశ్రీ ఆమె దుస్థితిని గాలి ద్వారా ఆర్ద్రతతో ప్రశ్నింపజేశాడు. ప్రకృతిలో జీవరాశులు స్వార్థంతో బతుకుతాయి. ఆ ముసలి అవ్వ దుస్థితిని చూసి "కుక్క" ఏమీ అనకుండా ఎముక ముక్క కొరుక్కుంటూ ఉందన్నాడు. తొండ తన స్వార్థంతో ఒక ఈగను పడవేసుకొని తినేందుకు తొందరగా తొలగి వెళ్లిపోయిందట. ప్రకృతిలో జంతువులు తమ ఆహారాన్ని వెతుక్కుంటూ పరిసరాలను పట్టించుకోకుండా ఉండటం సహజం. ఆ ముసలి అవ్వ దుస్థితికి చలించినా ఏమీ చేయలేని స్థితివాటిది. అంతలోనే చిమ్మ చీకట్లు కమ్ముకున్నాయి. గాలి ప్రభావంతో దుమ్ము రేగుతుంది. గాలికి ఎగిరి వచ్చిన ఎంగిలాకు ఇదినా పాపం కాదన్నది. ప్రకృతిలో సహజ సిద్దంగా జరిగే పరిణామాలు జరుగుతుంటాయి. ప్రకృతి దోపిడీ వ్యవస్థలో జరిగే అన్యాయాలను మార్చలేదు. ముసలి అవ్వలాంటి వారి దుస్థితికి ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ప్రకృతి ఉండటం సహజం.

అభ్యుదయ కవి శ్రీశ్రీ మానవతా దృక్పథంతో ఆ అవ్వ స్థితికి చలించిపోయాడు. దానికి కారణం అమానుషమైన దోపిడీ వ్యవస్థ. దోపిడీ వ్యవస్థపై తిరుగుబాటు జరిగి సమ సమాజ స్థాపన జరిగితే ఇటువంటి అమానుషమైన పరిస్థితి ఉండదు. ప్రజల్లో చైతన్యం కలిగించటానికి ఆకలి ఉద్యమ ప్రభావంతో బిక్షువర్షీయసి ఖండికను ఆర్ద్రంగా రచించాడు.

## 8.2. భిక్షువర్షీయసి పాఠంలో చిన్న ప్రశ్నలు :

1. భిక్షువర్షీయసి ఖండికలో శ్రీశ్రీ ప్రయోగించిన పద చిత్రాలను వివరించండి ?

ప్రపంచవ్యాప్తంగా 1930 ప్రాంతాల్లో కరువు కాటకాలు, నిరుద్యోగ సమస్య వల్ల ఆకలి తీవ్రత ఉద్యమంగా రూపుదాల్చింది. ఆకలితో అలమటించే సామాన్యులు, దీనులు నిరాశ నిస్పృహలతో అలమటించి అల్లాడిపోయారు.

శ్రీశ్రీ 1930 ప్రాంతంలలో తీవ్రమైన టైపాయిడ్ జ్వరానికి గురై 40 రోజుల లంకణాలతో అలమటించి ఆకలి బాధ తీవ్రతను గుర్తించి అభ్యుదయ కవిగా మారాడు. ఆ ప్రభావంతో 1934లో దోపిడీ వ్యవస్థలో ఆకలి వేదనతో అల్లాడే ముసలి అవ్వ దైన్య స్థితిని 'బిక్షువర్షీయసి' ఖండికగా అక్షరీకరించారు. ఈ ఖండికలో శ్రీశ్రీ ప్రయోగించిన పద చిత్రాలన్నీ పాఠకులను గొప్పగా ఆకర్షించాయి.

ఏళ్లు మీరిన ముసలి బిచ్చగత్తెఈ దారి పక్క చెట్టు కింద 'ఆరిన కుంపటి' లా కూర్చుకున్నది. 'ఆరిన కుంపటి' అనే పద చిత్రం కొడిగట్టిన ఆమె జీవిత దైన్యాన్ని సూచిస్తుంది. పాఠకుల మనో ఫలకాలపై హత్తుకొనే విధంగా వర్ణించాడు. ఆమె ముసురుతున్న ఈగలతో బాధ పడలేక మూలుగుతుంది.

ఆమె ముసలి తనాన్ని సూచించే విధంగా 'ముగ్గుబుట్టలాంటి తల' 'కాంతి లేని గాజు కళ్లు' అనే పద చిత్రాలు ప్రయోగించాడు. ముగ్గు బుట్టలా తెల్లగా నెరసిన జుట్టు, చూపు కోల్పోయిన కాంతి లేని గాజు 'కళ్లు' పాఠకులకు హత్తుకొనే విధంగా వర్ణించాడు. ఆమె దైన్య స్థితిని వర్ణిస్తూ 'తన కన్నా శవం నయం' అనే పద బంధం వల్ల నిర్జీవమైన శవం కంటే దయనీయంగా ఉందని సూచించాడు.

వయస్సు పై బడి వార్ధక్యం వల్ల ఆ ముసలి దాని కీళ్లు కదిలి పట్టు తప్పాయి. జీవించాలనే కోరిక సడలి బతుకు మీద విరక్తి కలిగింది. ఆమె స్థితి పక్కనున్న బండరాయిలా స్తబ్దంగా చలన రహితంగా ఉంది. ఆవిడ దైన్య స్థితిని ఔచిత్యమైన పద చిత్రాలతో పాఠకుల గుండెలు పిండేలా శ్రీశ్రీ వర్ణించాడు.

శ్రీశ్రీ మానవతా దృక్పథంతో ఆ అవ్వ స్థితికి చలించిపోయాడు. ఆమె స్థితికి కారణమైన అమానుషమైన దోపిడీ వ్యవస్థపై తిరుగుబాటు సమ సమాజ స్థాపన జరిగితే ఇటువంటి పరిస్థితి ఉండదు. ప్రజల్లో చైతన్యం కలిగించటానికి ఆకలి ఉద్యమ ప్రభావంతో ఈ ఖండికను ఆర్ద్రంగా రచించాడు.

**2. శ్రీశ్రీ అభ్యుదయ కవిగా మారేందుకు దారి తీసిన పరిస్థితులను వివరించండి ?**

శ్రీశ్రీ ప్రసిద్ధి చెందిన శ్రీరంగం శ్రీనివాసరావు ఆధునిక మహా కవుల్లో అగ్రగణ్యుడు. భావకవితా యుగంలో కలం పట్టి, అభ్యుదయ కవితా రథసారధిగా, విప్లవ కవితా ఉద్యమ విధాతగా తన ప్రత్యేకతను చాటుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి.

"ఇప్పుడు మనం 20వ శతాబ్దిలో ఉన్నాం. ఈ శతాబ్దం నాది. (తెలుగు సాహిత్యానికి సంబంధించినంత వరకు) ఈ వ్యవస్థను మార్చాలని ఉద్ఘోషించడం కన్నా ఇంకో ఉత్కృష్ట ధర్మం ఏ సాహిత్య పరుడికైనా ఎలా ఉంటుందో నేనూహించలేను. మరి వ్యవస్థను రకరకాలుగా కొమ్ముగాసే రాత గాళ్లంతా నా దృష్టిలో ప్రజా ద్రోహులే" అని వ్యవస్థ మార్చే సాహిత్యం పరమార్థమని చాటి చెప్పిన ప్రగతివాది శ్రీశ్రీ.

ఆయన పద్దెనిమిదో ఏట భావ కవితా ప్రభావంతో 1928లో 16 పద్య ఖండికలను పురిపండా అప్పలస్వామిగారి ప్రేరణతో ప్రభవ కవితా సంపుటిగా ప్రచురించాడు. అందులో ప్రకృతి గీతలు, ప్రణయ గీతాలు, ప్రకీర్ణ గీతాలు అనే మూడు విభాగాలున్నాయి. ఆ ఖండికలపై కృష్ణశాస్త్రి విశ్వనాథల ప్రభావం ఉంది.

శ్రీశ్రీ 1928-31 సంవత్సరాల్లో మద్రాసులో బి.ఏ. చదివే సమయంలో 1929లో తీవ్రమైన టైఫాయిడ్ జ్వరానికి గురయ్యాడు. అప్పుడు ఆయన ఆలోచనా విధానంలో అప్పటి వరకున్న కవిత్వానికి ఛందస్సు ఆవశ్యకమనే భావం తొలగిపోయింది. 40 రోజులు ఆయుర్వేద వైద్యులు లంకణాలుంచడంతో ఆకలితో అలమటించాడు. ఆకలితో అలమటించినందున ఆకలితో బాధపడే సామాన్యులు, కార్మికులు, దీనుల స్థితి ఆలోచించడంతో అభ్యుదయ కవితా దృక్పథానికి అంకురార్పణ జరిగింది.

1931లో ఆంధ్ర విశ్వవిద్యాలయంలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న ప్రముఖ కవి, సాహిత్యవేత్త అబ్బూరి రామకృష్ణారావుగారి సాంగత్యంతో దేశ దేశాల కవుల సాహిత్య గ్రంథాలను చదివి మనస్సుకు పట్టించుకున్నారు. ఆయన ద్వారానే అభ్యుదయ కవుల మేనిఫెస్టోను చదివాడు. ఫ్రెంచి జాతీయ గీతం హరీన్ ఛటోపాధ్యాయ "ఘురూహువా హైజంగ్" గీతం, నజ్రుల్ ఇస్లాం గీతాలు, ఎడ్గార్ ఎలెన్‌పో కవితలు, గురజాడ, కవికొండల గేయాలు మహా ప్రస్థాన రచనకు మార్గదర్శకాలయ్యాయి. పై ప్రభావాలతో శ్రీశ్రీ 1933లో రచించిన "జయభేరి"తో నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను అనేది అభ్యుదయ కవిత్వానికి నూతన కవాటాలు తెరిచింది. ఆది శంకరుల "భజ గోవిందమ్ గీతం" మహా ప్రస్థానంలోని మరో ప్రపంచం గీతం నడకకు తోడ్పడిందని శ్రీశ్రీ తెలిపారు. నిరుద్యోగంతో, అశాంతితో, అలజడితో మదన పడుతున్న దశలో శ్రీశ్రీ మహాప్రస్థానం కావ్య సంపుటిలోని గీతాలను 1933-42 మధ్య సంవత్సరాల్లోనే చాలా వరకు రచించాడు. ఈ గీతాలన్నీ ఏక కాలంలోనే పండిత పామరులందరినీ రంజింపజేశాయి. తదనంతర కవులను గొప్పగా ప్రభావితం చేశాయి. దాదాపుగా అభ్యుదయ కవులంతా శ్రీశ్రీని అనుసరించారు.

మహాప్రస్థాన గీతాలు యువ నవ కవులను ఉత్తేజపరచాయి. పాఠక లోకంలో బాగా ప్రచారం పొందాక ఆలస్యంగా మహాప్రస్థాన కావ్య సంపుటి 1950లో చలం గారి యోగ్యతా పత్రంతో వెలువడింది. సాహిత్య లోకంలో సంచలనం కలిగించిన శ్రీశ్రీ యువకవులకు ఆరాధ్యుడయ్యాడు. ఆ తర్వాత కవులు శ్రీశ్రీ ప్రభావం నుంచి తప్పించుకోలేకపోయారు. "తెలుగు కవిత్వాన్ని ఖండించి, దీవించి, ఊగించి, శాసించిన అపూర్వ శక్తిగా" మహా ప్రస్థాన కావ్య సంపుటిని చలం ప్రశంసించారు.

అభ్యుదయ కవిత్వం ఆదరణ కోల్పోయిన తర్వాత విప్లవ రచయితల సంఘానికి 1970లో అధ్యక్షుడయ్యాడు.

## 8.3. సందర్భ సహిత వ్యాఖ్యలు :

### 1. ఆరిన కుంపటి విధాన

కవి పరిచయం : మహాకవి శ్రీశ్రీ రచించిన మహాప్రస్థాన కవితా సంపుటిలోని 'భిక్షువర్షీయసి' ఖండిక నుండి గ్రహించబడింది.

సందర్భం : శ్రీశ్రీ భిక్షువర్షీయసి దైన్య స్థితిని వర్ణించే సందర్భంలో చెప్పిన వాక్యమిది.

భావం : వృద్ధురాలైన బిచ్చగత్తె దారి పక్క చెట్టు కింద ఆరిన కుంపటి విధాన కూర్చున్నది. తన చుట్టూ ముసురుతున్న ఈగలతో వేగలేక బాధతో మూలుగుతుంది. శ్రీశ్రీ 'భిక్షువర్షీయసి' దైన్య స్థితిని 'ఆరిన కుంపటి విధాన' అనే పద చిత్రంతో సూచించాడు. ఆవిడ అవసాన దశలో ఆరిన కుంపటిలా నిస్తేజంగా ఉందన్న వర్ణన పాఠకులకు సానుభూతి కలిగిస్తుంది.

### 2. తన కన్నా శవం నయం

కవి పరిచయం : మహాకవి శ్రీశ్రీ రచించిన మహాప్రస్థాన కవితా సంపుటిలోని 'భిక్షువర్షీయసి' ఖండిక నుండి గ్రహించబడింది.

సందర్భం : ఆవిడ దయనీయమైన దైన్య స్థితిని శ్రీశ్రీ వర్ణించే సందర్భంలోనిదీ వాక్యం

భావం : ముసలితనాన్ని సూచించే తెల్లని ముగ్గు బుట్ట లాంటి నెరిసిన జుట్టు, ముడతలు పడ్డ శరీరం, కాంతి రహితమైన కంటి చూపు కోల్పోయిన గాజుకల్లు. ఆవిడ దైన్య స్థితి జీవచ్ఛవంలా ఉందని, తనకంటే శవమే నయమన్న వాక్యంతో సూచించాడు.

### 3. బండరాతి పగదిగనే పడి ఉన్నది.

కవి పరిచయం : మహాకవి శ్రీశ్రీ రచించిన మహాప్రస్థాన కవితా సంపుటిలోని 'భిక్షువర్షీయసి' ఖండిక నుండి గ్రహించబడింది.

సందర్భం : ముసలి బిచ్చగత్తె బతుకు మీద కోరిక సడలి స్తబ్ధంగా బండరాయిలా పడి ఉందన్న సందర్భంతో కవి పలికిన వాక్యమిది.

భావం : వయస్సు పైబడి వార్ధక్యం వల్ల ముసలి బిచ్చగత్తెకు కీళ్లు కదిలి పట్టు తప్పాయి. జీవితం పట్ల కోరిక సడలి వైరాగ్యంతో ఉంది. ఆ ముసలి దాని స్థితి చలన రహితంగా ఆమె పక్కనున్న బండరాయిలా ఉందని శ్రీశ్రీ చక్కని పదబంధంతో పాఠకుల గుండెలు పిండేలా వర్ణించాడు.

**4. దిక్కులేని దీనురాలు**

కవి పరిచయం : మహాకవి శ్రీశ్రీ రచించిన మహాప్రస్థాన కవితా సంపుటిలోని 'భిక్షువర్షీయసి' ఖండిక నుండి గ్రహించబడింది.

సందర్భం : రానున్న చలికాలంలో దిక్కులేని ఆ దీనురాలి స్థితి పట్ల శ్రీశ్రీ సానుభూతితో పలికిన సందర్భంలోనిదీ వాక్యం.

భావం : ఆ ముసలిది జబ్బు చేసి పడిపోయింది. అడుక్కొనే శక్తి లేదు. రానున్న చలి కాలంలో మానవతా దృష్టితో ఆదీనురాలిని ఆదుకొనేవారెవ్వరు ? అని శ్రీశ్రీ సానుభూతితో పలికాడు.

**5. వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్లిపోయింది.**

కవి పరిచయం : మహాకవి శ్రీశ్రీ రచించిన మహాప్రస్థాన కవితా సంపుటిలోని 'భిక్షువర్షీయసి' ఖండిక నుండి గ్రహించబడింది.

సందర్భం : దిక్కులే దీనురాలైన ఆ ముసలి అవ్వ మరణిస్తే ఆ పాపం ఎవ్వరిదని వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్లిపోయిందన్న సందర్భంలో కవి పలికిన వాక్యమిది.

భావం : ఆ ముసలి బిచ్చగత్తె మరణిస్తే ఆ పాపం ఎవ్వరిదని ? వెర్రిగాలి ప్రశ్నిస్తూ వెళ్లిపోయింది. గాలి చైతన్యానికి ప్రతీక. ఆ అవ్వ దుస్థితికి చలించి గాలి చైతన్యంతో వెళ్లిపోయిందని శ్రీశ్రీ వ్యవస్థాగతమైన లోపాన్ని శ్రీశ్రీ ఆర్ద్రతతో ప్రశ్నించాడు.

**6. తొందరగా తొలగెతొండ**

కవి పరిచయం : మహాకవి శ్రీశ్రీ రచించిన మహాప్రస్థాన కవితా సంపుటిలోని 'భిక్షువర్షీయసి' ఖండిక నుండి గ్రహించబడింది.

సందర్భం : ప్రకృతిలో జీవరాశులు తమ ఆహారాన్వేషణలో నిర్లప్తంగా ఉంటాయని కవి పలికిన సందర్భంలోనిదీ వాక్యం.

భావం : ముసలి అవ్వ దుస్థితిని చూసి కుక్క ఏమీ అనకుండా ఎముక ముక్క కొరుక్కుంటూ ఉంది. 'తొండ' స్వార్థానికీ, దోపిడీకి ప్రతీక. తొండ స్వార్దంతో ఒక ఈగను పడవేసుకొని తొందరగా తొలగివెళ్లింది. ప్రకృతిలో జంతువులు ముసలి అవ్వ స్థితికి చలించినా ఏమీ చేయలేని అశక్తత వాటిదని శ్రీశ్రీ భావన.

**7. ఇది నా పాపం కాదనె**

కవి పరిచయం : మహాకవి శ్రీశ్రీ రచించిన మహాప్రస్థాన కవితా సంపుటిలోని 'భిక్షువర్షీయసి' ఖండిక నుండి గ్రహించబడింది.

సందర్భం : చిమ్మ చీకట్లు వ్యాపించి గాలి ప్రభావంతో ఎంగిలాకు ఎగిరి వచ్చిన సందర్భంలో కవి పలికిన వాక్యమిది.

భావం : ముసలి అవ్వ దుస్థితిలో ఉండగా చిమ్మ చీకట్లు వ్యాపించాయి. గాలి ప్రభావంతో దుమ్ము రేగుతుంది. గాలికి ఎగిరి వచ్చిన ఎంగిలాకు ఇది నా పాపం కాదని సంజాయిషీ చెప్పింది. దోపిడీ వ్యవస్థలో ముసలి అవ్వలాంటి వారి దుస్థితికి జీవరాశులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండటం సహజమే.

## 4.2.4. కవితా భావానికి రాదగిన గేయ పంక్తులు

ఈ క్రింది పంక్తుల్లోని కవితా భావాన్ని వివరించండి ?

1. దారి పక్క చెట్టుక్రింద
ఆరిన కుంపటి విధాన
కూర్చున్న ముసల్దొకతి
మూలుగుతూ ముసురుతున్న
ఈగలతో వేగలేక

కవితాభావం : వృద్ధురాలైన బిచ్చగత్తె దారి పక్క చెట్టు కింద 'ఆరిన కుంపటి విధాన'అనే పద చిత్రంతో కూర్చున్నది. తన చుట్టూ ముసురుతున్న ఈగలతో వేగలేక బాధతో మూలుగుతుంది. 'భిక్షువర్షీయసి' స్థితిని ఆరిన కుంపటి విధాన అనే పద చిత్రంతో సూచించాడు. ఆరిన కుంపటిలా ఆవిడ అవసాన దశలో నిస్తేజంగా ఉందన్న వర్ణన పాఠకులకు సానుభూతి కలిగిస్తుంది.

2. ముగ్గుబుట్టలాంటి తలా
ముడతలు తీరిన దేహం
కాంతిలేని గాజు కళ్లు
తనకన్నా శవం నయం

కవితాభావం : ముసలి తనాన్ని సూచించే తెల్లని ముగ్గు బుట్ట లాంటి నెరసిన జుట్టు. ముడతలు పడ్డ శరీరం. కాంతి రహితమైన కంటి చూపు కోల్పోయిన గాజు కళ్లు. ఆవిడ దైన్య స్థితి జీవచ్ఛవంలా ఉందని, తన కంటే శవమే నయమన్న వాక్యంతో సూచించాడు.

3. ఏళ్లుముదిరి, కీళ్లు కదలి
బతుకంటే కోర్కె సడలి
పక్కనున్న బండరాతి
పగిదిగనే పడి ఉన్నది

కవితాభావం : వయస్సు పైబడి వార్ధక్యం వల్ల ముసలి బిచ్చగత్తెకు కీళ్లు కదలి పట్టు తప్పాయి. జీవితం పట్ల కోరిక సడలి వైరాగ్యంతో ఉంది. ఆ ముసలి దాని స్థితి చలన రహితంగా ఆమె పక్కనున్న స్తబ్దమైన బండరాయిలా ఉందని శ్రీశ్రీ చక్కని ఔచిత్యమైన పదబంధంతో పాఠకుల గుండెలు పిండేలా వర్ణించాడు.

యూనిట్ - 5

పాఠం - 9

# అమృతం కురిసిన రాత్రి

(కవితా ఖండిక)

- దేవరకొండ బాలగంగాధర తిలక్

నా అక్షరాలు కన్నీటి జడులలో తడిసే దయా పారావతాలు
నా అక్షరాలు ప్రజాశక్తుల వహించే విజయ ఐరావతాలు
నా అక్షరాలు వెన్నెల్లో ఆడుకొనే అందమైన ఆడపిల్లలు"

అని తన అక్షర స్వరూపాన్ని ప్రకటించిన కవికుల తిలకుడు శ్రీ దేవరకొండ బాల గంగాధర తిలక్.

తిలక్ పశ్చిమగోదావరి జిల్లాలోని తణుకుకు దగ్గరగా ఉన్న మండపాక గ్రామంలో 1921వ సంవత్సరం ఆగస్టు 20వ తేదీన జన్మించాడు. ఈయన తల్లి రామసోదమ్మ, తండ్రి సత్యనారాయణ. సత్యనారాయణ గారికి తిలక్ ఆరవ సంతానం. తల్లిదండ్రులు సారస్వతాభిలాష గలవారు. తిలక్ తండ్రి ఎంత పాండితీ ప్రకర్షగలవారో అంతే దేశభక్తి సంపన్నులు. వారికి రాజకీయాల్లో కూడా ప్రవేశం వుంది. అంతే కాదు ఆయనకు స్వాతంత్ర్య సమరం పట్ల మిక్కిలి అభిమానం కూడా ఉండేది. అందుకే ఆయనకిష్టమైన లోకమాన్య బాలగంగాధర తిలక్ పేరును తన కుమారునికి పెట్టుకొన్నాడు.

దేవరకొండ బాలగంగాధర తిలక్ సున్నిత హృదయుడు. తండ్రి హఠాన్మరణం తిలక్‌ను శారీరకంగా, మానసికంగా కుంగదీసింది. 1946 నుంచి 1954 వరకు నరాల బలహీనత వచ్చి తిలక్ దీర్ఘకాలం అనారోగ్యానికి గురయ్యాడు. కొద్ది కాలమే సాహిత్య సృష్టికి వినియోగించగలిగాడు. 1966 జులై 1వ తేదీన తిలక్ తన 45 ఏట మరణించటం తెలుగు సాహిత్యానికి తీరని లోటు.

సంస్కృతాంధ్ర భాషల మీద తిలక్‌కు మంచి అధికారం ఉంది. భావానికనుగుణంగా భాషను ప్రయోగించి తన ప్రత్యేకతను ప్రకటిస్తాడు. ఆధునికాంధ్ర సాహిత్యంలో వచన కవితా ప్రక్రియలో తనదైన బాణీని ఏర్పరచుకొన్న విలక్షణ కవి తిలక్.

ఆధునికాంధ్ర సాహిత్యానికి తిలక్ మొట్టమొదటగా పరిచయం చేసిన కవితా సంపుటి "ప్రభావము - సంధ్య". ఇది పద్య కావ్యం. తిలక్ చాలా మంది ఆధునిక కవుల లాగానే ఛందో మార్గాన్ని పక్క బెట్టి వచన కవిత వైపు పయనించాడు. అప్పుడప్పుడు ఆయన రచించిన ఊర్మిళ విషణ్ణ వైదేహి, అద్వైత మాన్మథము, ఆటవెలది మొదలైన ఖండ కావ్యాలు సాహిత్య పత్రికల్లో ముద్రితమయ్యాయి. ఇలాంటి ఖండికలతో "గోరువంకలు" అనే కవితా సంపుటి ముద్రితమైంది.

తిలక్ కథలు కూడా రచించాడు. తిలక్ కథల్ని మొదటిసారిగా 1961లో "సుందరి. సుబ్బారావు" పేరుతో ఏలూరు ప్రజా ప్రచురణల సంస్థ వారు ప్రకటించారు. ఆ తర్వాత "ఊరి చివరి ఇల్లు" అనే మరో కథా సంపుటి కూడా వచ్చింది. 1972 మార్చిలో విశాలాంధ్ర వారు తిలక్ కథల్ని సేకరించి "తిలక్ కథలు" అనే పేరుతో ప్రచురించారు. తిలక్ కథల్లో కదిలే నీడలు, ఉంగరం, ఏమీలేదు, సముద్రపు అంచులు, అద్దంలో జిన్నా, బాబు, నల్లజర్ల రోడ్డు, దొంగ, నవ్వు, సీతాపతి కథ మొదలైన అనేక కథలు తిలక్‌కు తెలుగు కథా సాహిత్యంలో విశిష్ట స్థానాన్ని సంపాదించి పెట్టాయి.

తిలక్ పలు నాటికలు రచించాడు. సుచిత్ర ప్రణయం, సుప్తశిల, ఇరుగు పొరుగు, పొగ మొదలైన నాటికలు రచించాడు. తిలక్ సాలెగూడు, సుశీల పెళ్లి అనే నాటకాల్ని రచించాడు.

తిలక్ వ్యాసకర్తగా కూడా తన ప్రతిభను నిరూపించుకొన్నాడు. కవిత్వం అంటే, హృదయం విప్పి, కావ్య సృష్టి, గాంధీజీ జీవితం ఒక మహాకావ్యం, హేమంత వాసంతిక, కృష్ణశాస్త్రి, కథలు వ్రాయడం ఎలా, కావ్యరసం, యుద్ధం - రచయిత మొదలైన వ్యాసాలు తిలక్ బహుముఖ ప్రతిభను ప్రతిబింబిస్తాయి.

తిలక్ తన ప్రతిభను వివిధ సాహితీ ప్రక్రియల ద్వారా వ్యక్తం చేశాడు. పలు సాహితీ సమావేశాల్లో ఉపన్యాసాలిచ్చాడు. కవితా పఠనం గావించాడు. తిలక్ స్వయంగా 'తిలక్ సాహితీ సరోవరం'' అనే ఒక సాహిత్య సంస్థను తణుకులో స్థాపించాడు. బొంబాయి, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ, అనంతపురం మొదలైన ప్రాంతాల్లోని సాహితీ సంస్థల ఆహ్వానం మేరకు పలు సభల్లో పాల్గొన్నాడు. 1942లో బొంబాయిలో జరిగిన అఖిల భారత అభ్యుదయ రచయితల మహాసభకు ప్రతినిధిగా హాజరయ్యాడు.

తిలక్ రచించిన వచన కవితలు మొట్టమొదటిసారి 1968 లో "అమృతం కురిసిన రాత్రి'' అనే కవితా సంపుటిగా ఆయన మరణానంతరం ప్రచురితమైంది. దీనికి 1969లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ అవార్డు, 1970లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు ఆయన మరణానంతరం లభించటం విశేషం.

అమృతం కురిసిన రాత్రి
అందరూ నిద్రపోతున్నారు
నేను మాత్రం
తలుపు తెరచి ఇల్లు విడిచి
ఎక్కడికో దూరంగా
కొండదాటి కోనదాటి
వెన్నెల మైదానంలోకి
వెళ్ళి నిలుచున్నాను.

ఆకాశం మీద అప్సరసలు
ఒయ్యారంగా పరుగులెత్తుతున్నారు
వారి పాదాల తారామంజీరాలు
ఘల్లు ఘల్లని మోగుతున్నాయి
వారి ధమ్మిల్లాల పారిజాతాలు
గుత్తులు గుత్తులై వేలాడుతున్నాయి
వారు పృథు వక్షోజ నితంబ భారలై
యౌవన ధనుస్సుల్లా వంగిపోతున్నారు.

నన్ను చూసిచూసి కిలకిల నవ్వి ఇలా అన్నారు
చూడు వీడు
అందమైన వాడు
ఆనందం మనస్సైనవాడు
కలల పట్టు కుచ్చులూగుతూన్న కిరీటం ధరించాడు
కళ్ళ చివర కాంతి సంగీత గీతాన్ని రచిస్తున్నాడు
ఎర్రని పెదవులమీద తెల్లని నవ్వుల వీణల్ని మీటుతున్నాడు
ఎవరికీ దొరకని రహస్యాల్ని వశపరచుకున్నాడు
జీవితాన్ని ప్రేమించినవాడు జీవించడం తెలిసినవాడు
నవనవాలైన ఊహావర్ణాల మీద ఉదయించిన సూర్యుడు
ఇతడే సుమీ మన ప్రియుడు, నరుడు, మనకి వరుడు.

జలజలమని కురిసింది వాన
జాల్వారింది అమృతంపు సోన
దోసిళ్ళతో తాగి తిరిగివచ్చాను
దుఃఖాన్నీ చావునీ వెళ్ళిపొమ్మన్నాను
కాంక్షా మధుర కాశ్మీరాంబరం కప్పుకున్నాను.
జీవితాన్ని హసన్మందార మాలగా ధరించాను
జైత్రయాత్ర పథంలో తొలి అడుగు పెట్టాను.

అమృతం కురిసిన రాత్రి
అందరూ నిద్రపోతున్నారు
అలసి నిత్య జీవితంలో సొలసి సుషుప్తి చెందారు
అలవాటునీ అస్వతంత్రతనీ కావలించుకున్నారు
అధైర్యంలో తమలో తాము ముడుచుకుపోయి పడుకున్నారు
అనంత చైతన్యోత్సవాహ్వానాన్ని వినిపించుకోలేక పోయారు

అందుకే పాపం
ఈనాటికీ ఎవరికీ తెలియదు
నేను అమరుడనని !

## 9.1. కవి పరిచయం:

నువ్వు చెప్పేదేదైనా నీదై వుండాలి - నీలోంచి రావాలి - చించుకుని రావాలి. మాటలు పేర్చడం కవిత కాదు, మంత్రం తంత్ర అసలే కాదు, మళ్ళీ ఈనాడు చిత్ర కవితల్నీ, అయోమయ బంధాల్నీ పునరుద్ధరించకు, నిగ్రహ ప్రగ్రహాలు లేని భావాశ్వాలని బరిమీద వదలకు, అన్నా కవిత్వం అంతరాంత జ్యోతి స్సీమల్ని బహిర్గతం చెయ్యాలి. విస్తరించాలి చైతన్య పరిధి.

అగ్ని జల్లినా, అమృతం కురిసినా

అందం ఆనందం దాని పరమావధి"

అని కవిత్వాన్ని గూర్చి తన అభిప్రాయాన్ని విస్పష్టంగా ప్రకటించిన కవికుల తిలకుడు శ్రీ దేవరకొండ బాల గంగాధర తిలక్. ప్రాక్పశ్చిమ దేశాల సారస్వతాన్ని, తెలుగులో ప్రాచీనాధునిక సాహిత్య తత్త్వాన్ని శ్రద్ధగా అధ్యయనం చేసిన సార్వస్వతాభిమాని తిలక్. కవిత్వానికి అవసరమైన ప్రతిభ, వ్యుత్పత్తి అభ్యాసాలు ఆయనలో పుష్కలంగా ఉన్నాయి. ఏదో ఒక సిద్ధాంతానికి కట్టుబడి రచనలు చేస్తే ఉత్తమ కవితా సృష్టి జరగదని తిలక్ నమ్మకం. ఉదాత్తమై భావాలతో, సామాన్య మానవుని మీద అతని అభ్యుదయం మీద దృష్టి సారించి కవితా సృష్టి గావించిన మానవతావాది తిలక్.

బాలగంగాధర తిలక్ పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు తాలూకాలో ఉన్న మండపాక గ్రామంలో 1921వ సంవత్సరం ఆగస్టు నెల 20వ తేదీన జన్మించాడు. రామసోదమ్మ, సత్యనారాయణ గారు ఈయన తల్లిదండ్రులు. తిలక్ తండ్రి గారికి సారస్వతాభిలాషతో పాటు దేశభక్తి కూడా మెండుగా ఉండేది. అందుకే వీరికి ఇష్టమైన లోకమాన్య బాల గంగాధర తిలక్ పేరును తన కుమారునికి పెట్టుకొన్నారు.

ఆధునికాంధ్ర సాహిత్యానికి తిలక్‌ను మొదట పరిచయం చేసిన కవితా సంపుటి "ప్రభాతము-సంధ్య" ఇది పద్య కావ్యం. తిలక్ అనేక కథలు రాశాడు. నాటికలు రచించాడు. వ్యాసకర్తగా కూడా తిలక్ తన ప్రతిభను నిరూపించుకున్నాడు. నాటకాలు కూడా రాశాడు.

తిలక్ తన ప్రతిభను వివిధ సాహితీ ప్రక్రియల ద్వారా ప్రకటించాడు. సాహితీ సమావేశాల్లో పలు ఉపన్యాసాలిచ్చాడు. తిలక్ సాహితీ సరోవరం అనే సాహిత్య సంస్థను తణుకులో స్థాపించాడు. తిలక్ 1966 జులై 1వ తేదీన తన 45వ ఏట మరణించటం తెలుగు సాహిత్యానికి తీరని లోటు.

తిలక్ రచించిన వచన కవితలు మొట్టమొదటిసారి 1968లో "అమృతం కురిసిన రాత్రి" అనే కవితా సంపుటిగా ఆయన మరణానంతరం ముద్రిమైంది. దీనికి 1969లో ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు, 1970లో కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు లభించటం విశేషం.

## 9.2. పాఠ్య భాగ నేపథ్యం :

విశాలాంధ్ర ప్రచురణ సంస్థవారు తిలక్ వచన కవితల్ని ప్రచురిస్తూ కుందుర్తి ఆంజనేయులుగారి చేత పీఠికను రాయించారు. ఈ కావ్యానికి "అమృతం కురిసిన రాత్రి" అనే శీర్షికను కుందుర్తిగారే పెట్టటం గమనార్హం. తిలక్ తన వచన కవితా సంపుటికి "కఠినోపనిషత్" అనే పేరు పెట్టాలనుకున్నట్లుగా 1961 నవంబరులో ఏలూరు నుంచి ప్రజా ప్రచురణలు సంస్థ వారు ముద్రించిన "సుశీల పెళ్లి" అనే నాటకాన్ని బట్టి తెలుస్తున్నది. తిలక్ తలపెట్టిన శీర్షిక కన్నా కుందుర్తి పెట్టిన శీర్షికే బాగున్నదని తిలక్ భావనాశక్తికి అద్దం పడుతున్నదని విజ్ఞుల భావం.

అమృతం కురిసిన రాత్రి కవితా సంపుటిలో 78 సంపూర్ణ కవితలు, 15 అసంపూర్ణ కవితలు మొత్తం 93 కవితలున్నాయి. ఇవన్నీ వచన కవితలు కావు. మాత్రా గణబద్ధమైన గేయాలు కూడా కొన్ని ఉన్నాయి. వచన కవితలుగా చెప్పబడే వాటిలో కూడా కొంత లయాత్మకత తొంగి చూస్తున్నది. ఈ సంపుటిలోని కవితల్ని ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావుగారు కవిత్వ తత్త్వ విచారం, భావ కవిత్వం, అనుభూతి కవిత్వం, అభ్యుదయ కవిత్వం, యుద్ధ కవిత్వం, మానవతావాదం, తాత్త్వికత, ఇతరములు అనే విభాగాలుగా పరిశీలించ వచ్చని చెప్పారు.

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి కృష్ణ పక్షంలాగా, శ్రీశ్రీ మహా ప్రస్థానంలాగా తిలక్ అమృతం కురిసిన రాత్రి కూడా ఆధునికాంధ్ర కవిత్వ చరిత్రలో ఒక మైలు రాయి. అనేక ముద్రణలు పొందింది. 2018లో ముద్రణ పొందిన 19వ ముద్రణ పుస్తకం ప్రస్తుతం లభిస్తున్నది.

తిలక్ అమృతం కురిసిన రాత్రి కవితా సంపుటికి ముందుమాట రాస్తూ కుందుర్తి "మావాడు - మహా గట్టివాడు" అనే శీర్షికనుంచాడు. తిలక్ కవిత అభ్యుదయ కవిత్వం కొన్ని పాళ్లు, భావ కవిత్వం కొన్ని పాళ్లు కలిసిన మిశ్ర రూపం. తిలక్ అభ్యుదయ భావనకు అందమైన శైలిని సమకూర్చి అభ్యుదయ కవితా కాలంలో ఉన్న దోషాన్ని తొలగించటానికి ప్రయత్నించాడని చెప్పుకోవచ్చు. భావ కవులు శబ్ద సౌందర్యానికి, శైలీ రమ్యతకూ ప్రాధాన్యం ఇచ్చారు. అభ్యుదయ కవులు ప్రగతి కారకమైన వస్తువుకు ప్రాధాన్యమిచ్చారు. అభ్యుదయ కవిత్వాన్ని కూడా పేలవంగా కాకుండా అందంగా చెప్పుదాం" అన్నదే తిలక్ ఆచరణ ద్వారా చేసిన సూచన.

తిలక్ "అమృతం కురిసిన రాత్రి" అనే కవితా సంపుటిలో ఉన్న "అమృతం కురిసిన రాత్రి" అనే కవితా ఖండిక ప్రస్తుత పాఠ్యభాగం.

## 9.3. కఠిన పదాలకు అర్థాలు :

| | | |
|---|---|---|
| కోన | = | అడవి, కొండల్లోని మారుమూల ప్రాంతం |
| అప్సరసలు | = | దేవతా స్త్రీలు |
| తారా మంజీరాలు | = | నక్షత్రాలు అనే అందెలు |
| ధమ్మిల్లాలు | = | జుట్టు ముడులు |
| పారిజాతాలు | = | పారిజాత పుష్పాలు |
| పృథు | = | పెద్దవి |
| వక్షోజ | = | చన్నులు |
| నితంబము | = | పిరుదు |
| భారలై | = | బరువుకలవారై |
| యౌవన ధనస్సుల్లా | = | యౌవనమనే విల్లుల్లా |
| నవ్వుల వీణల్ని | = | నవ్వులు అనే వీణల్ని |
| నవనవాలైన | = | కొత్త కొత్తవి అయిన |
| ఊహ | = | ఆలోచనలనే |
| వర్ణ | = | రంగుల |
| అర్ణవాల | = | సముద్రాల |

| | | |
|---|---|---|
| వరుడు | = | కోరదగినవాడు |
| జాలువారింది | = | ప్రవహించింది |
| అమృతము + సోన | = | అమృత ప్రవాహం |
| కాంక్ష | = | కోరిన |
| మధుర | = | మనోహరమైన |
| కాశ్మీర + అంబరం | = | కాశ్మీర ప్రాంతపు వస్త్రం |
| హసత్ + మందార మాల | = | నవ్వు అనే మందార పుష్పాల దండ |
| పథం | = | మార్గం |
| సొలసి | = | బాగా అసిపోయి |
| సుషుప్తి | = | గాఢనిద్ర |
| ముడుచుకుపోయి | = | కుంచించుకుపోయి |
| చైతన్య + ఉత్సవ + ఆహ్వానాన్ని | = | చైతన్యం అనే పండుగ పిలుపును |
| అమరుడు | = | మరణం లేనివాడు |

## 9.4. పాఠ్యభాగ సారాంశం :

వచన కవితా ప్రక్రియను పరిపుష్టం చేసిన కవుల్లో తిలక్‌ది అగ్రస్థానం. తిలక్ రచనా విధనాం ఎంతో మందికి ఆదర్శ ప్రాయంగా నిలిచింది. ఒక వైపు సంస్కృత పద ప్రయోగాల్ని పరవళ్ల తొక్కిస్తూ, మరోవైపు చిన్న చిన్న కవిత్వ పంక్తుల్లో తెలుగుదనాన్ని నింపటం తిలక్ ప్రత్యేకశైలి. తిలక్ కవితను గూర్చి ఆరుద్ర "తిలక్ కవితలో క్లిష్టత ఉండదు. ఏం చెప్పదలచుకున్నాడో తనకు తెలుసు కనుక ఎలా చెప్తే అందంగా ఉంటుందో, ఆనందం ఇస్తుందో తెలుసుకోవాలన్న ప్రయత్నంలోనే ఎన్నో రచనలు చేశాడు. ఒంటి నిండా కాల్పనికోద్యమం కన్న వారు పెట్టిన పాత నగలూ, అభ్యుదయోద్యమం అత్తవారు చేయించిన కొత్త నగలు పెట్టుకున్న చిన్నమ్మలాగా సింపుల్‌గా ఉండటానికి ప్రయత్నిస్తూ ఘనంగా గలగల్లాడుతుంది.'' అని చెప్పిన మాటలు అక్షర సత్యాలు.

తిలక్‌కు ఆధునికాంధ్ర సాహిత్యంలో ఉత్తమ కవిగా గుర్తింపు తెచ్చిన కవితా సంపుటి "అమృతం కురిసిన రాత్రి'' ఇది ఆత్మాశ్రయ రీతిలో సాగింది. ఈ ఖండికలో తిలక్ రచించిన భావాలు చిత్రంగా ఉన్నాయి.

అమృతం కురిసిన రాత్రి అందరూ నిద్రపోతున్నారని, కవి మాత్రం తాను తలుపు తెరచి ఇల్లు విడిచి ఎక్కడికో దూరంగా కొండను దాటి కోన దాటి వెన్నెల మైదానంలోనికి వెళ్లి నిలుచున్నానని చెప్పాడు.

కవి వెన్నెల మైదానంలోనికి వెళ్లినప్పుడు ఆయన మదిలో మెరసిన భావాల్ని విచిత్రమైన రీతిలో వెల్లడించాడు. ఆకాశం మీద అప్సరసలు ఒయ్యారంగా పరుగులు తీస్తున్నారని చెప్పాడు. అంతే కాదు ఆ అప్సరసల పాదాలకు నక్షత్రాలు అనే అందెలున్నాయని, అవి ఘల్లు ఘల్లుమని మోగుతున్నాయని చెప్పాడు. అప్సరసల జుట్టు ముడులలో ఉన్న పారిజాత పుష్పాలు గుత్తులు గుత్తులుగా వేలాడుతున్నాయని మనోహరంగా భావించాడు. అప్సరసల స్తనాలు పెద్దగా ఉండటం వల్ల వారు నితంబ భారలై యౌవన ధనుస్సుల్లా వంగిపోతున్నారని చెప్పాడు.

అప్సరసలు కవిని చూసి కిల కిలా నవ్వారు. నవ్వటమే కాదు కవిని గూర్చి తమ భావాల్ని ప్రకటించారు. అతడు అందమైన వాడని, ఆనంద స్వరూపుడని, అనంత సంతోషంతో ఉన్నాడని పలికారు. అతడు ఒక కిరీటాన్ని ధరించాడు. ఆ కిరీటం కలం పట్టుకుచ్చులతో ఊగుతూ ఉన్నదన్నారు. అతని కళ్ల చివర కాంతి సంగీతాన్ని రచిస్తున్నాడని అప్సరసలు పలికినట్లు చెప్పాడు. అంతే కాదు అప్సరసలకు కనిపించిన కవి, ఎర్రని పెదవుల మీద తెల్లని నవ్వుల వీణల్ని మీటుతున్నట్లు పలికారు. లోకంలో ఎవరికీ దొరకని రహస్యాల్ని కవి వశపరచుకున్నాడని అతడు జీవితాన్ని ప్రేమించినవాడని, జీవించటం తెలిసినవాడని అప్సరసలు పలికారు. అప్సరసలు కవిని గూర్చి అద్భుత భావనలు చేశారు. అతడు నిత్య నూతనమైన ఊహలనే రంగు సముద్రాల మీద ఉదయించిన సూర్యుడని పలికారు. అందుకే అప్సరసలు కవి తమకు ప్రియుడని, వాళ్లకు నచ్చిన నరుడని వారు మెచ్చిన వరుడని పలికారు.

వెన్నెల మైదానంలోనికి వెళ్లిన కవి మీద జలజలమని వాన కురిసింది. అమృతం ప్రవహించింది. అప్పుడు కవి అమృతాన్ని దోసిళ్లతో తాగి తిరిగి వచ్చాడు. అమృతపానం తర్వాత దుఃఖాన్ని చావునీ వెళ్ళిపొమ్మన్నాడు. అంతే కాదు కవి, కోరిక అనే మధుర కశ్మీరపు వస్త్రాన్ని కప్పుకున్నాడు. జీవితాన్ని నవ్వుల మందార మాలగా ధరించాడు. జైత్ర యాత్ర మార్గంలో తొలి అడుగును పెట్టినట్లు కవి ఆత్మాశ్రయ రీతిలో చెప్పాడు.

అమృతం కురిసిన రాత్రి అందరూ నిద్రపోతున్నారని కవి చెప్పాడు. అందరూ బాగా అలసిపోయి గాఢనిద్రలో ఉన్నారు. వారు అలవాటుని, అస్వతంత్రతను కౌగిలించుకొన్నారన్నాడు. ప్రజలకు ధైర్యం సన్నగిల్లటంతో వారు తమలో తాము ముడుచుకు పోయి పడుకున్నారని రచించాడు. వారు గాఢ నిద్రలో ఉండటం వల్ల అనంత చైతన్య ఉత్సవ ఆహ్వానాన్ని వినలేకపోయారని చెప్పాడు. అందుకే వారందరికీ పాపం కవిని గూర్చి తెలియదు. అంటే కవి అమృతాన్ని తాగటం వల్ల అమరుడైన సంగతిని ప్రజలు గుర్తించలేకపోయారని అద్భుత భావనతో తిలక్ ఈ ఖండికను రాశాడు.

'అమృతం కురిసిన రాత్రి' కవితా ఖండిక తిలక్ భావుకతకు నిదర్శనంగా ఉందని చెప్పవచ్చు.

## 9.5. ముఖ్యమైన ఖండికలకు భావాలు :

1. ఆకాశం మీద అప్సరసలు
ఒయ్యారంగా పరుగులెత్తుతున్నారు
వారి పాదాల తారా మంజీరాలు
ఘల్లు ఘల్లని మోగుతున్నాయి
వారి ధమ్మిల్లాల పారిజాతాలు
గుత్తులు గుతులై వేలాడుతున్నాయి
వారు పృథం వక్షోజనితంబ భారలై
యౌవన ధనుస్సుల్లా వంగిపోతున్నారు.

తిలక్ అమృతం కురిసిన రాత్రి కవితా సంపుటి నుంచి స్వీకరించబడిన అమృతం కురిసిన రాత్రి అనే కవితా ఖండిక నుంచి గ్రహించబడిన పంక్తులివి.

తిలక్ అద్భుతమైన భావుకతా ప్రతిభకు ఈ పంక్తులు నిదర్శనంగా ఉన్నాయి. అమృతం కురిసిన రాత్రి అందరూ నిద్రపోతున్న సమయంలో కవి ఒక్కడే కొండ కోనలు దాటి వెన్నెల మైదానంలోనికి వెళ్లాడు. అక్కడ ఆయనకు ఆకాశం మీద

అప్సరసలు కనిపించారు. అప్సరసలు దేవకాంతాలు కాబట్టే ఆకాశంలో పరుగులు తీస్తున్నారని చెప్పాడు. వారు ఒయ్యారం ఒలకపోస్తూ తమ పాదాలకు నక్షత్రాలనే అందెల్ని ధరించారని తిలక్ అద్భుతంగా భావించాడు. నక్షత్రాలు కాంతి మరింతగా ఉంటాయి. అలాగే వారి అందెలు మెరుస్తూ ఉంటాయి. ఇక్కడ అప్సరసల కాలి అందెల లాగా నక్షత్రాలు భాసిస్తున్నాయని చెప్పటం తిలక్ ప్రత్యేకత. అప్సరసలు దేవకాంతలు కాబట్టి వారి జుట్టు ముడుల్లో దేవతా వృక్షమైన పారిజాతానికి సంబంధించిన పుష్పాలు ధరించాకన చెపపటం ఎంతో బాగుంది అని అంటే ఆ పుష్పాలు గుత్తులు గుత్తులుగా వేలాడుతున్నాయని చెప్పాడు. అప్సరసల స్తనాలు భారంగా ఉండటం వల్ల వారి పిరుదులు భారంగా ఉండటం వల్ల వారు యౌవన ధనస్సుల్లా వంగిపోతున్నారని చెప్పటం ద్వారా తిలక్ తన భావుకశక్తిని ప్రకటించాడు.

2. అందమైన వాడు
ఆనందం మనిషైనవాడు
కలల పట్టుకుచ్చు లూగుతున్న కిరీటం ధరించాడు
కళ్ల చివర కాంతి సంగీత గీతాన్ని రచిస్తున్నాడు
ఎర్రని పెదవుల మీద తెల్లని నవ్వుల వీణల్ని మీటుతున్నాడు
ఎవరికీ దొరకని రహస్యాల్ని వశపరచుకున్నాడు
జీవితాన్ని ప్రేమించిన వాడు జీవించడం తెలిసినవాడు
నవనవాలైన ఊహా వర్ణార్ణవాల మీద ఉదయించిన సూర్యుడు
అతడే సుమీ మన ప్రియుడు, నరుడు, మనకి వరుడు

తిలక్ రచించిన అమృతం కురిసిన రాత్రి అనే కవితా ఖండిక నుంచి గ్రహించబడిన పంక్తులివి.

కవిని గమనించిన అప్సరసలు మాట్లాడుకొంటున్న తీరును తిలక్ ఈ పంక్తుల్లో ప్రతిబింబింప చేశాడు. కవి అందమైన వాడని, ఆనంద స్వరూపుడని అప్సరసలు పలికారు. అప్సరసల మాటల్ని గమనించినప్పుడు, కవి కిరీటాన్ని ధరించాడని, ఆ కిరీటం కలల పట్టుకుచ్చులు ఊగులాడుతూ మనోహరంగా ఉందన్నారు. అతని కళ్లలో కాంతి ఉందని, ఆ కాంతి సంగీతంలా ఉన్నదని చెప్పటం తిలక్ భావనాశక్తికి తార్కాణం. కవి పెదవులు ఎర్రగా, నవ్వులు తెల్లగా ఉన్నాయి. అయితే తిలక్ నవ్వుల్ని నవ్వుల వీణలు అని రూపకాలంకార ప్రయోగం గావించాడు. కవి ఎవరికీ లభించని రహస్యాల్ని వశం చేసుకొన్నాడని అప్సరసలు పలకటం ద్వారా కవికి గల విశిష్ట ప్రతిభ సాక్షాత్కరిస్తున్నది. కవికి జీవితాన్ని ప్రేమించటం, ఆనందాన్ని అలవర్చుకొని జీవించటం తెలుసు. కవి నిత్య నూతనమైన ఊహలనే రంగు సముద్రాల మీద ఉదయించిన సూర్యుడని చెప్పటం ద్వారా తన భావనాశక్తిని ప్రకటించాడు. కవిలోని విశిష్ట గుణ సంపదను గుర్తించి అప్సరసలు అతన్ని వరించారని మనోహరంగా చెప్పాడు.

3. జల జలమని కురిసింది వాన
జల్వారింది అమృతంపు సోన
దోసిళ్లతో తాగి తిరిగివచ్చాను
దుఃఖాన్నీ చావునీ వెళ్లిపొమ్మన్నాను
కాంక్ష మధుర కాశ్మీరాంబరం కప్పుకున్నాను
జీవితాన్ని హసన్మందార మాలగా ధరించాను
జైత్రయాత్ర పథంలో తొలి అడుగుపెట్టాను.

తిలక్ అమృతం కురిసిన రాత్రి అనే కవితా ఖండిక నుంచి గ్రహించబడిన పంక్తులివి.

తిలక్ భావుకత ఉన్నత స్థితికి చేరుకోవటంతో అమృత వర్షం కురిసిందని చెప్పాడు. రాళ్ల వర్షం, వడగళ్ల వర్షం, ఆమ్ల వర్షం, అనే పదాలు ప్రచారంలో ఉన్నాయి కాని అమృత వర్షం అనేది అపూర్వం. ఉత్తమ భావనా బలం కలిగినవాడు కాబట్టి తిలక్ అమృతం కురిసిందని చెప్పాడు. "జల జలమని" అని ధ్వన్యనుకరణ శబ్దాల్ని ప్రయోగించి అమృతం వర్షం కురిసిన తీరును ధ్వనింప జేశాడు. అమృత ప్రవాహాన్ని తాగటానికి తన దగ్గర పాత్ర లేదని, సమయం లేదని చెప్పటానికి దోసిళ్లతో తాగివచ్చానని చెప్పాడు. అమృతాన్ని తాగటంతో దుఃఖం కానీ, చావు గానీ ఆయన దగ్గరకు రావటానికి అవకాశం లేదు. అందుకే వాటిని వెళ్లిపొమ్మని ఆజ్ఞాపించాడు. కవులకు సన్మానాలు జరిగినప్పుడు కాశ్మీర శాలువాలు కప్పటం సంప్రదాయం. అంటే కవి తాను కాశ్మీర శాలువాను కప్పుకొన్నానని చెప్పాడు. కాశ్మీర శాలువాను కప్పుకోవటంతో కవి పొంగిపోతాడు. కవి అమృతాన్ని తాగటం వల్ల అతని ఎలాంటి దుఃఖము కలగదు. ఆయన జీవితం సంతోషంగా సాగుతుంది. అందుకే జీవితాన్ని నవ్వుల మాలగా భరించాలని చెప్పాడు. తన జీవితం సంతోషమయంగా ఉండటంతో తన జైత్రయాత్ర పథంలో తొలి అడుగును మోపినట్లు చెప్పాడు. ఇలా ఈ పంక్తులు మధుర భావ ప్రవాహంలా ఉన్నాయి.

4. అమృతం కురిసిన రాత్రి
అందరూ నిద్రపోతున్నారు
అలసి నిత్య జీవితంలో సొలసి సుషుప్తి చెందారు
అలవాటునీ, అస్వతంత్రతనీ కావలించుకున్నారు.
అధైర్యంలో తమలో తాము ముడచుకుపోయి పడుకున్నారు.
అనంత చైతన్యోత్సవాహ్వానాన్ని వినిపించుకోలేకపోయారు
అందుకే పాపం
ఈనాటికీ తెలియదు
నేను అమరుడనని !

తిలక్ రచించిన 'అమృతం కురిసిన రాత్రి' అనే కవితా ఖండిక నుంచి స్వీకరించబడిన పంక్తులివి.

అమృతం కురిసిన రాత్రి అందరూ నిద్రపోతున్నారు. ప్రజలు బాగా అలసిపోయి గాఢ నిద్రలో మునిగిపోయారు. శరీర కష్టం చేసిన వారికి విశేషంగా నిద్రవస్తుంది. అందుకే పగలంతా కష్టపడిన ప్రజలు బాగా నిద్రపోతున్నారని చెప్పాడు. వారందరూ అస్వతంత్రులని, తమలో తాము ముడుచుకుపోయారని చెప్పాడు. వారంతా చైతన్యోత్సవ ఆహ్వానాన్ని అందుకోలేక పోయారని చెప్పాడు. అస్వతంత్రతలో ఉన్న వారికి ధైర్యం ఉండదు. వారు అందరికీ భయపడిపోతారు. అందుకే వారు ముడుచుకుపోయారన్నాడు. అంతే కాదు కవి అమృతాన్ని తాగినట్లు చెప్పాడు. అంటే ఇతరులకు కలగని అదృష్టం కలిగింది. అమృత పానం వల్ల కవి అమరుడయ్యాడనే విషయాన్ని లోకంలో ఎవరూ గుర్తించలేకపోయారని కవి ప్రకటించాడు. కవి అమృతాన్ని తాగకపోయినా, అమృతప్రాయమైన తన రచనల ద్వారా అమరుడు గానే ఉంటాడని లోకానికి తెలిసిన సత్యం.

**- డా॥ గుమ్మా సాంబశివరావు**

యూనిట్ - 5

పాఠం - 10

# అమృతం కురిసిన రాత్రి

(రెండవ భాగం)

- దేవరకొండ బాలగంగాధర తిలక్

## 10.1. ప్రశ్నలు - సమాధానాలు :

1. తిలక్ అనుభూతివాద కవి - సమర్థించండి

లేదా

అమృతం కురిసిన రాత్రి కవితా ఖండికలో తిలక్ వెల్లడించిన భావాన్ని వివరించండి.

ఆధునికాంధ్ర సాహిత్యంలో విశేషమైన ప్రతిభా పాటవం కలిగిన కవి దేవరకొండ బాల గంగాధర తిలక్. కవిగా జీవించిన కాలం స్వల్పమే అయినా అనల్పమైన ఖ్యాతిని సంతరించుకొన్నాడు. ఇతర కవుల కంటే భిన్నమై మార్గంలో పయనించి ఉత్తమ శ్రేణి కవిత్వాన్ని రచించాడు. జాతీయ, అంతర్జాతీయ విశేషాలపై అనంత పరిజ్ఞానం కలిగిన కవిగా తిలక్‌ను విమర్శకులు గుర్తించారు. "అమృతం కురిసిన రాత్రి" అనే ఖండికలో తిలక్ తన అనుభూతిని వెల్లడించాడు. అందుకే తిలక్‌ను అనుభూతివాద కవి అన్నారు. అమృతం కురిసిన రాత్రి కవితా సంపుటికి ముందు మాట రాస్తూ కుందుర్తి ఈ అనుభూతివాదము యిటీవలి కాలంలో భావ కవితా యుగ సంబంధి. ఇది వ్యక్తి వాదానికి మరొక పేరు. "నా అనుభూతి నాది, దానిని నేను ఆవిష్కరిస్తాను" అనే తత్త్వం కవిపొందిన ప్రధాన అనుభూతి ఆకృతులో దర్శనమిచ్చే ఏర్పాటు అని వివరించాడు. అద్దేపల్లి రామమోహనరావు తిలక్ ప్రయత్నం ఏ భావాన్ని చెప్పినా అందులో తన మనస్సులోని పాతాళ గంగను పదాలుగా మార్చాలనీ, మనస్సు యొక్క లోతులలోని అనుభూతుల్ని కవిత్వంగా అనువదించాలనీ చెప్పారు. అందుకే తిలక్ కవితా రీతిని అనుభూతివాదం అనవచ్చని అద్దేపల్లి వారు చెప్పారు.

తిలక్ ఒక చోట "నువ్వు చెప్పేదేదైనా నీదై వుండాలి - నీలోంచి రావాలి - చించుకు రావాలి" అని చెప్పాడు. అనుభూతి వాదమంటే సహృదయుడైన కవిత్వ మనస్సు నుంచి ఒక వస్తువును కానీ, దృశ్యాన్ని కానీ చూసినప్పుడు కలిగే భావాన్ని మాటల రూపంలో వ్యక్తం చేసి తాను అనుభవించిన ఆనందాన్ని పఠిత మనసులోనూ కలిగించటం అవుతుంది. కవిలోని ప్రతిభ, వ్యుత్పత్తి, అభ్యాసాల్లో ఏది లోపించినా కవితను పొందిన అనుభూతిని పాఠకుల్లో కలిగించలేడు. తిలక్ రచించిన "అమృతం కురిసిన రాత్రి" ఖండిక ఆయన అనుభూతికి అక్షర సాక్ష్యమని చెప్పవచ్చు.

తిలక్ భావుకశక్తి అమోఘమైంది. అనన్య సామాన్యమైంది. కొన్ని భావాలు తిలక్ మాత్రమే ప్రకటించగలడు అనే రీతిలో ఉంటాయి. ఆయన సమాజాన్ని, సాహిత్యాన్ని బాగా పరిశీలించాడు. అంతర్జాతీయ అవగాహన కూడా తిలక్‌కు అద్భుతంగా ఉంది. అందుకే ఆయన అంతర్జాతీయ అంశాలతో పలు ఖండికల్ని రచించాడు. "కవి చేయవలసింది ప్రకటన కాదు. అనుభవాన్ని తెలియజేయాలి" అని చెప్పాడు. అదే పనిని "అమృతం కురిసిన రాత్రి" ఖండికలో చేశాడు.

అమృతం కురిసిన రాత్రి అందరూ నిద్రపోతున్నారు. కానీ కవికి నిద్ర పట్టలేదు. మేలుకొనే ఉన్నాడు. ఆయనకు ఇంటిలో ఉండ బుద్ధి కాలేదు. ఎక్కడికో దూరంగా వెళ్లాలనుకున్నాడు. కొండ కోనలు దాటి వెన్నెల మైదానంలోకి వెళ్లాడు. అందరూ నిద్రపోతున్నా కవి జాగరూకుడై ఉండాడని, తన అనుభూతిని, తాను చేసిన పనిని వివరించాడు.

కవి వెన్నెల మైదానంలోనికి వెళ్లి నిలబడినప్పుడు ఆకాశం మీద అప్సరసల కాళ్లకు ఉన్న నక్షత్రాలనే అందెలు ఘల్లు ఘల్లుమని మోగుతున్నాయి. నక్షత్రాలకు ధ్వనించే శక్తి లేకపోయినా, వాటిని కాలి అందెలుగా భావించటం వల్ల వాటికి ధ్వనించే శక్తి కవి కల్పించాడు. "తారామంజీరాలు" అనే కొత్త పదబంధాన్ని తిలక్ ఇక్కడ సృష్టించాడు.

అప్సరసల కొప్పుల్లో ఉన్న పారిజాతాలు గుత్తులు గుత్తులుగా వేలాడుతున్నాయని చెప్పాడు. వారి వక్షోజాలు పెద్దవిగా ఉండటం వల్ల, పిరుదులు బరువైన కారణంగా వారు యౌవన ధనుస్సుల్లా వంగిపోతున్నారని అద్భుతంగా భావించాడు. అప్సరసలు కవిని చూసి కిల కిలా నవ్వారు. అంతే కాదు కవిని చూసి అందమైనవాడని, ఆనంద స్వరూపుడని పలికాడు. కవి కలల పట్టుకుచ్చులూగుతున్న కిరీటం ధరించాడని, కళ్ల చివర కాంతి సంగీత గీతాన్ని రచిస్తున్నాడని, ఎర్రని పెదవుల మీద తెల్లని నవ్వుల వీణల్ని మీటుతున్నాడని, ఎవరికీ దొరకని రహస్యాల్ని వశపరచుకొన్నాడని అప్సరసలు పలికారు. అంతే కాదు అతడి జీవితాన్ని ప్రేమించిన వాడని, జీవితమంటే ఏమిటో తెలిసిన వాడని అన్నారు. అతడు కొత్త కొత్త ఊహలు అనే రంగు సముద్రాల మీద ఉదయించిన సూర్యుడని అన్నారు. అన్ని విశిష్ట లక్షణాలున్న కవి తమకు ప్రియుడని, అతడు నరుడైనా తమకు వరుడని పలికారు.

తిలక్ రాత్రిపూట అమృతం కురిసిందనే అనుభూతికిలోనై వెన్నెల మైదానంలోనికి తాను వెళ్లటమే కాదు పాఠకుల్ని కూడా తీసుకువెళ్లాడు. అప్సరసల్ని అతడు దర్శించిన అనుభూతిని ప్రకటిస్తూ పాఠకుల చేత దర్శింపజేశాడు. అప్సరసల కాలి అందెల ధ్వనుల్ని వినిపింజేశాడు. వారి కొప్పుల్లో ఉన్న పారిజాతాల్ని చూసిన అనుభూతిని కలిగింపజేశాడు. అప్సరసలు యౌవన ధనుస్సుల్లా వంగి ఉన్న భావచిత్రాన్ని సాక్షాత్కరింపజేశాడు.

తిలక్ అప్సరసల మాటల్ని బట్టి కవి తీరుతెనుల్ని అవగాహన చేసుకొనే అనుభూతిని కలిగించాడు. కలల పట్టుకుచ్చులూగుతున్న కిరీటాన్ని దర్శించిన, కాంతి సంగీతాన్ని విన్న అనుభూతిని కలిగించాడు. నవ్వుల వీణల్ని మీటుతున్న కవి పాఠకులకు కనిపిస్తున్న తీరు మనోహరంగా ఉండి ఊహల రంగు సముద్రాల మీద ఉదయించిన సూర్యుడుగా కవిని చెప్పటం ద్వారా కవిలోని చైతన్యాన్ని స్ఫురింపజేశాడు. సూర్యుడు చీకట్లను తొలగించి వెలుగుల్ని ప్రసరింపజేస్తాడు. అలాగే కవి అజ్ఞానపు చీకట్లను పారదోలి విజ్ఞానపు వెలుగుల్ని పాఠకుల మనస్సులో నింపుతాడు.

అమృత వర్షం జలజలమని కురిసిందని కవి చెప్పాడు. అమృత వర్షాన్ని కవి దోసిళ్లతో తాగి దుఃఖాన్ని చావునీ వెళ్లి పొమ్మనని చెప్పటం ద్వారా కవి అమృత మూర్తిగా కనిపిస్తున్నాడు. కవి, కోరిక అనే మధుర కాశ్మీర వస్త్రాన్ని కప్పుకొని జీవితాన్ని నవ్వుల మందార మాలగా ధరించాడు. కవి జీవితంలో కాశ్మీర శాలువాలు, మందార మాలలు సహజమే కాబట్టి తిలక్ ఇక్కడ వాటి ప్రస్తావన తెచ్చాడు. కవి తాను జైత్రయాత్రా పథంలో తొలి అడుగు పెట్టినట్లు కూడా చెప్పాడు. అమృతం కురిసిన రాత్రి ప్రజలందరూ అలసిపోయి గాఢ నిద్రలో అస్వతంత్రతని, అలవాటునీ కౌగిలించుకొన్నారని చెప్పాడు. ప్రజలకు ధైర్యం లేకపోవటంతో వారు తమలో తాము ముడుచుకుపోయి పడుకున్నారని చెప్పాడు. అందుకే వారు అనంత చైతన్య పర్వ ఆహ్వానాన్ని అందుకోలేకపోయారని చెప్పాడు. కవిని గురించి ఎవరికీ తెలియదని అంటే కవి అమృతం తాగిన విషయాన్ని గూర్చి ఎవరికీ తెలియదు కాబట్టి అమృతపానం వల్ల తాను అమరుడనని ప్రకటించాడు.

తిలక్ అంతరంగంలో దాగి ఉన్న అద్భుత భావ వీచికల్ని "అమృతం కురిసిన రాత్రి"లో ప్రసరింపజేశాడు.

## ప్రశ్నలు - సంగ్రహ సమాధానాలు :

**1. "అమృతం కురిసిన రాత్రి" కవితా ఖండికలో కవి అప్సరసల్ని దర్శించిన తీరును తెల్పండి ?**

సమాధానం : తిలక్ కవిత్వం అనుభూతి ప్రధానమైంది. కవిత్వంలోని మాధుర్యాన్ని, వైవిధ్యాన్ని ఊహించగల పాఠకుడు కవిలో ఉన్న అనుభూతి స్థాయికి చేరుకొని ఆనందించగలుగుతాడు. అనుభూతి ఫలవంతం కావాలంటే కవి, పఠిత సమానమైన హృదయాలు కలిగినవారై ఉండాలి.

ఒక రోజు అమృతం కురిసింది. అందరూ నిద్రపోతున్న సమయంలో కవి మాత్రమే మేలుకొని ఉన్నాడు. ఆయనకు బయటకు వెళ్లాలనిపించి కొండ, కోన దాటి వెన్నెల మైదానంలోనికి వెళ్ళి నిలబడ్డాడు. అక్కడ ఆకాశంలో ఆయనకు అప్సరసలు కనిపించారు. తనకు కనిపించిన అప్సరసల్ని కవి ఇలా వర్ణించాడు.

ఆకాశం మీద అప్సరసలు ఒయ్యారంగా పరుగులు తీస్తున్నారని కవి చెప్పాడు. అందంగా ఉండే అప్సరసలకు ఒయ్యారం తోడైంది. అప్సరసల పరుగులు కూడా ఒయ్యారంగా ఉన్నాయి. అప్సరసల కాళ్లకు నక్షత్రాలనే అందెలున్నాయి. అవి ఘల్లు ఘల్లుమని మోగుతున్నాయి. అప్సరసల పాదాల్ని వర్ణించిన కవి తర్వాత వారి జుట్టుముడుల్ని వర్ణించాడు. అంటే అప్సరసల్ని ఆపాద మస్తకం వర్ణించాడని చెప్పవచ్చు. అప్సరసల కొప్పుల్లో పారిజాతాలు గుత్తులు గుత్తులుగా వేలాడుతున్నాయని చెప్పాడు. అప్సరసలు దేవకాంతలు కావటం వల్ల వారు పారిజాత పుష్పాల్ని ధరించారని చెప్పటం చాలా సముచితంగా ఉంది. అప్సరసల చన్నులు భారంగా ఉన్నాయి. వారి పిరుదులు కూడా పెద్దవిగా ఉన్నాయి. అందువల్ల అప్సరసలు యౌవన ధనస్సుల్లా వంగిపోతున్నారని చక్కటి భావ చిత్రాన్ని తిలక్ పాఠకులకు అందించాడు. ఇదంతా కవి భావన మాత్రమే. భావ కవితా లక్షణాలు ఇక్కడ ప్రస్ఫుటంగా గోచరిస్తున్నాయి.

**2. అప్సరసలు కవిని దర్శించిన తీరును తెలపండి ?**

సమాధానం : ఇంటి నుంచి వెన్నెల మైదానంలోనికి వెళ్లిన కవి ఆకాశంలో అప్సరసల్ని గమనించాడు. వాళ్లను చూడగానే కవి మనసులో అనేక ఆలోచనలు కలిగాయి. అప్సరసలు కూడా వెన్నెల మైదానంలో నిలబడి ఉన్న కవిని గమనించారు. అంతటితో ఊరుకోలేదు. కిల కిలా నవ్వారు. నవ్వటంతో ఆగకుండా కవిని జాగ్రత్తగా గమనించి అతన్ని గూర్చి పలు విధాలుగా భావించారు. అప్సరసల భావనలో "కవి" స్వభావం ఇలా ప్రస్ఫుటమైంది.

కవిని దర్శించిన అప్సరసలు "అందమైనవాడు - ఆనందం మనిషైనవాడు" అన్నారు. కవి బాగా అందంగా ఉన్నాడు. అంతే కాదు ఆనందమే ఒక మనిషి రూపాన్ని దరిస్తే ఎలా ఉంటాడో కవి కూడా అలా ఉన్నాడని అప్సరసలు భావించారు. కవికి అందంతో పాటు ఆనందం తోడైంది. అందుకే అప్సరసలు కవిని ఆసక్తితో దర్శించాడు.

అప్సరసలకు కవి "కలల పట్టుకుచ్చులూగుతున్న కిరీటం" ధరించి కనిపించాడు. ఆయన కళ్ల చివర కాంతి సంగీత గీతాన్ని రచిస్తున్నాడు. కవి పెదవులు ఎర్రగా ఉన్నాయి. ఎర్రని పెదవుల మీద తెల్లని నవ్వుల్ని ప్రసరింప చేస్తున్నాడు. ఈ విషయాన్ని తిలక్ "తెల్లని నవ్వుల వీణల్ని మీటుతున్నాడు" అని అద్భుతంగా చెప్పాడు. నవ్వులకు వీణలకు అభేదం చెప్పటం మనోహరంగా ఉంది. కవిని చూసిన అప్సరసలకు అతడు ఎవరికీ దొరకని రహస్యాల్ని వశపరచుకొన్నట్లనిపించింది. కవి, జీవితాన్ని ప్రేమించినవాడని, జీవించటం తెలిసిన వాడని అప్సరసలు పలికారు. కవిని చూసిన అప్సరసలు అతడు కొత్త కొత్త ఊహలు అనే రంగు సముద్రాల మీద ఉదయించిన సూర్యుడని చెప్పటం ద్వారా కవిలోని సామాజిక చైతన్యాన్ని స్పష్టం చేశాడు. ఇన్ని లక్షణాలు గల కవి నరుడైనా తమకు ప్రియుడని, వరుడని చెప్పటం మరింత మనోహరంగా ఉంది.

**3. అమృతాన్ని తాగిన కవి పలికిన తీరును వివరించండి ?**

సమాధానం : కవిగా తిలక్‌ను ఉన్నత స్థానంలో నిలబెట్టింది ఆయన రచించిన "అమృతం కురిసిన రాత్రి" అమృతం కురిసిందని చెప్పటమే ఒక ప్రత్యేకత. అమృతం కురిసిన రాత్రి, కవి అప్సరసల్ని దర్శించటం, అప్సరసలు కవిని చూసి పలు విధాలుగా భావించటం అనే అంశాల్ని వర్ణించిన తర్వాత కవి దుఃఖాన్ని చావునీ జయించే "అమృతపు సోన" కురిసిన తీరును వివరించాడు. అమృతం జలజలమని కురిసి జాలుగా ప్రవహించింది. కవికి మంచి అవకాశం దొరికింది కాబట్టి దాన్ని సార్ధకం చేసుకోదలచి అమృతాన్ని దోసిళ్లతో తాగి వచ్చానని చెప్పాడు.

ఆనందంతో అమృతాన్ని తాగిన కవి దుఃఖాన్ని చావును తన దగ్గరకు రావద్దని ఆజ్ఞాపించాడు. కవి తన శరీరం మీద కోరిక అనే మధురమైన కాశ్మీర అంబరాన్ని కప్పుకొన్నాడు. అంటే అమృతపానం వల్ల కవికి ఒక ప్రత్యేక గౌరవం లభించిందని చెప్పవచ్చు. అమృత పానం చేసిన కవికి ఏ విధమైన భయం లేదు కాబట్టి ఆయన జీవితాన్ని నవ్వుల మందారమాలగా భావించాడు. అంటే అతని జీవితమంతా ఆహ్లాదంతో నిండి ఉంటుందని భావించాలి. అమృతపానం వల్ల కవి జైత్రయాత్ర పథంలో తొలి అడుగు పెట్టానని ఆత్మ సంతృప్తి ప్రకటించాడు.

కవి అమృతం తాగిన రాత్రి ప్రజలందరూ అలవాటు ప్రకారం అస్వతంత్రతను కౌగిలించుకొన్నారని చెప్పాడు. దీన్ని బట్టి కవి స్వతంత్ర భావనలో ఉన్నాడని చెప్పవచ్చు. నిద్రపోతున్న ప్రజల్లో ధైర్యం లేదని, వారు ముడుచుకొని పడుకున్నారని చెప్పాడు. గాఢ నిద్రలో ఉన్న ప్రజలు అనంత చైతన్య ఉత్సవ ఆహ్వానాన్ని వినింపించుకోలేకపోయారని వారి దురదృష్టానికి సానుభూతిని ప్రకటించాడు. అమృతాన్ని తాగినా తాగక పోయినా కవి అమరుడే. కవి భౌతికంగా లోకాన్ని వీడినా తన రచనల ద్వారా శాశ్వతుడవుతాడు.

## 10.2. సందర్భ సహిత వ్యాఖ్యలు :

1. వెన్నెల మైదానంలోనికి వెళ్లి నిలుచున్నాను

పరిచయం : ఈ వాక్యం దేవరకొండ బాలగంగాధర తిలక్ రచించిన "అమృతం కురిసిన రాత్రి" అనే కవితా సంపుటి నుంచి స్వీకరించబడిన 'అమృతం కురిసిన రాత్రి' అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం : అమృతం కురిసిన రాత్రి అందరూ నిద్రపోతున్నప్పుడు కవి తాను ఇల్లు విడిచి ఒంటరిగా వెన్నెల మైదానంలోనికి వెళ్లిన సందర్భంలోనిది ఈ వాక్యం

వ్యాఖ్య : తిలక్ అనుభూతివాద కవి కావటంతో తన అనుభవానికి వచ్చిన విషయాల్ని బహిర్గతం చేసి తన ప్రతిభను ప్రకటిస్తాడు. ఒకనాడు రాత్రి వేళ అమృతం కురిసిందని, ఆ సమయంలో తాను ఒంటరిగా ఇంటిలో ఉండలేక తలుపు తెరచి, ఇల్లు విడిచి కొండకోనలు దాటి వెన్నెల మైదానంలో నిలుచున్నాడు. ఇదే విషయాన్ని ఇక్కడ ప్రస్తావించాడు తాను వెళ్లిన మైదానంలో బాగా వెన్నెల ఉన్నదని అక్కడి పరిస్థితి ఆహ్లాదమయమని చెప్పాడు.

2. వారు పృథు వక్షోజనితంబ భారలై యౌవన ధనస్సుల్లా వంగిపోతున్నారు.

పరిచయం : ఈ వాక్యం దేవరకొండ బాలగంగాధర తిలక్ రచించిన "అమృతం కురిసిన రాత్రి" అనే కవితా సంపుటి నుంచి స్వీకరించబడిన 'అమృతం కురిసిన రాత్రి' అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం : కవి వెన్నెల మైదానంలో నిలబడ్డాడు. అప్పుడు ఆకాశం వంక చూస్తే అప్సరసలు పరుగెత్తుతున్న దృశ్యం కనిపించింది. కవి అప్సరసల్ని పరిశీలనగా చూసి వారి తీరు తెన్నుల్ని వివరిస్తున్న సందర్భంలోనిది ఈ వాక్యం.

వ్యాఖ్య : ఆకాశంలో అప్సరసలు పరుగులు తీస్తుంటే వారి కాళ్లకు ఉన్న నక్షత్రాలనే అందెలు ఘల్లు ఘల్లు మని మోగుతున్నాయి. కేవలం తారలు మోగవు కాబట్టి తిలక్ తారా మంజీరాలన్నాడు. అప్సరసల కొప్పుల్లో పారిజాతాలు గుత్తులు గుత్తులుగా వేలాడుతున్నాయని చెప్పాడు. అప్సరసలు పెద్ద వక్షోజాలు, పిరుదుల భారంతో యౌవన ధనస్సుల్లా వంగిపోతున్నారని చెప్పటం చక్కని భావ చిత్రం.

3. కళ్ల చివర కాంతి సంగీత గీతాన్ని రచిస్తున్నాడు.

పరిచయం : ఈ వాక్యం దేవరకొండ బాలగంగాధర తిలక్ రచించిన "అమృతం కురిసిన రాత్రి" అనే కవితా సంపుటి నుంచి స్వీకరించబడిన 'అమృతం కురిసిన రాత్రి' అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం : వెన్నెల మైదానంలో ఒంటరిగా నిలబడి ఉన్న కవిని అప్సరసలు గమనించి అతన్ని గూర్చి వారు మాట్లాడిన తీరును కవి వర్ణిస్తున్న సందర్భంలోనిది ఈ వాక్యం.

వ్యాఖ్య : కవి ఒంటరిగా వెన్నెల మైదానంలోనికి వెళ్లినప్పుడు అతన్ని చూసి అప్సరసలు కిల కిలా నవ్వారు. అంతటితో ఆగలేదు. అతడు అందమైనవాడు అని చెప్పారు. అందంగా ఉండటమే కాకుండా అతడు ఆనంద స్వరూపుడని పలికారు. కలల పట్టుకుచ్చులు ఊగుతున్న కిరీటాన్ని ధరించాడని చెప్పారు. అంతే కాదు అతడు కళ్ల చివర కాంతి సంగీత గీతాన్ని రచిస్తున్నాడని కవిని గూర్చి అప్సరసలు అద్భుత భావన చేశారు.

4. అతడే సుమీ మన ప్రియుడు, నరుడు మనకి వరుడు

పరిచయం : ఈ వాక్యం దేవరకొండ బాలగంగాధర తిలక్ రచించిన "అమృతం కురిసిన రాత్రి" అనే కవితా సంపుటి నుంచి స్వీకరించబడిన 'అమృతం కురిసిన రాత్రి' అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం : అమృతం కురిసిన రాత్రి కవి తన ఇంటిని వదలి అప్సరసలు కనిపించారు. అప్సరసలు కవిని చూసి అతని మీద తమ మక్కువను ప్రదర్శించిన సందర్భంలో కవి రచించిన వాక్యమిది.

వ్యాఖ్య : కవి పెదవులు ఎర్రగా ఉన్నాయి. నవ్వులు తెల్లగా ఉన్నాయి. కానీ ఉత్తమ భావుకుడైన తిలక్ నవ్వుల వీణల్ని మీటుతున్నాడని చెప్పటం ద్వారా తన ప్రత్యేకతను ప్రదర్శించాడు. నవ్వులకు వీణలకు అభేదాన్ని చెప్పటం ద్వారా కవి తనకు గల ఆలంకారిక ప్రతిభను ప్రదర్శించాడు. కవి ఎవరికీ దొరకని రహస్యాల్ని వశపరచుకొన్నాడని, కవి జీవితాన్ని ప్రేమించినవాడని జీవిచటం తెలిసిన వాడని అప్సరసల మాటల ద్వారా స్పష్టమవుతున్నది. కవినవనవోన్మేష ప్రతిభావంతుడనే మాటను సార్థకం చేస్తూ ఊహలు అనే రంగు సముద్రాల మీద ఉదయించిన సూర్యుడు కాబట్టి అప్సరసలకు ఇష్టమైన వాడని, నరుడైనా తమకు వరుడని పలికినట్లు తిలక్ రచించాడు.

5. జైత్రయాత్రా పతంలో తొలి అడుగు పెట్టాను.

పరిచయం : ఈ వాక్యం దేవరకొండ బాలగంగాధర తిలక్ రచించిన "అమృతం కురిసిన రాత్రి" అనే కవితా సంపుటి నుంచి స్వీకరించబడిన 'అమృతం కురిసిన రాత్రి' అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం : అమృతం కురిసిన రాత్రి అందరూ నిద్రపోతున్నారని చెప్పిన కవి అమృతం కురిసిన తీరును వివరించి అప్సరసల్ని గూర్చి తన భావాల్ని, కవిని గూర్చి అప్సరసల ఆలోచనల్ని వెల్లడించి చివరగా కవిలోని ఆత్మ విశ్వాసం వృద్ధి చెందిన తీరును వివరించే సందర్భంలోనిది ఈ వాక్యం.

వ్యాఖ్య : అమృత వర్షం కురిసిన తర్వాత అది జాలుగా ప్రవహించటం వల్ల కవి దోసిళ్లతో తాగి వచ్చాడు. అమృతపానం వల్ల కవిలో విశేషమైన ఆత్మ విశ్వాసం రూపుదిద్దుకొంది. అందుకే దుఃఖాన్ని, చావునీ దూరంగా తొలగి పొమ్మని చెప్పాడు. అమృతపానం చేసిన కవి కోరిక అనేక మధుర కాశ్మీర వస్త్రాన్ని కప్పుకొన్నాడు. జీవితాన్ని నవ్వుల మందారమాలగా ధరించాడు. కవికి ఆత్మ విశ్వాసం పెరగటంతో జైత్రయాత్ర పథంలో తొలి అడుగు పెట్టానని చెప్పాడు. అమృతపానం వల్ల తనకు విజయం తథ్యమని కవిభావం.

6. ఈనాటికీ తెలియదు నేను అమరుడనని

పరిచయం : ఈ వాక్యం దేవరకొండ బాలగంగాధర తిలక్ రచించిన "అమృతం కురిసిన రాత్రి" అనే కవితా సంపుటి నుంచి స్వీకరించబడిన 'అమృతం కురిసిన రాత్రి' అనే పాఠ్య భాగంలోనిది.

సందర్భం : అమృతం కురిసిన రాత్రి ప్రజలందరూ నిద్రపోతున్నారని, కవి తాను చైతన్య ఉత్సవానికి ఆహ్వానం పలికినా ఎవరూ స్పదించలేదని చెప్పాడు. అంతే కాదు కవి అమృతం తాగిన విషయాన్ని ఎవరూ గమనించలేదని వివరిస్తున్న సందర్భంలోనిదీ వాక్యం.

వ్యాఖ్య : కవి అమృతం తాగిన రాత్రి ప్రజలందరూ అలసిపోయి గాఢ నిద్రలో ఉన్నారు. వారు అస్వతంత్రులు, ధైర్యం లేనివారు. అందుకే తమలో తాము ముడుచుకుపోయి పడుకున్నారు. కవి చైతన్య ఉత్సవానికి ఆహ్వానం పలికినా ప్రజలు గమనించలేదు. అందుకే కవి అమరుడనే విషయాన్ని గుర్తించలేకపోయారు. కవి అమృతం తాగకపోయినా అమరుడే కవి భౌతికంగా లోకాన్ని వదలిపోయినా తన రచనల ద్వారా శాశ్వతుడవుతాడు.

**- డా॥ గుమ్మా సాంబశివరావు**